సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 16

సంచిక: 10


ఆదివారం

2-4-2023



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సాక్షి ఫ్యామిలీ
II
హైదరాబాద్
ఆదివారం ॥ 2-4-2023

వైరల్

చల్లటి, తీయటి టెక్నో క్రియేటివిటీ!

మనసు ఉంటే మార్గం ఉండడమే కాదు... చల్లని ఐస్‌క్రీమ్ కూడా ఉంటుంది! ఎండాకాలంలో చాలా మంది బయటికి వెళ్లి మార్కెట్‌లోని తీయటి, చల్లటి ప్యాకేజ్‌డ్ ఐస్‌క్రీమ్‌లను తింటారు. 'ఇంత విషయానికి అంతదూరమేలా?'



అంటుంది ఒక ఇల్లాలు. ఐస్‌క్రీమ్‌ల కోసం బయటికి వెళ్లనవసరం లేకుండా సుబ్బరంగా ఇంట్లోనే తయారు చేస్తుంటుంది. ఈ తయారీ ప్రక్రియకు అట్టే ఖర్చు కాదు. సహజ పదార్థాలు(నేచురల్ ఇన్‌గ్రేడియెంట్స్)ను ఉపయోగించి చేసే ఈ ఐస్‌క్రీమ్‌ల రుచి బయటి ఐస్‌క్రీమ్‌ల కంటే బ్రహ్మాండంగా ఉంటుందట!

ఇన్‌గ్రేడియెంట్స్‌తో కూడిన వేడి వేడి ద్రావకాన్ని ఒక పాత్రలో పోసి, మూతపెట్టి దాన్ని ఫ్రీజర్‌లాంటి పాత్రలో పెట్టి చుట్టూ ఐస్‌ముక్కలు వేస్తుంది. ఈ పాత్రకు తాడు కట్టి, ఫ్యాన్‌కు వేలాడదీసి స్విచ్ వేస్తుంది. ఫ్రిజ్‌తో పనేలే! కొద్దిసేపటి తరువాత ఐస్‌క్రీమ్ మన ముందు ఉంటుంది. ఈ వీడియో క్లిప్‌ను పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తే వైరల్ అయింది.

'చక్కని ఐస్‌క్రీమ్ తయారుచేయడానికి అవసరమైన పదార్థాలే కాదు... కాస్త ఓపిక, అందమైన చిరునవ్వు కూడా ముఖ్యమే'

'చల్లటి, తీయటి టెక్నో క్రియేటివిటీ ఇది'... ఇలా నెటిజనులు రకరకాలుగా స్పందించారు.

గోల్ ఇన్ శారీ!

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ మున్సిపల్ కార్పోరేషన్ ఒక స్వచ్ఛందసంస్థతో కలిసి మహిళల కోసం 'గోల్ ఇన్ శారీ' పేరుతో ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించింది. గ్వాలియర్ జిల్లాలోని ఎనిమిది టీమ్‌లు ఇందులో పాల్గొన్నాయి. 20 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయసు ఉన్న మహిళల వరకు ఈ టీమ్‌లలో ఉన్నారు.

'గోల్ ఇన్ శారీ' టోర్నమెంట్ ప్రత్యేకత ఏమిటంటే సంప్రదాయ క్రీడా దుస్తులు ధరించకుండా చీర మాత్రమే ధరించాలి!

'వేర్ శారీ అండ్ స్టే ఫిట్' థీమ్‌తో నిర్వహించిన ఈ టోర్నమెంట్ ఎంత హిట్ అయిందంటే 'వచ్చే టోర్నమెంట్‌లో మేము కూడా పాల్గొంటాం' అని వివిధ జిల్లాల నుంచి మహిళలు వస్తున్నారు.

'గోల్ ఇన్ శారీ టోర్నమెంట్‌లో పాల్గొన్నవారిలో కాస్తోకూస్తో ఫుట్‌బాల్ ఆడడం వచ్చిన వారి నుంచి ఈ టోర్నమెంట్ కోసమే ఆట నేర్చుకున్న వారి వరకు ఎందరో ఉన్నారు. ఆటలో వారి అద్భుత ప్రతిభ చూస్తే రెండు కళ్లు చాలవు అని



పిస్తుంది' అంటుంది సామాజిక కార్యకర్త, టోర్నమెంట్ నిర్వాహకురాలు అంజలి గుప్తా బాత్రా.

ఈ టోర్నమెంట్ తాలూకు వీడియోను ఐఏఎస్ అధికారి కిశోర్ కన్వాల్ ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తే వేలాది వ్యూస్‌తో వైరల్ అయింది.

హాయ్... చిందెయ్..

'ఈ వయసులో డ్యాన్స్ ఏమిటి?' అనుకుంటారు కొందరు. అయితే 'మీ వయసు ఎంత?' అని డ్యాన్స్ ఎప్పుడూ వివరం అడగదు.

విషయంలోకి వెళితే... కేరళలోని ఎతన్య కుమ్మట్టీ గ్రామంలోని ఆలయంలో సంప్రదాయ సంగీత విభావరి ఘనంగా జరుగుతుంది. దీనిలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటారు. ఈ విభావరిలో యూత్ హవా ఎక్కువగా ఉంటుంది. అయితే ఒక వృద్ధురాలు మాత్రం 'నేను సైతం' అంటూ రిథమిక్ బీట్స్‌కు అందమైన స్టెప్స్ వేసింది.



బామ్మ డ్యాన్సు చేస్తున్న వీడియో క్లిప్‌ను స్వాతి జగదీష్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే అనూహ్యమైన రెస్పాన్స్ వచ్చింది.

'సారీ... బామ్మ అనుమతి లేకుండా ఈ క్లిప్‌ను పోస్ట్ చేశాను. వద్దంటే ఇప్పుడే తీసివేస్తాను. నాకైతే బామ్మ డాన్స్ తెగ నచ్చేసింది' అని రాసింది స్వాతి.

'డిలీట్ చేయాల్సిన అవసరమే లేదు' అని నెటిజనులు ముక్తకంఠంతో చెప్పారు.

'బామ్మ డ్యాన్స్ వీడియో చూస్తుంటే... కర్ణాటకలోని మంగళూర్, బంట్వాల్ ప్రాంతాలలో మహిళలు చేసే పిలినాలికె అనే టైగర్ డాన్స్ గుర్తుకు వచ్చింది' అని ఒక నెటిజన్ రాశాడు.

బ్యూటిప్స్

టర్మరిక్ క్యూబ్స్‌తో.. మచ్చలేని అందం

ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నప్పటికీ ఒక్కోసారి ముఖ చర్మం జిడ్డుగా, మొటిమలు, బ్లాక్, వైట్ హెడ్స్ వల్ల అందవిహీనంగా కనిపిస్తుంది. ఈ సమస్యలన్నింటికీ పసుపు, ఐస్‌క్యూబ్‌లతో మంచి పరిష్కారం లభిస్తుంది.

- టీస్పూను పసుపు, టీస్పూను ముల్తానీ మట్టి, టీస్పూను కమలా తొక్కల పొడి, కప్పు రోజ్‌వాటర్, టీస్పూను కొబ్బరి పాలు, ఆరు చుక్కల నిమ్మనూనెను తీసుకుని ఒక గిన్నెలో వేసి చక్కగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఐస్‌క్యూబ్స్ ట్రేలో పోసి గడ్డకట్టేంత వరకు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. ఈ క్యూబ్‌లు మూడు వారాల వరకు తాజాగా ఉంటాయి.



- ముఖాన్ని శుభ్రంగా కడిగి ఈ ఐస్‌క్యూబ్స్‌తో ఇరవై నిమిషాల పాటు మర్దన చేయాలి
- ఇరవై నిమిషాల తరువాత నీటితో కడిగి తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు మాయిశ్చరైజర్ లేదా అలోవెరా జెల్‌ను రాసుకోవాలి.
- ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల ముఖంపై పేరుకుపోయిన మొటిమల తాలూకు మచ్చలు, వైట్, బ్లాక్ హెడ్స్, ట్యాన్ పోయి ముఖం ఫ్రెష్‌గా రేడియంట్‌గా కనిపిస్తుంది.
- చర్మం జిడ్డు కారడం నియంత్రణలో ఉండడమేగాక, దీర్ఘకాలంగా వేధిస్తోన్న మొటిమలు కూడా తగ్గుముఖం పడతాయి.
- పసుపు, కొబ్బరి పాలు వృద్ధాప్య ఛాయలను నియంత్రించి చర్మం యవ్వనంగా కనిపించేలా చేస్తాయి.

అవాంఛిత రోమాలకు మసూర్ ప్యాక్!



వంద గ్రాముల మసూర్ దాల్ (ఎర్రపప్పు), ఇరవై గ్రాముల గంధం పొడి, ఒక నారింజకాయ తొక్క, రెండు గ్లాసులు పచ్చి పాలు తీసుకోవాలి. మసూర్ దాల్, గంధంపొడిని, నారింజ తొక్కను పాలల్లో వేసి గంటపాటు నానబెట్టాలి. తరువాత వీటిని మిక్సీ జార్‌లో వేసి మెత్తని పేస్టులా చేసుకోవాలి. ఈ పేస్టును డైలీ ముఖానికి రాసి ఆరిన తరువాత కడిగేయాలి. ఇలా చేయడం వల్ల ముఖం మీద మృతకణాలు, అవాంఛిత రోమాలు తొలగి ముఖవర్చస్సు మెరుగుపడుతుంది.

ఇంటిప్స్



- పచ్చిమిరప కాయలు తరిగిన తర్వాత ఎండు మిరపకాయలు ముట్టుకున్న తర్వాత చేతులు మండుతుంటాయి. అలా మంటపుట్టకుండా ఉండాలంటే మిరపకాయలను కట్ చేసే ముందు చేతులకు ఆవ నూనె లేదా కొబ్బరి నూనె రాసుకోవాలి.



- గ్యాస్ స్టవ్ బర్నర్ రింగులు నల్లగా మారిపోతే వాటిని వెనిగర్‌లో వేసి ఐదు గంటలు నానపెట్టాలి. నానిన తరువాత బేకింగ్ సోడావేసి స్టీల్ పీచుతో తోమితే బర్నర్ రింగులు నలుపు పోయి మెరుస్తాయి.



- కుకర్ విజిల్ వచ్చినప్పుడు పొంగి.. కుకర్ మూత మీద, స్టవ్ మీద పడుతూ ఇబ్బందిపెడుతుంటే.. విజిల్ చుట్టూ ఒక కాటన్ క్లాత్‌ను పెట్టాలి. అప్పుడు కుకర్ విజిల్ వచ్చినప్పుడు పొంగినా కాటన్ క్లాత్ పీల్చుకుంటుంది. తరువాత ఆ క్లాత్‌ను నీళ్లలో కడుక్కోవచ్చు.



- సమ్మర్‌లో నిమ్మకాయ షర్బత్‌ని ఎక్కువగా తాగుతుంటాం. అయితే నిమ్మరసంలో వేసిన చక్కెర అంత త్వరగా కరగదు. అటువంటప్పుడు నిమ్మరసంలో వేసేముందు పంచదారను కాసిని వేడినీళ్లలో వేసి కలిపితే త్వరగా కరుగుతుంది. పంచదార కరిగాక చల్లటి నీళ్లు, నిమ్మరసం వేసి కలిపితే నిమ్మరసం ఎంతో టేస్టీగా ఉంటుంది.



- వెల్లుల్లి రెబ్బల పొట్టు త్వరగా తీయాలంటే తీసేముందు వెల్లుల్లి రెబ్బలను ఓ ఐదు నిమిషాలపాటు వేడి నీళ్లలో నానబెడితే సరి. ఆ తరువాత పొట్టు తీస్తే సులభంగా వస్తుంది.




- అరకట్ట కొత్తిమీర ఆకుల్ని తీసుకుని శుభ్రంగా కడిగి మిక్సీజార్‌లో వేసి కొద్దిగా నీళ్లు పోసి జ్యూస్‌లా గ్రైండ్ చేసుకోవాలి. ఈ జ్యూస్‌ను ఉదయం పరగడుపున తాగితే రాత్రి సమయంలో మంచి నిద్ర పడుతుంది.



- మధ్యస్థంగా పండిన అరటిపండును ముక్కలుగా కట్ చేసి గ్లాసు నీళ్లల్లో వేసి సన్నని మంట మీద పదిహేను నిమిషాలు మరిగించాలి. మరిగాక అరస్పూను దాల్చిన చెక్క పొడి వేసి మరో పదినిమిషాలు మరిగించాలి. తరువాత వడగట్టి కొద్దిగా తేనె కలిపి నిద్రపోయే ముందు తాగితే వెంటనే నిద్ర పడుతుంది.

హెల్త్



35 ఏళ్ల తర్వాతా... ఆరోగ్యకరమైన బిడ్డ పుట్టాలంటే?

గత కొన్నేళ్ల కిందటి వరకు గర్భధారణకు పెరిగే వయసు లేదా పెద్ద వయసు కాస్త ప్రతికూల ఫలితాలు ఇవ్వవచ్చనీ, సాధారణంగా 28 లేదా 30 ఏళ్లలోపే గర్భధారణ జరగడంతో ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టే ఆస్కారం ఎక్కువనే మాటలు వినిపించేవి. అంతేకాదు... 35 ఏళ్లు పైబడ్డ తర్వాత గర్భధారణ జరిగితే పిల్లల్లో డౌన్స్ సిండ్రోమ్ వంటి కొన్ని అనర్థాలు కనిపించే అవకాశాలూ ఎక్కువేనంటూ ఆందోళన నిండిన సలహాలూ వచ్చేవి. అయితే ఆ మాటల్లో కొద్దిపాటి నిజాలున్నప్పటికీ అంత కంగారు పడాల్సిన అవసరం లేదంటున్నారు వైద్యులు. మెడికల్ పుస్తకాల్లో చెప్పినట్లుగా 35 వయసు దాటాక పుట్టిన పిల్లల్లో జన్యుపరమైన సమస్యలు తలెత్తే అవకాశాలు అరుదుగా ఉంటాయి. వాటి గురించి అంతగా ఆందోళన అవసరం లేదంటూ డాక్టర్లు చెబుతున్న సంగతులివి....

ఇటీవల కాలం అనేక మార్పులను తెస్తోంది. యువతులు సైతం బాగా చదువుకుంటూ, కెరియర్‌లో స్థిరపడిన తర్వాతే పిల్లలను కోరుకుంటున్నారు. దాంతో గర్భధారణ, పిల్లలు కలగడంలో ఆలస్యం సాధారణమవుతోంది. వయసు 35 ఏళ్లు దాటాక గర్భధారణ జరిగిన కేసుల్లో గర్భస్రావాలు జరిగే రేటు ఎక్కువనీ, ఆలస్యంగా గర్భధారణ జరిగినప్పుడు పుట్టే పిల్లలకు పుట్టుకతో వచ్చే జన్యుసమస్యలు వస్తాయనే అభిప్రాయాలు ఎక్కువగా ఉండేవి. అందులో కొద్దిపాటి సత్యం ఉంటే ఉండవచ్చేమోగానీ... అదే అక్షరసత్యమనీ, ఆ మాటలే శిలాక్షరాలని అనుకోడానికి వీల్లేదని వైద్యపరిశోధనలు వెల్లడిస్తున్నాయంటున్నారు డాక్టర్లు. అందుకే 'అడ్వాన్స్‌డ్ మెటర్నల్ ఏజ్', 'జీరియాట్రిక్ ప్రెగ్నెన్సీ' అనే పదాలను విని, చదివి కంగారు పడవద్దని చెబుతున్నారు.

ఆలస్యపు గర్భధారణలో అనర్థాలు ఎందుకంటే..?

ముప్పై ఐదేళ్ల తర్వాత జరిగే గర్భధారణల వల్ల పుట్టబోయే పిల్లల్లో అనేక ఆరోగ్యపరమైన రిస్క్‌లతో పాటు అబార్షన్స్‌కు అవకాశం ఎక్కువ. దానికి కొన్ని కారణాలు ఉంటాయి. అవి... ● అండాశయం వయసు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్యకరమైన అండం విడుదల సక్రమంగా జరగడానికి అవకాశం తక్కువ. అండం నాణ్యతా తగ్గుతుంది. అంటే గర్భధారణకు అవకాశాలు పూర్తిగా తగ్గుతాయని కాదు. కానీ ఆలస్యపు గర్భధారణ విషయంలో క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదిస్తూ జాగ్రత్తగా ఉండాలి. ● అబార్షన్స్ రిస్క్ ఎక్కువ. ● వయసు పెరుగుతున్న కొద్దీ అండంలో జరిగే కణవిభజన అంత సక్రమంగా ఉండకపోవచ్చు. దాంతో క్రోమోజోముల సంఖ్యలో విభజన సక్రమంగా జరకపోవచ్చు.

ఇతర సమస్యల విషయానికి వస్తే...

● మహిళల్లో 30 ఏళ్లు దాటాక అధిక రక్తపోటు, డయాబెటిస్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. ఇది గర్భధారణపై ప్రభావం చూపవచ్చు. ● పీసీఓడీ, ఫైబ్రాయిడ్స్ సమస్యలూ, ఫెలోపియన్ ట్యూబులు మూసుకుపోవడం జరగవచ్చు. ● పెద్ద వయసు మహిళలకు పుట్టే పిల్లలు తక్కువ బరువుతో పుట్టే అవకాశముంది. ● 35 ఏళ్లు దాటిన మహిళల్లో సహజ ప్రసవపు అవకాశాలు తగ్గి, సిజేరియన్‌కే అవకాశాలు ఎక్కువ.

ఇటీవల ఆలస్యంగా కెరియర్‌లో స్థిరపడ్డ తర్వాత, అప్పటికీ స్వాభావికంగా గర్భధారణ జరగకపోతే 35 దాటిన తర్వాతే కృత్రిమ గర్భధారణకు వెళ్తున్నారు. అయినప్పటికీ ఆరోగ్యకరమైన గర్భధారణ, పండంటి బిడ్డ పుట్టే కేసులే చాలా ఎక్కువ. ఇందుకు కొన్ని సూచనలు, జాగ్రత్తలు పాటించాలి.

గర్భధారణ కంటే ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గర్భం ధరించాలనుకున్న కాస్త పెద్ద వయసు మహిళ గర్భధారణ కంటే ముందునుంచే కొన్ని సూచనలు, జాగ్రత్తలు పాటించాలి.

● తమ సాధారణ ఆరోగ్యం, జీవనశైలి, ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే వాటి గురించి, కుటుంబ ఆరోగ్య చరిత్ర గురించి డాక్టర్‌కు విపులంగా వివరించాలి. ● అప్పటికే తీసుకున్న వ్యాక్సిన్‌ల వివరాలు తెలపాలి. తీసుకోవాల్సిన వ్యాక్సిన్లు ఇంకేమైనా ఉన్నాయా అని వాకబు చేయాలి. ● జీవిత భాగస్వామి (భర్త) వారి వైపు ఆరోగ్య వివరాలు, కుటుంబ ఆరోగ్య చరిత్ర గురించి కూడా చెప్పాలి. (వయసు ఎక్కువైనా, తక్కువైనా గర్భధారణ కోరుకున్న మహిళలందరూ ఈ సూచనలు పాటించాలి.) ● డిప్రెషన్, హైబీపీ, మధుమేహం (డయాబెటిస్) లాంటి ఆరోగ్య సమస్యలు ఉంటే డాక్టర్‌కు వివరించాలి. ● ప్రతిరోజూ 400 మైక్రోగ్రాములకు తగ్గకుండా ఫోలిక్ యాసిడ్‌తో పాటు మల్టీవిటమిన్ టాబ్లెట్లు వాడాలి. (పిండం పెరుగుదల సమయంలో ఈ పోషకాలన్నీ ప్రతి కణానికీ కావాలి. ఈ సప్లిమెంట్స్ వాడటం వల్ల పుట్టబోయే చిన్నారికి గ్రహణం మొర్రి వంటి సమస్యలతో పాటు వెన్నుపాము లోపాలు (న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్స్) నివారితమవుతాయి. ● గర్భధారణ సమయంలో ఉండాల్సిన బరువు కంటే... మరీ ఎక్కువ బరువు ఉండటం, అలాగని బరువు తక్కువగా ఉండటం ఈ రెండూ కొన్ని ముప్పులను ఆహ్వానిస్తాయి. అందుకే ఆరోగ్యకరమైన రీతిలో ఆహారం తీసుకుంటూ, తగిన వ్యాయామం చేస్తూ ఉండాల్సినంత బరువు మాత్రమే ఉండేలా జాగ్రత్త పడాలి. ● గర్భధారణ సమయంలో ఆల్కహాల్, పొగతాగడం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. ● పనిచేసే చోట లేదా ఇతరత్రా ప్రదేశాలలో హానికారకమైన రసాయనాలకు దూరంగా ఉండాలి. ఇలా హానికర రసాయనాలకు ఎక్స్‌పోజ్ కావడం బిడ్డలో పుట్టుకతో వచ్చే లోపాలకు దారితీయవచ్చు. (ఉదాహరణకు కెమికల్ లేదా పెయింట్స్ వంటి పరిశ్రమల్లో పనిచేసేవారి కోసం ఈ జాగ్రత్తలు). ● ఒత్తిడికి పూర్తిగా దూరంగా ఉండాలి. హాయిగా, ఆహ్లాదంగా ఉండటానికి ప్రయత్నించాలి.

గర్భధారణ సమయమప్పుడు ఈ సూచనలు...

● అన్ని విధాలా ఆరోగ్యకరంగా ఉన్నామని ఫీలవుతున్నప్పటికీ... డాక్టర్లు నిర్దేశించిన ప్రకారం క్రమం తప్పకుండా వారి ఫాలో అప్‌లో ఉండాలి. ● గర్భవతిగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన వ్యాక్సిన్‌ల వివరాలు (ఫ్లూ షాట్ వంటివి) తెలుసుకుని, వాటిని తప్పక తీసుకోవాలి. ● ఆ సమయంలో డాక్టర్లు సూచించిన చికిత్స ప్రణాళికను పూర్తిగా అనుసరించాలి. ఇది తల్లి, కడుపులోని బిడ్డ... ఈ ఇరువురూ పూర్తిగా సురక్షితంగా ఉండేలా చేస్తాయి. ● సమతులాహారం తీసుకుంటూ శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు అంటే... క్యాల్షియమ్, ఫోలిక్ యాసిడ్, ఐరన్, విటమిన్–డి వంటి అన్ని పోషకాలందేలా చూడాలి. శరీరానికి శ్రమ కలగని రీతిలోనే వ్యాయామం చేస్తూ, రోజంతా చురుగ్గా ఉండాలి.

రిస్క్ ఉన్నా... ఆరోగ్యకరమైన ప్రెగ్నెన్సీ కోసం...

ఒకవేళ మహిళకు 35 ఏళ్లు దాటాక గర్భధారణ జరిగే అవకాశం ఉన్నప్పుడు కొన్ని స్క్రీనింగ్ పరీక్షలు చేయించాలి. అవి... ● సెల్–ఫ్రీ డీఎన్ఏ స్క్రీనింగ్ పరీక్ష ● కొంత మెటర్నల్ బ్లడ్ స్క్రీనింగ్ (అయితే ఇలాంటి స్క్రీనింగ్ పరీక్షల వల్ల పుట్టబోయే చిన్నారిలోని లోపాలన్నీ నూరు శాతం తెలియకపోవచ్చు. కానీ రాబోయే ముప్పులు కొంత సూచనాత్మకంగా తెలిసే అవకాశాలు మాత్రం ఉంటాయి). ● న్యూకల్ ట్రాన్స్‌లుయెన్సీ (ఎన్‌టీ) స్కాన్ టెస్ట్ అనే పరీక్షను గర్భధారణ తర్వాత 14వ వారాల లోపు చేయించాలి. ● గర్భధారణ తర్వాత 20 వారాలప్పుడు అనామలీ స్కాన్ వంటి పరీక్షల్ని చేయించాలి.



డాక్టర్ వరలక్ష్మి కె.ఎస్.
సీనియర్ గైనకాలజిస్ట్

భవిష్యత్తుకోసం అండాల సంరక్షణ...

రోజులు గడుస్తున్న కొద్దీ విడుదలయ్యే అండాల నాణ్యత, అందులో లోపాలు వస్తాయి. అందుకే జీవితంలో ఇంకా స్థిరపడని వారు తగిన సమయంలో ఆరోగ్యంగా ఉన్న అండాలను సేకరించి పెట్టుకోవడానికీ ఇప్పుడు అవకాశం ఉంది. అన్నీ అనువుగా ఉన్న సమయంలో ఆ అండాలను గర్భధారణకు ఉపయోగించుకోవచ్చు. అంతేకాదు... దురదృష్టవశాత్తూ చిన్నవయసులోనే మెనోపాజ్ రావడం లేదా ఏవైనా క్యాన్సర్లకు గురై అండాశయాలను తొలగించాల్సిన పరిస్థితులు రావడం వంటివి జరిగితే... ముందుగా సేకరించి పెట్టుకున్న ఆరోగ్యకరమైన అండాల సహాయంతో అటు తర్వాత కూడా ఆరోగ్యకరమైన రీతిలో గర్భధారణకు ఇప్పుడు అవకాశాలున్నాయి.

చివరగా... 35 ఏళ్ల తర్వాత కూడా సురక్షితమైన గర్భధారణ కోసం ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే ముందుగానే సరైనరీతిలో డాక్టర్ సలహాలు పాటించడం, సమతులాహారం తీసుకోవడం, తగినంత బరువు ఉండేలా చూసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలి వంటివి పండంటి బిడ్డ పుట్టేందుకు ఎంతగానో ఉపకరిస్తాయి. గర్భధారణకు ముందునుంచే గైనకాలజిస్ట్ సూచనలు అనుసరిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటిస్తే ఆరోగ్యకరమైన గర్భధారణకు వయసు ఒక అంకె మాత్రమే.

జీఈఆర్‌డీ నివారణకు సింపుల్ సూచనలు

గ్యాస్ పైకి ఎగజిమ్ముతూ ఉంటే..!




గ్యాస్‌తో నిండి, కడుపు ఉబ్బరంగా ఉండి అది పైకి ఎగజిమ్ముతూ... ఇబ్బంది పెట్టడం అనే సమస్య ప్రతి ఒక్కరి జీవితంలో ఒక్కసారైనా అనుభవంలోకి వస్తుంది. అంత సాధారణమైన సమస్య ఇది. ఇక కొందరిలోనైతే అది గుండెపోటా అనే అనుమానానికి తావిస్తూ, ఆందోళనకు గురిచేస్తుంది. ఇటీవల ఈ తరహా సమస్యలు చాలామందిలో కనిపిస్తున్నాయి. కడుపులో ఆహారం జీర్ణం కావడానికి అవసరమయ్యే యాసిడ్ తాలూకు వాయువులు గ్యాస్ రూపంలో పైకి ఎగజిమ్ముతుండే ఈ సమస్యను 'గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్' (జీఈఆర్‌డీ) అంటారు. చిన్న చిన్న చిట్కాలనూ, సూచనలను పాటిస్తే చాలావరకు ఈ సమస్యను అధిగమించవచ్చు. అవి... ● పీచు ఎక్కువగా ఉండే కాయధాన్యాలనూ, ఆకుకూరలను తమ ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలి. ● పాలు, మిల్క్ ప్రాడక్ట్స్ వాడే సమయంలో కొవ్వు తక్కువగా ఉండే డెయిరీ ఉత్పాదనలను వాడాలి. ● జీఈఆర్‌డీతో బాధపడేవారు కొవ్వు తక్కువగా ఉండే ఆహారాలు వాడటం మేలు. ఇక మాంసాహారాన్ని బాగా ఇష్టపడేవారు రెడ్‌మీట్ వంటి వాటికి దూరంగా ఉండి కేవలం వైట్ మీట్ అయిన చికెన్, చేపల వంటి వైపునకు మొగ్గుచూపాలి. ● నారింజ, నిమ్మ, ద్రాక్ష, పైనాపిల్, టమాటాల వంటివి ఇతరులకు బాగా ఆరోగ్యకరమే అయినప్పటికీ... గ్యాస్ సమస్య ఉండేవారు తాత్కాలికంగా వాటికి కాస్తంత దూరంగా ఉండాలి. ● రాత్రిపూట భోజనం చాలా ఆలస్యంగా తినకూడదు. తిన్న తర్వాత కొద్దిదూరం తప్పక నడవాలి. వీలైతే రాత్రి నిద్రకు ముందర రెండుగంటల పాటు ఏమీ తినకుండా ఉండటం మంచిది. ● ఒంటి కంటే తల భాగం కాస్త ఎత్తుగా ఉండేలా తలగడ అమర్చుకోవాలి. అయితే ఈ తలగడ కేవలం తల కింద మాత్రమే కాకుండా భుజాల కింది వరకూ ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.

మెడిటిప్స్

కుక్క కాటుకు గురైనప్పుడు...

ఇటీవల కుక్క కాటు కేసుల గురించిన వార్తలు, వివరాలు తరచూ వినిపిస్తున్నాయి. వేసవి తీవ్రత కారణంగా వాటికి సరైన నీడ దొరకకపోవడం, ఆహారం, నీళ్ల లభ్యం కాకపోవడంతో ఈ సీజన్‌లో చిరాకు పెరుగుతుంది. అందుకే ఈ వేసవి కాలంలో త్వరగా ఆగ్రహం చెందడం, మొరగడం, వెంటపడటం... చివరకు కరవడం కూడా కాస్త ఎక్కువే. కుక్క మొరుగుతూ దగ్గరకు వస్తున్నప్పుడు ఆందోళన చెందకూడదు. ఒకవేళ దురదృష్టవశాత్తూ కుక్క కాటుకు గురైతే మాత్రం ఈ కింది సూచనలు పాటించాలి. ● కుక్క కరవగానే వీలైనంత త్వరగా ఆ గాయాన్ని పై నుంచి నీరు ధారగా ఓ ప్రవాహంలా కింద పడుతుండగా శుభ్రంగా కడగాలి. అంటే... మగ్‌తో నీళ్లు పోస్తూ గాని, కుళాయి కింద గానీ గాయమైన భాగాన్ని ఉంచి నీళ్లు పడుతుండగా సబ్బుతో వీలైనంత శుభ్రంగా కడగాలి. ● కుక్క కాటు తర్వాత ఆ గాయానికి ఎలాంటి కట్టూ కట్టకూడదు. దాన్ని ఓపెన్‌గానే ఉంచాలి.



● కుక్క కాటుతో రేబీస్ వచ్చే అవకాశాలు ఎక్కువ కాబట్టి... పైన పేర్కొన్న ప్రథమ చికిత్స ముగిసిన వెన్వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఆయన సూచించిన మేరకు యాంటీరేబీస్ వ్యాక్సిన్‌ను అవసరాన్ని బట్టి మూడు లేదా ఐదు మోతాదుల్లో తీసుకోవాలి. గాయం తగ్గడానికి డాక్టర్ సూచించిన మందుల్ని క్రమం తప్పకుండా వాడాలి. ● కుక్కకాటు గాయమైన చోట... ఆ గాయం తీవ్రతను బట్టి ఇమ్యునోగ్లోబులిన్ రెండు డోసులు ఇప్పించి, మిగతావి చేతికి ఇప్పించాలి. ● గాయం అయిన వైపు ఉండే చేతికి ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్ ఇచ్చి... ఆ రెండో వైపు చేతికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఇవ్వాల్సి ఉంటుంది.


'బీడుబడిన తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 10

SUNDAY Special | ఆదివారం 2-4-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



లక్నో 'సూపర్' విజయం

ఢిల్లీ క్యాపిటల్స్‌పై 50 పరుగుల తేడాతో గెలుపు. కైల్ మేయర్స్ మెరుపు అర్ధ సెంచరీ. ఐదు వికెట్లతో చెలరేగిన మార్క్ వుడ్ మరో మ్యాచ్‌లో కోల్‌కతాపై నెగ్గిన పంజాబ్ కింగ్స్. - 12లో



ఏప్రిల్- జూన్ మధ్య వేడి సెగలు

దేశంలో ఈ ఏప్రిల్ నుంచి జూన్ నెలదాకా సాధారణంకంటే కాస్త ఎక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. - 6లో



నా పరువు మంటగలిపేందుకు..

తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా 'కొందరు' విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌ను ఉద్దేశిస్తూ మోదీ వ్యాఖ్యానించారు. - వివరాలు 6లో



'హస్తినకొస్తే అంతం చేస్తాం'

ఓ గ్యాంగ్‌స్టర్ బృందం తనను చంపేస్తానని బెదిరించిందని ఎంపీ సంజయ్ రౌత్ ముంబై పోలీసులకు ఫిర్యాదుచేశారు. - వివరాలు 6లో



విమానంలో అసభ్య ప్రవర్తన

ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానంలో స్వీడన్‌కు చెందిన ఒక ప్రయాణికుడు మహిళా సిబ్బందితో అసభ్యంగా ప్రవర్తించాడు. - వివరాలు 6లో



అమెరికాలో టోర్నడో బీభత్సం

అమెరికాలోని అర్కన్సాస్, ఇల్లినాయిస్‌తో పాటు ఇండియానా, అలబామా రాష్ట్రాల్లో టోర్నడో ధాటికి 18 మందికి పైగా మరణించారు. - వివరాలు 6లో

న్యూస్‌రీల్

ఆర్టీసీ చార్జీల్లో స్వల్పంగా టోల్ రుసుము పెంపు



టోల్‌ప్లాజాల్లో చార్జీలు పెంచిన నేపథ్యంలో ఆ రూపంలో ఆర్టీసీపై పడే భారాన్ని రికవరీ చేసుకునేందుకు టికెట్ చార్జీలో ఉండే టోల్ రుసుమును సంస్థ సవరించింది. ఒక టోల్‌గేట్ దాటుతూ వెళ్లే స్టాప్‌లకు భారం పడకపోయినప్పటికీ రెండు, మూడు టోల్‌గేట్లు దాటుతూ వెళ్లే ప్రయాణికులపై మాత్రం కొంతమేర అదనపు భారం పడుతోంది.

- వివరాలు 5లో

రిక్రూటైనా జాయినింగ్ లేదు!



ఏడాది కింద కాలేజీలకే వెళ్లి, మెరిట్ విద్యార్థులను ఇంటర్వ్యూ చేసి రిక్రూట్ చేసుకున్న కొన్ని కంపెనీలు ఇప్పటికీ 'ఆన్ బోర్డింగ్' ప్రక్రియను మొదలుపెట్టలేదు. చిన్న కంపెనీలే కాకుండా బహుళజాతి కంపెనీ (ఎంఎన్‌సీ)లు కూడా ఇలాగే వ్యవహరిస్తుండటంపై ఫ్రెష్ గ్రాడ్యుయేట్లలో ఆందోళన వ్యక్తమవుతోంది.

- వివరాలు 14లో

రియల్‌ఎస్టేట్ సంస్థల్లో ఈడీ సోదాలు



హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్ సంస్థ సాహితీ ఇన్‌ఫ్రాటెక్, దాని అనుబంధ సంస్థల కార్యాలయాలు, ఆ సంస్థ కీలక వ్యక్తుల ఇళ్లతో పాటు కంపెనీ కీలక ప్రమోటర్ బి.లక్ష్మీనారాయణ ఇంట్లోనూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం సోదాలు చేసింది. ప్రీలాంచ్ ఆఫర్ల పేరిట కంపెనీ పలువురిని మోసగించినట్టు తెలుస్తోంది.

- వివరాలు 2లో

తెలంగాణ దేనికి మోడల్ కేసీఆర్?: బండి సంజయ్

- రైతుల ఆత్మహత్యల్లోనా.. హామీలపై మాట తప్పడంలోనా?
- సుఖేశ్ అంశాన్ని దారి మళ్లించేందుకే మహారాష్ట్ర రైతుల చేరికలు

3 లో



..ఇంకానయం! నేను హైకమాండ్ నిర్ణయిస్తుందేమోనని అనుకున్నాన్సార్!

టార్గెట్ మహారాష్ట్ర!

రైతుశక్తిని ఏకం చేసి పోరాడుదాం: కేసీఆర్ పిలుపు



స్థానిక సంస్థలు సహా అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ

త్వరలోనే విదర్భలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం

- గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కమిటీలు
- అంతా ఏకమై ఓటును అస్త్రంగా ప్రయోగించాలి.. 200 సీట్లు గెలుచుకోగలమని ధీమా
- బీఆర్ఎస్‌లో చేరిన మహారాష్ట్ర నేతలతో సీఎం ఇష్టాగోష్టి
- తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు చూశానని సీఎం కేసీఆర్ వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తదుపరి టార్గెట్ మహారాష్ట్రేనని ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. మహారాష్ట్రలో జరిగే అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి, బీఆర్ఎస్ విజయానికి తోడ్పడేలా కమిటీలు వేస్తామని చెప్పారు. రైతు సమస్యల పరిష్కారం కోసం రైతుల్లో ఐక్యత రావాలని, వారి చేతిలో ఉన్న ఓటును అస్త్రంగా ఉపయోగించుకుని రైతు రాజ్యం తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మహారాష్ట్ర షెట్కారీ సంఘటన్ (రైతు సంఘం) నేత శరద్ జోషి ప్రణీత్‌తోపాటు పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గతంలో షెట్కారీ కామ్‌గార్ పార్టీ మహారాష్ట్రలో 76 సీట్లు గెలుచుకుందని, ఇప్పుడు 200 సీట్లు గెలుస్తామని కేసీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''నా 50 ఏళ్ల రాజకీయ అనుభవంలో ఎన్నో ఉద్యమాలు, ఆందోళనలు, సమస్యలు, ఆటుపోట్లను చూశా.. దేశంలోని రైతుల కష్టం చూసి రైతుల పోరాటం న్యాయమైనదనే భావనతో జాతీయ

మిగతా 3వ పేజీలో ▶

> రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, సాగునీరు ఇలా అన్ని రకాలుగా రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ. 4.5 లక్షల కోట్లు ఖర్చు చేసింది. తెలంగాణ తరహాలో మహారాష్ట్ర, కేంద్రం ఎందుకు పనిచేయడం లేదు? దేశ రైతాంగానికి సాగునీరు, కరెంటు, పెట్టుబడి సాయం లేవు. అందుకే అబ్ కీ బార్ కిసాన్ సర్కార్.. అనే నినాదాన్ని తీసుకుని ముందుకు పోతున్నాం..
>
> - సీఎం కేసీఆర్

భారత రాష్ట్ర సమితిలో చేరడానికి తెలంగాణ భవన్‌కు వచ్చిన మహారాష్ట్ర నాయకులతో ముఖ్యమంత్రి కేసీఆర్ కాసేపు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బీఆర్ఎస్ తదుపరి టార్గెట్ మహారాష్ట్రేనని.. అక్కడ జరిగే అన్ని ఎన్నికల్లో గెలిచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో త్వరలోనే విదర్భలో భారీ బహిరంగసభ నిర్వహిద్దామన్నారు. త్వరలో జరిగే మహా

పార్టీని బలోపేతం చేసుకుందాం

రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేస్తుందని.. మెజారిటీ స్థానాలను కైవసం చేసుకునేలా ప్రయత్నాలు చేయాలని నేతలకు సూచించారు. మహారాష్ట్రలోని మొత్తం 288 నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంతోపాటు బీఆర్ఎస్ గెలుపునకు బాటలు వేసేలా కమిటీలు వేస్తామని చెప్పారు. మహారాష్ట్ర నుంచి బీఆర్ఎస్‌లో చేరేందుకు చాలా మంది నాయకులు వస్తున్నారన్నారు. ముఖ్యంగా రైతుల నాయకత్వంతోనే ముందుకెళ్లనున్నామని.. రైతుల పోరాటంలో మహారాష్ట్రలో ముఖ్య భూమిక పోషించాలని నేతలకు సూచించారు.

పొత్తా.. చిత్తా?

రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులకు తలనొప్పిగా బీఆర్ఎస్ పొత్తు వ్యవహారం

- పొత్తు ఉండదని గతంలోనే కుండబద్దలు కొట్టిన రాహుల్‌గాంధీ
- ఆ ప్రకటనకే కట్టుబడి ఉంటామన్న రాష్ట్ర ఇన్‌చార్జి ఠాక్రే
- అయినా తరచూ తెరపైకి 'పొత్తు' ముచ్చట
- తాజాగా జానా వ్యాఖ్యలతో మరోమారు కలకలం
- ఈ వ్యాఖ్యలను అధిష్టానం సీరియస్‌గా తీసుకున్నందునే హుటాహుటిన వివరణ
- బీఆర్ఎస్‌తో పొత్తుంటే మంచిదేననే భావనలో కాంగ్రెస్‌లోని ఓ వర్గం



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌తో పొత్తు వ్యవహారం రాష్ట్ర కాంగ్రెస్‌లో మరోసారి కలకలం రేపుతోంది. బీఆర్ఎస్‌తో పొత్తు ఉండాలా, వద్దా అన్నది ప్రజలు నిర్ణయిస్తారంటూ సీనియర్ నేత జానారెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్రస్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు తామే ప్రత్యామ్నాయమంటూ ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధమవుతున్న తరుణంలో.. ఇప్పుడు జానారెడ్డి, గతంలో పలువురు నేతలు చేసిన పొత్తు వ్యాఖ్యలు కేడర్‌ను అయోమయానికి గురిచేస్తున్నాయి. మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో మరోమారు బీఆర్ఎస్–కాంగ్రెస్ పొత్తు అంశం రాష్ట్ర రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారి తీస్తోంది.

కొందరు అలా.. కొందరు ఇలా..

రాష్ట్రస్థాయి కాంగ్రెస్ నేతల్లో పొత్తులపై అభిప్రాయం భిన్నంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్‌తో పొత్తుకు కొందరు నేతలు సుముఖంగా ఉంటే మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న నేపథ్యంలో పొత్తు ఉంటేనే వచ్చే ఎన్నికల్లో పార్టీకి మేలు జరుగుతుందనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేస్తుండగా.. బీఆర్ఎస్‌తో పొత్తు అంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయినట్టేనని, బీజేపీకి అప్పనంగా అవకాశం ఇచ్చిన వాళ్లమవుతామని మరికొందరు

మిగతా 3వ పేజీలో ▶

ఏమైనా జరగొచ్చు?

జానారెడ్డి చేసిన వ్యాఖ్యలను తేలిగ్గా తీసిపారేయాల్సిన పనిలేదని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్యారాచూట్లకు (ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి చేరినవారికి) టికెట్లు ఇచ్చేది లేదని 2018 ముందు రాహుల్‌గాంధీనే స్వయంగా చెప్పారని.. కానీ టికెట్ల కేటాయింపులో ప్యారాచూట్లకు కూడా తగిన స్థానం లభించిందని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు బీఆర్ఎస్‌తో పొత్తు విషయంలోనూ ఏదైనా జరగవచ్చని, జాతీయ రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఏఐసీసీ ఎలాంటి నిర్ణయమైనా తీసుకునే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పేపర్ల లీకేజీలో మీ నిర్లక్ష్యం లేదా?

కీలక బాధ్యతలు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చేతుల్లోనా?

- సైబర్ ఆడిటింగ్‌లో గుర్తించిన లోపాలు సరిచేయలేదేం?
- మీ పీఏలు గ్రూప్–1 పరీక్షలు రాస్తున్నట్లు మీకు తెలియదా?
- టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, సభ్యుడు లింగారెడ్డిపై సిట్ ప్రశ్నల వర్షం
- ఇద్దరినీ వేర్వేరుగా రెండేసి గంటల చొప్పున విచారణ.. వాంగ్మూలాలు నమోదు
- త్వరలో చైర్మన్ సహా మరికొందరికి నోటీసులు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీ స్కాంపై దర్యాప్తు చేస్తున్న 'సిట్'శనివారం కమిషన్ కార్యదర్శి అనితా రామచంద్రన్, సభ్యుడు లింగారెడ్డిలను ప్రశ్నించింది. సిట్ ఇన్‌చార్జ్‌గా ఉన్న అదనపు సీపీ (నేరాలు) ఏఆర్ శ్రీనివాస్ నేతృత్వంలోని బృందం ఇరువురినీ వేర్వేరుగా దాదాపు రెండు గంటల చొప్పున విచారించింది. కమిషన్ నిర్వహణ తీరు, లోపాలు, నిబంధనలు సహా అనేక అంశాలపై 27 ప్రశ్నలు సంధించి వాంగ్మూలాలు నమోదు చేసింది. అనిత కార్యాలయానికి వెళ్లి విచారించాలని సిట్ అధికారులు భావించగా తానే సిట్ ఆఫీసుకు వస్తానని చెప్పిన అనిత.. అన్నట్లుగా శనివారం ఉదయం వచ్చారు. లింగారెడ్డి మధ్యాహ్నం సిట్ అధికారుల ముందు హాజరుకాగా ఇద్దరినీ దాదాపు 2 గంటల చొప్పున ప్రశ్నించారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో కమిషన్ నిర్లక్ష్యం లేదా? అనే అంశంపై

మిగతా 2వ పేజీలో ▶



రవీంద్రనాథ్‌కు మళ్లీ చుక్కెదురు..

జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు నరేంద్ర చౌదరికి క్లీన్‌చిట్

ప్రస్తుత అధ్యక్షుడు రవీంద్రనాథ్ పిటిషన్‌ను డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు

ప్లాట్ కేటాయింపు సక్రమమే అన్న న్యాయస్థానం

2 లో

డేటా చోరీ సూత్రధారి దొరికాడు

హరియాణాలో వినయ్ భరద్వాజ్‌ను అరెస్ట్ చేసిన సైబరాబాద్ పోలీసులు

- దేశంలోని సుమారు 70 కోట్ల మంది వ్యక్తిగత సమాచారం కొట్టేసిన కేటుగాడు
- 24 రాష్ట్రాలు, 8 మెట్రో నగరాల ప్రజల సమాచారం చౌర్యం
- హైదరాబాద్‌కు చెందిన 56 లక్షలు, ఏపీకి చెందిన 2.10 కోట్ల మంది డేటా చోరీ
- పరారీలో ఉన్న అమీర్ సొహైల్, మదన్ గోపాల్‌ల కోసం పోలీసుల గాలింపు



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అతిపెద్ద డేటా చౌర్యం కేసులో కీలక సూత్రధారిని సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. దేశ జనాభాలో 50 శాతం ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించి విక్రయిస్తున్న ఫరీదాబాద్‌కు చెందిన వినయ్ భరద్వాజ్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. 24 రాష్ట్రాలు, 8 మెట్రో నగరాలకు చెందిన సుమారు 70 కోట్ల మంది రహస్య సమాచారాన్ని తస్కరించినట్లు పోలీసులు గుర్తించారు. రక్షణ, విద్యుత్, ఇంధన శాఖ, జీఎస్టీ, ఆర్టీవోలతోపాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ప్రవాసులు, టీచర్లు, వైద్యులు, లాయర్లు, ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, గృహిణులు.. ఇలా 104 కేటగిరీలకు

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

విజయ పాలు లీటరు ధర రూ.3 పెంపు



లాలాపేట: విజయ డెయిరీ పాల ధరను మరోసారి పెంచింది. ఏప్రిల్ 1 నుంచి ఈ ధర అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. టోన్డ్ మిల్క్ లీటరుకు రూ.3 చొప్పున పెంచినట్లు డెయిరీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రస్తుతం రూ.55గా ఉన్న టోన్డ్ మిల్క్ లీటరు ధర నేటి నుంచి రూ.58కి అందుబాటులోకి వచ్చింది. గత శుక్రవారం అర్ధరాత్రి నుంచి సరఫరా చేసిన పాలకు ఈ పెంచిన ధరలు వర్తిస్తాయని అధికారులు పేర్కొన్నారు. డబుల్ టోన్డ్ పాలు 300 మిల్లీ లీటర్ల ధర రూ.16 నుంచి రూ.17 వరకు.. 500 మిల్లీ లీటర్ల ధర రూ.26 నుంచి రూ.27కు పెరిగింది. ఆవు పాలు 500 మిల్లీ లీటర్లు రూ.28 నుంచి రూ.29 వరకు..స్టాండైజ్డ్ మిల్క్ 500 మిల్లీ లీటర్లు రూ.30 నుంచి రూ.31 వరకు, హోల్ మిల్క్ 500 మిల్లీ లీటర్లు రూ.35 నుంచి రూ.36 వరకు, డైట్ మిల్క్ 500 మిల్లీ లీటర్లు రూ.25 నుంచి రూ.26 వరకు, టీ స్పెషల్ మిల్క్ 500 మిల్లీ లీటర్లు రూ.27 నుంచి రూ.28 వరకు పెరిగింది.

రేపు బీసీల ఛలో ఢిల్లీ..

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50% రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 3న ఛలో ఢిల్లీ–పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. శనివారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. బీసీల విద్య ఉద్యోగ రిజర్వేషన్లను 25 నుంచి 50% పెంచాలని, త్వరలో జరిపే జనాభా గణనలో కులాలవారీ లెక్కలు తీయాలన్నారు.

పోయిన చెప్పు దొరికింది

కాజీపేట రూరల్: రైలు ఎక్కుతున్న సమయంలో తన చెప్పు పడిపోయిందని ఒక ప్రయాణికుడు రైల్వే ట్విట్టర్‌లో ఫిర్యాదు చేయగా.. రైల్వే పోలీసులు దాన్ని వెతికి అతనికి తిరిగి భద్రంగా అప్పగించారు. ఈ ఘటన ఆలస్యంగా శనివారం వెలుగు చూసింది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన ఒక ప్రయాణికుడు స్థానిక రైల్వే స్టేషన్‌లో గురువారం హైదరాబాద్‌కు వెళ్లేందుకు కాకతీయ ప్యాసింజర్ ఎక్కుతుండగా.. తన చెప్పు ఒకటి జారిపడి పోయిందని ట్విట్టర్‌లో రైల్వేబోర్డుకు ద్వారా ఫిర్యాదు చేశాడు. దీంతో కాజీపేట రైల్వే పోలీసులు శనివారం ఘన్‌పూర్ వద్ద ప్రయాణికుడి చెప్పును కనుగొని తీసుకొచ్చారు. ఫిర్యాదు చేసిన ప్రయాణికుడిని పిలిపించి.. అతనికి చెప్పును అప్పగించారు.



సికింద్రాబాద్‌కు చెందిన గిరి డయాబెటిక్ కన్సల్టేషన్ కోసం నగరంలోని ఓ ప్రముఖ ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్‌ను కలవడానికి వెళ్లాడు. డాక్టర్‌ను చూడగానే ఆయన్ను ఎక్కడో బాగా చూసినట్టు అనిపించింది. కాసేపటికి గుర్తొచ్చింది. మొహమాటం పడకుండా 'మీరు ఫలానా వెబ్ సిరీస్‌లో నటించారు కదా డాక్టర్?..'అంటూ అడిగాడు. ఆయన అవునంటూ చిరునవ్వుతో సమాధానమివ్వడంతో సంబరపడి పోయాడు. గిరి లాంటి అనుభవాన్ని నగరంలో చాలామంది ఎదుర్కొంటున్నారు. సీరియల్స్, వెబ్ సిరీస్‌లు బాగా చూసేవారికి ఇలాంటి వారు ఎక్కడో ఒకచోట తారస పడుతున్నారు. వెబ్ సిరీస్‌లు, సీరియల్స్ రూపంలో అవకాశాలను అందిపుచ్చుకుంటున్న నగరవాసులు, తమలో అప్పటివరకు అంతర్లీనంగా ఉన్న నటనా కౌశలాన్ని ప్రదర్శిస్తున్నారు. వీలైతే సినిమాల్లోనూ చాన్స్ కొట్టేస్తున్నారు. మొత్తం మీద ఏ వీధి వెదికినా ఆ వీధిలోనే గలరు యాక్టర్లు అన్నట్టుగా సిటీ మారిపోయిందంటే అతిశయోక్తి కాదు.

ప్రొఫెషన్ ఏదైనా..

వెబ్ సిరీస్‌లు, ఓటీటీల నేపథ్యంలో అవకాశాలు
సద్వినియోగం చేసుకుంటున్న సిటీజనులు
తమ నటనతో ఆకట్టుకుంటున్న వైనం

యాక్టింగే ప్యాషన్!

సాక్షి, హైదరాబాద్: గతంలో నటులు అంటే నాటకాలనో, సినిమాలనో కెరీర్‌గా ఎంచుకున్నవారే అన్నట్టుగా ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. వృత్తిలా కాకుండా హాబీగా నటించేవారి సంఖ్య పెరిగిపోయింది. గత ఐదేళ్ల కాలంలో ఆన్‌లైన్ సర్వీసుల మాదిరి ఈ హాబీ కూడా ఒక్కసారిగా ఊపందుకుంది. ముఖ్యంగా ఓటీటీ వేదికలు విస్తృతమవడం, పెద్దసంఖ్యలో సీరియల్స్, వెబ్ సిరీస్‌లు రూపుదిద్దుకుంటుండడంతో నటీనటులకు అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. పాత్రోచితంగా కనిపించే వ్యక్తులకు కాస్తంత శిక్షణ అందిస్తే చాలు పనై పోతోంది. వయసులకు అతీతంగా నగరంలో అనేకమందికి నటన ఓ ప్యాషన్‌గా మారిపోయింది.

ప్రేక్షకాభిరుచిలో మార్పు...

➤ నటనలో పేరున్నవారు, బాగా తెలిసిన ముఖాలను మాత్రమే కాకుండా కొత్త వారిని కూడా ఆదరించే దిశగా ప్రేక్షకుల అభిరుచుల్లో స్పష్టమైన మార్పు వచ్చింది. దీంతో నిర్మాతలు కొత్త నటీనటులతో ప్రయోగాలు చేయడానికి గతంలోలా భయపడడం లేదు. అంతేకాకుండా ఏ రంగంలో ఉన్నవారు ఆ రంగానికి సంబంధించిన పాత్ర లో కాస్త సులభంగా మమేకమ య్యే వీలుంటుంది. కాబట్టి వినూ త్న పద్ధతుల్లో సినిమాలో వైద్యుడిపాత్ర ఉంటే వైద్యుడిని, లాయర్ పాత్రకు లాయ ర్‌ని ఎంచుకుంటున్నారు. సర దాగా ఓ సీన్‌లో చేసేవారు కొందరైతే, ఇంకొందరు ప్రాధాన్యత కలిగిన పాత్రల్లోనూ తమ సత్తా చూపుతున్నారు. దీంతో రంగాలేమైనా తెరంగేట్రం సాధారణ విషయంగా మారిపోయింది.

ఓ గంగవ్వ.. ఇంకో రామ్.. మరో శ్రీనివాస్


దీపా కిరణ్


శ్రీనివాస్


రామ్

నటనపై ఉన్న ఆసక్తి కారణంగా సరదాగా టిక్ టాక్స్‌తో మొదలుపెట్టి రీల్స్, షార్ట్ వీడియోల్లో, సోషల్ మీడియా వేదికలపై కాస్తో కూస్తో పేరు సంపాదించుకున్నవారితో పాటు ఇతరత్రా రంగాల్లో ఉన్నవారు కూడా సీరియల్స్, వెబ్ సిరీస్‌ల్లో నటించేస్తున్నారు. సినిమా తారలుగానూ మారిపోతున్నారు. ఒక యూట్యూబ్ చానెల్ ప్రోగ్రామ్ ద్వారా పేరు తెచ్చుకున్న మారుమూల గ్రామానికి చెందిన గంగవ్వ దీనికో ఉదాహరణ. నగరానికి చెందిన ఫ్యాషన్ డిజైనర్ రామ్... గత కొంత కాలంగా సెలబ్రిటీల కోసం పనిచేస్తూ ఆ రంగంలో పేరొందారు. లుక్స్‌లో టాలీవుడ్ హీరోలకు తీసిపోని రామ్... గత లాక్ డౌన్ టైమ్‌లో దొరికిన ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకున్నారు. 'పచ్చీస్'పేరుతో రూపొందించిన ఓ సినిమాలో హీరోగా నటించారు. ఆ సినిమా ప్రస్తుతం ఓటీటీలో అందుబాటులో ఉంది. నిర్మాణ రంగంలో ఉన్న మణికొండకు చెందిన శ్రీనివాస్‌కు కూడా నటనపై మక్కువ ఎక్కువ. కానీ ఎన్నో ఏళ్లపాటు తన అభిరుచిని, తనలోని నటనా కౌశలాన్ని తనలోనే దాచేసుకున్నారు. పిల్లలు పెద్దవాళ్లవడంతో వృత్తికి కాస్త విరామం ఇచ్చారు. సీరియల్స్‌తో పాటు సినిమాల్లోనూ రాణిస్తున్నారు. ఇక నగరంలో స్టోరీ టెల్లింగ్‌కు కేరాఫ్‌గా పేరొందిన దీపా కిరణ్ కూడా ఇటీవల యాంగర్ టేల్స్ అనే ఓటీటీ చిత్రంలో నటించారు. అందులోని నాలుగు పొట్టి కథల్లో ఒకటైన 'యాస్ ఆఫ్టర్ నూన్ న్యాప్'లో ఆమె కనిపిస్తారు. ఈ ఎక్స్‌పీరియన్స్ తనకు కొత్త అనుభూతిని అందించిందని ఆమె అంటున్నారు.

కేరెక్టర్‌కు ఓకే.. కెరీర్‌గా నాట్ ఓకే


సంధ్యారాజు


రాఘవేంద్ర

ఇలాంటి నటులు వరుస పెట్టి సినిమాలు చేసేయాలనే ఆత్రుత ఏమీ చూపడం లేదు. తమ వృత్తికో, ఉద్యోగానికో ప్రాధాన్యత ఇస్తూనే 'జస్ట్ ఫర్ ఏ ఛేంజ్' అన్నట్టుగా అడపాదడపా వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. సినిమా అనేది తమకు కేవలం అభిరుచి మాత్రమేనని చాలామంది అంటున్నారు. ''నాట్యం'అనేది నా అభిరుచికి, నా ఆలోచనలకు దగ్గరగా ఉన్న సినిమా కాబట్టి నటించాను. అంతే తప్ప సినిమాల్ని కెరీర్‌గా తీసుకునే ఆలోచన లేదు..'అంటున్నారు సంధ్యారాజు. ప్రముఖ పారిశ్రామికవేత్త సత్యం రామలింగరాజు కుటుంబ సభ్యురాలైన ఈ సంప్రదాయ నృత్య కారిణి... ఇటీవలే నాట్యం అనే సినిమాలో కథానాయికగా నటించారు. ఆ సినిమా విమర్శకుల ప్రశంసలతో పాటు జాతీయ పురస్కారాన్ని కూడా అందుకుంది. అయినప్పటికీ ఆమె మరో చిత్రంలో నటించలేదు. అదే విధంగా నగరానికి చెందిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ల రాఘవేంద్ర కూడా ఒకటి రెండు చిత్రాల్లో కనిపించారు.

బలహీనపడిన ఉపరితల ద్రోణి

రానున్న రెండ్రోజులు మోస్తరు వర్షాలు




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గత రెండు రోజులుగా కొనసాగిన ఉపరితల ద్రోణి శనివారం బలహీనపడింది. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయని వాతావరణ శాఖ సూచించింది. మరో రెండ్రోజులు అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. శనివారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే..గరిష్ట ఉష్ణోగ్రత మహబూబ్‌నగర్‌లో 37.9 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 19.8 డిగ్రీ సెల్సియస్‌గా నమోదయ్యాయి.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
అనంతపురం	41.1	22.4
కర్నూలు	39.7	27.3
ఆదిలాబాద్	37.3	21.7
భద్రాచలం	35.0	23.5
హకీంపేట్	34.5	22.1
దుండిగల్	34.2	19.4
హనుమకొండ	34.0	24.5
ఏలూరు	34.0	26.0
హైదరాబాద్	35.7	23.6
ఖమ్మం	35.8	25.0
మహబూబ్‌నగర్	37.9	23.6
మెదక్	35.6	19.8
నల్లగొండ	36.5	21.4
నిజామాబాద్	36.4	23.6
రామగుండం	36.6	25.6
విశాఖపట్నం	33.8	27.2

రవీంద్రనాథ్‌కు మళ్లీ చుక్కెదురు

- జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు నరేంద్ర చౌదరికి క్లీన్‌చిట్
- ప్రస్తుత అధ్యక్షుడు రవీంద్రనాథ్ పిటిషన్ డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు
- ప్లాట్ కేటాయింపు సక్రమమే అన్న న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బి.రవీంద్రనాథ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్లాట్ కేటాయింపును తప్పుబడుతూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ నిరాశే మిగిలింది ఓ ప్లాట్ కేటాయింపునకు సంబంధించి హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆయన సుప్రీంను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో సీహెచ్ శిరీషకు 853 ఎఫ్ ప్లాట్ కేటాయించారు. ఈ ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని హైకోర్టు కూడా హౌసింగ్ సొసైటీని ఆదేశించింది. ఈ మేరకు 2020లో అప్పటి పాలకవర్గం ప్లాట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసింది. అయితే, 2021 మార్చి నెలలో హౌసింగ్ సొసైటీ ఎన్నికల నేపథ్యంలో ఈ ప్లాట్ అంశాన్ని తెరపైకి తెచ్చిన రవీంద్రనాథ్.. ప్లాట్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు, ఇది సివిల్ ఇన్ నేచర్ అంటూ కోర్టుకు క్లోజర్ రిపోర్ట్‌ను సమర్పించారు. ఆ తర్వాత కేసును రీ ఓపెన్ చేయాలంటూ నాంపల్లి క్రిమినల్ కోర్టులో రవీంద్రనాథ్ ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు న్యాయస్థానం కేసును రీ ఓపెన్ చేసింది.

కాగా, కేసును మళ్లీ తెరవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అప్పటి జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి హనుమంతరావు తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. జూబ్లీహిల్స్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శిగా ఉన్న రవీంద్రనాథ్ స్థానంలో రాజేశ్వరరావు ఎన్నికై నందున ఈ కేసుతో రవీంద్రనాథ్‌కు ఎలాంటి సంబంధం లేదని హనుమంతరావు వినిపించిన వాదనలతో ఏకీభవించిన హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పు చెప్పింది. ఈ కేసు తీర్పులో న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు కూడా చేసింది. కోర్టును వ్యక్తిగత దూషణలకు వేదికగా మార్చుకోవద్దని హెచ్చరించింది. అసలు రవీంద్రనాథ్‌కు ఫిర్యాదు చేసే హక్కు లేదని తేల్చి చెప్పింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రవీంద్రనాథ్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఇదే అంశంపై రవీంద్రనాథ్ ఈడీకి కూడా ఫిర్యాదు చేశారు. ఈడీ విచారణపై గతంలో హైకోర్టు స్టే విధించగా.. ఆ తర్వాత ఈడీ ఈసీఐఆర్‌ను కొట్టివేసింది. హైకోర్టు ఆదేశాలతో నాంపల్లి క్రిమినల్ కోర్టు కూడా నిందితులపై ఉన్న కేసులను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రవీంద్రనాథ్ సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. ఆయన పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఆదేశాలను సమర్థిస్తున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు నరేంద్ర చౌదరికి క్లీన్‌చిట్ లభించింది. నరేంద్ర చౌదరిపై రవీంద్రనాథ్ మోపిన అభియోగాలన్నీ వీగిపోయాయి. ఆదివారం జరిగే జూబ్లీహిల్స్ సొసైటీ జనరల్ బాడీ సమావేశం పర్యవేక్షణకు అధికారిని నియమించాలని సహకార సంఘాల కమిషనర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

అడ్వెంచర్ టూరిజానికి విస్తృత అవకాశాలు

- పర్యాటకుల కోసం వినూత్న విధానాలు
- జీ20–అడ్వెంచర్ టూరిజంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


శనివారం సిలిగురిలో కళాకారులతో కలసి డోలు వాయిస్తున్న కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: దేశీయంగా సాహస పర్యాటకాని(అడ్వెంచర్ టూరిజం)కి విస్తృత అవకాశాలు ఉన్నాయని కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. విదేశీ పర్యాటకులను ఆకట్టుకోవడానికి అనేక ప్రదేశాలున్నాయని తెలిపారు. ఆయా అవకాశాలు సద్వినియోగం చేసుకోవడానికి వినూత్న విధానాలతో కేంద్రం ముందుకెళ్తోందని తెలిపారు. రెండో పర్యాటక రంగ జీ20 వర్కింగ్ గ్రూప్ సమావేశాల సందర్భంగా పశ్చిమబెంగాల్‌లోని సిలిగురిలో 'సాహస పర్యాటకం'పై ఏర్పాటు చేసిన సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..అడ్వెంచర్ టూరిజానికి హిమాలయాలను మించిన ఉత్తమమైన ప్రదేశం మరొకటి ఉండదని, అందుకే ఈ సామర్థ్యాన్ని సద్వినియోగ పరుచుకునే దిశగా కేంద్రం కృషి చేస్తోందని తెలిపారు. ట్రెక్కింగ్ అండ్ క్యాంపింగ్, మౌంటనీరింగ్ వంటి వాటికి డిమాండ్ పెరిగిందని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు జాతీయ పర్యాటక విధానాన్ని తీసుకురానున్నట్లు చెప్పారు.

పులుల సంరక్షణలో తెలంగాణ విఫలం

పులుల సంరక్షణలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో గొప్పలు మినహా క్షేత్రస్థాయిలో నిధులు అందడం లేదని, పులుల సంరక్షణకు రూ.2.2 కోట్లు కూడా కేటాయించక పోవడమే అందుకు నిదర్శనమన్నారు. దేశంలో పులుల సంరక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో 'ప్రాజెక్ట్ టైగర్'ను ప్రారంభించి శనివారంతో యాభై ఏళ్లు పూర్తి కాగా ప్రపంచ అడవి పులుల సంఖ్యలో భారత్‌లోనే 70 శాతానికి పైగా పులులున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్, ఏటూరు నాగారం, కిన్నెరసాని, పాఖల్, పోచారం, మంజీర, ప్రాణహిత వంటి వన్యప్రాణుల అభయారణ్యాలకు కేంద్రం రూ.30 కోట్లు ఇచ్చిందని తెలిపారు. అనంతరం...కిషన్‌రెడ్డి అడ్వెంచర్ టూరిజంకు ఉన్న అవకాశాలపై వివిధ దేశాల ప్రతినిధులు ప్యానల్ చర్చలో పాల్గొన్నారు.

అడవుల రక్షణకు పెద్దపులి సంరక్షణ అవసరం

ప్రాజెక్ట్ టైగర్‌కు 50 ఏళ్ల సందర్భంగా ఎంపీ సంతోష్

సాక్షి, హైదరాబాద్: అడవుల రక్షణకు పెద్దపులి సంరక్షణ అవసరమని, గ్రీన్ ఇండియా చాలెంజ్ తరపున పులుల రక్షణకు మద్దతు తెలుపుతున్నట్లు అడవులు, పర్యావరణంపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ చెప్పారు. దేశవ్యాప్తంగా అడవుల రక్షణ, పులుల సంరక్షణ కోసం కేంద్రం 1973లో ప్రాజెక్టు టైగర్‌ను ప్రవేశ పెట్టింది. శనివారం (ఏప్రిల్ 1) ఈ సేవ్ టైగర్ ఉద్యమానికి యాభై ఏళ్లు నిండాయి. దేశవ్యాప్తంగా ఈ ప్రాజెక్ట్ టైగర్ కింద తీసుకున్న చర్యల వల్ల పులుల సంఖ్య పెరిగిందని సంతోష్ పేర్కొన్నారు. 1973లో 1,827గా నమోదైన పులుల సంఖ్య 2022 నాటికి 2,967కు చేరగా.. టైగర్ రిజర్వుల సంఖ్య తొమ్మిది నుంచి 53కు పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ టైగర్ ప్రాధాన్యాన్ని ఆయన ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. సేవ్ టైగర్ ఉద్యమం గోల్డెన్ జూబ్లీ సందర్భంగా తెలంగాణకు చెందిన అమ్రాబాద్ టైగర్ రిజర్వు విడుదల చేసిన టైగర్ బుక్, టీషర్ట్, కాఫీ మగ్ సావనీర్లను సంతోష్ ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ ద్వారా అమ్రాబాద్, కవ్వాల్ పులుల అభయారణ్యాన్ని బాగా నిర్వహిస్తోందని, పులుల సంఖ్య పెరుగుతోందన్నారు. పర్యావరణ సమతుల్యతలో పెద్దపులి అగ్రభాగాన ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ ప్రతినిధులు కరుణాకర్, రాఘవ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఈడీ సోదాలు

- సాహితీ ఇన్‌ఫ్రా, ఫీనిక్స్ కంపెనీ డైరెక్టర్ల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు
- ఫార్మా కంపెనీల్లో మనీలాండరింగ్ పైనా ఈడీ అధికారుల ఆరా

సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ సంస్థల లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టి సారించింది. ఈడీ అధికారుల బృందాలు శనివారం హైదరాబాద్‌లోని సాహితీ ఇన్‌ఫ్రాటెక్, దాని అనుబంధ సంస్థల కార్యాలయాలు, ఆ సంస్థ కీలక వ్యక్తుల ఇళ్లతోపాటు కంపెనీ కీలక ప్రమోటర్ అయిన బి.లక్ష్మినారాయణ ఇంట్లోనూ ఈడీ సోదాలు కొనసాగినట్టు సమాచారం. హైదరాబాద్ సీసీఎస్‌తోపాటు పలు పోలీస్‌స్టేషన్లలో లక్ష్మినారాయణ, సాహితీ గ్రూప్‌నకు చెందిన మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. ప్రీలాంచ్ ఆఫర్ల పేరిట కంపెనీ పలువురిని మోసగించినట్టు తెలుస్తోంది. అమీన్‌పూర్ వెంచర్‌కు సంబంధించి దాదాపు 46 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్టు సమాచారం. అమీన్‌పూర్‌లో సాహితీ గ్రూప్‌నకు చెందిన శ్రావణి ఎలైట్‌పైనే ఎక్కువ ఫిర్యాదులు అందినట్టు తెలుస్తోంది. 38 అంతస్తుల భవనాల్లో ఫ్లాట్లను ప్రీలాంచ్ పేరిట విక్రయించారని, అసలు ఈ భవనాలకు హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అనుమతులు సైతం లేవని దర్యాప్తు అధికారులు గుర్తించారని తెలిసింది. ఇప్పటికే ఈ కేసులలో మనీలాండరింగ్ గుట్టురట్టు చేసేందుకు ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. మరో రియల్ ఎస్టేట్ కంపెనీ ఫీనిక్స్ గ్రూప్ సంస్థల్లోనూ శనివారం ఈడీ అధికారుల సోదాలు కొనసాగినట్టు సమాచారం. మొత్తం ఏడు ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగినట్టు తెలిసింది.

సాహితీ, ఫీనిక్స్ మధ్య లావాదేవీలు జరిగినట్టు గుర్తింపు!

అమీన్‌పూర్ ల్యాండ్ కేసులో సాహితీ, ఫీనిక్స్ మధ్య లావాదేవీలు జరిగినట్టుగా ఈడీ అధికారులకు ఆధారాలు లభించినట్టు తెలిసింది. ఓమిక్స్ ఇంటర్నేషనల్ కంపెనీలోనూ ఈడీ అధికారులు సోదాలు నిర్వహించినట్టు సమాచారం. ఫార్మా కంపెనీల్లోనూ ఈడీ అధికారుల సోదాలు కొనసాగినట్టు తెలిసింది. ఈడీ అధికారులు శనివారం పల్సస్ ఫార్మా కంపెనీతోపాటు ఆ కంపెనీ డైరెక్టర్ల ఇళ్లలోనూ సోదాలు చేసినట్టు తెలిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పటాన్‌చెరు, మాదాపూర్‌ల్లో ఈ సోదాలు కొనసాగినట్టు తెలిసింది. ప్రధానంగా నగదు లావాదేవీలపైనే ఈడీ అధికారులు దృష్టి పెట్టినట్టు సమాచారం.

డేటా చోరీ సూత్రధారి దొరికాడు

▶ మొదటి పేజీ తరువాయి

చెందిన ప్రజలు, సంస్థల వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని నిందితుడు చోరీ చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాలివే..

వెబ్ డిజైనర్ నుంచి...

హరియాణాలోని ఫరీదాబాద్‌కు చెందిన వినయ్ భరద్వాజ్ వెబ్ డిజైనర్‌గా పనిచేసేవాడు. ఓ వ్యక్తితో ఏర్పడిన పరిచయంతో డేటా సమీకరణ, విక్రయం గురించి తెలుసుకున్నాడు. వెబ్ డిజైనింగ్ కోసం తన వద్దకు వచ్చే కస్టమర్ల వివరాలను మార్కెటింగ్ ఏజెంట్లకు, సైబర్ నేరస్తులకు విక్రయించి సొమ్ము చేసుకొనేవాడు. అప్పనంగా డబ్బు వస్తుండటంతో ప్రజలు, సంస్థల వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని సైతం తస్కరించాలని నిర్ణయించుకున్నాడు. డేటా సమీకరణ కోసం ఏకంగా 4.5 లక్షల మంది ఉద్యోగులను నియమించుకున్నాడు. ఇందులో అమీర్ సొహైల్, మదన్ గోపాల్‌లు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు.

విక్రయం కోసం వెబ్‌సైట్..

తస్కరించిన డేటాను విక్రయించేందుకు ఇన్‌స్పైర్ వెబ్జ్ వెబ్‌సైట్‌ను ప్రారంభించాడు. కస్టమర్లను ఆకర్షించేందుకు సోషల్ మీడియాలో ప్రచారం చేసేవాడు. క్లౌడ్ డ్రైవ్ లింక్‌ల ద్వారా మాత్రమే డేటాను విక్రయించేవాడు. ఇలా గత 8–12 నెలలుగా నిందితుడు డేటా తస్కరణ, విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఎలా వెలుగులోకి వచ్చిందంటే..

నగరానికి చెందిన ఓ వ్యక్తి నెల క్రితం ఓపెన్ సోర్స్ వెబ్‌సైట్‌లో తన వ్యక్తిగత సమాచారం చూసి కంగుతిన్నాడు. వెంటనే సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సమాచారం ఎలా బహిర్గతమైందో కూపీ లాగారు. 10 రోజుల క్రితం రెండు కేసులలో 16 మంది డేటా చోరీ నిందితులను పట్టుకున్నారు. వారిని కస్టడీలోకి తీసుకొని విచారించగా.. వినయ్ భరద్వాజ్ పేరు వెలుగులోకి వచ్చింది. దీంతో అతనికి నోటీసులు జారీ చేసి అరెస్టు చేశారు.

తెలుగు రాష్ట్రాల ప్రజల డేటా కూడా..

నిందితుడు విక్రయించిన డేటాలో తెలంగాణ, ఏపీ ప్రజల డేటా కూడా ఉంది. హైదరాబాద్‌కు చెందిన 56 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 2.10 కోట్ల మంది వ్యక్తిగత వివరాలను నేరస్తుడు విక్రయానికి పెట్టాడు. పన్ను చెల్లింపుదారులు, కంపెనీ సెక్రటరీలు, ఆడిటర్లు, ఉద్యోగస్తుల డేటా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వాటిలో వ్యక్తుల పేరు, ఫోన్ నంబరు, చిరునామా, ఈ–మెయిల్ ఐడీలు తదితర వివరాలున్నాయి.

నిందితుడు వినయ్ నుంచి రెండు సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న అమీర్, మదన్‌ల కోసం సైబరాబాద్ పోలీసు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

ఈ డేటాతో ఏం చేసేవారంటే..

మార్కెటింగ్ బృందాలు, ఏజెన్సీలు, సైబర్ నేరస్తులు నిందితుడి నుంచి డేటాను కొనుగోలు చేసేవారు. ఉత్పత్తుల ప్రచారం, మార్కెటింగ్ కోసం బల్క్ మెసేజ్‌లు పంపించడం కోసం ఏజెన్సీలు డేటాను కొనుగోలు చేశాయి. సైబర్ నేరస్తులు కొనుగోలు చేసిన డేటాతో ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడేవారు. ఎవరెవరి డేటా లీకైంది? ఏ సంస్థ, వ్యక్తులు లీకు చేశారు? వంటి సమస్త సమాచారాన్ని ప్రజలకు ఎలా చేరవేయాలనే అంశంపై న్యాయ సలహా తీసుకుంటున్నామని సైబరాబాద్ డీసీపీ (క్రైమ్స్) కల్మేశ్వర్ శింగేన్వర్ తెలిపారు.

రక్షణ శాఖ ఉద్యోగుల సమాచారం లీక్..

ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతానికి చెందిన 2.55 లక్షల మంది రక్షణ శాఖ ఉద్యోగుల రహస్య సమాచారాన్ని నేరస్తుడు తస్కరించి విక్రయానికి పెట్టాడు. ఇందులో ఉద్యోగుల వ్యక్తిగత వివరాలతోపాటు ర్యాంకు, పనిచేస్తున్న చోటు, విభాగం వంటి వివరాలున్నాయి. దీంతోపాటు ఎల్ఐసీ, విద్యుత్, ఇంధన శాఖ వంటి ప్రభుత్వ సంస్థల సమాచారం కూడా ఉంది. అలాగే 1.26 లక్షల మంది ప్రవాసులు, 5 లక్షల మంది హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్ఎన్ఐ)ల డేటా కూడా అంగట్లో విక్రయానికి పెట్టేశాడు.

విద్యార్థుల డేటా నేరస్తుల చేతుల్లో..

విద్యాసంస్థలతోపాటు విద్యార్థుల డేటా కూడా నేరస్తుల చేతుల్లోకి చేరింది. బైజూస్, వేదాంతు వంటి ఆన్‌లైన్ విద్యాసంస్థలకు చెందిన 18 లక్షలు మంది విద్యార్థులు, 1.8 లక్షల మంది నీట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు, 30 లక్షల మంది సీబీఎస్ఈ (10, 12వ తరగతి), 3.5 కోట్ల మంది ఇతర విద్యార్థుల డేటాను నేరస్తులు విక్రయానికి పెట్టారు.

డేటా లీకైన ప్రధాన రాష్ట్రాలివే: (అంకెలు కోట్లలో)

రాష్ట్రం	డేటా
ఉత్తరప్రదేశ్	21.39
మహారాష్ట్ర	4.50
ఢిల్లీ	2.70
ఏపీ	2.10
రాజస్తాన్	2
కర్ణాటక	2
కేరళ	1.57
మధ్యప్రదేశ్	1.10
తమిళనాడు	1.02
పంజాబ్	1.5
హరియాణా	1
బిహార్	1

పేపర్ల లీకేజీలో మీ నిర్లక్ష్యం లేదా?

▶ మొదటి పేజీ తరువాయి

కొంత సమాచారం సేకరించారు.

సిబ్బందే లీక్ చేస్తారనుకోలేదు..

జాగ్రత్తలన్నీ తీసుకొనే ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నామని... కానీ కమిషన్‌లో పనిచేసే సిబ్బందే లీకేజీకి పాల్పడతారని ఊహించలేదని అనితా రామచంద్రన్, లింగారెడ్డి స్పష్టం చేశారు. నిందితులు కొన్నాళ్లుగా వ్యక్తిగత సహాయకులుగా పనిచేస్తున్నందున ఏ సందర్భంలోనూ వారిపై అనుమానం రాలేదని సిట్‌కు తెలిపారు. సైబర్ ఆడిటింగ్‌లో గుర్తించిన లోపాలను సరిచేయకపోవడానికి గల కారణాలపైనా సిట్ అధికారులు వారిద్దరినీ ప్రశ్నించారు. కమిషన్ పరిధిలోని అంశాలపై ఎప్పటికప్పుడు నిర్ణయం తీసుకున్నామని, ప్రభుత్వ, ఇతర శాఖల పరిధిలోని అంశాల్లోనే జాప్యం జరుగుతోందని వివరణ ఇచ్చారు. కమిషన్‌లో చైర్మన్ నుంచి ఉన్నతోద్యోగుల వరకు ఎవరి బాధ్యతలు ఏమిటన్నది అడగటంతోపాటు వాటిని సంబంధిత వ్యక్తులు సక్రమంగా నిర్వర్తిస్తున్నారా? దానిపై నిత్యం పర్యవేక్షణ ఉంటోందా? అనే అంశంపైనా సిట్ అనిత, లింగారెడ్డిల నుంచి సమాచారం సేకరించింది. కాన్ఫిడెన్షియల్ సెక్షన్ నిర్వహణ, యాక్సెస్ కంట్రోల్ లేకపోవడం, కస్టోడియన్ల ఎంపిక తదితర విషయాలపైనా ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కీలక బాధ్యతల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకోవడంపైనా పోలీసులు ప్రశ్నించారు. అయితే విధానపరమైన నిర్ణయాలు ఏ ఒక్కరో తీసుకోరని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తామని అనిత, లింగారెడ్డి సిట్ దృష్టికి తీసుకువెళ్లారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శి, సభ్యుల వద్ద వ్యక్తిగత సహాయకులుగా పనిచేస్తున్న వాళ్లు కమిషన్ నిర్వహించే పోటీ పరీక్షలు రాయవచ్చా? అనే అంశంపై సిట్ అనితను ప్రశ్నించింది. ఇలా రాయకూడదని ఎలాంటి నిబంధన లేదన్న ఆమె గతంలోనూ అనేక మంది ఉద్యోగులు రాశారని వివరించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డితోపాటు మిగిలిన సభ్యులు, ఉన్నతాధికారులకు సైతం త్వరలో నోటీసులు ఇచ్చి విచారించడం ద్వారా వాంగ్మూలాలను నమోదు చేయాలని సిట్ అధికారులు నిర్ణయించారు.

సిట్ అదుపులో ఉన్న మాజీ ఉద్యోగులపై ఆగ్రహం

అనిత రామచంద్రన్, లింగారెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చిన సమయంలో పోలీసు కస్టడీలో ఉన్న కమిషన్ మాజీ ఉద్యోగులు షమీమ్, రమేష్, సురేష్‌లు అక్కడే ఉన్నారు. వారిలో షమీమ్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా, రమేష్ సభ్యుడు లింగారెడ్డికి వ్యక్తిగత సహాయకుడిగా అరెస్టు అయ్యే వరకు పనిచేశారు. వారిని సిట్ కార్యాలయంలో చూసిన అనిత, లింగారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది. మీ చర్యల వల్ల కమిషన్ పరువుపోవడంతోపాటు వేలాది మంది నిరుద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందని మండిపడ్డట్లు తెలుస్తోంది. కమిషన్ ఉద్యోగులు, వివిధ పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు అందించాలని సిట్ అనితను కోరింది. వారి మధ్య ఏమైనా సంబంధాలు ఉన్నాయా? ఉంటే ఏమిటి? తదితర అంశాలు సరిచూడటానికి ఈ కోణంలో ముందుకు వెళ్తున్నారు.

క్లుప్తంగా...

టీఎస్‌పీఎస్సీ వ్యవహారంపై ఏసీబీకి కాంగ్రెస్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)ను కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి నేతృత్వంలోని కాంగ్రెస్ బృందం శనివారం ఏసీబీ డీజీ రవిగుప్తాను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అవినీతి నిరోధక చట్టం–1988లోని సెక్షన్ (సీ) ప్రకారం ఈ వ్యవహారంపై దర్యాప్తు జరపాలని కోరుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాసిన లేఖను రవి గుప్తాకు అందించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారు ఈ లీకేజీకి పాల్పడినందున వారిపై దర్యాప్తు జరపాలని, నిరుద్యోగ యువతకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. ఏసీబీ డీజీని కలిసిన వారిలో కాంగ్రెస్ నేతలు బల్మూరి వెంకట్, మానవతా రాయ్, చరణ్‌కౌశిక్ యాదవ్ ఉన్నారు.

తీగలాగితే ప్రగతిభవన్ డొంక కదిలిందా?

పేపర్ లీకేజీపై రేవంత్ ట్వీట్



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ సభ్యుడు లింగారెడ్డిని సిట్ విచారించడంపై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆసక్తికర ట్వీట్ చేశారు. 'టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ..తీగ లాగితే ప్రగతిభవన్ డొంక కదిలిందా?.. విచారణలో 'బావ'..సీఎంవో తెలంగాణలో బావమరిది.. మీకర్థమవుతోందా పరువుగల కేటీఆర్ బీఆర్ఎస్ గారూ' అంటూ శనివారం రేవంత్ ట్వీట్ చేశారు.ఈ ట్వీట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

నేడు టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) విస్తృత స్థాయి కార్యవర్గం ఆదివారం గాంధీభవన్‌లో జరగనుంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశానికి అన్ని జిల్లాల నాయకులు హాజరు కావాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ కోరారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసిన నేపథ్యంలో కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న పోరాటాన్ని కేంద్రం అణచివేస్తున్న తీరుకు నిరసనగా ఏప్రిల్‌లో నిర్వహించాల్సిన 'జై భారత్ సత్యాగ్రహం'కార్యాచరణ రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.


బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య చీకటి ఒప్పందం ఉందని బీజేపీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు డా.కె. లక్ష్మణ్ ఆరోపించారు. ఇదే విషయాన్ని తాజాగా కాంగ్రెస్‌నేత జానారెడ్డి వ్యాఖ్యలు స్పష్టం చేయగా, గతంలో కూడా ఆ పార్టీ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా దీన్నే గుర్తు చేస్తున్నాయని తెలిపారు. శనివా రం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ భద్రాచలం వెళితే సీఎం పదవి ఊడుతుందనే మూఢనమ్మకంతో రాముడిని సైతం అవమానించే దుస్థితి ఏర్పడిందన్నారు. రాముడికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు ఇవ్వడంలేదన్నారు. ఈ నెల 8 న ప్రధాని మోదీ రాష్ట్రంలో రూ. 20వేల కోట్ల పనులకు శ్రీకారం చుడతారని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో 30 లక్షల కుటుంబాలు ఆందోళన చెందుతోంటే కేసీఆర్ రాష్ట్రాలు తిరుగుతున్నారే కానీ భరోసా ఇవ్వలేదని మండిపడ్డారు.

సీఎంకు నిరుద్యోగుల బాధలు పట్టవా?


బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



నాగర్‌కర్నూల్ రూరల్/హైదరాబాద్: సీఎం కేసీఆర్‌కు దేశమంతా తిరిగి సమావేశాలు నిర్వహించడానికి సమయం ఉంటుంది కానీ.. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు పడుతున్న బాధల గురించి ఎందుకు మాట్లాడరని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. బహుజన రాజ్యాధికార యాత్ర సందర్భంగా శనివారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల వాటా ఏదని ప్రశ్నించారు. అట్టడుగు ప్రజలను అణచివేస్తూ ఏ మొఖం పెట్టుకుని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని ప్రశ్నించారు. పేపర్ లీక్ వ్యవహారంలో బోర్డు సభ్యులను విచారిస్తేనే దొంగలు బయటపడతారని చెప్పారు. 2009 బ్యాచ్ ఎస్ఐలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ప్రవీణ్‌కుమార్ అన్నారు.

రాజాసింగ్‌పై మరో కేసు

అఫ్జల్‌గంజ్: వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీకి చెందిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై మరో కేసు నమోదైంది. శ్రీరామ నవమి శోభాయాత్రలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై కేసు నమోదు చేసినట్లు అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ రెడ్డి తెలిపారు. కాగా, ఇటీవలే షరతులతో కూడిన బెయిల్ మంజూరు కావడంతో జైలు నుంచి రాజాసింగ్ బయటకు వచ్చిన విషయం తెలిసిందే.



వర్క్ ఫ్రం హోం, హైబ్రిడ్ వద్దు

- కార్యాలయాలకు వెళ్లేందుకే అత్యధిక శాతం టెకీల మొగ్గు
- మారిన పరిస్థితుల్లో 86 శాతం మంది ఉద్యోగులది ఇదే అభిప్రాయం
- కొలీగ్స్‌తో కలిసి పని చేయాలనుకుంటున్న 78% మంది
- వర్క్ ఫ్రం హోంలో 'చాయ్ బ్రేక్ బాండింగ్' మిస్సవుతున్నామని వెల్లడి
- కెరీర్ గ్రోత్ తగ్గిపోతుందనే భావనలో 63% ఉద్యోగులు
- లింక్డ్ ఇన్ నివేదిక స్పష్టీకరణ

ఆఫీసుకు వచ్చేస్తాం..

సాక్షి, హైదరాబాద్: మళ్లీ ఆఫీసుల్లో ప్రత్యక్షంగా విధుల నిర్వహణకు ఉద్యోగులు సై అంటున్నారు. సహోద్యోగులతో సరదా సంభాషణలు, మాట్లాడుతూనే విధులు నిర్వర్తించడం, అంతా కలిసి కాఫీ, టీ బ్రేక్‌లు తీసుకోవడం, వీకెండ్ ఎంజాయ్‌మెంట్‌లు..ఆ మజానే వేరు అని అధికశాతం మంది అభిప్రాయపడుతున్నారు. కోవిడ్ మహమ్మారి కారణంగా ప్రత్యక్ష, పరోక్ష రూపాల్లో తలెత్తిన పరిస్థితులతో ఐటీ కంపెనీలు మూడేళ్లకు పైగా వర్క్ ఫ్రం హోం, ఇటీవలి కాలంలో హైబ్రిడ్, ఇతర పని విధానాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. కొన్ని కంపెనీలు ఇప్పటికీ వర్క్ ఫ్రం హోంనే కొనసాగిస్తుండగా, మూన్‌లైటింగ్ (2 లేదా అంతకు మించి ఉద్యోగాలు చేయడం) వెలుగులోకి రావడంతో కొన్ని కంపెనీలు హైబ్రిడ్ విధానాన్ని చేపట్టాయి. మరికొన్ని ఉద్యోగుల్ని పూర్తిగా ఆఫీసులకు రప్పిస్తున్నాయి. హైబ్రిడ్ విధానంలో టెకీలు 2,3 రోజులు ఆఫీసుకు వెళుతూ, మిగతా రోజుల్లో ఇంటి నుంచి పని చేస్తున్నారు. అయినప్పటికీ 86 శాతం మంది భారతీయ వృత్తి నిపుణులు, టెకీలు రెగ్యులర్‌గా ఆఫీసుకు వెళ్లడం పైనే ఆసక్తి కనబరుస్తున్నట్లు తేలింది. రోజూ ప్రత్యక్షంగా తమ తోటి ఉద్యోగుల్ని కలుసుకోవాలని, వారితో స్నేహ సంబంధాలు కొనసాగించాలని 78% కోరుకుంటున్నట్లు వెల్లడైంది. ఆఫీసులకు వెళితే మనోబలం, మానసికస్థైర్యం పెరుగుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. 'సెన్సస్ వైడ్'అధ్యయనం ఆధారంగా ప్రొఫెషనల్ నెట్ వర్కింగ్ సైట్ లింక్డ్ ఇన్ రూపొందించిన తాజా నివేదికలో పలుఅంశాలు వెల్లడయ్యాయి.

నివేదికలో ముఖ్యాంశాలు...

- వర్క్ ప్లేసెస్‌లో 'చాయ్ బ్రేక్ బాండింగ్' (కలిసి టీ తాగే మంచి సమయం) మిస్సవుతున్నామన్న 72 శాతం మంది.
- వర్క్ ఫ్రం హోం విధానానికే పరిమితమైతే 'కెరీర్ గ్రోత్'(వృత్తి పరమైన ఎదుగుదల) తగ్గిపోతుందనే భావనలో 63% ఉన్నారు.
- ఆఫీసులో గురువారం కల్లా మొత్తం పని పూర్తిచేసుకుని, ఆ రోజునే 'న్యూ ఫ్రైడే'గా మార్చుకోవాలని, శుక్రవారం ఆఫీసుకు వెళ్లకుండా లాంగ్ వీకెండ్ గడపాలని 79 శాతం మంది కోరుకుంటున్నారు.
- శుక్రవారాల్లో మరింత ఎక్కువ సమయం కుటుంబం, మిత్రులతో గడపాలని 50 శాతం మంది భావిస్తున్నారు.
- రిమోట్ వర్కింగ్ పద్ధతి వల్ల తమ వృత్తులపై ప్రతికూల ప్రభావం పడలేదని 63 శాతం మంది పేర్కొన్నారు.
- కేవలం కొలీగ్స్‌తో సోషల్ ఇంటరాక్షన్ కోసం ఆఫీసుకు వెళ్లాలనుకుంటున్నట్లు 43 శాతం మంది చెప్పారు.
- సహోద్యోగులతో ముఖాముఖి, ఆఫీసు మీటింగ్‌లు మరింత కార్యదక్షతతో పని చేసేందుకు దోహదపడతాయని 42 శాతం మంది చెప్పారు. మంచి స్నేహ సంబంధాలు పెరుగుతాయని 41 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- శని, ఆదివారాల బ్రేక్ తర్వాత మొదలయ్యే సోమవారాన్ని 'మోస్ట్ ఫోకస్డ్ డే'గా 39% మంది పేర్కొన్నారు.

నైతిక బలం పెరుగుతుందని విశ్వసిస్తున్నారు



వృత్తి నిపుణులు, టెకీల వంటి వారు ఫ్లెక్సిబుల్ పని విధానాన్ని కోరుకుంటున్నారు. అదే సమయంలో ఆఫీసులకు రావడానికి అత్యంత ప్రాధాన్యతనివ్వడంతో పాటు టీమ్‌వర్క్ ద్వారా తమ నైతిక బలం పెరుగుతుందని విశ్వసిస్తున్నారు. చాయ్ బ్రేక్‌లు, కొలీగ్స్‌తో సరదా చర్చలు తమను చైతన్యపరచడంతో పాటు మరింత మెరుగైన ఫలితాల సాధనకు దోహదపడతాయని భావిస్తున్నారు.– నిరజిత బెనర్జీ, లింక్డ్ఇన్(ఇండియా) మేనేజింగ్ ఎడిటర్

జాతి సంపద | ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం

- మోదీ, కేసీఆర్ దేశానికి ప్రమాదకరం
- టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



విలేకరులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, పక్కన డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రధాని మోదీ జాతి సంపదను, సీఎం కేసీఆర్ రాష్ట్ర సంపదను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తూ దేశానికి ప్రమాదకరంగా మారారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. రాష్ట్ర ఆస్తులను అమ్ముకోవడానికి తెలంగాణ తెచ్చుకోలేదని, హైదరాబాద్ శివారు భూములను నిధుల సేకరణ పేరుతో విక్రయించడం సరికాదని, భూముల అమ్మకాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. శనివారం ఆయన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం ఆవుడంలో పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు బలహీన వర్గాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే, డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం హౌసింగ్ కార్పొరేషన్ ఎత్తివేసిందని విమర్శించారు. పేదలు ఇళ్లు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్‌ను తలకిందులు చేసిన టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాల్సిందిగా రాష్ట్రపతికి విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. నిరుద్యోగ భృతిని నాలుగేళ్లకు లెక్కగట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడుతూ బెదిరిస్తున్నారని, గిరిజనులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న అటవీ భూముల్లో కందకాలు తవ్వుతూ ఇబ్బందిపెడుతున్నారని ధ్వజమెత్తారు. రూ.42 వేల కోట్లు ఖర్చు చేసి పైపుల కోసమే మిషన్‌భగీరథ పథకం తెచ్చారని, కానీ ఎక్కడా తాగునీరు రావడం లేదని తెలిపారు.

తెలంగాణలోనూ మద్యం కుంభకోణం

తెలంగాణ మోడల్ మద్యం పాలసీ ఢిల్లీలో కుంభకోణమైతే, రాష్ట్రంలో కూడా రూ.వేల కోట్ల మద్యం స్కాం జరిగినట్లు అనుమానాలు ఉన్నాయని విక్రమార్క ఆరోపించారు. సర్కారే బెల్టుషాపులు పెట్టించి, మద్యం అమ్మిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర మద్యం పాలసీపై సమగ్ర విచారణ జరపాలని, దీనిపై దర్యాప్తు సంస్థలకు లేఖ రాస్తానని తెలిపారు.

నిరుద్యోగుల కోసం కలసి పోరాడుదాం..

బండి సంజయ్, రేవంత్‌లకు ఫోన్ చేసిన వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగుల విషయంలో కలసి పోరాడదామని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రతిపక్షాలను కోరారు. శనివారం ఆమె బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిలకు ఫోన్ చేసి మాట్లాడారు. ఉమ్మడి కార్యాచరణతో ప్రగతిభవన్ మార్చ్‌కు పిలుపునిద్దామని సూచించారు. కేసీఆర్ మెడలు వంచాలంటే ప్రతిపక్షాలు ఏకం కావాలన్నారు. కలసి పోరాటం చేయకపోతే ప్రతిపక్షాలను తెలంగాణలో కేసీఆర్ బతకనివ్వరని షర్మిల హెచ్చరించారు. దీనిపై స్పందించిన బండి సంజయ్, ఉమ్మడిగా పోరాటం చేసేందుకు సిద్ధమని.. నిరుద్యోగుల విషయంలో పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ అంశంపై త్వరలో సమావేశం అవుదామన్నారు. ప్రతిపక్షాలు కలసి పోరాటం చేయాల్సిన సమయం ఏర్పడిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీలో చర్చించి తదుపరి కార్యాచరణను వెల్లడిస్తామని వారు చెప్పినట్లు షర్మిల తెలిపారు.

కాంగ్రెస్‌తో కలసి పనిచేయం..

'వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల నాకు ఫోన్ చేసి మాట్లాడిన మాట వాస్తవం. భవిష్యత్తులో ఎవరికి అన్యాయం జరిగినా కేసీఆర్ అరాచకాలపై పోరాడతామని చెప్పిన. అయితే కాంగ్రెస్‌తో కలసి పనిచేయబోమని కూడా స్పష్టం చేశాను'అని బండి సంజయ్ పేర్కొన్నారు. కాంగ్రెస్–బీఆర్ఎస్ ఒక్కటేనని ఆయన అన్నారు. 'ఈ రెండు పార్టీలు కలిసే పోటీ చేస్తాయని వాళ్ల నాయకులే చెబుతున్నారు. జానారెడ్డి కూడా ఇదే చెప్పారు. అలాంటి పార్టీతో ఎట్లా కలసి పనిచేస్తాం?'అని బండి సంజయ్ మీడియా సమావేశంలో అన్నారు.



శనివారం బీఆర్ఎస్‌లో మహారాష్ట్ర నేతల చేరికల కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో బీబీ పాటిల్, హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, జీవన్‌రెడ్డి, రవీందర్‌సింగ్ తదితరులు

టార్గెట్ మహారాష్ట్ర!

▶ మొదటి పేజీ తరువాయి

రైతుల సమస్యలను తలకెత్తుకున్నా. చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తే అసంభవమనేది ఉండదు. ప్రతి తాళానికీ తాళం చెవి ఉన్నట్టుగానే ప్రతి సమస్యకు కచ్చితంగా పరిష్కారం ఉంటుంది. రోడ్ల మీద ఆందోళనలు, పోరాటాలు చేసి లాఠీలు, తూటాలు తినాల్సిన పనిలేదు. గట్టి సంకల్పంతో, చిత్తశుద్ధితో ముందుకువెళితే చాలు. మనం కచ్చితంగా గెలిచి తీరుతాం.

ప్రధాని దిగి వచ్చారు..

రైతు సమస్యల పరిష్కారానికి 1935 నుంచి నేటి దాకా రైతు పోరాటాలు సాగుతూనే ఉన్నాయి. 13 నెలల పాటు ఢిల్లీ రోడ్లమీద రైతులు ఆందోళన చేశారు. కేంద్ర ప్రభుత్వం నక్సలైట్లు, తీవ్రవాదులు అని ముద్రవేసినా రైతులు చెక్కుచెదరలేదు. పోరాటంలో 750 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. తర్వాత పంజాబ్, యూపీ ఎన్నికల కోసం ప్రధాని దిగివచ్చి రైతులకు క్షమాపణలు చెప్పారు.

వ్యవసాయ సుస్థిరతతో తగ్గిన ఆత్మహత్యలు

తెలంగాణ ఏర్పాటుకు ముందుకు ఇక్కడ మహారాష్ట్ర కన్నా పరిస్థితులు ఘోరంగా ఉండేవి. ఇక్కడ వ్యవసాయ సుస్థిరత సాధించడంతో ఆత్మహత్యలు జీరో స్థాయికి చేరుకున్నాయి. తెలంగాణవ్యాప్తంగా రిజర్వాయర్లతోపాటు ఇక్కడి అభివృద్ధిని ఒకటి రెండు రోజులు ఉండి పరిశీలించండి. కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు నడి వేసవిలోనూ తెలంగాణ చెరువులు, కాలువల్లో నిండుగా నీరుంది. హిమాలయాల కంటే ఎత్తైన సంకల్పం వల్లే ఇక్కడ నీళ్లు పారుతున్నాయి.

14 మంది ప్రధానులు మారినా..

దేశంలో సహజ సంపదలకు కొదవలేకున్నా భారత్ వెనుకబడింది. 14 మంది ప్రధానులు మారినా మన దేశ తలరాత మారలేదు. తెలంగాణలో రైతు సమస్యలు పరిష్కారం అవుతున్నప్పుడు మహారాష్ట్రలో ఎందుకు సాధ్యం కాదు? తెలంగాణ బడ్జెట్ కన్నా మహారాష్ట్ర బడ్జెట్ పెద్దది. మరి ఆ రాష్ట్ర సర్కార్ ఎందుకు రైతు సమస్యల పరిష్కారానికి ప్రయత్నించడం లేదు. అంటే దీని వెనుక ఏదో ఉంది (దాల్ మే కుచ్ కాలా హై) అని అర్థమవుతోంది. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, సాగునీరు ఇలా అన్ని రకాలుగా రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ. 4.5 లక్షల కోట్లు ఖర్చు చేసింది. తెలంగాణ తరహాలో మహారాష్ట్ర, కేంద్రం ఎందుకు పనిచేయడం లేదు? దేశ రైతాంగానికి సాగునీరు, కరెంటు, పెట్టుబడి సాయం లేవు. అందుకే అబ్ కీ బార్ కిసాన్ సర్కార్.. అనే నినాదాన్ని తీసుకుని ముందుకు పోతున్నాం..'' అని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ బీబీ పాటిల్, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ కిసాన్ విభాగం అధ్యక్షుడు గుర్నామ్ సింగ్ చడోని తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీగా వచ్చిన నేతలు

శనివారం మహారాష్ట్ర షెట్కారీ సంఘటన్ నేత శరద్ జోషి ప్రణీత్‌తో పాటు పలువురు నేతలు భారీ ర్యాలీగా తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. వీరికి కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో మహారాష్ట్ర షెట్కారీ సంఘటన్ యువజన అధ్యక్షుడు సుధీర్ బిందు, కైలాష్ తవార్, శరద్ మర్కాడ్, సువర్ణ కాతే, రాంజీవన్ బోండార్, నారాయణ్ విభూదే, బిజి కాకా, అనిల్ రజంకార్, పవన్ కర్వార్, భగవత్ పాటిల్ తదితరులు ఉన్నారు. వీరితో పాటు చంద్రపూర్ జిల్లాకు చెందిన యువజన నేతలు బీఆర్ఎస్‌లో చేరారు.

పొత్తా.. చిత్తా..?

▶ మొదటి పేజీ తరువాయి

వాదిస్తున్నారు. అయితే బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని పార్టీ అధిష్టానం ఇప్పటికే పేర్కొంది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ కూడా వరంగల్, హైదరాబాద్ సభల్లో దీనిపై స్పష్టతనిచ్చారు. ఇటీవల రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే కూడా ఈ విషయాన్ని నొక్కి చెప్పారు. అయినా కాంగ్రెస్‌లో బీఆర్ఎస్‌తో పొత్తు అంశం తెరపైకి వస్తుండటం గమనార్హం.

అలాగైతే ఉనికి కూడా ఉండదు

బీఆర్ఎస్‌తో పొత్తుతో ఎన్నికలకు వెళితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉనికి దెబ్బతింటుందనే వాదన కొందరు టీపీసీసీ నేతల్లో వినిపిస్తోంది. ఒంటరిగా పోటీ చేసి అధికారం కోసం కొట్లాడటం ద్వారానే రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నాయకత్వం మిగులుతుందని అంటున్నారు. అధికారం దక్కకపోయినా 40 స్థానాల వరకు గెలుచుకోగలిగితే అప్పుడు కాంగ్రెస్ అవసరం బీఆర్ఎస్‌కు వస్తుందని, ఆ సమయంలో కింగ్ మేకర్‌గా వ్యవహరించవచ్చని పేర్కొంటున్నారు. ప్రజలు అవకాశమిస్తే నేరుగా, లేదంటే పరోక్షంగా ప్రభుత్వంలో భాగస్వామ్యం కావచ్చని స్పష్టం చేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో బీజేపీ అనివార్యంగా మూడో స్థానానికి పరిమితం అవుతుందని, భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కూడా ఇదే పరిస్థితి ఉంటుందని వివరిస్తున్నారు. ఎన్నికల ముందే పొత్తుకు వెళితే 20–30 మంది పెద్ద నేతలకు లబ్ధి కలుగుతుందే తప్ప మిగతావోట్ల పార్టీ కేడర్ దెబ్బతింటుందని, తద్వారా అధికారానికి దూరమవుతామని పేర్కొంటున్నారు. బీఆర్ఎస్–కాంగ్రెస్ కలిసి ఎన్నికలకు వెళితే ప్రత్యామ్నాయంగా బీజేపీనే ప్రజలు పరిగణించాల్సి వస్తుందని వాదిస్తున్నారు.

ఎన్నికల్లో కొట్లాడగలమా?

మరికొందరు నేతలు మాత్రం పార్టీ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పొత్తులపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. "గత పదేళ్లుగా అధికారంలో లేం. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ ఎన్నికల్లో భారీగా ఖర్చు పెడతాయి. కాంగ్రెస్ నేతలకు అలాంటి పరిస్థితి లేదు. ఈసారి ఎన్నికల్లో ఆ రెండు పార్టీల ధన ప్రవాహాన్ని తట్టుకోవాలంటే పొత్తులు ఉపయోగపడవచ్చు. కనీసం 20–30 స్థానాలు గెలిచే అవకాశం ఉంటుంది. అధికారంలోనూ పాలుపంచుకోవచ్చు. అప్పుడు మళ్లీ పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టొచ్చు'' అని పేర్కొంటున్నారు. అందువల్ల ఎన్నికల కంటే ముందే సర్దుబాటుతో వెళితే మేలు జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇలాంటి చర్చతోనూ నష్టమే..

పొత్తులు ఉంటాయో, లేదోగానీ.. ఇప్పుడు జరుగుతున్న చర్చ కాంగ్రెస్ కేడర్‌ను అయోమయంలోకి నెట్టేస్తోందని మరికొందరు నేతలు స్పష్టం చేస్తున్నారు. ఇది కాడి ఎత్తేసే ధోరణి అని విమర్శిస్తున్నారు. ఇలాంటి చర్చ కూడా పార్టీకి మంచిది కాదని, దీనికి చెక్ పెట్టకపోతే భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నోరు జారిన కీలక నేత

బీఆర్ఎస్–కాంగ్రెస్ పొత్తు వ్యవహారం రాష్ట్ర కాంగ్రెస్‌లోని ఓ కీలక నేత చరిష్మాకు గండి కొట్టిందని తెలుస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించే ఆ నేత గతంలో ఉన్న ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ వద్ద నోరు జారారని, దీనిపై అధిష్టానాన్ని ఒప్పించాలని కోరారని సమాచారం. ఈ మేరకు ఠాగూర్ వెళ్లి అధిష్టానానికి ఈ విషయాన్ని వివరించారని, దీంతో కాంగ్రెస్‌లోని కొందరు నాయకులు బీఆర్ఎస్ పక్షం వహిస్తున్నారనే అభిప్రాయం అధిష్టానంలో మొదలైందని తెలిసింది. ఆ విషయాన్ని గ్రహించిన సదరు కీలక నేత.. మళ్లీ తన చరిష్మా కోసం ఇప్పుడు పడరాని పాట్లు పడాల్సి వస్తోందని గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి.

అన్ని స్థానాల్లో పోటీ చేయాల్సిందే

బీఆర్ఎస్‌తో పొత్తు, జానారెడ్డి చేసిన వ్యాఖ్యలపై సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డిని 'సాక్షి' సంప్రదించగా.. కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా, అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయాల్సిందేనని పేర్కొన్నారు. "ఏ పార్టీతోనూ పొత్తుకు పోవద్దు. అప్పుడే పార్టీలో నాయకత్వం నిలబడుతుంది. ప్రజలు అధికారమిస్తారా, ఇవ్వరా అన్నది వారిష్టం. 70సీట్లు దక్కించుకునేందుకు ప్రయత్నం చేయాలి. అలాకాకున్నా అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ కీలకం కావాలి. అప్పుడే భవిష్యత్తుపై ఆశలు సజీవంగా ఉంటాయి'' అని పేర్కొన్నారు.

తెలంగాణ దేనికి మోడల్ కేసీఆర్?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

- రైతుల ఆత్మహత్యల్లోనా.. హామీలపై మాట తప్పడంలోనా?
- సుఖేశ్ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే మహారాష్ట్ర రైతుల చేరికలు
- సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన సంగారెడ్డి జిల్లా నాయకులు



సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న యువకులు

సాక్షి, హైదరాబాద్: 'దేశానికి తెలంగాణ ఎందులో మోడల్ కేసీఆర్? రైతుల ఆత్మహత్యల్లోనా.. ఫ్రీయూరియా, రుణ మాఫీ, విత్తనాల పేరుతో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాట తప్పడంలోనా? రైతుబంధు పేరుతో అన్ని సబ్సిడీలు బంద్ చేయడంలోనా?'అని సీఎం కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. కేసీఆర్‌ది కిసాన్ సర్కార్ కాదని.. తెలంగాణ ప్రజలు, నిరుద్యోగుల కొంపలు ముంచే సర్కార్ అని ధ్వజమెత్తారు. ఢిల్లీ దొంగ సారా దందాలో సుఖేశ్ చంద్రశేఖర్ బీఆర్ఎస్ పార్టీకి రూ.75 కోట్లు ఇచ్చిన విషయంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతుండటంతో ఆ చర్చను దారిమళ్లించేందుకు కేసీఆర్.. మహారాష్ట్ర రైతుల చేరికల పేరుతో డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. శనివారం బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన బీఆర్ఎస్, ఇతర పార్టీలకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మీడియా ప్రతి నిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

సుఖేశ్ అంశాన్ని దారిమళ్లించడానికే..

'సుఖేశ్ చంద్రశేఖర్ అంశం తెరపైకి రావడంతో ఆ చర్చను దారిమళ్లించడానికే మహారాష్ట్ర రైతుల జాయినింగ్స్ పేరుతో మీడియాలో చర్చ జరగాలని చూస్తున్నరు. కేసీఆర్ ఎవరినీ వదిలిపెట్టడం లేదు. ఆ కుటుంబం కూడా అంతే.. దొంగ దందా, లిక్కర్‌దందా చేసేటోళ్ల దగ్గర కూడా పైసలు తీసుకుంటున్నరు. బీఆర్ఎస్ ఆఫీస్‌కు వచ్చి డబ్బులిచ్చిపోయినట్లు సుఖేశ్ చెప్పిండు. వెహికల్ నంబర్ కూడా చెప్పాడు. రేపో మాపో ఆయనపై ఒత్తిడి తెచ్చి మాట మార్చేలా చేసినా ఆశ్చర్యం లేదు'అని సంజయ్ అన్నారు. 'కాంగ్రెస్–బీఆర్ఎస్ ఎన్నికల్లో కలసి పోటీ చేయడం ఖాయం. వాళ్లతోపాటు సూది దబ్బడం పార్టీలు కలిసే పోటీ చేస్తాయి. బీజేపీ మాత్రం సింగిల్‌గా పోటీ చేస్తుంది. రజాకార్ల రాజ్యాన్ని అంతమొందిస్తాం. రామరాజ్యం స్థాపిస్తాం'అని పేర్కొన్నారు. 'ఏ సర్వే చూసినా, చివరకు కేసీఆర్ చేయించుకున్న సర్వేల్లోనూ ఇవే ఫలితాలొస్తున్నాయి. కేసీఆర్ ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ వారసుడు. బీజేపీ కార్యకర్తలను బెదిరించి జైళ్లకు పంపుతున్నారు. దమ్ముంటే పోలీస్ బందోబస్తు లేకుండా కేసీఆర్, మంత్రులు ప్రజల్లో తిరగాలి' అని సంజయ్ అన్నారు.

లీకేజీతో బీఆర్ఎస్ పెద్దమనుషులకు సంబంధాలు

'టీఎస్‌పీఎస్సీ కమిషన్‌ను పూర్తిగా రద్దు చేయాలే. వాళ్లను తొలగించడానికి, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడానికి కేసీఆర్‌కున్న ఇబ్బంది ఏమిటి? కేటీఆర్.. ఇద్దరి తప్పిదంవల్లే లీకేజీ అన్నడు కదా! మరి ఇయ్యాల్టి వరకు 15 మందిని అరెస్ట్ చేశారు. 104 మందిని విచారించారు. ఈ కేసులో తప్పుదోవ పట్టించిన తన కొడుకును కేసీఆర్ ఎందుకు బర్తరఫ్ చేయలే. ఎందుకు విచారించలేదు? పేపర్ లీకేజీలో బీఆర్ఎస్‌కు చెందిన పెద్ద మనుషుల పాత్ర ఉంది. వాళ్లను కాపాడుకోవడానికి చిన్న వాళ్లను అరెస్ట్ చేసి కేసును క్లోజ్ చేయాలని కుట్ర చేస్తున్నరు' అని సంజయ్ ధ్వజమెత్తారు. 'ఒకవైపు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి, సభ్యులకు నోటీసులిచ్చి విచారణ చేస్తూనే మరోవైపు వాళ్ల ఆధ్వర్యంలోనే పరీక్షలు ఎట్లా నిర్వహిస్తారు? ఇది దొంగ చేతికి తాళాలివ్వడం కాదా? తక్షణమే కేటీఆర్‌ను బర్తరఫ్ చేసి విచారణ జరిపించాలి'అని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ దొంగ పాస్‌పోర్టుల దందా చేస్తున్నారని గతంలో సాక్షాత్తు కాంగ్రెస్‌నేత ఎమ్మెస్సార్ కూడా అప్పట్లో అన్నరు' అని సంజయ్ పేర్కొన్నారు.



నరులకు సంభవించునది యేదో అదే మృగములకు సంభవించును; వారికిని వాటికిని కలుగు గతి ఒక్కటే; సకల జీవులకు ఒక్కటే ప్రాణము; మృగముల కంటె నరుల కేమియు ఎక్కువలేదు.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.ద్వాదశి పూర్తి (24గంటలు), **నక్షత్రం:** మఖ పూర్తి (24గంటలు), **వర్జ్యం:** సా.5.55 నుండి 7.41 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.32 నుండి 5.21 వరకు, **అమృతఘడియలు:** తె.4.32 నుండి 6.20 వరకు (తెల్లవారితే సోమవారం).

సూర్యోదయం : 5.58
సూర్యాస్తమయం : 6.09
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

కుమారస్వామి (సన్నాఫ్ దేవెగౌడ)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

నాన్నగారికి దగ్గరగా కూర్చొని ఉన్నాను. "అలా దూరంగా ఉండిపోయావేం.." అన్నారు నాన్నగారు!

కుర్చీని జరుపుకోకుండా కుర్చీలోంచి నేనే కాస్త ముందుకు జరిగి నాన్నగారికి మరింత దగ్గరగా ఒరిగి కూర్చున్నాను.

"ఇదే నువ్వు చేస్తున్న తప్పు కుమారస్వామీ.." అన్నారు నాన్నగారు!

"ఏం చేశాను నాన్నగారూ?!" అని అడిగాను.

"కుర్చీని జరుపుకుని కూర్చోవలసి వచ్చినప్పుడు.. జరిపితే కుర్చీ ఎక్కడ ఇబ్బంది పడుతుందోనని ఆ ఇబ్బందేదో నువ్వే పడుతూ కుర్చీలోంచి ముందుకు జరిగి కూర్చుంటావు. ఇంత సున్నితంగా ఉంటే రాజకీయాలను అగౌరవపరిచినట్లు అవుతుంది కుమారస్వామీ.." అన్నారు నాన్నగారు.

ఆ మాటకు నా కళ్లు ఎమోషనల్ అయ్యాయి. కర్చీఫ్ తీసి కళ్లు, చెంపలు తుడుచుకున్నాను.

"గట్టిగా ఉండాలి కుమారస్వామీ. నీ కన్నా నీ కుర్చీనే గట్టిదనే సంకేతం నీ కన్నీళ్ల ద్వారా



గానీ, నీ కర్చీఫ్ ద్వారా గానీ బయటికి ప్రవహించకూడదు.." అన్నారు నాన్నగారు.

"కానీ నాన్నగారూ.. కుర్చీకి కూడా పెయిన్, ప్లెజర్ ఉంటాయని నాకు అనిపిస్తూ ఉంటుంది! ప్రజలు ఓటేసి కుర్చీలో కూర్చోబెట్టిన మనిషి ప్రజల సమస్యల్ని పట్టించుకోకుండా కూర్చున్నప్పుడు ఆ కుర్చీ.. పెయిన్‌నీ, ప్రజల సమస్యల్ని పరిష్కరించేందుకు కుర్చీలోంచి లేచి వెళ్లి ప్రజల్లో తిరుగుతున్నప్పుడు ఆ కుర్చీ.. ప్లెజర్‌నీ అనుభూతి చెందుతుందని నేను అనుకుంటూ ఉంటాను.." అన్నాను.

నాన్నగారు మాట్లాడలేదు!

"నాన్నగారూ.." అని మెల్లగా ఆయన చేతిని తట్టాను. నిద్రపోతున్నారు!

ప్రధానిగా ఉండగా నాన్నగారు ఇలాగే పార్లమెంటు హాల్లో నిద్రలోకి జారిపోతూ కనిపించేవారు. నిద్రను చూడటమే గానీ, ఆ నిద్ర వెనుక ఉన్న అలసటను చూసేవారెవరు? ఆయన కూర్చొని ఉన్న కుర్చీ తప్ప.

నిద్రలాంటిదే ఎమోషన్ కూడా. రెండూ మనకు తెలియకుండా మనల్ని పట్టేస్తాయి! అలసటతో నాన్నగారు నిద్రలోకి చేజారిపోయినట్లే.. బాధ్యతగా ఉండే మనుషులు, బాధ్యత పట్టని మనుషులు.. ఇద్దరూ నన్ను ఎమోషన్‌లోకి నెట్టేస్తారు.

కర్ణాటక ఎన్నికల ప్రకటన వచ్చినప్పుడు ఇలానే నేను ఎమోషనల్ అయ్యాను.

"మే 10నే పోలింగ్ పెట్టడానికి కారణం ఉంది. ఆరోజు బుధవారం. ఓటర్లను లాంగ్ వీకెండ్ హాలిడేస్‌కి వెళ్లనివ్వకుండా ఉంచేందుకే సోమవారం, శుక్రవారం కాకుండా బుధవారం రోజు పోలింగ్ పెట్టాను.." అని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ చెప్పినప్పుడు కలిగిన ఎమోషన్ అది.

పౌరులు బాధ్యతగా లేకున్నా, ప్రజా ప్రతినిధులు బాధ్యతగా లేకున్నా ఈ దేశ ఎన్నికల ప్రధాన అధికారి బాధ్యతగా ఉన్నారన్న ఆలోచన రాగానే నేను బ్రేక్ డౌన్ అయ్యాను. కర్చీఫ్ తీసి కళ్లు తుడుచుకున్నాను.

పౌరులకు బాధ్యతే ఉంటే 2019 లోక్‌సభ ఎన్నికల్లో మాండ్యాలో సుమలతకు బదులుగా నా కుమారుడు నిఖిల్‌ని గెలిపించేవారు కాదా?! ప్రజా ప్రతినిధులకు బాధ్యతే ఉంటే 2006లో, 2018లో నన్ను పూర్తిగా ఐదేళ్లూ ముఖ్యమంత్రిగా ఉండనిచ్చేవారు కాదా?!

ఈ రాజకీయాలు నాకు పడేవి కావు. ఇక్కడ నేనొక గరళకంఠుడిని. దిగమింగుకుని ఉండలేను. భయ తాండవమూ చేయలేను. ఇవే నా ఆఖరు ఎన్నికలు. 2028లో ఒక సామాన్య కార్యకర్తగా మిగిలిపోతాను.

"ఏంటి కుమారస్వామీ ఆలోచిస్తున్నావ్.. మళ్లీ ఎమోషనా?" అంటున్నారు నాన్నగారు!! నిద్రలోకి ఆయన ఎంత త్వరగా వెళ్లిపోతారో, నిద్రలోంచి అంత త్వరగా తిరిగొచ్చేస్తారు.

89 ఏళ్ల వయసులో కూడా నాన్నగారు ఇంత ప్రశాంతంగా, నాన్-ఎమోషనల్‌గా ఉండగలగడానికి కారణం ఈ నిద్ర, నిర్నిద్రలేనా?!

మైండ్ గేమ్... మనీ గేమ్!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



అడ్డదారులు తొక్కి అధర్మ మార్గాన్నెంచుకొని ఏదో సాధించాలనుకోవడం ఎప్పుడూ ప్రమాదకరమే. తాత్కాలిక ఫలితాలు సిద్ధిస్తాయేమో గానీ అంతిమంగా పతనం తప్పదనే నీతి సారాన్ని మన ఇతిహాస కథలు బోధిస్తున్నాయి. అహల్యను చెరచడానికి దేవేంద్రుడు ఆమె భర్త గౌతముని వేషం దాల్చి మోసగిస్తాడు. చివరికి గౌతముని శాపానికి గుర్రై కురూపిగా చిరకాలం బతకవలసి వచ్చింది. రావణాసురుడు సీతమ్మవారిని అపహరించడానికి వీలుగా మారీచుడు బంగారు జింకలా మారి రామలక్ష్మణులను ఏమార్చుతాడు. ఒంటరిగా ఉన్న సీతమ్మను మారువేషంలో వచ్చిన రావణుడు అపహరిస్తాడు. కానీ, అజేయుడని పేరున్న రావణాసురుడు అంతిమంగా రామ బాణానికి నేలకూలక తప్పలేదు. మహాభారతంలోని మాయా జూద ఘట్టంతో సహా మనకు ఇటువంటి వృత్తాంతాలెన్నో ఉన్నాయి.

ఇతిహాస మోసాలకు మరింత పదును పెట్టిన వాడు ఆధునిక యుగంలో గోబెల్స్. హిట్లర్ దగ్గర ప్రపగాండా మంత్రిగా పనిచేసిన గోబెల్స్, దుష్ప్రచారాలకు పర్యాయ పదంగా మిగిలిపోయాడు. అతని ప్రచారాల అండతో చెలరేగిపోయిన హిట్లర్ కనీవినీ ఎరుగని మారణకాండకు కారకుడయ్యాడు. చివరికి ప్రాణ భయంతో కలుగులో దాక్కొని కుక్కచావు చచ్చాడు. గోబెల్స్ ప్రపగాండా చాతుర్యానికి మరిన్ని కుయుక్తులు చేర్చి ఒక అధునాతన వంచనా శిల్పాన్ని చెక్కిన అపఖ్యాతి మన తెలుగువారైన చంద్రబాబుకూ, ఆయన భాగస్వాములైన యెల్లో మీడియాకూ సంయుక్తంగా దక్కుతుంది. తెలుగువారి ఘనకీర్తిని అంతర్జాతీయ యవనికపై ఎగరేసిన మహానుభావులెందరో మనకున్నారు. తులసి వనంలో గంజాయి మొక్కల్లా ఇటువంటి అపకీర్తి కలుపుమొక్కలు కూడా కొన్ని మొలకెత్తడం ఒక విషాదం.

ఇప్పుడు చంద్రబాబు సహా యెల్లో కూటమి సభ్యులు తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారు. జీవన్మరణ సమస్య ఒక కరవాలం మాదిరిగా వారి మెడపై వేలాడుతున్నది. అధికారంలో ఉన్నప్పుడు వీరూ, వీరి అనుయాయులు వేల కోట్ల రూపాయలను అమరావతి జూదంలో ఫణంగా ఒడ్డారు. రైతుల నుంచి భూసమీకరణ చేయడమనేది బూటకమనీ, ఇందులో అత్యధిక శాతం భూమిని చంద్రబాబు కూటమి సభ్యులే కొనుగోలు చేసి రైతుల పేరు మీద సమీకరణకు ఇచ్చారనే వాస్తవాలు ఒక్కొక్కటిగా ఇప్పుడు బయటకొస్తున్నాయి. అమరావతి రైతుల పాదయాత్ర పేరుతో చేసిన ప్రహసనంలో ఆధార్ కార్డులు చూపెట్టి పాల్గొనడానికి అరవై మంది కూడా ముందుకు రాకపోవడంతో ఈ అభిప్రాయానికి బలం చేకూరింది. ప్రైవేట్ అంచనాల ప్రకారం యెల్లో కోటరీ సభ్యులు సోకాల్డ్ భూసమీకరణ మీద పదిహేను వేల కోట్లకు పైగా పెట్టుబడి పెట్టారు. అమరావతి రియల్ ఎస్టేట్ వ్యాపారం వారు అనుకున్నట్లు కొనసాగి వుంటే ఇంతకు పదింతలు సంపాదించవచ్చనే ఆశతో వారీ సమీకరణ తంతును జరిపించారు. అచ్చం రియల్ ఎస్టేట్ కంపెనీవాళ్లు విడుదల చేసినట్టే ప్రింటెడ్, డిజిటల్ గ్రాఫిక్ బ్రోచర్లను స్వయానా చంద్రబాబునాయుడే విడుదల చేసిన వైనం చాలామందికి గుర్తుండే ఉంటుంది. ఈ వెంచర్‌లో బలహీనవర్గాల ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించినప్పుడు యెల్లో ముఠా ఎంత అల్లకల్లోలం చేసిందో కూడా గుర్తుండే ఉంటుంది. కోర్టు మెట్లెక్కి మరీ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు.

నోటిదాకా వచ్చిన లక్షన్నర కోట్ల కేపిటల్ లడ్డూ అందకుండా పోతున్నదని ఈ ముఠా కుమిలి కుమిలి కునారిల్లుతున్నది. శాసన రాజధాని అక్కడే కొనసాగుతుందనీ, పాలనా, న్యాయ రాజధానులను మాత్రమే తరలిస్తామనీ ప్రభుత్వం చెప్పే సమాధానం ససేమిరా మింగుడుపడడం లేదు. అదిగో సచివాలయం, అల్లదిగో అసెంబ్లీ, అటు చూడు హైకోర్టు అని వెంచర్‌ను ప్రచారం చేసుకోవడానికి వీల్లేని పరిస్థితుల్లో చిక్కుకున్నామని ఆందోళనపడుతున్నారు. చంద్రబాబు విడుదల చేసిన బ్రోచర్లను ఒకసారి పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా బోధపడుతుంది. కృష్ణానది చీలి అమరావతి నగరం మధ్యలో పారుతున్నట్టు ఒక కల. ఒక కలర్ పిక్చర్. వెనిస్ నగరానికి అమ్మలాగా నగరం మధ్యలో పడవ ప్రయాణం. తాజ్‌మహల్ అమ్మమ్మ లాంటి కట్టడాలు, వీలైతే పారిస్‌లో ఉన్న ఐఫిల్ టవర్‌ను కొనుగోలు చేసి మన మందడం పక్కన పాతించడం... ఈ రకమైన సెట్టింగ్స్ వేయడమెలాగో తెలుసుకోవడానికి రాజమౌళితో కూడా చంద్రబాబు సంప్రదింపులు సాగించిన సంగతి తెలిసిందే. ఈ స్థాయిలో గ్రాఫిక్స్ ప్రచారానికి ప్లాన్ చేసుకున్న వారికి ఒక్క అసెంబ్లీ ఏం సరిపోతుంది?

భూముల విక్రయాల ద్వారా ఆశించిన లక్షన్నర కోట్లే కాదు... ఆ తర్వాత డెవలప్‌మెంట్ పేరుతో అంతకు రెట్టింపు ఆర్జించే ప్రణాళికను బాబు, ఆయన కోటరీ

నోటిదాకా వచ్చిన లక్షన్నర కోట్ల కేపిటల్ లడ్డూ అందకుండా పోతున్నదని ఈ ముఠా కుమిలి కునారిల్లుతున్నది. శాసన రాజధాని అక్కడే కొనసాగుతుందనీ, పాలనా, న్యాయ రాజధానులను మాత్రమే తరలిస్తామనీ ప్రభుత్వం చెప్పే సమాధానం ససేమిరా మింగుడుపడడం లేదు. అదిగో సచివాలయం, అల్లదిగో అసెంబ్లీ, అటు చూడు హైకోర్టు అని వెంచర్‌ను ప్రచారం చేసుకోవడానికి వీల్లేని పరిస్థితుల్లో చిక్కుకున్నామని ఆందోళన పడుతున్నారు. చంద్రబాబు విడుదల చేసిన బ్రోచర్లను ఒకసారి పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా బోధపడుతుంది. కృష్ణానది చీలి అమరావతి నగరం మధ్యలో పారుతున్నట్టు ఒక కల. ఒక కలర్ పిక్చర్. వెనిస్ నగరానికి అమ్మలాగా నగరం మధ్యలో పడవ ప్రయాణం. తాజ్‌మహల్ అమ్మమ్మ లాంటి కట్టడాలు, వీలైతే పారిస్‌లో ఉన్న ఐఫిల్ టవర్‌ను కొనుగోలు చేసి మన మందడం పక్కన పాతించడం... ఈ స్థాయిలో గ్రాఫిక్స్ ప్రచారానికి ప్లాన్ చేసుకున్న వారికి ఒక్క అసెంబ్లీ ఏం సరిపోతుంది? ఆ తర్వాత డెవలప్‌మెంట్ పేరుతో అంతకు రెట్టింపు ఆర్జించే ప్రణాళికను బాబు, ఆయన కోటరీ తయారుచేసుకున్నది. ఇప్పుడా కలలన్నీ కల్లలుగా మారే పరిస్థితి ఎదురుకావడంతో, పెట్టిన పదిహేను వేల కోట్ల పరిస్థితేమిటని వణికిపోతున్నారు.

తయారుచేసుకున్నది. ఇప్పుడా కలలన్నీ కల్లలుగా మారే పరిస్థితి ఎదురుకావడంతో, పెట్టిన పదిహేను వేల కోట్ల పరిస్థితేమిటని బాబు, ఆయన భాగస్వాములు వణికిపోతున్నారు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే, ఏదో మేరకు డ్యామేజి కంట్రోల్ జరగాలంటే వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిచితీరాలి. సాధ్యమేనా? అసాధ్యమనే సంగతి తెలియనంత అమాయకుడు కాదు చంద్రబాబు. జాతీయ స్థాయిలో ప్రతిష్ఠ గలిగిన ఒక సర్వే సంస్థ ఒక జాతీయ పార్టీకోసం రాష్ట్రాల వారీగా చేసిన అభిప్రాయ సేకరణ ద్వారా ఈ సంగతి రూఢీ అయింది. తెలుగుదేశం పార్టీ కంటే వైసీపీకి ఇరవై శాతానికి పైగా ఎక్కువ మద్దతున్నట్టు వెల్లడైంది. గడిచిన ఎన్నికల్లో ఈ తేడా పదిశాతం మాత్రమే. ఇప్పుడు వైసీపీ మద్దతు గతంతో పోలిస్తే రెండు నుంచి నాలుగు శాతం మాత్రమే పెరిగినప్పటికీ తెలుగుదేశం మద్దతు దాదాపుగా పదిశాతం పడిపోయింది. రెండు పార్టీల మధ్యన ఉన్న ఈ అగాధాన్ని దాటాలంటే హనుమంతుని మాదిరిగా లంఘించే పవన విహార విద్య తెలిసి ఉండాలి.

గత ఎన్నికల్లో వైసీపీకి యాభై శాతానికి పాయింట్ సున్నా సున్నా ఒకటి శాతం ఓట్లు తక్కువైనప్పటికీ నూటా యాభయ్యొక్క సీట్లొచ్చాయి. ఇప్పుడున్న అంచనాల ప్రకారం యాభై నాలుగు శాతం ఓట్లు వస్తే ఎన్ని సీట్లు రావాలి? ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం నెగ్గుకురావాలంటే ఏం చేయాలి? హనుమంతుడిలా అగాధ లంఘన విద్యను ఎలా అభ్యసించాలి? చావోరేవో తేల్చుకోవాల్సిన పరిస్థితి. ఈ శిరోభారం నుంచి బయటపడేందుకు చాలాకాలం కిందటే తెలుగుదేశం పార్టీ డబుల్ యాక్షన్ ఎక్స్‌ప్లోజివ్ వంటి ఒక ద్విముఖ వ్యూహాన్ని రంగంలోకి తెచ్చింది. ఈ డబుల్ యాక్షన్‌లో ఒకటి మనీ గేమ్, రెండు మైండ్ గేమ్! నాన్-వైసీపీ పార్టీలు, సంస్థలన్నింటినీ తన నాయకత్వంలో ఒక్క తాటిపైకి తేవాలి. ఇందుకోసం అవసరమైతే మనీ గేమ్‌కు రెడీ! అధికారం వస్తే ఓ రెండు లక్షల కోట్లను (అమరావతి ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా) కొల్లగొట్టే అవకాశం ఉన్నప్పుడు అందులో రెండు శాతమో మూడు శాతమో వెదజల్లితే మాత్రం నష్టమేమిటన్న నిర్ధారణకు యెల్లో కూటమి వచ్చేసినట్టు కనిపిస్తున్నది. ఇక వైసీపీకి జనంలో ఉన్న మద్దతును గణనీయంగా తగ్గించాలి. ఇందుకోసం మైండ్ గేమ్. దీనికి గోబెల్స్ ప్రచారమే ప్రాతిపదిక. కాకపోతే దానికంటే వెయ్యి గిగాబైట్ల సామర్థ్యమెక్కువ. దీన్ని ఆధారం చేసుకొని జనం మెదళ్లతో గేమ్ ఆడటం. వైసీపీ బలం క్షీణించిందనే అభిప్రాయాన్ని జొప్పించడం. ఇందుకోసం ఉపయోగపడే ఒక సందర్భాన్ని వాడుకోవడానికి చాలాకాలం క్రితమే ఆ పార్టీ ఒక వ్యూహాన్ని రూపొందించుకున్నది.

టీచర్స్, గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాలను శాసనమండలికి జరిగే ఎన్నికల్లో అధికార పార్టీలు గెలవడం చాలా అరుదు. ఎప్పుడైనా ఒకటీ అరా సందర్భాల్లో ప్రతిష్ఠకు పోయి, డబ్బులు వెదజల్లి విపక్షాలను చీల్చినప్పుడు స్వల్ప తేడాతో గెలవడం జరిగేదేమో. అది కూడా ఒకటి రెండు సందర్భాలకు మించి లేవు. ఈ ఓటర్లలో వామపక్షాలకు ఆది నుంచి బలం ఎక్కువ. ఆ తర్వాతి స్థానం బీజేపీది. గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల్లో ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, టీచర్లు ఓటర్లుగా ఉంటారు. సాధారణ గ్రాడ్యుయేట్లు ఎవరూ స్వచ్ఛందంగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించుకోవడానికి ఉత్సాహం చూపరు. ఈ పనిని ఎవరో ఒకరు చేసిపెట్టాల్సిందే. వామపక్షాలు, బీజేపీ కార్యకర్తలు ఈ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటారు. పైగా ఉద్యోగ సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, బ్యాంకు ఉద్యోగుల సంఘాల్లోనూ వామపక్షాల పలుకుబడి మొదటినుంచీ ఉన్నది.

ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాలు, రాయలసీమలోని రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికలపై చాలాకాలం క్రితమే టీడీపీ కన్నేసింది. వామపక్ష ఓట్లు, బీజేపీ ఓట్లు తన పార్టీ అభ్యర్థులకు ఎక్కువగా పోలయ్యేలా రహస్య మంత్రాంగం చేసింది. రంగంలో లేని జనసేన ఓట్లు స్వల్పమే అయినా టీడీపీ ఖాతాలో వేసుకున్నది. బీజేపీ, వామపక్షాల ఓట్లు గణనీయంగా టీడీపీకి బదిలీ అయిన ట్రెండ్ లెక్కింపులో కనిపించింది. పశ్చిమ రాయలసీమలో గత ఎన్నికల్లో వైసీపీ మద్దతుతో పోటీచేసిన ఇండిపెండెంట్ గెలిచారు. ఈసారి ఆయన వైసీపీ అభ్యర్థిగా రంగంలో ఉన్నాడు. తొలి ప్రాధాన్యత ఓట్లలో ఆయనకే ఆధిక్యత లభించింది. యాభై శాతం ఓట్ల మార్కుకోసం రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించినప్పుడు టీడీపీ అభ్యర్థి గెలుపొందాడు. మొదటి ప్రాధాన్యతలో పీడీఎఫ్ (లెఫ్ట్), బీజేపీలకు ఓట్లేసినవారు గంపగుత్తగా రెండో ప్రాధాన్యతలో టీడీపీకి వేశారు. టీడీపీ చేసిన రహస్య మంత్రాంగానికి స్పష్టమైన ఉదాహరణ ఇది.

ఉత్తరాంధ్రలో గత ఎన్నికల్లో పీడీఎఫ్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు జరిగి స్వల్ప తేడాతో బీజేపీ గెలిచింది. ఈసారి వారి ఓట్లు తగ్గి టీడీపీ అభ్యర్థి గెలిచారు. తూర్పు రాయలసీమలో ఇంతకుముందు పీడీఎఫ్ గెలిచింది. ఇప్పుడు టీడీపీ గెలిచింది. ఇక్కడా అదే పరిస్థితి. రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో వైసీపీ గెలిచింది. దానికి మీడియాలో సరైన ప్రాధాన్యత లభించలేదు. ఒక గాలిని పోగేయడం, ఒక మూడ్‌ను సృష్టించడం కోసం తెలుగుదేశం, యెల్లో మీడియా సర్వశక్తులు ఒడ్డి ఫోకస్ పెట్టాయి. గత కొంత కాలంగా ఉద్యోగుల మనసుల్లో యెల్లో మీడియా నాటుతున్న ప్రభుత్వ వ్యతిరేక విషబీజాల ప్రభావం కూడా ఎంతోకొంత ఉండవచ్చు. ఇంతా చేస్తే మొత్తం పోలయిన ఓటల్లో వైసీపీ అభ్యర్థులకంటే టీడీపీకి వచ్చిన ఓట్లు కేవలం ఆరేడు శాతమే ఎక్కువ. బౌన్సీ పిచ్‌పై బ్యాటింగ్ చేసిన జట్టు చాలా గౌరవప్రదమైన స్కోరు చేసినట్టే వైసీపీ ఫలితాన్ని పరిగణించాల్సి ఉంటుంది. గతంలో అధికారంలో ఉన్న ఏ పార్టీ ఈ స్థాయి ప్రభావాన్ని చూపలేదు. రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలను గెలుచుకోలేదు. ఇదీ వాస్తవికత. కానీ తెలుగుదేశం యెల్లో మీడియా ప్రభుత్వ వ్యతిరేక పవనం వీస్తున్నదని ప్రచారంలో పెట్టింది. దీన్నే మైండ్ గేమ్ అంటారు.

ఎమ్మెల్యేలు ఓటేసే ఎమ్మెల్సీ సీట్లలో ఏడుకు గాను ఒక సీటును టీడీపీ గెలిచింది. విలువలను దిగజార్చడం ఇష్టంలేక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వదిలేసుకున్న సీటు అది. వదిలేసిన సీటును గెలిచి ఎమ్మెల్యేలలోనూ ప్రభుత్వ వ్యతిరేక ప్రభంజనం వీస్తున్నదని డప్పేయడం మొదలుపెట్టారు. చచ్చి పడి ఉన్న ఓ పెద్దపులి గోళ్లను కత్తిరించుకొచ్చి పులిని చంపింది నేనే అన్నాడట పూర్వం ఒకడు. ఇప్పుడు కూడా ఒకాయన రోజూ అంటూనే ఉంటాడు... సెల్‌ఫోన్ నాదే, కంప్యూటర్ నాదే, టీవీ నాదే, కెమెరా నాదే, హైదరాబాద్ నాదే, బాగ్దాద్ నాదే, దావోస్ నాదే, ఇస్తాంబుల్ నాదే, సింగపూర్ నాదే... ఈరకమైన వ్యవహార శైలికి ఏం పేరు పెట్టాలి? సామాన్య జనుల సాధికారత కోసం, జనాభాలో సగమైన అక్కచెల్లెమ్మలకు సముచిత స్థానంకోసం, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ప్రజాస్వామిక విప్లవం కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని గోబెల్స్ ప్రచారాలతో, మైండ్ గేమ్‌లతో, మనీ గేమ్‌లతో ఓడించగలమని భావిస్తే... అది అహంభావమైనా కావాలి... ఉన్మాదమైనా కావాలి.

ఈ రెండూ జత కలిసి ఇవ్వాళ ఆంధ్రప్రదేశ్‌లో జమిలి నాట్యం చేస్తున్నవి. ఒకడు మీడియాను మాఫియాగా మార్చిన ప్రబుద్ధుడు. అనేకానేక ఆరోపణలు ఎదుర్కొంటున్నా మాయోపాయాలతో న్యాయవ్యవస్థ కళ్లు కప్పుతున్నవాడు. మార్గదర్శి వ్యవహారంలో నేర నిర్ధారణ జరిగి కటకటాల వెనక్కి వెళ్లవలసినవాడు. మరొకడు రాజకీయ నేత. రాజకీయాన్ని జూదంగా మార్చినవాడు. ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నవాడు. సవాలక్ష అవినీతి పనులకు కేరాఫ్ అడ్రస్. ఎత్తులతో, జిత్తులతో న్యాయ సమీక్షకు దూరం జరుగుతున్నవాడు. పాపాలు పండుతున్నాయి. ఒక్కొక్క స్కామ్ సాక్ష్యాధారాలతో బద్దలవుతున్నది. నేడో రేపో జైలు ఊచలు లెక్కపెట్టవలసినవాడు. ఇద్దరూ కలిసి ఆంధ్రదేశం కళ్లకు ఇంకెంతకాలం గంతలు కట్టాలి? ఓ అఖిలాంధ్ర మేధావులారా వీరి చట్టవిరుద్ధ చర్యలను ప్రశ్నించరెందుకని? నిజం నిద్ర లేవకముందే అబద్ధాలతో, అభూతకల్పనలతో ప్రభాత భేరీలు మోగిస్తున్న ఆషాఢభూతుల కదలికలపై కన్నేయవలసిన అవసరం లేదా? పేద ప్రజల మేలుకోసం, సామాన్య ప్రజల శ్రేయస్సుకోసం సాగుతున్న యజ్ఞాన్ని తమ స్వార్థంకోసం, సొంత వర్గ ప్రయోజనాల కోసం భగ్నం చేయజూస్తున్న యెల్లో ముఠాను ఎలుగెత్తి ఖండించడం నేటి కర్తవ్యం కాదా?

చచ్చి పడి ఉన్న ఓ పెద్దపులి గోళ్లను కత్తిరించుకొచ్చి పులిని చంపింది నేనే అన్నాడట పూర్వం ఒకడు. ఇప్పుడు కూడా ఒకాయన రోజూ అంటూనే ఉంటాడు... సెల్‌ఫోన్ నాదే, కంప్యూటర్ నాదే, టీవీ నాదే, కెమెరా నాదే, హైదరాబాద్ నాదే, బాగ్దాద్ నాదే, దావోస్ నాదే, ఇస్తాంబుల్ నాదే, సింగపూర్ నాదే... ఈ రకమైన వ్యవహార శైలికి ఏం పేరు పెట్టాలి? సామాన్య జనుల సాధికారత కోసం, జనాభాలో సగమైన అక్కచెల్లెమ్మలకు సముచిత స్థానంకోసం, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ప్రజాస్వామిక విప్లవం కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని గోబెల్స్ ప్రచారాలతో, మైండ్ గేమ్‌లతో, మనీ గేమ్‌లతో ఓడించగలమని భావిస్తే... అది అహంభావమైనా కావాలి... ఉన్మాదమైనా కావాలి. ఈ రెండూ జత కలిసి ఇవ్వాళ ఆంధ్రప్రదేశ్‌లో జమిలి నాట్యం చేస్తున్నవి. ఒకడు మీడియాను మాఫియాగా మార్చిన ప్రబుద్ధుడు. మరొకడు రాజకీయాన్ని జూదంగా మార్చినవాడు. ప్రజా స్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నవాడు. పాపాలు పండుతున్నాయి. ఒక్కొక్క స్కామ్ సాక్ష్యాధారాలతో బద్దలవుతున్నది. ఇద్దరూ కలిసి ఆంధ్రదేశం కళ్లకు ఇంకెంత కాలం గంతలు కట్టాలి?

vardhelli1959@gmail.com

ఇథనాల్ కలిపిన పెట్రోలుతో ఎవరికి ప్రయోజనం?

దేశీయ ఇంధన అవసరాలు తీర్చడానికీ, ఇంధన దిగుమతి భారం తగ్గించడానికీ, వాయు, కర్బన కాలుష్యాలను తగ్గించడానికీ ఇథనాల్ కలిపిన పెట్రోలు పరిష్కారమని భారత ప్రభుత్వం ఎన్నో వెసులు బాట్లు కల్పించి ప్రోత్సహిస్తున్నది. ఆహార ధాన్యాలైన బియ్యం, గోధుమలు, మొక్కజొన్నల నుండి ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి సత్వర పర్యావరణ అనుమతులూ, సబ్సిడీలూ, వడ్డీ రాయితీతో రుణాలూ మంజూరు చేసి 2025 నాటికి 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోలు అందుబాటులోకి తేవడానికి ప్రయత్నిస్తున్నది. ఇథనాల్‌ను పెట్రోలుకు కలపడం కొత్తేమీ కాదు. రెండో ప్రపంచ యుద్ధ కాలం నుండీ వాడుతున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే, ఇతర ఐరోపా దేశాలూ; కెనడా, చైనా కూడా మిశ్రమ ఇంధనాన్ని ప్రస్తుతం వాడుతున్నాయి.

శాస్త్రీయ అధ్యయనాలు ఇథనాల్‌ను ఇంధనంగా వాడడంలోని నష్టాలను వెలుగులోకి తెచ్చాయి. 2023 మార్చి13న ఐపీసీసీ విడుదల చేసిన నివేదిక, తాపం పెరుగుదల 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు మించకుండా నిరోధించడానికి శిలాజ ఇంధనాలకు సత్వర ముగింపు పలకాలని స్పష్టం చేసింది. కొత్తగా నిర్మిస్తున్న ఇథనాల్ ప్లాంట్లు కనీసం 30 ఏళ్లు పని చేస్తాయి. మరి 2070 నాటికి నికర జీరో కర్బన ఉద్గారాలెలా సాధ్యమవుతాయి?

అమెరికా ప్రభుత్వ శక్తి (ఎనర్జీ) విభాగం 'ఇ20... పెట్రోల్ కంటే 7.7 శాతం తక్కువ ఇంధన శక్తి కలిగి ఉంటుందని' నిర్ధారించింది. ఒక లీటరు పెట్రోల్... 1.073 లీటర్ల మిశ్రమ ఇంధనానికి సమానం. పరిశీలనల్లో పెట్రోలునూ, మిశ్రమ ఇంధనాన్నీ వాడినప్పుడు దాదాపు కర్బన ఉద్గారాలు అదేస్థాయిలో ఉంటాయని తేలింది. ప్రతి ఇథనాల్ ప్లాంట్‌కీ ఒక బొగ్గుతోకానీ, బయోమాస్‌తో కానీ నడిచే పవర్ ప్లాంట్‌కు అనుమతిస్తున్నారు. వాటి ఉద్గారాలు అదనం. ఇంకా ప్రతి లీటరు ఇథనాల్ ఉత్పత్తికి 0.76 కిలోల కార్బన్- డై-ఆక్సైడ్ విడుదలవుతుంది. దానిని పూర్తిగా పట్టి గాలిలో చేరకుండా ఆపే వ్యవస్థ లేదు. అంటే మొత్తం ఉత్పత్తయిన కార్బన్-డై-ఆక్సైడ్ చివరికి గాలిలోకి చేరుతుంది. భూతాపానికి దోహదపడుతుంది. అంటే లక్ష్యం తిరగబడుతుందన్న మాట.

చమురు దిగుమతుల ఆర్థిక భారం తగ్గించడానికి ఇథనాల్ ఇంధనం పరిష్కారంగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఇ10 ఇంధనం అందుబాటులోకి వచ్చింది. అయినా




పెరుగుతున్న డిమాండ్ వల్ల చమురు దిగుమతి భారం తగ్గలేదన్నది స్పష్టం. విదేశీ మారక ద్రవ్యం ఖర్చు పెరిగింది కాని తగ్గ లేదు. ఇంకా తగిన ఇథనాల్ ఉత్పత్తి లేక ఇథనాల్ దిగుమతి కూడా పెరిగింది. దేశీయ చమురు ఉత్పత్తులు గణనీయంగా క్షీణిస్తున్నందునా, చమురు వినియోగం పెరుతున్నందునా, ఇథనాల్ కలపడం చమురుపై ఆధారపడడం నుండి విముక్తం చేయదు. కర్బన ఉద్గారాలు పారిస్ ఒప్పందానికి అనుగుణంగా తగ్గవు.

చెరకు, బియ్యం, మొక్క జొన్నల నుండి ఇథనాల్ ఉత్పత్తి నీటి వనరులపై భారం పెంచుతుంది. ఇథనాల్ ప్లాంట్‌ల ప్రతిపాదనలు లీటర్ ఇథనాల్‌కు 8 నుండి 10 లీటర్ల నీరు కావాలంటున్నాయి. చెరకు నుండి లీటరు ఇథనాల్ ఉత్పత్తికి దాదాపు మూడు వేల లీటర్ల నీరు అవసరమవుతుంది. ఆహార పంటలను ఇంధన ఉత్పత్తికి తరలించడం వల్ల అదనపు భూమిని సాగులోకి తేవలసి వస్తుంది. దానివల్ల భూవినియోగం మార్పు వస్తోంది. అందువల్ల ఉద్గారాలు పెరుగుతాయి. భూతాపం వల్ల పంటల దిగుబడి గణనీయంగా తగ్గడంతో ఆహార కొరత సమస్య ఉత్పన్నమవుతుంది. రైతులకు ఇథనాల్ ఉత్పత్తితో ఒరిగేదేమీ లేదు. ప్రభుత్వమే సబ్సిడీ ధరకు కంపెనీలకు బియ్యం సరఫరా చేస్తుంది. కిలో బియ్యం రూ. 20కు ఇస్తున్నది. అంటే కిలోకు రూ.17 సబ్సిడీ ఇస్తున్నది. ఒక లీటరు ఇథనాల్ ఉత్పత్తికి 2.22 కిలోల బియ్యం సబ్సిడీ ధరకు ఇస్తున్నారు. లీటరు ఇథనాల్ ఉత్పత్తికి బియ్యంపై రాయితీ రూ. 37.74. ఎఫ్‌సీఐ సరఫరా ధర రూ. 37 కు బియ్యం కొంటే లీటరు ఇథనాల్‌కు కావలసిన బియ్యం ధర రూ. 83.78. ప్రభుత్వం నిర్ణయించిన ఇథనాల్ ధర లీటరుకు 56.87. లీటరు పెట్రోలుకు ఇంధన శక్తిలో సమానమైన 1.51 లీటర్ల ఇథనాల్ ఉత్పత్తికి వాడే బియ్యం ఖరీదు రూ.126.5. ఆ పైన ఉత్పత్తి ఖర్చులు ఎటూ ఉంటాయి. అంటే మిశ్రమ ఇంధనం పెట్రోలు కంటే ప్రియమన్న మాట. ప్రస్తుతం రోడ్డుపైనున్న వాహనాలేవీ ఇ20 ఇంధనాన్ని వాడడానికి పనికిరావు. కొత్తగా వచ్చే వాహనాలను అందుకు అనువుగా రూపొందించినా ఇ20 అవసరం తక్కువే ఉంటుంది. అనువుగా మార్చని వాహనాలలో ఇ20 వాడితే ఇంజన్‌కు జరిగే నష్టం గణనీయం. ఇథనాల్ ఇంధనంతో జాతికీ, వాతావరణానికీ ప్రయోజనమేమిటో చర్చ జరగాలి.

– డా॥ కలపాల బాబూరావు, విశ్రాంత శాస్త్రవేత్త

విజయోత్సవ ఆదివారం

గుడ్ ఫ్రైడేకు ముందున్న ఆదివారాన్ని మట్టలాదివారం అంటారు. ఇంగ్లిష్‌లో 'పామ్ సండే' అంటారు. మ్రాని కొమ్మల ఆదివారం అనీ, యేసు యెరూషలేములో ప్రవేశించిన చివరి ఆదివారం అనీ, యేసు యెరూషలేములో విజయోత్సవంతో ప్రవేశించిన దినం అనీ వివిధ రకాలుగా పిలుస్తారు. ఈ ఆదివారం తర్వాత శ్రమల వారం 'ప్యాషన్ వీక్' మొదలవుతుంది. 'ప్యాషన్' అనే పదం 'ప్యాషియో' అనే లాటిన్ పదం నుండి వచ్చింది. అంటే శ్రమ అని అర్థం.



యేసు, ఆయన శిష్యులు బలీవల కొండ దగ్గర ఉన్న 'బేత్పగే' గ్రామం దగ్గరకు వచ్చారు. తన శిష్యులలో ఇద్దరిని పిలిచి 'అదిగో మనకు ఎదురుగా ఉన్న గ్రామానికి వెళ్ళండి. అక్కడ ఒక గాడిద కట్టబడి ఉంటుంది. దాని కట్లు విప్పి తోలుకొని రండి. ఎవరైనా మిమ్ముల ప్రశ్నిస్తే ఇది ప్రభువుకు కావాలని చెప్పండి' అని అన్నాడు. శిష్యులు ఆ గ్రామానికి వెళ్ళారు. కట్టబడి ఉన్న గాడిద కట్లు విప్పారు. అక్కడ ఉన్నవారు ఎందుకని అడిగారు. ప్రభువుకు కావాలని జవాబిచ్చారు. వారు అందుకు అంగీకరించారు. యేసు ఆ గాడిద మీద యెరూషలేము వైపు ప్రయాణం సాగించాడు. ఆ దారి పొడవునా జన సమూహములు నేలపై తమ వస్త్రాలను పరుస్తున్నారు. ఆ సమయంలో యెరూషలేము వీధులలో ఇసుక వేసినా రాలనంత జనం ఉన్నారు. అనేకులు ఖర్జూరపు మట్టలు చేతబూని, 'హోసన్నా, హోసన్నా' అంటూ గీతాలను ఆలపిస్తున్నారు. 'హోసన్నా' అంటే 'జయము' అని అర్థం.

ఖర్జూర మట్టలు చేబూని యేసును స్వాగతించారు గనుక దీనిని మట్టలాదివారం అని, చెట్ల కొమ్మలు దారి పొడవునా పరిచారు గనుక మ్రాను కొమ్మల ఆదివారం అని పిలవడం జరిగింది. యేసు పాపం మీద, సాతాను మీద, తుదకు మరణం మీద విజయం సాధించనై యున్నాడు గనుక ఈ రోజును విజయోత్సవ యెరూషలేం ప్రవేశ ఆదివారం అని బైబిల్ పండితులు పేర్కొన్నారు.

– పులుకూరి లాబాను ప్రభుదాసు, కావలి

(నేడు మట్టలాదివారం)

క్లుప్తంగా...

త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ: తలసాని



సాక్షి, హైదరాబాద్: త్వరలో 3.38 లక్షల మందికి రెండో విడత గొర్రెల పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు పశుసంవర్ధక శాఖమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. కొనుగోలు చేసిన గొర్రెల రవాణాకు టెండర్లు వెంటనే నిర్వహించాలని ఆదేశించారు. శనివారం బీఆర్‌కేఆర్ భవన్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎస్ శాంతి కుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తలసాని పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేశామన్నారు. 2017లో చేసిన సర్వే ప్రకారం రాష్ట్రంలో 7.31 లక్షల మంది అర్హులను గుర్తించినట్లు తెలిపారు. అయితే వీరిలో ఇప్పటికే 3.93 లక్షల మందికి ఈ పథకం వర్తింపజేశామన్నారు. ఏపీ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకలో గొర్రెలు అందుబాటులో ఉండే మార్కెట్లను పశుసంవర్ధక శాఖ గుర్తించిందని, జిల్లా స్థాయి సీనియర్ అధికారులను ఈ ప్రాంతాలకు పంపి కొనుగోలు చేయించాలని ఆదేశించారు.

ప్రజల ఆకాంక్షల సాధనకే ‘తెలంగాణ రక్షణ సమితి’



సత్యనారాయణ

కల్లూరు: తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు నెరవేర్చేందుకు తెలంగాణ రక్షణ సమితి(టీఆర్ఎస్) పార్టీని ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ తెలిపారు. ఖమ్మం జిల్లా కల్లూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..రైతులు, మహిళలు, వృద్ధులు, నిరుద్యోగులకే కాక ఉద్యమకారులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్..ప్రజల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. ఉద్యోగ నియామకాలు, ప్రాజెక్టుల నిర్మాణంలో అవినీతికి తెరలేపారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్న ప్రజలకు అండగా నిలిచేందుకు పార్టీని స్థాపించామని సత్యనారాయణ తెలిపారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్ల శ్రీలత ఇతర నాయ కులు పాల్గొన్నారు.

స్పేస్ కాంటెస్ట్‌లో ప్రపంచ చాంపియన్‌గా శ్రీచైతన్య

సాక్షి, హైదరాబాద్: అమెరికా నాసా వారి ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్–2023లో శ్రీచైతన్య వరుసగా పదో సంవత్సరం ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. ప్రపంచ నలుమూలల నుంచి 30కి పైగా దేశాలు పాల్గొన్న ఇందులో తమ విద్యార్థులు నెంబర్‌వన్ స్థానంలో నిలబెట్టారని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఎన్ఎస్ఎస్ కాంటెస్ట్‌లో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 138 ప్రాజెక్టుల్లో 89 ప్రాజెక్టులు ఒక్క భారతదేశం నుంచి ఎంపికవ్వగా.. అందులో 54 ప్రాజెక్టులు ఒక్క శ్రీచైతన్య నుంచే ఎంపికయ్యాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరల్డ్ 1, 2, 3 ప్రైజ్‌లలో గానీ, విన్నింగ్ ప్రాజెక్ట్ సంఖ్యలో గానీ శ్రీచైతన్య విద్యార్థులు సత్తా చాటారన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను శ్రీచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ బి.ఎస్.రావు అభినందించారు.

స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో నారాయణ హవా

సాక్షి, హైదరాబాద్: నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గెరార్డ్ కె.ఓ నీల్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్ 2021–23లో నారాయణ విద్యార్థులు సత్తాచాటారు. వరల్డ్ నెంబర్‌వన్ స్థానంలో 6 సెలక్షన్స్ నారాయణ విద్యార్థులు దక్కించుకున్నారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ సింధూర నారాయణ, శరణి నారాయణ తెలిపారు. వరల్డ్ నెంబర్ 2 స్థానంలో 14, వరల్డ్ నెంబర్ 3 స్థానంలో 30 సెలక్షన్స్‌తో పాటు 26 హాజరబుల్ ప్రైజ్‌లను తమ విద్యార్థులు సాధించారన్నారు. మొత్తంగా 76 ప్రాజెక్టుల్లో విజయకేతనం ఎగురవేసినట్లు వెల్లడించారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునీత్ ప్రత్యేకంగా అభినందించారు.

స్టాటిస్టిక్స్‌పై ఎన్ఎమ్ఐఎమ్ఎస్ అంతర్జాతీయ సదస్సు

సాక్షి, హైదరాబాద్: స్టాటిస్టిక్స్ మీద అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ సహకారంతో దీన్ని ఎస్వీకేఎమ్ ఎన్ఎమ్ఐఎమ్ఎస్ నీల్‌కమల్ స్కూల్ ఆఫ్ మేథమెటిక్స్, అప్లైడ్ స్టాటిస్టిక్స్ అండ్ అనలిటిక్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో స్టాటిస్టిక్స్‌లో వచ్చిన నూతన పరిణామాలు, పోకడల గురించి ముఖ్యంగా చర్చించనున్నారు. ఈ సందర్భంగా డీన్ సుశీల్ కులకర్ణి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో స్టాటిస్టిక్స్ కీలకమైన పాత్రను పోషిస్తోందని తెలిపారు. ఈ సమావేశం ప్రపంచవ్యాప్తంగా ఉన్న గణాంకవేత్తలను ఒక్క వేదికమీదకి చేర్చి తమ ఆలోచనలను పంచుకోవడానికి దోహదం చేస్తుందన్నా రు. సమావేశంలో ప్రో వైస్‌చాన్స్‌లర్స్ శరద్ మైస్కార్, మీ నా చింతమనేని, డీన్ సుశీల్ కులకర్ణి, ఎన్ఎస్ఓఎమ్ఏఎస్‌ఏ ప్రొఫెసర్ సు నీల్ శిర్వైకర్, ప్రొగ్రామ్ డైరెక్టర్ కేఎస్ మాధవరావు, అసోసియేట్ ప్రొఫెసర్ లీనా కులకర్ణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రకాశరావు పాల్గొన్నారు.

ఇక తిరుపతికి ఎనిమిదిన్నర గంటల్లోనే..

- వారంలో అందుబాటులోకి ‘వందే భారత్’
- సికింద్రాబాద్‌లో ఉదయం 6కి బయలుదేరి మధ్యాహ్నం రెండున్నరకల్లా తిరుపతికి
- 8న ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- నల్లగొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరులో ఆగనున్న రైలు



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి తిరుపతి రైలు ప్రయాణాలకు పడుతున్న 12 గంటల సమయాన్ని ఎనిమిదిన్నర గంటలకు కుదిస్తూ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ దూసుకొస్తోంది. ఈ నెల 8న సికింద్రాబాద్‌లో ప్రధాని మోదీ ఈ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఇప్పటికే సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య ఓ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సంక్రాంతి రోజున ప్రారంభమై విజయవంతంగా సేవలందిస్తుండగా ఇప్పుడు దక్షిణమధ్య రైల్వేకు రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రాబోతోంది. మొదటి రైలును ప్రధాని స్వయంగా వచ్చి ప్రారంభించాల్సి ఉన్నా అనివార్య కారణాలతో రాలేకపోయారు. ఇప్పుడు రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించేందుకు ఆయన నగరానికి రానున్నారు. దాంతోపాటు నగరంలో ఎంఎంటీఎస్ రెండో దశకు సంబంధించి ఫలక్‌నుమా–ఉందా నగర్, సికింద్రాబాద్–మేడ్చల్ సర్వీసులను కూడా ప్రారంభించనున్నారు. అలాగే సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు సికింద్రాబాద్–మహబూబ్ నగర్ మధ్య పూర్తయిన డబ్లింగ్ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఉదయం బయలుదేరి మధ్యాహ్నానికి తిరుపతికి..

ప్రస్తుతం రాష్ట్రం నుంచి తిరుమల వెళ్లే భక్తుల కోసం 8 రైళ్లు అందుబాటులో ఉన్నాయి. వెంకటాద్రి, నారాయణాద్రి, సెవెన్‌హిల్స్, పద్మావతి, రాయలసీమ, కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లతోపాటు ఢిల్లీ–తిరుపతి మధ్య నడిచే ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ నుంచి తిరువనంతపురం వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్‌లు తిరుమల యాత్రికులకు సేవలందిస్తున్నాయి. గతంలో కొంతకాలం డబుల్ డెక్కర్ రైలు నడిచినా ప్రయాణికుల ఆదరణ అతితక్కువగా ఉండటంతో దాన్ని రద్దు చేశారు. ఇప్పుడు నగరం నుంచి తిరుపతికి తొమ్మిదో రైలుగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం అవుతోంది. మిగతా రైళ్లు నగరం నుంచి తిరుపతికి వెళ్లేందుకు సగటున 12 గంటల సమయం తీసుకుంటున్నాయి. కానీ ఈ రైలు కేవలం ఎనిమిదిన్నర గంటల్లోనే గమ్యానికి చేరుకోనుండటం విశేషం. ప్రస్తుతానికి తాత్కాలికంగా రైల్వే అధికారులు పేర్కొంటున్న వేళల ప్రకారం ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2:30 గంటలకల్లా తిరుపతికి చేరుకుంటుంది. ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరే కృష్ణా (ఆదిలాబాద్‌లో రాత్రి బయలుదేరి) ఎక్స్‌ప్రెస్ తిరుపతికి వెళ్లేసరికి రాత్రి పదిన్నర దాటుతోంది. ఈ నేపథ్యంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

వేగంగా వెళ్లేందుకే ఆ మార్గం ఎంపిక..

కొత్త వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నల్లగొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు మీదుగా తిరుపతి వెళ్లనుంది. వందేభారత్ రైళ్ల వేగం ఎక్కువగా ఉండనున్నందున, 130 కి.మీ. వేగాన్ని తట్టుకొనేలా పటిష్టం చేసిన ట్రాక్‌నే కేటాయిస్తున్నారు. ఆ తరహా ట్రాక్ ప్రస్తుతం తిరుపతి మార్గంలో ఇదొక్కటే. దీంతో ఆ మార్గాన్ని ఎంపిక చేశారు. అయితే బీబీనగర్–నడికుడి మధ్య ఉన్నది కేవలం బ్రాంచి లైనే. అది కూడా సింగిల్ లైన్. దీన్ని 130 కి.మీ. వేగానికి పటిష్టం చేయలేదు. దాదాపు 175 కి.మీ. మేర ఉన్న ఈ మార్గంలో మాత్రం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నెమ్మదిగా వెళ్లాల్సిందే. గుంటూరు–తెనాలి మధ్య ఉన్నది కూడా బ్రాంచి లైనే. ఈ ట్రాక్ సామర్థ్యాన్ని సైతం పెంచలేదు. అయితే ఇటీవలే సింగిల్ లైన్‌ను డబుల్ లైన్‌గా మార్చారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు గంటకు 160 కి.మీ. నుంచి 200 కి.మీ. వేగంతో ప్రయాణించగల సామర్థ్యం ఉన్నా మన ట్రాక్ పరిస్థితి, మలుపుల దృష్ట్యా సగటున గంటకు 77 కి.మీ. వేగంతోనే ఈ రైలు ప్రయాణించనుంది.

తక్కువ కోచ్‌లే..

విశాఖకు నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో 16 కోచ్‌లు ఉండగా తిరుపతి రైలులో ఆ సంఖ్య 9 లేదా 10గా ఉండనున్నట్లు సమాచారం. ఈ రైలు టికెట్ ధర ఎక్కువగా ఉండనున్నందున అంత మొత్తాన్ని భరించలేనివారు ఇతర రైళ్లవైపే మొగ్గుచూపుతారన్న ఉద్దేశంతో తొలుత తక్కువ కోచ్‌లతోనే రైలును నడపాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. రద్దీ ఎక్కువగా ఉంటే, తర్వాత కోచ్‌ల సంఖ్య పెంచనున్నట్టు సమాచారం. ఈ రైలు గుంటూరులో 5 నిమిషాలు, మిగతా చోట్ల నిమిషం చొప్పున మాత్రమే ఆగుతుంది. అయితే ఈ నెల 8న ప్రారంభోత్సవం రోజున సాధారణ ప్రయాణికులను అనుమతించరు. ఆ రోజు సికింద్రాబాద్‌లో ఉదయం 11:30కు బయలుదేరుతుందని సమాచారం.

సికింద్రాబాద్ టు తిరుపతి			తిరుపతి టు సికింద్రాబాద్	
అరైవల్	డిపార్చర్	స్టేషన్	అరైవల్	డిపార్చర్
–	ఉ.6:00	సికింద్రాబాద్	రా.11:45	–
7:19	7:20	నల్లగొండ	10:10	10:11
9:45	9:50	గుంటూరు	7:45	7:50
11:09	11:10	ఒంగోలు	6:30	6:31
12:29	12:30	నెల్లూరు	5:20	5:21
2:30	--	తిరుపతి	--	3:15

ఆర్టీసీ చార్జీల్లో స్వల్పంగా టోల్ రుసుము పెంపు

- రెండు టోల్‌గేట్లు దాటి వెళ్లేవారిపై కొంత ప్రభావం
- ఒక్కోదానికి రూ.4 చొప్పున టికెట్ రుసుములో కలిపి వసూలు

సాక్షి, హైదరాబాద్: టోల్‌ప్లాజాల్లో చార్జీలు పెంచిన నేపథ్యంలో ఆ రూపంలో ఆర్టీసీపై పడే భారాన్ని రికవరీ చేసుకునేందుకు టికెట్ చార్జీలో ఉండే టోల్ రుసుమును సంస్థ సవరించింది. ఆర్టీసీ బస్సులు కూడా టోల్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో గతంలోనే, టోల్ రుసుమును టికెట్ ధరలో చేర్చింది. ఇప్పుడు కొత్తగా పడే భారానికి తగ్గట్టు దాన్ని సవరించింది. అయితే, గతేడాది డీజిల్ సెస్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ సెస్, సేఫ్టీ సెస్.. ఇలా పలు సెస్‌లను చేర్చి టికెట్ ధరలను సవరించినప్పుడు చిల్లర సమస్య రాకుండా తదుపరి పది రూపాయలకు రౌండింగ్ ఆఫ్ చేసింది. ఇప్పుడు ఒక టోల్‌గేట్ దాటుతూ వెళ్లే స్టాప్‌లకు కొత్తగా టోల్ రుసుము జోడించినా ఆ రౌండింగ్ ఆఫ్ చేసిన మొత్తాని కంటే తక్కువే అవుతున్నందున అదనంగా పెంపు లేకుండా పోయింది. కానీ రెండు, మూడు టోల్‌గేట్లు దాటుతూ వెళ్లే ప్రయాణికులకు మాత్రం కొంతమేర అదనపు భారం పడుతోంది. ఒక్కో టోల్ గేట్‌కు సంబంధించి రూ.4 చొప్పున టికెట్ రుసుములో చేర్చింది. రౌండింగ్ ఆఫ్ పరిధి మించి రావాలంటే కనీసం రెండు టోల్ గేట్లు దాటి ప్రయాణించాల్సి ఉంటుంది. అప్పుడు రూ.10 చొప్పున అదనంగా టికెట్ రుసుములో చేర్చారు. విజయవాడ, ఖమ్మం మార్గాల్లో మూడు చొప్పున టోల్ గేట్లు ఉన్నందున చివరి స్టాప్ వరకు వెళ్లే వారికి మాత్రం రూ.20 చొప్పున అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో నిత్యం 28 లక్షల మంది సగటున ప్రయాణిస్తున్నారు. వీరిలో సిటీబస్సుల్లో తిరిగే వారి సంఖ్య దాదాపు 13 లక్షలుంటోంది. వీరిపై టోల్ రుసుము భారం లేదు. పల్లె వెలుగు బస్సుల నిడివి తక్కువ. వీటిల్లో 12 లక్షలమంది ప్రయాణిస్తున్నారు. వీరిపై భారం దాదాపు లేదు. ఇక దూర ప్రాంత బస్సుల్లో తిరిగే మిగిలిన మూడు లక్షలమందిపై ఈ పెంపు ప్రభావం కనిపిస్తోంది.

ములుగు జెడ్పీ చైర్మన్‌కు మైల్డ్‌స్ట్రోక్

- ఆస్పత్రిలో కొనసాగుతున్న చికిత్స



జగదీశ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీతక్క

ములుగు: ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ మైల్డ్‌స్ట్రోక్‌కు గురయ్యారు. ఆయన శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్న స్థాయీ సంఘం సమావేశానికి హనుమకొండలోని ఇంటినుంచి బయల్దేరారు. ఈ క్రమంలో ఛాతిలో నొప్పి రావడంతో కుప్పకూలిపోయారు. వెంటనే ఆయన భార్య రమాదేవి సీపీఆర్ చేసి ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మైల్డ్‌స్ట్రోక్ కారణంగా అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సీతక్క ఆస్పత్రిలో జెడ్పీ చైర్మన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

‘కేసీఆర్ సర్కార్ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి’

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ సభ్యులపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్రపతికి మాత్రమే ఉంటుందని, వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతికి లేఖ రాసి కేసీఆర్ సర్కార్ నిరుద్యోగుల పట్ల తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఇలాంటివి చోటుచేసుకున్నపుడు కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం ఇదేవిధంగా లేఖలు రాసిందని, తదనుగుణంగా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై రాష్ట్ర ప్రభుత్వానివి కేవలం కంటితుడుపు చర్యలేనని విమర్శించారు. పేపర్ లీకేజ్ వ్యవహారంపై ప్రభుత్వం సిట్ వేయలేదని ప్రస్తుతం విచారణ చేస్తున్న సిట్ కేవలం పోలీసులు వేసుకున్నదేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. టీఎస్‌పీఎస్సీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అని, ఆ సంస్థ చైర్మన్‌ను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఇంటికి ఎందుకు పిలిపించుకున్నారని ప్రశ్నించారు.

‘లీకేజీపై తప్పించుకుంటున్న కేటీఆర్’

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో తప్పించుకునేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విమర్శించారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ రైతులకు కేసీఆర్ చేసిన ఘనకార్యమేమీ లేదన్నారు. పంట నష్టపరిహారం చెల్లించలేదని, వారికిచ్చే సబ్సిడీలన్నీ నిలిపివేశారని పేర్కొన్నారు. ఎరువులపై కేంద్రం ఇచ్చిన సబ్సిడీల గురించి కేసీఆర్ ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 8న ప్రధాని మోదీ హైదరాబాద్ వస్తున్నందున ఏర్పాట్లపై పార్టీ ముఖ్యనేతలు తరుణ్‌ఛుగ్, సునీల్‌బన్సల్, శివప్రకాశ్, అర్వింద్ మీనన్‌లతో చర్చించినట్లు అరుణ తెలిపారు.

పెళ్లి చేసుకున్న యువతి కాదందని..

- యువకుడి ఆత్మహత్య
- చికిత్స పొందుతూ వారం రోజులకు మృతి
- ఎస్సైకి వ్యతిరేకంగా బంధువుల ఆందోళన

బీబీపేట /కామారెడ్డి టౌన్: ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి కాదనడంతో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు రోడ్డుపై ఆందోళన నిర్వహించారు. కామారెడ్డి జిల్లాలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం జనగామ గ్రామానికి చెందిన దండుగుల వరప్రసాద్ (25) మండల కేంద్రంలోని ఓ యువతి ఒకరినొకరు ప్రేమించుకుని ఫిబ్రవరి 24న పెళ్లి చేసుకున్నారు. పోలీసులను ఆశ్రయించడంతో ఇరు కుటుంబాల పెద్దలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ పది రోజుల తర్వాత రమ్మన్నారు. మనసు మార్చుకున్న యువతి తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన వరప్రసాద్ గతనెల 24న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. దీంతో మృతుడి బంధువులు ఆస్పత్రి ముందు రోడ్డుపై ధర్నాకు దిగడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. పోలీసులు ఆందోళనకారులను సముదాయించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వరప్రసాద్ మృతికి ఎస్సై సాయికుమారే కారణమని, ప్రేమజంటను విడదీశాడని ఆరోపిస్తూ బీబీపేటలో పోలీసుస్టేషన్‌కు వెళ్లే దారిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వరప్రసాద్ చికిత్స పొందుతున్న సమయంలో అమ్మాయి తల్లిదండ్రులు, ఎస్సై తీరుతోనే తాను ఆత్మహత్యాయత్నం చేశానని మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అమ్మాయి తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రేమికుడి వేధింపులకు యువతి బలి

- విషం తాగి ఆస్పత్రిపాలు
- చికిత్స పొందుతూ తొమ్మిది రోజుల అనంతరం మృతి



రాజేశ్వరి (ఫైల్)

మాక్లూర్: ప్రేమికుడి వేధింపులను తట్టుకోలేక విషం తాగిన యువతి చికిత్స పొందుతూ 9 రోజుల అనంతరం మృతి చెందింది. కోపోద్రిక్తులైన మృతురాలి బంధువులు యువకుడి ఇంటిపై దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మాణిక్ భండార్ తండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అభిలాష్, అదే తండాకు చెందిన కెతావత్ రాజేశ్వరి (19) నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. ఇటీవల అభిలాష్ మరో యువతితో ప్రేమాయణం నడుపుతున్నట్లు తెలిసిన రాజేశ్వరి అతనితో గొడవ పడింది. దూరంగా ఉండాలనే ఉద్దేశంతో రెండునెలల క్రితం హైదరాబాద్ వెళ్లి ఓ జ్యూయలరీ షాప్‌లో జాబ్‌లో చేరింది. అయితే అభిలాష్ తరుచూ ఫోన్ చేస్తూ అసభ్యకరంగా మాట్లాడుతూ వేధించటంతో తిరిగి మార్చి 20న రాజేశ్వరి తండాకు వచ్చింది. అభిలాష్ నుంచి వేధింపులు ఎక్కువ కావటంతో గతనెల 23న రాత్రి 8 గంటల సమయంలో విషం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి రాజేశ్వరి శనివారం మృతి చెందింది. విషయం తెలిసిన తండాలోని యువతి బంధువులు అభిలాష్ ఇంటిపై దాడి చేశారు. మృతురాలి తండ్రి దుబాయ్‌లో ఉన్నాడు. తల్లి, అనూష, అన్న తరుణ్ వ్యవసాయ పనులు చేస్తారు. పోలీసులు అభిలాష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పోలీసులకు శాశ్వత ఫోన్ నంబర్లు

- కమ్యూనికేషన్‌లో ఎక్కడా ఇబ్బంది రావొద్దనే..
- హెచ్‌ఆర్ఎంఎస్, బ్యాంకు, పీఎఫ్ ఖాతాలకు అనుసంధానం
- 55 వేల సిమ్‌కార్డుల కొనుగోలు.. ఇప్పటికే సగం మందికి పంపిణీ



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పోలీసుశాఖ మరో వినూత్న నిర్ణయాన్ని అమల్లోకి తెచ్చింది. డిపార్ట్‌మెంటులో ప్రతి పోలీసు అధికారికి శాశ్వత సెల్‌ఫోన్ నెంబర్‌ను కేటాయించింది. ఇందుకోసం దాదాపు 55 వేల మంది సిమ్‌కార్డులను కొనుగోలు చేసింది. కరీంనగర్, రామగుండం, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలతోపాటు అన్ని కమిషనరేట్లు, ఎస్పీ కార్యాలయాలు, ఇతర వింగ్స్ ప్రధాన కార్యాలయాలకు సిమ్‌కార్డులు చేరుకున్నాయి. ఇప్పటికే సగానికిపైగా పోలీసు అధికారులు సిమ్‌కార్డులను పొందగా మిగిలిన సిబ్బందికి ఈ వారాంతంలోగా అందజేయనున్నారు. పోలీసుల విధి నిర్వహణలో ఎక్కడా కమ్యూనికేషన్‌లో ఇబ్బంది రావద్దన్న ఉద్దేశంతోనే పోలీసులందరికీ శాశ్వత సెల్‌ఫోన్ నంబర్లు ఇవ్వాలని డీజీపీ అంజనీకుమార్ ఇటీవల నిర్ణయించారు.

ఏంటి లాభాలు?

కానిస్టేబుల్ మొదలు డీజీపీ స్థాయి అధికారి దాకా అందరికీ ఇస్తున్న శాశ్వత నంబర్లను వారి హెచ్‌ఆర్ఎంఎస్, బ్యాంకు ఖాతా, పీఎఫ్‌లకు అనుసంధానిస్తున్నారు. ఫలితంగా ఇకపై వ్యక్తిగత నంబర్‌ను వాటికి అనుసంధానించే బాధ తప్పుతుంది. విధుల్లో చేరిన తొలిరోజు నుంచి రిటైరయ్యే రోజు వరకు ఫోన్ నంబర్ ఉద్యోగితోనే ఉంటుంది. అదే సమయంలో ఉన్నతాధికారులు ఫలానా అధికారి ఎక్కడ పనిచేస్తున్నాడో తెలుసుకొనేందుకు అతని ఎంప్లాయ్ ఐడీ ద్వారా సులువుగా గుర్తించవచ్చు. క్షణాల్లో అతని నంబర్ ఉన్నతాధికారి సెల్‌ఫోన్‌పై ప్రత్యక్షమవుతుంది. అంటే ఏ అధికారి ఎక్కడ ఉన్నా.. వెంటనే అతనితో ఉన్నతాధికారులు సంప్రదించి ఆదేశాలు ఇచ్చే వీలుంటుంది. అదే సమయంలో వారు స్టేషన్ లేదా వింగ్, టీములు మారినప్పుడు సంబంధిత ఫోన్ నంబర్ ఎలాగూ ఉంటుంది. ఉదాహరణకు ఒక ఎస్సైకి డిపార్ట్‌మెంటు ఇచ్చే శాశ్వత నంబర్‌తోపాటు అతను పనిచేసే స్టేషన్‌లో ఎస్సైకి ఇచ్చే మరో నంబర్‌ను వినియోగించాల్సి ఉంటుంది.

మారిన నెట్‌వర్క్..

పోలీసులను వేగవంతమైన నెట్‌వర్క్‌తో అనుసంధానించేందుకు పోలీసు శాఖ బీఎస్ఎన్ఎల్ నుంచి ఎయిర్‌టెల్‌కు మారింది. అది కూడా అత్యాధునిక 5జీ నెట్‌వర్క్‌తో. ఈ సిమ్ ఎంప్లాయి ఐడీతో వస్తుంది. ప్రతి అధికారికి రోజుకు 2 జీబీ, 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు చేసుకునే సదుపాయం ఉంటుంది. తాము వాడే చాలా యాప్స్ డేటాను అధికంగా తీసుకుంటున్నాయని... 5జీకి మారాక యాప్స్ మరింత సమర్థంగా పనిచేస్తున్నాయని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోలీసు అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో మావోయిస్టుల కదలికలను పసిగట్టే పోలీసులకు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు, భారీ ప్రమాదాలు జరిగినప్పుడు ఏ అధికారిని ఆదేశించాలన్నా ఈ విధానం వల్ల క్షణాల్లో సంప్రదించడం సాధ్యం కానుందని చెబుతున్నారు.

కేసీఆర్ ప్రభుత్వ హామీల అమలు ఎక్కడ?

- నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్లలో అనేకచోట్ల ఫ్లెక్సీలు



నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వద్ద నిజాం షుగర్స్ ఫ్యాక్టరీపై కేసీఆర్, కేటీఆర్, కవిత ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కేసీఆర్ ప్రభుత్వం హామీ ఇచ్చిన పథకాలను అమలు చేయడం లేదంటూ వ్యంగ్యంగా తెలియజేస్తూ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల సెగ్మెంట్లలో అనేకచోట్ల శనివారం పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు వెలిశాయి. నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించకపోవడం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఎన్ఆర్ఐ సెల్, నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, ఉచిత ఎరువులు, దళితులకు మూడెకరాలు తదితర పథకాల గురించి ఆయా ఫ్లెక్సీల్లో పెట్టారు. అలాగే ఉపాధి అవకాశాలు కల్పించకుండా ప్రజలను ఉచితాల వైపు మరల్చి, విపరీతంగా చార్జీలు పెంచి, ప్రజలను మద్యానికి బానిసలు చేసినందుకు కేసీఆర్‌కు ధన్యవాదాలు అనే ఫ్లెక్సీ కూడా పెట్టారు. ప్రతి ఫ్లెక్సీలో సీఎం మాట ఇస్తే తల నరుక్కుంటాడు.. కానీ ఇచ్చిన మాట తప్పడు అంటూ క్యాప్షన్ రాశారు. అలాగే ‘కేసీఆర్‌కు ఫామ్‌హౌస్, కవితకు దుబాయ్ బుర్జ్ ఖలీఫాలో ఫ్లాట్, ఎమ్మెల్యేకు జీ.1 మాల్, నిరుపేదలకు డబుల్ ఇళ్లు ఏవి?’అంటూ ఆర్మూర్‌లో హైవే వద్ద ఫ్లెక్సీ పెట్టారు. శుక్రవారం పసుపు బోర్డు గురించి ఎంపీ అర్వింద్‌ను ఉద్దేశించి వ్యంగ్యంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు కౌంటర్‌గా వీటిని ఏర్పాటు చేసినట్లు చర్చ జరుగుతోంది.

ఆడి.. పాడి.. అంతలోనే గుండె ఆగి

- బీఆర్ఎస్ నేత నరేందర్ మృతి



బండారి నరేందర్

జగిత్యాల: ఒకవైపు ఒగ్గు కళాకారుల విన్యాసాలు.. మరోవైపు గులాబీ శ్రేణుల నృత్యాలు.. ఆత్మీయ సమ్మేళనానికి తరలివస్తున్న తమ అధినేత్రి, ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం పలికి ప్రత్యేకత చాటుకోవాలనే తాపత్రయం.. అందరూ ఆనందంగా ఆడుతూ, పాడుతూ, నృత్యం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఈక్రమంలోనే హఠాత్తుగా కుప్పకూలి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, జగిత్యాల మున్సిపల్ 33వ వార్డు కౌన్సిలర్ బండారి రజని భర్త బండారి నరేందర్ (56) మృతిచెందారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం మధ్యాహ్నం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి కవిత ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు భారీఎత్తున ర్యాలీ, ప్రదర్శనలు చేపట్టారు. ఒగ్గుడోలు కళాకారులు విన్యాసాలతో ముందుకు సాగుతున్నారు. వారితోపాటే బీఆర్ఎస్ శ్రేణులతోపాటు జగిత్యాల పోచమ్మవాడకు చెందిన సీనియర్ నాయకుడు బండారి నరేందర్ నృత్యం చేస్తున్నారు. ఈ సమయంలో హఠాత్తుగా కుప్పకూలిపోయారు. అక్కడున్నవారు వెంటనే స్పందించి స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అప్పటిదాకా తమతోపాటే ఆడిపాడిన నాయకుడు కళ్లెదుటే చనిపోవడంతో పార్టీ శ్రేణులు విషాదంలో మునిగాయి. బండారి నరేందర్ గతంలో కాంగ్రెస్ పార్టీలో చురుకైన నేతగా సేవలందించారు. జగిత్యాల మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో పనిచేస్తున్నారు. తాను ఉన్న 33వ వార్డు కౌన్సిలర్ స్థానం రిజర్వేషన్‌లోకి వెళ్లడంతో ఆయన భార్య రజనిని పోటీలో నిలిపి గెలిపించుకున్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు రాజేందర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు నివాళులర్పించారు.

క్లుప్తంగా

రాహుల్ గాంధీపై మరో పరువు నష్టం కేసు

ఆర్ఎస్ఎస్–కౌరవుల వ్యాఖ్యలపై ఉత్తరాఖండ్‌లో కేసు నమోదు



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ ఇంటిపేరుపై అనుచిత వ్యాఖ్యలతో ఎంపీగా అనర్హత వేటు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి మరో తలనొప్పి మొదలైంది. మహాభారతంలోని కౌరవులను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)తో పోలుస్తూ రాహుల్ వ్యాఖ్యలు చేశారంటూ ఆర్ఎస్ఎస్ కార్యకర్త ఒకరు కేసు వేశారు. గతంలో భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ కోర్టులో కమల్ భదౌరియా అనే వ్యక్తి పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసు ఈనెల 12వ తేదీన విచారణకు రానుంది. కమల్ న్యాయవాది చెప్పిన ప్రకారం.. ఈ జనవరి తొమ్మిదో తేదీన భారత్ జోడో యాత్రలో భాగంగా హరియాణాలోని అంబాలా పట్టణంలోని ఒక కూడలిలో రాహుల్ ప్రసంగించారు. ' కౌరవులు ఎవరో మీకు తెలుసా ? మొదట మీకు 21 శతాబ్దపు కౌరవుల గురించి వివరిస్తా. వాళ్లంతా ఖాకీ రంగు నిక్కర్లు వేసుకుంటారు. చేతిలో లాఠీ పట్టుకుని 'శాఖ'లు నిర్వహిస్తారు. భారత్‌లోని ఇద్దరు, ముగ్గురు అపర కుబేరులు వీరికి మద్దతుగా నిలుస్తున్నారు' అని రాహుల్ ప్రసంగించారని తన పిటిషన్‌లో కమల్ పేర్కొన్నారు. '21వ శతాబ్దంలో కౌరవులు ఇంకా ఉన్నారు అంటే అది ఆర్ఎస్ఎస్ సభ్యులే' అని ప్రసంగించి ఆర్ఎస్ఎస్ పరువుకు రాహుల్ తీవ్ర భంగం కల్గించారని ఆరోపించారు. 'మోదీ అని ఇంటిపేరు ఉన్నవాళ్లంతా దొంగలే' అని వ్యాఖ్యానించారన్న కేసులో దోషిగా తేలడంతో సూరత్ కోర్టు రాహుల్‌కు ఇప్పటికే రెండేళ్ల జైలుశిక్ష విధించిన విషయం తెల్సిందే. ఎగువ కోర్టులో అప్పీల్‌కు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును తాత్కాలిక నిలుపుదల చేసిన విషయం తెల్సిందే.

'అది కేంద్రం పరిధిలోది'

న్యూఢిల్లీ: పార్టీ ఫిరాయించే ప్రజాప్రతినిధులు సదరు సభ కాలపరిమితిలో జరిగే ఉప ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇందులో తమ పాత్రేమీ ఉండబోదని స్పష్టం చేసింది. కాంగ్రెస్ నాయకురాలు జయా ఠాకూర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టుకు ఈ మేరకు అఫిడవిట్ సమర్పించింది.

ప్రజలకు ఆరోగ్య హక్కును పరిపూర్ణంగా అందించేందుకంటూ రాజస్తాన్‌లో అశోక్ గహ్లోత్ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఆరోగ్య హక్కు చట్టం (రైట్ టు హెల్త్) దుమారం రేపుతోంది. ఎమర్జెన్సీ సమయాల్లో రోగులు ముందుగా డబ్బులు చెల్లించకపోయినా ప్రైవేటు ఆస్పత్రులు, వైద్యులు విధిగా చికిత్స చేసి తీరాలని చెబుతోంది. దీన్ని తీవ్రంగా నిరసిస్తూ ప్రైవేటు వైద్యులు మెరుపు సమ్మెలకు దిగారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపునిచ్చిన సమ్మెలో లక్ష మంది ప్రైవేటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్రంలో దాదాపుగా 2,500 ప్రైవేటు ఆస్పత్రులకు చెందిన వైద్యులు రెండు వారాలుగా ఉధృతంగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. దాంతో అత్యవసర పరిస్థితుల్లోనూ చికిత్స అందించే వైద్యుల్లేక రాష్ట్రంలో రోగులు అల్లాడుతున్నారు. వైద్యం కోసం పొరుగు రాష్ట్రాల బాట పడుతున్నారు. అయినా వెనక్కి తగ్గేది లేదని సీఎం గహ్లోత్ అంటున్నారు. 2018 ఎన్నికల హామీని నెరవేర్చామని చెబుతున్నారు. దేశంలో తొలిసారి రాజస్తానే ఇలాంటి చట్టం తెచ్చిందని ఆరోగ్య మంత్రి ప్రసాద్ లాల్ మీనా గర్వంగా ప్రకటించారు. మరోవైపు ప్రైవేటు డాక్టర్ల వాదన కూడా విని, వారి ఆందోళనలను సీఎం తీర్చాలని కాంగ్రెస్ అసమ్మతి నేత సచిన్ పైలట్ హితవు పలికారు. అలా ఈ చట్టం అధికార కాంగ్రెస్‌లోనూ అంతర్గత పోరుకు దారి తీయొచ్చంటున్నారు.



చట్టానికి ఆరోగ్య పరీక్ష..

ప్రైవేట్ వైద్యులు వర్సెస్ ప్రభుత్వ చట్టం..

రాజస్తాన్‌లో రెండు వారాలుగా స్తంభించిన వైద్య సేవలు

ఆరోగ్య హక్కు చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు.. 2,500 ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది నిరసన

చట్టంలో స్పష్టత లేని విషయాలివే!

- ఎమర్జెన్సీ అంటే చట్టంలో సరిగ్గా వివరించలేదు. ఒక్కోసారి తలనొప్పి కూడా అత్యవసర పరిస్థితి కిందకు వచ్చి బ్రెయిన్ హెమరేజ్‌కి దారి తీయవచ్చు.
- ఎంత బిల్లయినా ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందా?
- వైద్య పరీక్షలకయ్యే ఖర్చుల సంగతేమిటి? కడుపు నొప్పి, తలనొప్పితో వచ్చి పరీక్షలన్నీ చేశాక తీరా అది ఎమర్జెన్సీ కాదని తేలితే ఆ వైద్య పరీక్షల ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందా?
- బిల్లు పంపిన ఎన్నాళ్లకు ప్రభుత్వం ఆ సొమ్ముల్ని తిరిగి చెల్లిస్తుంది? ప్రైవేటు ఆస్పత్రులు ఎన్నాళ్లు వేచి చూడాలి?

ఏమిటీ చట్టం?

ఈ చట్టం ప్రకారం ఒక వ్యక్తి అనారోగ్యంతో అత్యవసర పరిస్థితిలో వచ్చినప్పుడు ప్రైవేటు ఆస్పత్రులు, ప్రైవేటు డాక్టర్లు వైద్యం నిరాకరించకూడదు. ముందుగా డబ్బులు చెల్లించకపోయినా చికిత్స అందించి తీరాలి. చికిత్స పూర్తయ్యాక రోగి డబ్బులు కట్టలేని పరిస్థితుల్లో ఉంటే ఆ బిల్లుల్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రమాదాలు, పాము కాట్లు, గర్భిణుల ప్రసవంతో పాటు రాష్ట్ర ఆరోగ్య శాఖ నిర్దేశించిన ఏ పరిస్థితులైనా ఎమర్జెన్సీ కిందకు వస్తాయి. వాటికి వైద్యం నిరాకరించే ఆస్పత్రి/వైద్యుడు తొలిసారి 10 వేలు జరిమానా చెల్లించాలి. ఆ తర్వాత 25 వేలు, అలా పెరుగుతూ పోతుంది.

ప్రైవేటు వైద్యుల నిరసనలెందుకు?

- ప్రైవేటు ఆస్పత్రులను పూర్తిగా రూపుమాపాలన్న ఉద్దేశంతోనే ఈ చట్టాన్ని చేశారని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. వైద్యుల జీవించే హక్కును కాలదన్నేలా ఈ చట్టం ఉందని, ఎమర్జెన్సీ అంటూ రోగులు వస్తే వారి సమస్య ఎలాంటిదైనా చికిత్స తప్పనిసరిగా ఇవ్వాలన్న నిబంధన వల్ల ఇక కనీస విశ్రాంతి కూడా దొరకదని వైద్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ ఆస్పత్రులు తమ బాధ్యతను చాకచక్యంగా ప్రైవేటు ఆస్పత్రులపై నెట్టేస్తున్నాయన్న వాదనలున్నాయి. రోగులు బిల్లులు చెల్లించలేని పక్షంలో వాటిని ప్రభుత్వం ఎలా చెల్లిస్తుందో చట్టంలో స్పష్టత లేదని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఈ చట్టం అమలు సరిగ్గా జరగకపోతే రోగులకు, డాక్టర్లకు మధ్య పరస్పరం అపనమ్మకం ఎక్కువైపోతుందని వైద్యుల్లో ఒక వర్గం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ''దీన్ని ఆరోగ్య హక్కు చట్టం అని పిలుస్తున్నారు. కానీ ఇందులో రోగుల హక్కుల కంటే వైద్యుని బాధ్యతలే ఎక్కువ! దీన్ని బలవంతంగా రుద్దితే వైద్యులు ఆర్థికంగా, వృత్తిపరంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారు''అని జైపూర్‌కు చెందిన డాక్టర్ బ్రూనో అన్నారు.

వైద్యులకు వేధింపులు తప్పవా?

- ప్రైవేటు క్లినిక్‌లో డాక్టర్ చికిత్స ఇవ్వడానికి నిరాకరిస్తే అతనిపై రోగి న్యాయపరమైన చర్యలకు దిగొచ్చు. చట్టంలోని ఈ నిబంధన వల్ల తాము వేధింపులకి గురి కాక తప్పదని, అధికార యంత్రాంగం జోక్యం పెరిగిపోయి తప్పుడు కేసులు కూడా నమోదయ్యే అవకాశాలున్నాయని ప్రైవేటు డాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. ''ఎవరికైనా చిన్న ప్రైవేటు క్లినిక్ ఉంటే ఎమర్జెన్సీ కింద 24 గంటలు తెరిచి ఉంచడం కష్టం. వైద్యులకు వ్యక్తిగత జీవితం ఉండదా? రోగులు కేసు పెడితే దాన్ని సవాల్ చేసే అవకాశం వైద్యులకు లేకుండా చేశారు. ఇది కచ్చితంగా వైద్యుల్ని వేధించేందుకే''అని జైపూర్ అసోసియేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ అమిత్ యాదవ్ విమర్శించారు.

ఉద్దేశం మంచిదే కానీ...

- రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో పాల్గొంటున్న వైద్యులు, ఆరోగ్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు అందరికీ ఆరోగ్యం అందించాలనే ఆ చట్టం స్ఫూర్తికి తాము మద్దతుగానే నిలుస్తున్నామని అంటున్నారు. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినా చట్టంలో ఎన్నో లొసుగులున్నాయని డాక్టర్ పార్థ శర్మ అన్నారు. వాటినన్నింటిని తీర్చాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత చట్టాన్ని యథాతథంగా అమలు చేస్తే మంచి కంటే చెడే జరుగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.


వైద్యుల నిరసన(ఫైల్)

– సాక్షి, నేషనల్ డెస్క్

ఏప్రిల్–జూన్‌లో వేడి సెగలు!

- దేశంలో చాలా చోట్ల కాస్తంత ఎక్కువగానే ఉష్ణోగ్రతలు
- అంచనాలు వెల్లడించిన భారత వాతావరణ శాఖ



న్యూఢిల్లీ: వాయవ్య ప్రాంతం మినహా దాదాపు భారతదేశమంతటా ఈ ఏప్రిల్ నుంచి జూన్ నెలదాకా సాధారణం కంటే కాస్త ఎక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. సంబంధిత వివరాలను శనివారం ప్రకటించింది. ' 2023 ఎండాకాలంలో మధ్య, తూర్పు, వాయవ్య భారతంలో సాధారణం కంటే ఎక్కువగా హీట్‌వేవ్ రోజులు కొనసాగవచ్చు. దేశవ్యాప్తంగా సాధారణ గరిష్ట ఉష్ణోగ్రతలు కొద్దిగా అధికం కావచ్చు. అయితే దక్షిణ భారతదేశంలో, ఇంకొన్ని వాయవ్య ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు అనేవి సాధారణంగా, సాధారణం కంటే తక్కువగా నమోదుకావచ్చు' అని వాతావరణ శాఖ తన అంచనాల్లో పేర్కొంది. మైదాన ప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియస్‌ను, తీరప్రాంతాల్లో 37 డిగ్రీల సెల్సియస్‌ను, కొండ ప్రాంతాల్లో 30 డిగ్రీల సెల్సియస్‌ను దాటినా, ఆ సీజన్‌లో ఆ ప్రాంతంలో సాధారణంగా నమోదవ్వాల్సిన ఉష్ణోగ్రత కంటే 4.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే దానిని హీట్‌వేవ్‌గా పరిగణిస్తారు. భారత్‌లో 1901 నుంచి ఉష్ణోగ్రతల నమోదును గణిస్తుండగా ఈ ఏడాది ఫిబ్రవరి.. అత్యంత వేడి ఫిబ్రవరిగా రికార్డులకెక్కడం గమనార్హం. అయినాసరే సాధారణం కంటే ఎక్కువగా(29.9 మిల్లీమీటర్లకు బదులు 37.6 మిల్లీమీటర్లు) వర్షపాతం నమోదవడం, ఏడుసార్లు పశ్చిమ అసమతుల్యతల కారణంగా మార్చి నెలలో ఉష్ణోగ్రతలు మామూలు స్థాయిలోనే కొనసాగిన విషయం విదితమే. గత ఏడాది మార్చి నెల మాత్రం గత 121 సంవత్సరాల్లో మూడో అతి పొడిబారిన మార్చి నెలగా రికార్డును తిరగరాసింది. భారత్‌లో రుతుపవనాల స్థితిని ప్రభావితం చేసే దక్షిణఅమెరికా దగ్గర్లోని పసిఫిక్ మహాసముద్ర జలాలు చల్లబడే(లా నినో) పరిస్థితి బలహీన పడిందని వాతావరణ శాఖ తెలిపింది. లా నినో పరిస్థితి లేదు అంటే ఎల్ నినో ఉండబోతోందని అర్థం. ఎల్ నినో అనేది అక్కడి సముద్ర జలాలు వేడెక్కడాన్ని సూచిస్తుంది. అప్పుడు అక్కడి నుంచి వచ్చే గాలుల కారణంగా భారత్‌లో రుతుపవనాల సీజన్‌లో తక్కువ వర్షాలు కురుస్తాయి. అయితే మే నెలకల్లా పరిస్థితులు మారే అవకాశముందని భిన్న మోడల్స్ అంచనాల్లో తేలిందని వాతావరణ శాఖ తెలిపింది.

హస్తినకొస్తే అంతం చేస్తాం

- ఏకే47తో కాల్చేస్తాం
- శివసేన ఎంపీ సంజయ్‌రౌత్‌ను బెదిరించిన గ్యాంగ్‌స్టర్ బృంద సభ్యుడు!
- రౌత్ ఫిర్యాదుతో ఒకరి అరెస్ట్



ముంబై: ఓ గ్యాంగ్‌స్టర్ బృందం తనను చంపేస్తానని బెదిరించిందని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) ఎంపీ సంజయ్ రౌత్ సంచలన ఆరోపణలు చేశారు. బెదిరింపుల అంశంపై వెంటనే ముంబైలో పోలీసులకు ఆయన ఫిర్యాదుచేశారు. ముంబైలో ఉండే సంజయ్‌రౌత్ ఢిల్లీకొస్తే ఏకే47 తుపాకీతో కాల్చిపడేస్తామని హెచ్చరిస్తూ ఆయనకు వాట్సాప్‌లో సందేశం పంపారు. ఈ ఘటనలో ముంబై పోలీసులు పుణేకు చెందిన 23 ఏళ్ల రాహుల్ తలేకర్‌ను అరెస్ట్‌చేశారు. కంజుర్‌మార్గ్ పోలీస్‌స్టేషన్‌లో రౌత్ సోదరుడు, ఎమ్మెల్యే సునీల్ ఇచ్చిన ఫిర్యాదు, పోలీసు అధికారి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. సంజయ్ రౌత్‌కు రాహుల్ తలేకర్ ముందుగా ఫోన్‌లో బెదిరించేందుకు ప్రయత్నించాడు. అది కుదరకపోవడంతో వాట్సాప్‌లో బెదిరిస్తూ మెసేజ్ చేశాడు. 'రౌత్ హిందువులకు శత్రువు. నువ్వు ఢిల్లీలో కనిపించావంటే ఏకే47తో చంపేస్తా. పంజాబ్ గాయకుడు సిద్ధూ మూసేవాలాకు పట్టిన గతే నీకు పడుతుంది. లారెన్స్ నుంచి వచ్చిన హెచ్చరిక ఇది. నీ, బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్‌ల మరణం తథ్యం. ఇది ఫిక్స్' అని హెచ్చరించాడు. మూసేవాలాను గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ బృందం చంపేసిందని ఆరోపణలు ఉన్న విషయం తెల్సిందే. దీంతో మెసేజ్‌లో పేర్కొన్న లారెన్స్‌ను లారెన్స్ బిష్ణోయ్‌గా పోలీసులు భావిస్తున్నారు. తలేకర్‌ను అరెస్ట్‌చేసిన పోలీసులు అతనిని విచారిస్తున్నారు. సోషల్‌మీడియా ద్వారా బిష్ణోయ్ గురించి తెల్సుకుని, మద్యం తాగిన మైకంలో అతను రౌత్‌కు బెదిరింపు సందేశం పంపినట్లు కేసు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు వార్తలొచ్చాయి. పాత్రా చావల్ కేసులో అరెస్టయి కస్టడీలో ఉన్నప్పుడు తనకు ఇలాంటి బెదిరింపులు వచ్చాయని, వీటిని భయపడేది లేదని రౌత్ స్పష్టం చేశారు. రౌత్‌ను హత్య చేస్తామని బెదిరింపులు రావడాన్ని మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీవ్రమైన అంశంగా పరిగణించాలని ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే డిమాండ్‌చేశారు.

నా పరువు మంటగలిపేందుకు తెగించారు

- విదేశీ శక్తులతోనూ చేతులు కలుపుతారు: మోదీ
- ప్రతిష్ట దిగజార్చేందుకు 'సుపారీ' ఇచ్చారు
- కాంగ్రెస్, రాహుల్‌పై పరోక్ష విమర్శలు


రైలులో విద్యార్థులతో మాట్లాడుతున్న మోదీ

భోపాల్: తన వ్యక్తిగత ప్రతిష్టను సర్వనాశనం చేసేందుకు 'కొందరు' విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీని, రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శనివారం భోపాల్‌లోని రాణి కమలాపతి రైల్వేస్టేషన్‌లో భోపాల్–ఢిల్లీ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ''2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాడే కొందరు నా పరువు ప్రతిష్టలను గంగలో కలపాలని కంకణం కట్టుకున్నారు. ఇందుకోసం ఎంతకైనా దిగజారుతున్నారు. 'మోదీ.. నీ సమాధికి గొయ్యి తవ్వుతాం ' అని కూడా కొందరు బహిరంగంగా ప్రతిజ్ఞ చేశారు. తమ లక్ష్యం నెరవేర్చుకునేందుకు దేశ, విదేశీ శక్తులతో చేతులు కలిపారు. కొందరు ఇక్కడి నుంచి పనిచేస్తే, ఇంకొందరు విదేశాల నుంచి కుట్రలు చేస్తున్నారు. ఇందుకు 'సుపారీ' సైతం ఇచ్చారు. వారికో విషయం తెలీదనుకుంటా. ఓట్లేసి నన్ను గెలిపించుకున్న కోట్లాది ప్రజానీకం సురక్షా కవచంలా నావైపు నిలిచినంతకాలం నన్నెవరూ ఏమీ చేయలేరు. ఇలాంటి కుట్రలను పటాపంచలు చేస్తూ దేశాభివృద్ధి కోసం, జాతి నిర్మాణం కోసం ప్రతి ఒక్క పౌరుడు పాటుపడాలి'' అన్నారు. భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని బ్రిటన్‌లో రాహుల్ వ్యాఖ్యానించడం, రాహుల్‌ను ఎంపీగా అనర్హుడిగా ప్రకటించిన ఉదంతాన్ని నిశితంగా గమనిస్తున్నామని జర్మనీ, అమెరికా ఉన్నతాధికారులు ప్రకటించిన నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలుచేయడం గమనార్హం. భారత అంతర్గత వ్యవహారాల్లోకి రాహుల్ కుట్రపూరితంగా విదేశాల జోక్యాన్ని ఆహ్వానిస్తున్నారని బీజేపీ తీవ్రంగా ఆక్షేపించడం తెల్సిందే.

బుజ్జగింపులతో సరిపుచ్చారు

'గత ప్రభుత్వాలు రైల్వే సేవల విషయంలో ప్రజలను బుజ్జగింపులతోనే సరిపుచ్చాయిగానీ సరైన ప్రయాణ భాగ్యం దక్కనివ్వలేదు. ఆ ఒక్క కుటుంబం గురించే పట్టించుకున్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజల ప్రయాణ సేవలను గాలికొదిలేశారు. మా సర్కార్ సంస్కరణలు తెచ్చి ప్రజానీకం సౌకర్యవంతంగా ప్రయాణించేలా, వారి ఆకాంక్షలకు తగ్గట్లు రైల్వే శాఖను ఆధునీకరిస్తోంది. ప్రజల్ని మోదీ ఒకటోతేదీన ఏప్రిల్ ఫూల్ చేస్తాడని కాంగ్రెస్ మిత్రులు అంటున్నారు. కానీ మేం అదే ఏప్రిల్ ఒకటిన రైలు ప్రారంభించి చూపించాం. ఈ సెమీ–హైస్పీడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ దేశ నైపుణ్యం, సామర్థ్యం, భరోసాకు ప్రతీక' అని అన్నారు. ' 2014కు ముందు వరకు రైల్వే బడ్జెట్‌లో మధ్యప్రదేశ్‌కు రూ.600 కోట్లు దక్కేవి. మా హయాంలో ఇది ఏకంగా రూ.13,000 కోట్లను దాటింది. కొత్త రైలుతో ఇక్కడి నుంచి ఢిల్లీకెళ్లే వ్యాపారాలు, వృత్తినిపుణులకు ఎంతో ప్రయోజనం. పర్యాటకాభివృద్ధితో ఉపాధి అవకాశాలూ పెరుగుతాయి' అని అన్నారు. ఈ మార్గానికి సమీపంలోనే సాంచీ, భీమ్‌బెట్కా, భోజ్‌పూర్, ఉదయగిరి గుహలు ఉన్నాయి. ' స్వాతంత్ర్యంరాగానే సిద్ధంగా ఉన్న రైల్వే నెట్‌వర్క్‌ను మాత్రమే గత ప్రభుత్వాలు అప్‌గ్రేడ్ చేశాయి. కొత్త రైల్వేస్‌ను సొంత రాజకీయ ప్రయోజనాలకు పణంగా పెట్టాయి. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఎందుకు ఈశాన్య రాష్ట్రాలను రైల్వేనెట్‌వర్క్‌లో అనుసంధానం చేయలేదు?. గతంలో ఎందుకు ఆధునీకరించి నవీకరించలేదు ? ' అని ప్రశ్నించారు. కార్యక్రమంలో భాగంగా 'భారతీయ రైల్' ఇతివృత్తంతో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో ఎంపికైన 300 మంది చిన్నారులతో మోదీ మాట్లాడారు. ఆ రైలులో సిబ్బందితోనూ సంభాషించారు. రైలు సర్వీస్ ప్రారంభోత్సవంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర గవర్నర్ మంగూ భాయ్, సీఎం చౌహాన్ పాల్గొన్నారు. భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లో శనివారం తప్ప మిగతా వారమంతా నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లలో ఇది 11వది. కొత్త రైలులో అధునాతన బ్రేకింగ్ వ్యవస్థ కారణంగా విద్యుత్ 30 శాతం ఆదా అవనుంది.

సైనిక సన్నద్ధతపై సమీక్ష

సైనిక దళాల సన్నద్ధత, దేశం ఎదుర్కొంటున్న భద్రతా సవాళ్లు తదితరాలపై ప్రధాని మోదీ కీలక వార్షిక సమీక్ష నిర్వహించారు. భోపాల్‌లో జరిగిన ఈ సమీక్షలో త్రివిధ దళాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సరిహద్దుల వెంబడి చైనాతో సవాళ్లు, పాకిస్తాన్ నుంచి సీమాంతర ఉగ్రవాదం తదితర అంశాలు చర్చకు వచ్చినట్టు రక్షణ శాఖ పేర్కొంది. ''కొత్త సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ప్రధాని సూచించారు. అందుకవసరమైన సాయుధ, సాంకేతిక సంపత్తిని ఎప్పటికప్పుడు అందజేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు వివరించారు'' అని వివరించింది. పలు అంశాలను ప్రధానికి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ వివరించారు.

సత్ప్రవర్తనతో రెండు నెలల ముందే...

సిద్ధూ విడుదల




పటియాలా: పంజాబ్ రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూ జైలుశిక్ష ముగించుకుని శనివారం పటియాలా కేంద్ర కారాగారం నుంచి విడుదలయ్యారు. బయటకు రాగానే కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. 'ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేశారు. రాజ్యాంగబద్ధ వ్యవస్థలను బానిసలుగా తమ ఇష్టానికి వాడుకుంటున్నారు. పంజాబ్‌లో రాష్ట్రపతి పాలన తెచ్చేందుకు కుట్ర పన్నుతున్నారు' అని మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఆప్ నేత, సీఎం భగవంత్ మాన్‌ను అక్బారీ (పత్రికల్లో ప్రకటనలిచ్చే) ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. రాష్ట్రం శాంతిభద్రతలు, రుణాల సమస్యల వలయంలో చిక్కుకుందన్నారు. 'దేశాన్ని నిరంకుశ పాలన పట్టిపీడించిన ప్రతిసారి దేశంలో విప్లవం పుట్టుకొస్తుంది. అలా ఈసారి పుట్టుకొచ్చిన విప్లవమే రాహుల్ గాంధీ' అని సిద్ధూ వ్యాఖ్యానించారు. 1988లో ఒక రోడ్డు ప్రమాద గొడవలో ఘర్షణ పడటంతో ఒకరి మృతికి కారణమైన నేరానికి సిద్ధూకు సుప్రీంకోర్టు గత ఏడాది మేనెలలో ఒక ఏడాదిపాటు జైలుశిక్ష విధించిన విషయం విదితమే. సత్ప్రవర్తన కారణంగా సిద్ధూ 10 నెలలకే విడుదలయ్యారని ఆయన న్యాయవాది తెలిపారు. సిద్ధూ విడుదల సందర్భంగా జైలు ప్రాంతం ఆయన మద్దతుదారులతో నిండిపోయింది.

సభలు నడవాలని బీజేపీకి లేదు

అందుకే సయోధ్య చర్యల్లేవు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: పార్లమెంటు సమావేశాలు సాగాలనే ఉద్దేశం మోదీ సర్కారుకు లేనే లేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అందుకే ప్రతిష్టంభనను తొలగించేందుకు విపక్షాలతో రాజీ ప్రయత్నాలేవీ చేయడం లేదని ఆ పార్టీ నేత జైరాం రమేశ్ అన్నారు. దాంతో చరిత్రలోనే తొలిసారిగా బడ్జెట్ సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం కనిపిస్తోందన్నారు. కీలకమైన బిల్లులను ఎలాంటి చర్చా లేకుండానే ప్రభుత్వం ఆమోదముద్ర వేయించుకుంటోందని మండిపడ్డారు. నిబంధనల ప్రకారం స్టాండింగ్ కమిటీలకు పంపాల్సిన బిల్లులను వ్యతిరేకత భయంతో తమ పార్టీ నేతల సారథ్యంలోని సెలెక్ట్ కమిటీలకు పంపుకుంటోందని ఆరోపించారు. మార్చి 13న మొదలైన రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో ఒక్క రోజు కూడా ఉభయ సభలు సజావుగా జరగని విషయం తెలిసిందే. అదానీ అంశంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం విచారణకు విపక్షాలు, భారత్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందన్న వ్యాఖ్యలపై రాహుల్ క్షమాపణకు అధికార బీజేపీ పట్టుబడుతుండటంతో రోజూ వాయిదాల పర్వమే కొనసాగుతోంది.

'మోదీ' తీర్పు దేశానికే షాక్: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్హతల వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేదంటూ గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో దేశమంతా షాకైందని ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. శనివారం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. ''మోదీ విద్యార్హతలపై అనుమానాలను ఈ తీర్పు మరింత పెంచింది. ఆయన నిజంగానే గుజరాత్, ఢిల్లీ యూనివర్సిటీల్లో చదివి ఉంటే ఆ విషయాన్ని అవి గర్వంగా చెప్పుకోవాలి. అలాకాకుండా వివరాలు దాచేస్తున్నాయి. మోదీకి నిజంగానే డిగ్రీ ఉంటే దాన్ని గుజరాత్ వర్సిటీ ఎందుకు చూపించడం లేదు? ఇందుకు మోదీ అహంకారమైనా కారణం అయ్యుండాలి. లేదంటే ఆయన సర్టిఫికెట్లు నకిలీవైనా అయ్యుండాలి'' అని అన్నారు. మోదీ విద్యావంతుడై ఉంటే నోట్ల రద్దు నిర్ణయాన్ని అమలు చేసేవారు కాదని అభిప్రాయపడ్డారు. మోదీ విద్యార్హతలు కోరినందుకు కేజ్రీవాల్‌కు కోర్టు రూ.25 వేల జరిమానా కూడా విధించడం తెలిసిందే.

ఢిల్లీ హిట్ అండ్ రన్ కేసులో చార్జిషీట్

న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన ఢిల్లీ హిట్ అండ్ రన్ కేసులో ఏడుగురు నిందితులపై పోలీసులు శనివారం 800 పేజీల చార్జిషీట్ దాఖలు చేశారు. దాదాపు 120 మంది సాక్ష్యాలను అందులో పొందుపరిచారు. నిందితుల్లో నలుగురిపై హత్యా నేరం మోపారు. దీనిపై విచారణను ఏప్రిల్ 13కు మెట్రోపాలిటన్ జడ్జి సన్యా దలాల్ వాయిదా వేశారు. గత డిసెంబర్ 31న ఢిల్లీలో న్యూ ఇయర్ వేడుకలు చేసుకుని అర్ధరాత్రి దాటాక స్కూటీపై వెళ్తున్న అంజలీసింగ్ అనే 20 ఏళ్ల యువతిని నిందితులు కారుతో ఢీకొట్టడం, ఆమె కారు కింద చిక్కుకుందని తెలిసి కూడా అలాగే 12 కిలోమీటర్లకు పైగా లాక్కెళ్లడం తెలిసిందే. దాంతో ఒళ్లంతా ఛిద్రమై అంజలి అత్యంత బాధాకరంగా మరణించింది.

కెనడా–అమెరికా సరిహద్దు దాటబోతూ...

భారతీయ కుటుంబం దుర్మరణం

టొరంటో: కెనడా నుంచి నదీ మార్గంలో అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించే ప్రయత్నంలో బోటు తిరగబడి ఓ భారతీయ కుటుంబం దుర్మరణం పాలైంది. ఈ ఉదంతానికి సంబంధించి ఇప్పటిదాకా 8 మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. ఇవి భారత, రొమేనియా సంతతికి చెందిన రెండు కుటుంబాలవిగా తేలింది. మృతుల్లో భారతీయులు ఎంతమంది అన్నది తేలాల్సి ఉంది. అలాగే మరో మృతదేహం దొరకాల్సి కూడా ఉందని పోలీసులు చెప్పారు.

అమెరికాలో టోర్నడో బీభత్సం


రోలింగ్ ఫోర్క్ పట్టణంలో టోర్నడోతో దెబ్బతిన్న ప్రాంతంలో మాట్లాడుతున్న బైడెన్

18 మందికి పైగా దుర్మరణం

లిటిల్‌రాక్ (యూఎస్): అమెరికాలో వారం క్రితం మిసిసిపి, పరిసర ప్రాంతాలను అల్లాడించిన ప్రాణాంతక టోర్నడో శుక్రవారం దక్షిణ, పశ్చిమ మధ్య ప్రాంతాలను వణికించింది. అర్కెన్సాస్, ఇల్లినాయిస్‌తో పాటు ఇండియానా, అలబామా రాష్ట్రాల్లోనూ పెను విధ్వంసం సృష్టించింది. గంటకు 100 కిలోమీటర్ల పై చిలుకు వేగంతో వచ్చి పడ్డ పెనుగాలుల ధాటికి ఎక్కడ చూసినా నేలమట్టమైన ఇళ్లు, షాపింగ్ సెంటర్లు తదితర భవనాలతో పరిస్థితి భయానకంగా మారింది. టోర్నడో బారిన పడి 18 మందికి పైగా మరణించగా డజన్ల మంది గాయపడ్డారు. అయోవా, ఓక్లహామా రాష్ట్రాల్లోనూ భారీ నష్టం సంభవించింది. దాదాపు 3 లక్షలకు పైగా ఇళ్లకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. పెనుగాలుల కారణంగా పలుచోట్ల అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. షికాగో అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అత్యవసర, విపత్తు స్పందన బృందాలు రంగంలోకి దిగాయి. వచ్చే బుధవారం మరికొన్ని భారీ తుపాన్లు, టోర్నడోలు రావచ్చని వాతావరణ విభాగం హెచ్చరించింది.

విమానంలో అసభ్య ప్రవర్తన

ముంబై: విమానాల్లో ప్రయాణికుల ఆగడాలు ఆగడంలేదు. తప్పతాగి ఒకరు.. తోటి మహిళా ప్రయాణికురాలిపై మూత్ర విసర్జన చేస్తూ మరొకరు, సిబ్బంది చెంప చెళ్లుమనిపిస్తూ ఇంకొకరు.. ఇలా అనుచిత ప్రవర్తనలతో ఇప్పటికే పలువురు ప్రయాణికులు అరెస్టవడం తెల్సిందే. గురువారం జరిగిన ఇలాంటి మరో ఘటన తాజాగా శనివారం వెలుగులోకి వచ్చింది. బ్యాంకాక్ నుంచి ముంబైకి వస్తున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం ఈ ఘటనకు వేదికైంది. ఈ ఘటనలో స్వీడన్‌కు చెందిన ప్రయాణికుడిని విమానం ల్యాండ్ అయ్యాక అరెస్ట్‌చేయడం ఆనక బెయిల్‌పై బయటకురావడం చకచకా జరిగిపోయాయి.

అసలేం జరిగింది ?

గురువారం బ్యాంక్ నుంచి ముంబైకి వస్తున్న విమానం మార్గమధ్యంలో ఉండగా 63 ఏళ్ల క్లాస్ ఎరిక్ హరాల్డ్ జోనస్ వెస్ట్‌బర్గ్ అనే ప్రయాణికుడు తనకు చేపలు, రొయ్యలు వంటి సీ–ఫుడ్ మాత్రమే కావాలని గొడవకు దిగాడు. అప్పటికే అతను తప్పతాగి ఉన్నాడు. ఆయనను శాంతింపజేసేందుకు 24 ఏళ్ల విమాన మహిళా సిబ్బంది ఒకరు అతడికి చికెన్ వంటకాన్ని వడ్డించారు. తర్వాత బిల్లు కట్టమని స్వైపింగ్ మెషీన్‌ను ఇస్తుంటే పిన్ టైప్‌చేయకుండా సీటులోంచి లేచి దగ్గరకు వచ్చి ఆమె చేయి పట్టుకుని, అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె సాయం కోసం గట్టిగా అరిచింది. దీంతో ఆమెకు సాయపడబోయిన మరో ప్రయాణికుడిని వెస్ట్‌బర్గ్ కొట్టాడు. వెంటనే ఆమె కెప్టెన్‌కు ఫిర్యాదుచేశారు. కెప్టెన్ నుంచి ఫిర్యాదు అందుకున్న ముంబైలోని ఎయిర్‌పోర్ట్ అధికారులు విమానం ల్యాండ్ అవగానే వెస్ట్‌బర్గ్‌ను అదుపులోకి తీసుకుని సహర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పారు. పోలీసులు అతడిని అరెస్ట్‌చేసి శుక్రవారం అంధేరీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా రూ.20,000 పూచీకత్తుపై బెయిల్ మంజూరుచేశారు. ఇలాంటి ఘటనల్లో వెస్ట్‌బర్గ్‌తో కలిపి గత మూడునెలల్లో ఇలా 8 మంది ప్రయాణికులు అరెస్ట్ అవడం గమనార్హం.


కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ప్రఖ్యాత సూర్య దేవాలయాన్ని దర్శించుకున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బేలా ఎం.త్రివేది

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



ఉప్పల్ స్టేడియంలో శనివారం ప్రాక్టీస్ సందర్భంగా అశ్విన్, చాహల్

ప్రాక్టీస్‌లో రాజస్తాన్ రాయల్స్ క్రికెటర్లు



సండే జోష్

'వెల్‌కమ్ బ్యాక్' ఐపీఎల్



ఆదివారం ఇఫ్తార్	సోమవారం సహర్
సా.6:35	ఉ.4:46

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

మంత్రి హరీష్‌రావును కలిసిన టీజీజీడీఏ వైద్యులు



గాంధీఆస్పత్రి: తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం సెంట్రల్ కమిటీ, గాంధీ ఆస్పత్రి యూనిట్ ప్రతినిధులు వైద్యమంత్రి హరీష్‌రావుతో కలిసి పలు అంశాలపై చర్చించారు. శనివారం గాంధీ ఆస్పత్రి కార్యాలయంలో జరిగిన సమావేశంలో టీజీజీడీఏ గాంధీ యూనిట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ భూపేందర్ రాథోడ్ వివరాలను వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా బోధనాసుపత్రుల్లో 250 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతి కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీనియారిటీ, స్పౌజ్ కేటగిరీలకు ప్రాధాన్యం, భార్యాభర్తలైన ప్రభుత్వ వైద్యులకు ఒకేచోట పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. తమ ప్రతిపాదనలకు మంత్రి హరీష్‌రావు సానుకూలంగా స్పందించారని డాక్టర్ రాథోడ్ తెలిపారు. పదోన్నతుల ప్రక్రియకు కృషి చేసిన డీఎంఈ రమేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీజీజీడీఏ సెంట్రల్, గాంధీ యూనిట్ కమిటీ ప్రతినిధులు పల్లం ప్రవీణ్, రంగా, అబ్బయ్య, రవి, వినోద్, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కలను నియంత్రిస్తాం

- హైలెవల్ కమిటీ సిఫారసులను అమలు చేస్తాం: మేయర్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వీధికుక్కల నియంత్రణకు ఏర్పాటైన హైలెవల్ కమిటీ సూచించిన సిఫారసులను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ విజయలక్ష్మి తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన హైలెవల్ కమిటీ సభ్యులు వీధికుక్కల నియంత్రణకు 26 అంశాలు సిఫారసు చేస్తూ తమ నివేదికను శనివారం మేయర్‌కు అందజేశారు. సిఫారసులను పూర్తిస్థాయిలో సమీక్షించేందుకు కమిటీ సభ్యులతో పాటు సంబంధిత అధికారులతో మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు మేయర్ తెలిపారు.

సిఫారసుల్లో ముఖ్యాంశాలు..

- కుక్కకాటు నియంత్రణకు వెటర్నరీ, శానిటేషన్, హెల్త్ విభాగాలు సమన్వయంతో పని చేయాలి. కుక్కలకు ప్రస్తుతం రోజుకు 300 సంతాన నిరోధక ఆపరేషన్లు జరుగుతుండగా.. వీటిని 400కు పెంచాలి. ఇందుకుగాను ఇప్పుడున్న డాక్టర్లకు తోడు ఔట్‌సోర్సింగ్‌పై 31 మంది ప్రైవేట్ వెటర్నరీ డాక్టర్లను తీసుకోవాలి.
- కుక్కలను పట్టుకునే డాగ్‌స్క్వాడ్ టీమ్స్ రాత్రివేళల్లో కూడా పని చేయాలి. వార్డుకు ఇద్దరు వెటర్నరీ ఫీల్డ్ అసిస్టెంట్లను రెండు సంవత్సరాల వరకు ఔట్‌సోర్సింగ్‌పై నియమించాలి. కుక్కలను పట్టుకునే వాహనాల సంఖ్య 50 నుంచి 60కి పెంచి, సర్కిల్‌కు రెండు వంతున అందుబాటులో ఉంచాలి.
- కుక్కకాట్ల బారిన పడకుండా ఉండేందుకు జంతు సంరక్షణసంఘాలు, ఎన్జీఓలు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజలకు తగిన అవగాహన కల్పించాలి. వీధికుక్కల దత్తతను ప్రోత్సహించాలి. డాగ్ క్యాచింగ్ స్క్వాడ్ పేరును స్ట్రేడాగ్ స్టెరిలైజేషన్ యూనిట్‌గా మార్చాలి.

సాక్షి, హైదరాబాద్: ఉప్పల్ క్రికెట్ స్టేడియం మరోసారి అభిమానులతో హోరెత్తనుంది. వరుసగా మూడు సీజన్లు టీవీల్లో, మొబైల్ ఫోన్‌లలో ఐపీఎల్ మ్యాచ్‌లు చూసి సంతృప్తి చెందిన క్రికెట్ ఫ్యాన్స్ ఇప్పుడు ప్రత్యక్షంగా మైదానంలో ఎంజాయ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. నేటితో మొదలు పెట్టి మే 18 వరకు ఏడు ఐపీఎల్ మ్యాచ్‌లు స్టేడియంలో అలరించనున్నాయి. ఐపీఎల్ మ్యాచ్... ఆపై ఆదివారం.. వేసవి వినోదాన్ని ఆస్వాదించేందుకు ఈ కాంబినేషన్ సరిగ్గా సరిపోతుంది. నేడు సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ రాజస్తాన్ రాయల్స్‌తో జరిగే పోరులో తలపడనుంది. ఈ రోజు మాత్రమే కాదు, వచ్చే ఆదివారం కూడా హైదరాబాద్‌లో ఐపీఎల్ మ్యాచ్ ఉండటంతో వరుసగా రెండు వారాంతాలు ఫ్యాన్స్‌కు పండుగే. సీజన్‌లో తొలి మ్యాచ్‌కు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఏడాది భారత్‌లో జరిగే వన్డే వరల్డ్ కప్ కోసం షార్ట్ లిస్ట్ చేసిన వేదికల్లో హైదరాబాద్ కూడా ఉంది. దాంతో అవుట్‌ఫీల్డ్, పిచ్ విషయంలో కూడా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ప్రతిష్టాత్మకంగా ఐపీఎల్ జరపాలని హెచ్‌సీఏ పట్టుదలగా ఉంది.

ఫ్యాన్స్ రెడీ...

ఐపీఎల్‌లో వినోదం గురించి నగర అభిమానులకు కొత్తగా చెప్పాల్సిన పని లేదు. మ్యాచ్ ఫలితాలతో సంబంధం లేకుండా స్థానిక జట్టుకు పెద్ద సంఖ్యలో మద్దతు లభించడం ఖాయం. దాంతో మరోసారి మైదానం ఆరెంజ్ రంగుతో నిండిపోనుంది. ప్రస్తుతానికి నేడు, వచ్చే ఆదివారం జరిగే రెండు మ్యాచ్‌ల కోసమే సన్‌రైజర్స్ టికెట్లను అందుబాటులో ఉంచింది. రెండు మ్యాచ్‌లకు సంబంధించి తక్కువ విలువ ఉన్న టికెట్లన్నీ పూర్తిగా అమ్ముడుపోయాయి. 'పేటీఎం ఇన్‌సైడర్' ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయిస్తున్నారు. ప్రస్తుతానికి రూ. 1367 ఆపై విలువ గల టికెట్లు లభిస్తున్నాయి. జింఖానా మైదానం, 24 సెవెన్, మేకర్స్ ఆఫ్ మిల్క్‌షేక్స్ అవుట్‌లెట్‌లలో కూడా నేరుగా టికెట్లు కొనుక్కునే అవకాశం ఉంది.

- భాగ్యనగరంలో మళ్లీ లీగ్ సందడి
- 2019 తర్వాత జరుగుతున్న మ్యాచ్‌లు
- నేడు రాజస్తాన్‌తో హైదరాబాద్ మ్యాచ్
- మధ్యాహ్నం 3:30 గంటల నుంచి

నాటి మ్యాచ్ గుర్తుందా...

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఉప్పల్ స్టేడియంలో 2019 ఏప్రిల్ 29న చివరిసారి మ్యాచ్ ఆడింది. పంజాబ్‌తో జరిగిన ఆ మ్యాచ్‌లో రైజర్స్ 45 పరుగులతో గెలిచింది. సుదీర్ఘ కాలం పాటు హైదరాబాద్ అభిమానులకు ఆత్మీయులుగా మారిపోయిన పలువురు క్రికెటర్లు ఈసారి ఆ జట్టులో లేరు. ముఖ్యంగా తన డ్యాన్స్‌లు, తెలుగు టిక్‌టాక్ పాటలతో మన అభిమానులకు ఎంతో చేరువైన డేవిడ్ వార్నర్, 'కేన్ మామా' విలియమ్సన్, వరుసగా మ్యాచ్‌లు గెలిపించిన రషీద్ ఖాన్ కూడా ప్రత్యర్థి టీమ్‌లలో ఉన్నారు. దాంతో ఈసారి జట్టు కాస్త కొత్తగా కనిపించనుంది. 2019 సీజన్ ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌ను కూడా మన అభిమానులు ఆస్వాదించారు. చెన్నైతో జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై 1 పరుగు తేడాతో గెలిచి చాంపియన్‌గా నిలిచింది. ఈసారి చెన్నై జట్టు హైదరాబాద్‌లో ఆడబోవడం లేదు. కాబట్టి మహేంద్ర సింగ్ ధోని ఆటను చూసే అవకాశం మన ప్రేక్షకులు కోల్పోయినట్లే!

ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లు.. ప్రత్యర్థి జట్లు

- ఏప్రిల్ 2 – ప్రత్యర్థి జట్టు రాజస్తాన్ – మధ్యాహ్నం 3.30 గంటల నుంచి
- ఏప్రిల్ 9 – పంజాబ్ – రాత్రి 7.30 గం. నుంచి
- ఏప్రిల్ 18 – ముంబై – రా.7.30 గం. నుంచి
- ఏప్రిల్ 24 – ఢిల్లీ – రా. 7.30 గం. నుంచి
- మే 4 – కోల్‌కతా – రా. 7.30 గం.నుంచి
- మే 13 – లక్నో – మ.3.30 గం. నుంచి
- మే 18 – బెంగళూరు – రాత్రి 7:30 గంటల నుంచి

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా క్రికెట్ అభిమానుల కోసం ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 60 బస్సులను ఉప్పల్ స్టేడియం వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం, ఘట్‌కేసర్, వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీ, ఇబ్రహీంపట్నం, ల్యాబ్‌క్వార్టర్స్, కోఠి, అఫ్జల్‌గంజ్, లక్డీకాపూల్, దిల్‌సుఖ్‌నగర్, జీడిమెట్ల, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు, మేడ్చల్, జేబీఎస్, మియాపూర్, ఈసీఐఎల్, బోయిన్‌పల్లి, చాంద్రాయణగుట్ట, కొండాపూర్, బీహెచ్‌ఈఎల్, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల నుంచి ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. మ్యాచ్ జరిగే రోజుల్లో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి రాత్రి మ్యాచ్ ముగిసే వరకు ఈ బస్సులను నడపనున్నట్లు అధికారులు తెలిపారు. సమాచారం కోసం 99592 26140, 78930 88433లను సంప్రదించవచ్చు.

నిఘా నీడలో..

ఉప్పల్: ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నేటి నుంచి మే 18 వరకు జరగనున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాచకొండ సీపీ దేవేందర్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. శనివారం ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మల్కాజిగిరి డీసీపీ జానకి, ట్రాఫిక్ డీసీపీ అభిషేక్ మహంతిలతో కలిసి బందోబస్తు వివరాలను వెల్లడించారు.

బందోబస్తు ఇలా..

- 1500 మంది పోలీసులు, సెక్యూరిటీ వింగ్, 400 మంది ట్రాఫిక్ సిబ్బంది, లా అండ్ ఆర్డర్, నాలుగు ప్లాటూన్ల టీఎస్ఎస్‌పీ బృందాలు, ఆరు ప్లటూన్ల ఆర్మ్‌డ్ సిబ్బంది, రెండు ఆక్టోపస్ టీంలు, మౌంటెడ్ పోలీస్, వజ్రా తదితర సిబ్బందితో భారీ బందో బస్తును ఏర్పాటు చేశారు. వీరితో పాటు ఎస్‌బీ, సీసీఎస్, ఎస్ఓటీ, రెండు ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. ఉప్పల్ స్టేడియం, దాని పరిసర ప్రాంతాల్లో మొత్తం 340 సీసీ కెమెరాలను అమర్చారు.

సెల్‌ఫోన్లకే అనుమతి..

- స్టేడియంలోకి కేవలం సెల్‌ఫోన్లనే అనుమతిస్తారు. ల్యాప్ టాప్‌లు, బ్యానర్లు, వాటర్ బాటిల్స్, కెమారాలు, సిగరెట్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, మ్యాచ్‌స్టిక్ బాక్స్‌లు, లైటర్లు, పదునైన వస్తులు, ప్లాస్టిక్ వస్తువులు, బైనాక్యులర్స్, పెన్నులు, బ్యాటరీలు, ఫర్‌ఫ్యూమ్స్, బయటి నుంచి తీసుకుచ్చే తినుబండారాలను అనుమతించరు.



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ దేవేందర్ సింగ్ చౌహాన్

మహిళల భద్రతకు షీటీంలు

మహిళా ప్రేక్షకుల భద్రతకు ప్రాధాన్యత నిస్తున్నామని, వేధించే వారిపై షీటీంలు కఠిన చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే సెల్‌ఫోన్‌ల ద్వారా బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారిపై నాలుగు కేసులను బుక్ చేశారు.

తాగునీరు, తిను బండారాలు లభ్యం

- తిను బండారాలు, తాగునీరు అన్ని రకాల ఆహార పదార్థాలను నిర్వాహకుల ద్వారా స్టేడియం లోపల విక్రయించనున్నారు. నిర్ణీత ధరలకే ఆహార పదార్థాలను స్టాళ్ల నిర్వాహకులు విక్రయించాలి. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

మెట్రో రైళ్ల సమయాల పొడిగింపు..

- మ్యాచ్ జరిగే రోజుల్లో అదనంగా మెట్రో రైల్ ట్రిప్పులను పెంచనున్నారు. రైళ్లు అర్ధరాత్రి ఒంటి గంట వరకు తిరుగుతాయి.

నేరాల బాట వీడండి

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నాగోలు: గతంలో నేరాలకు పాల్పడినవారు ఆ బాట వీడి ప్రస్తుత సమాజంలో నవజీవనాన్ని గడుపుతూ హుందాగా జీవించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ సూచించారు. శనివారం ఎల్బీనగర్‌లో కుషాల్ గార్డెన్స్‌లో పాత నేరస్తులతో 'మార్పు కోసం ముందడుగు' పేరుతో పాత నేరస్తులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ చౌహాన్ మాట్లాడుతూ.. గతంలో తొందరపాటులో నేరాలు చేసినా సరే తప్పు చేయని వారి కుటుంబాలు కూడా ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. నేరస్తులు గతాన్ని మరిచి మారిన మనసుతో ముందడుగు వేయాలని సూచించారు. నేరస్తులలో మార్పు తీసుకురావడం కోసం వారి కుటుంబ సభ్యుల పాత్ర చాలా ముఖ్యమని పేర్కొన్నారు. జైలులో గడిపే వారికంటే నేరాలకు పాల్పడకుండా సమాజంలో మంచి పౌరులుగా ఉండే వారికి కుటుంబంతో సంతోషంగా గడిపే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేందర్ మాట్లాడుతూ.. నేరాలు చేసి జైలుకు వెళితే తమ కుటుంబ పరిస్థితి ఏంటనే విషయాన్ని ఆలోచించాలని సూచించారు. సమాజంలో గౌరవంగా బతకాలంటే అనేక ఉపాధి మార్గాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ, అదనపు డీసీపీ మధుకర్ స్వామి, డీసీపీ లక్ష్మి, ఏసీపీలు శ్రీధర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.



పాత నేరస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్, ఇతర అధికారులు



నిఖత్‌కు నీరాజనం

పంచ్‌లతో ప్రత్యర్థిని మట్టి కరిపించి, ప్రపంచ మహిళా బాక్సింగ్ చాంపియన్‌గా నిలిచిన నిఖత్ జరీన్‌కు శనివారం శంషాబాద్ విమానాశ్రయంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఘన స్వాగతం పలికారు.

ఆల్‌టైమ్ రికార్డు

రూ.1681 కోట్ల ఆస్తిపన్ను వసూలు



- జీహెచ్‌ఎంసీ చరిత్రలో ఇదే అత్యధికం
- అయినా సిబ్బందిపై అధికారుల ఆగ్రహం
- నిర్లక్ష్యం వల్లే లక్ష్యాన్ని చేరుకోలేదని మండిపాటు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీకి 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 1681.71 కోట్ల ఆస్తిపన్ను వసూలైంది. జీహెచ్‌ఎంసీ చరిత్రలో ఇప్పటి వరకు ఇదే అత్యధిక మొత్తం. ఆర్థిక సంవత్సరం మొదటి నుంచే ఉన్నతాధికారులు ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతో ఇది సాధ్యమైంది. ఆర్థిక సంవత్సరం ఆరంభంలో 'ఎర్లీబర్డ్', భారీ బకాయిల పెనాల్టీలపై ప్రభుత్వం రాయితీనిచ్చిన ఓటీఎస్ వంటి వాటితోనూ ఎక్కువ ఆస్తిపన్ను వసూలైంది.

అయినా ఆగ్రహమే!

అయినప్పటికీ ఉన్నతాధికారులు టాక్స్ సెక్షన్ సిబ్బంది తగిన శ్రద్ధ చూపలేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారుల లక్ష్యం రూ. 2వేల కోట్లు కాగా, కనీసం రూ. 1800 కోట్లయినా వసూలవుతాయని భావించారు. ఈ నేపథ్యంలో రూ. 1700 కోట్లకు కూడా చేరుకోకపోవడంతో సిబ్బందిపై మండిపడినట్లు సమాచారం.

ఆస్తిపన్నే ఆధారం..

జీహెచ్‌ఎంసీకి ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్నే. సంస్థ సిబ్బంది జీతభత్యాలనుంచి మొదలు పెడితే చేయాల్సిన అన్ని పనులకూ ఇదే ప్రధాన ఆదాయ వనరు కావడం, ఆశించిన మేర వసూళ్లు జరగకపోవడంతో వారు అసంతృప్తి చెందినట్లు తెలుస్తోంది. 2021–22 ఆర్థిక సంవత్సరం చివరి నెల మార్చి కంటే 2022–23 ఆర్థిక సంవత్సరం మార్చినెలలో వసూళ్లు రూ.36 కోట్లు తగ్గడం కూడా వారి అసంతృప్తికి కారణంగా సిబ్బంది భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆస్తిపన్ను వసూళ్లపై అశ్రద్ధ చూపే వారిని ఇక ఉపేక్షించబోమని, కఠిన చర్యలుంటాయని, అలాంటి వారిని పాతబస్తీకి బదిలీ చేస్తామని హెచ్చరికలు సైతం జారీ చేసినట్లు తెలిసింది.

అందుబాటులోకి 'ఎర్లీబర్డ్'

- ఆస్తిపన్నుపై 5 శాతం రాయితీ
- ఈ నెలాఖరు వరకు వర్తింపు
- బల్దియా టార్గెట్ రూ.750 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్థిక సంవత్సరం మొదటి నెలలోనే ఆస్తిపన్ను చెల్లించేవారికి 5 శాతం రాయితీ నిచ్చే 'ఎర్లీబర్డ్' పథకం అందుబాటులోకొచ్చింది. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాల్సిందిగా జీహెచ్‌ఎంసీ కోరింది. ఆస్తిపన్ను పాత బకాయిలు లేనివారికి, 2023–24 ఆర్థిక సంవత్సరం మొత్తం ఆస్తిపన్ను ఒకే దఫా చెల్లించేవారికి ఈ రాయితీ వర్తిస్తుందని జీహెచ్‌ఎంసీ పేర్కొంది. ఏప్రిల్ 30 వరకు ఈ పథకం కింద రాయితీని వినియోగించుకోవచ్చు.

ఉన్నతాధికారుల గురి..

గడచిన ఆర్థిక సంవత్సరం టార్గెట్ మేరకు వసూళ్లు కాలేదని భావిస్తున్న జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఇప్పుడిక 'ఎర్లీబర్డ్'పై దృష్టి సారించారు. ఎర్లీబర్డ్ ద్వారా రూ. 750 కోట్లు వసూలు చేయాలనేది లక్ష్యమైనప్పటికీ.. దాన్ని మించి రూ. 800 కోట్లు వసూలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇప్పటినుంచే తగిన విధంగా ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రచార కార్యక్రమాల ద్వారా ఎర్లీబర్డ్ ద్వారా ఎక్కువ ఆస్తిపన్ను వసూలు చేయాలనేది జీహెచ్‌ఎంసీ లక్ష్యంగా ఉంది.

జోన్లవారీగా కలెక్షన్లు ఇలా..

జీహెచ్‌ఎంసీలోని ఆరు జోన్లకుగాను అత్యధికంగా ఖైరతాబాద్‌జోన్‌లో వసూలు కాగా, చార్మినార్ జోన్‌లో అత్యల్పంగా వసూలైంది.

జోన్	వసూలైన ఆస్తిపన్ను (రూ.కోట్లలో)
ఎల్బీనగర్	259.06
చార్మినార్	122.86
ఖైరతాబాద్	435.57
శేరిలింగంపల్లి	348.60
కూకట్‌పల్లి	282.18
సికింద్రాబాద్	233.44

'పది'కి రెడీ



గ్రేటర్‌లో 790 పరీక్ష కేంద్రాలు
1,66,457 మంది విద్యార్థులు

సాక్షి, సిటీబ్యూరో: రేపటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సీసీ కెమెరాల నిఘా నడుమ పరీక్షల నిర్వహణ కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. ఒక్కో పరీక్ష కేంద్రంలో 200 నుంచి 240 మంది విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 నుంచి 12:30 వరకు పరీక్షలు జరగనున్నాయి. అయిదు నిమిషాలు ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను నిషేధించారు.

పకడ్బందీ ఏర్పాట్లు..

- గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మల్కాజిగిరి– మేడ్చల్ జిల్లాల పరిధిలో 1,66,457 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. సుమారు 790 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రానికి ఒకరి చొప్పున చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులను కేటాయించారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.

సైన్స్‌కు విడివిడిగా

- పదోతరగతి పరీక్షలను 11 పేపర్ల నుంచి 6 పేపర్లకు ప్రభుత్వం కుదించింది. పరీక్షలు రాసే విద్యార్థులు మాత్రం ఆరు రోజుల్లో ఏడు పేపర్లు రాయాల్సి ఉంటుంది. ఈ నెల 10న సామాన్యశాస్త్రం పరీక్ష రోజున రెండు పేపర్లు.. ఫిజిక్స్, బయాలజీ పేపర్ల పరీక్షను వెంటవెంటనే రాయాల్సి ఉంటుంది. ప్రశ్నపత్రాలు, జవా బు పత్రాలను విడివిడిగా అందిస్తారు. మిగిలిన రోజుల్లో రోజుకొకటి చొప్పున పరీక్షలు జరుగుతాయి.

ఆర్టీసీ బస్సుల్లో ఉచితం

- విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. హాల్ టికెట్ చూపించాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రాలో తాగునీటితో పాటు వేసవి కావడంతో ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఏఎన్ఎం అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు.
- పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసివేసేలా చర్యలు తీసుకున్నారు.

గ్రేటర్ పరిధిలో పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు

జిల్లా	కేంద్రాలు	విద్యార్థుల సంఖ్య
హైదరాబాద్	344	72,114
రంగారెడ్డి	226	50,303
మేడ్చల్–మల్కాజిగిరి	220	44,040

వేగశ్రీ జ్యువెలరీ షోరూంలో మెగా సుధారెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీ హిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వేగ శ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్‌ను ప్రముఖ వ్యాపారవేత్త, ఫ్యాషన్ ఐకాన్ మెగా సుధారెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేసిన వజ్రాలు, పోల్కీ, కుందన్ జ్యువెలరీ, అసాధారణమైన హస్తకళల సేకరణ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఫ్యాషన్ 4 డెవలప్‌మెంట్ (ఎఫ్4డి) చరిత్రలో మొదటిసారిగా గౌరవించబడిన బహుముఖ ప్రజ్ఞాశాలి సుధా రెడ్డి తమ షోరూంను సందర్శించడం సంతోషంగా ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.









'జూ'లో చల్లచల్లగా..



నెహ్రూ జూలాజికల్ పార్కులో వేసవి కాలం దృష్ట్యా అధికారులు వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జంతువులు, పక్షులు వేసవి తాపాన్ని తట్టుకునేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. జంతువులు ఉండే ఆవరణలో, దాని చుట్టు పక్కల పచ్చగా, చల్లగా ఉంచడానికి పచ్చికలు, గార్డెన్‌లపై నిరంతరం నీరు చల్లుతున్నారు. భారీ సంఖ్యలో స్ప్రింక్లర్లు, చిన్న రెయిన్‌గన్‌లు అన్ని ఎన్‌క్లోజర్‌లలో ఏర్పాటు చేశారు. రెప్టైల్ హౌస్‌లో ఫాగర్లు, న్యూ మకావ్‌లు, ఎన్‌క్లోజర్ నైట్ హౌజ్ పైకప్పులపై తుంగ గడ్డిని ఉంచారు. డక్ పాండ్, కొంగ చెరువు ప్రాంతానికి షేడ్ నెట్‌ను ఏర్పాటు చేశారు. కోతులు, మాంసాహార, ఓమ్నివోర్ ఎన్‌క్లోజర్‌లలో 80 కంటే ఎక్కువ ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేశారు. ఇక వేసవికి తగినట్లుగా జంతువుల ఆహారంలోనూ మార్పులు చేశారు. వేసవిలో అన్ని జంతువులు, పక్షులు కూడా ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామని జూపార్కు క్యూరేటర్ ప్రశాంత్ బాజీరావు పాటిల్ మీడియాకు తెలిపారు.

– సాక్షి, సిటీబ్యూరో/బహదూర్‌పురా

అక్రమంగా మత్తు ఇంజెక్షన్ల విక్రయం

- ఇద్దరు నిందితుల్ని పట్టుకున్న ఎల్బీనగర్ ఎస్‌ఓటీ
- 30 ఇంజెక్షన్లు స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: అక్రమంగా, అధిక ధరలకు మత్తు సూది మందులను విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను ఎల్బీనగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ), హయత్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 30 ఇంజెక్షన్లు, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

- మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన బాలాజీ ధర్మాజీ, ప్రసాద్ గులాబ్రావ్‌లు కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. హయత్‌నగర్‌లోని అన్మగల్ కాలనీలో నివాసం ఉంటున్నారు. బాలాజీ హయత్‌నగర్‌లోని శ్రీనివాస ఆసుపత్రిలో కాంపౌండర్‌గా, ప్రసాద్ మ్యాక్స్‌క్యూర్ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు.
- విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన వీరు అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో మత్తు, హార్మోన్ ఇంజెక్షన్లకు డిమాండ్ ఉందని గ్రహించి.. వాటిని విక్రయించి డబ్బు సంపాదించాలని భావించారు. తక్కువ వ్యవధిలో స్టెరాయిడ్స్‌ను వాడి కండలు పెంచుకోవాలని భావించే యువకుల్ని ఎంపిక చేసుకునేవారు. గంజాయి, మత్తుపదార్థాల బానిసలకు ఎలాంటి ప్రిస్క్రిప్షన్లు లేకుండా అధిక రేట్లకు సూదిమందులను విక్రయించేవారు. సాధారణంగా బహిరంగ మార్కెట్‌లో మెఫెంటెర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్ రూ.268 ఉండగా.. దీన్ని నిందితులు రూ.1,000 నుంచి 2,000లకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు ఇద్దరు నిందితులు బాలాజీ, ప్రసాద్‌లను అరెస్టు చేశారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ లాస్ట్ చాన్స్ ఏప్రిల్, జులై పరీక్షల్లో ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా 100% పాస్ గ్యారంటీతో పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాలు పొందండి. ఫోన్. 6305979755 [H-781405]

TRAINING

■ Spike Test Technologies Performance Testing & Engineering Training Course Load Runner, Jmeter, Monitoring Tool Advanced Concepts with Placement Assistance any Graduate@ Balkampet Road, S.R. Nagar, Call : 8919250922, 6281221683 [H-793637]

Real Estate

■ గుంటూరుసిటీ, గోరంట్ల, లాం, JKC రోడ్, భవాని & శ్రీనగర్, మధురానగర్, అంజలి, కల్పతరువు, సొసైటీ, భాష్యం, జనచైతన్య & అన్ని వెంచర్లలో ప్లాట్లు అమ్మదలచిన వారు 9948779955 [G-6425]

■ We Sell & Buy Plots, Lands, Acres Develop & Flats, Houses in & Near Hyderabad Contact : 9663207848 [H-793645]

BUILDING & CONSTRUCTION

■ Construct ur Dream House with Good Quality Material at Reasonable Price as per Vastu in and around Hyd. Call for Best Price : 9666009005 [H-793402]

■ BUILDING & CONSTRUCTION, 1500/- For Sft కస్టమర్‌కి చాయిస్‌తో 100% వాస్తుతో హౌస్ కన్‌స్ట్రక్షన్ చేసి ఇవ్వబడును. సంప్రదించండి: 7032495920. [H-797511]

FOR SALE

■ For Sale: 2975 Sq.yds Plot @ Pocharam Village & New G+2 E/Facing 3200 Sft House with Lift in Gated Community @ Dammaiguda, Sec-bad. Ph : 9663207848 [H-793646]

■ A Plot Admeasuring 500 Square Yards with Shed & Open area Plot Size (14x30 in (Meters) Situated at IDA Moulali Ph: 9441887082. [H-797651]

FLAT FOR SALE

■ 4 BHK Flat for Sale in Premium Gated Community, Jubilee Hills Prime Location, Phoenix Halcyon, near FNCC, Whisper Valley, Ready to occupy, 3 Carparking, Built up area-5, 264, Contact: 8008926498, 8885552145. [HA-01]

■ Uppal, Pocharam nr, Infosys, New Flat for sale with wood work & all eclectrical work completed W/F 1400sft,4th flr car pkng,lift, Ready to occupy no broker direct 8919574216 [H-796833]

GAJWEL - JAGADEVPUR Land for sale 2 Acres 46 Lakhs/Acre Near Now Proposed RRR Vattipally (Village) Jagadevpur (Mandal) Call: 9505056295

■ Jeedimetla, TSIIC Colony, Shapur Elite County, 2&3 BHK, 1000sft-1550Sft, GYM, Function Hall, Play Area, Ready to Occupy 8790738313, 8008813256. [H-781555]

■ 2BHk Flats 841 Sft. 27 Lakhs, 955 Sft. 30 Lakhs, 1100 Sft. 35 Lakhs, 100% Bank Loan Near ORR @ Indresham Call: 8341276103 [H-797647]

■ HMDA & RERA Approved 2BHK & 3BHK Flats for Sale Ready to Occupy and under Construction are available, Near Infosys, Pocharam, 9908088424/ 9966638092 [HA-92806]

■ Sec-Bad, Contonment Quite peaceful, pollution free location 3BHK Flats nearing completion Gated community,clubhouse, swim mingpool, Call Now 8247859501 [H-797561]

■ East Hyderabad Near Infosys Premium 3BHK flats Gated community Clubhouse Modern amenities Just Rs 4,449/- per sft. Call 9502759933 [H-797560]

■ Nagole, Bandlaguda, Anandh Nagar, ready to occupy 3 BHK East & West facing flats (1650 sqft)with all facilities.9059490490 / 9908090718. [HA-10759]

■ New Indpt type Super Deluxe 2BHK Flats for Sale @ Moulali Opp SP Nagar Bus Stop. Ph : 7396900415, 8885589100 [HA-9959]

■ Warasiguda, Medibavi 1BHK Flat, 530 Sft@20L, 15years Old, 3rd Floor Nr Ramalayam Temple Ph: 6301104847 [HA-92735]

■ Single Bedroom Flat 25 Lakhs to 55 lakhs, Banjarahills, Kompally, Ph : 9440059303, 9391366899 E: cosmiconereality@gmail.com [HA-10393]

■ Gajularamaram, Mettukaniguda, Surya Classic. New 2BHK Deluxe Flats for Sale. RERA Approved. Ph : 9676954179, 9491616596 [H-793297]

HOUSE FOR SALE

■ Indp 29లక్షలకే HMDA, 100ft ఫార్మాసిటీ రోడ్డు, పోచారం, మంగళపల్లి, ORR. ఫాక్స్ కాన్, స్పాట్ రిజిస్ట్రేషన్ 10grm Gold. Ph: 9381438591. [HA-10395]

■ MOOSAPET H.P. ROAD, INDP House 484sq Yds North/West 2 Side Road / 45k Rents Cleartitle For Sale Direct. 9949134580 / 9949647659. [H-793473]

■ Chaitanyapuri, Phanigiri Colony, 186 Sq. Yd, G+2 Cellar N/E Corner New Constr. Total Carpet Area 6000 Sft. Ph : 9963416325, 9396234744 [H-793659]

2 & 3 BHK LUXURY FLATS FOR SALE @ BANDLAGUDA JAGIR
- NEAR APPA (TSPA) JUNCTION
- 10 min. Drive to Narsingi & Kokapet
- GATED COMMUNITY
- 1193 SFT - 2028 SFT
- 50+ AMENITIES

9697989999

■ 3+ BHK 2000 sq.ft Road 3B Krishna Nagar Colony, HB Colony-Moula Ali Road. Ph: 7382609122 [H-793657]

■ 132 Sq.Yards, North Facing, House for Sale House No.80, Self Finance Colony, Phase V, Vanasthalipuram Contact 9986954834 [HA-29234]

■ 2BHK Flats & INDP Houses with Furniture HMDA, Near Hayathnagar, Gated Community, Loans, B. Bheem Reddy, Ph:8885060741/9700974808. [HA-10608]

■ 133sqyds,900 sft semifinished House, North Face, plot no19, Very near to main road, opp. Ex MLA house first left Torrur, Abdullapurmet RS 4500000 negotiable. Contact 9246293228. [H-796745]

■ KPHB 9th P. MIG 11-194 yds, HIG: 266 yds. & Addagudda 650 yds & Gapalnagar 300 yds, 15thp LIG, MIG, HIG Plots. Ph : 9347005548 [H-787398]

■ Alwal Duplex Villa, 3BHK, 140yds, 1900 Sq.Ft. North Face 100% Vaastu, Manjeera & Bore Water 126 Lacs. Ph :9100910097 [H-787399]

LAND FOR SALE

■ మహేశ్వరం రియల్ ఎస్టేట్: మన్‌సాన్ పల్లి, అమీర్‌పేట్, నాగారం, కందుకూరు, తుక్కుగూడలో ప్లాట్లు, వ్యవసాయ భూములు & రీసేల్ ప్లాట్లు అమ్మబడును. & కొనబడును. ఫోన్. 9177887748 [H-793590]

■ Very Cheap 1 Acr 10 Gunta Own Land just 2km to NH-44. 80km to Kompally. 58Lakhs Per Acre Fixed. Ph : 9908820474. [HA-922]

■ 1/2 Acre Farm Land Plots for Sale in 20 Acres @ Pharmacity Kandukur, Srisailam Highway. Ph : 9849692493 [HA-92673]

PLOT FOR SALE

■ నారాయణఖేడ్ NIMZ దగ్గర్లో 4,50,000 విలువ గల 605గ॥ ఫార్మ్ ల్యాండ్ కేవలం 3,50,000 మాత్రమే ఈ ఆఫర్ ఏప్రిల్ 3వరకు. Ph: 9849768476 [H-796766]

■ హైదరాబాద్ @ రామోజీఫిల్మ్‌సిటీ దగ్గర కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ & HMDA లాజిస్టిక్ హబ్ పక్కనే ఉన్న మాస్యూ HMDA వెంచర్‌లో ఇల్లు కట్టుకునే ప్లాట్లు కలవు. Ph: 9666645756 [HA-2459]

■ సాగర్ హైవే Nr. ఫార్మాసిటీ & అమెజాన్ డాటా సెంటర్, యాచారం. 100Ft. రోడ్ ఫేసింగ్ తో, HMDA, DTCP & పాంల్యాండ్ లేఅవుట్ లో ఓపెన్ ప్లాట్లు కలవు రెడీ టు కన్‌స్ట్రక్షన్. ఫోన్: 7013272282 [H-793732]

■ కేవలం గజం 7499/- & 13,999/- రాబోయే మైక్రోసాఫ్ట్ కంపెనీకి దగ్గరలో DTCP Layout @ షాద్‌నగర్, స్పాట్ రిజిస్ట్రేషన్, RRR లోపల (బ్యాంక్ లోన్ సదుపాయం) సంప్ర.: 7702441834 [H-793390]

■ Near ORR (రామోజీ ఫిల్మ్‌సిటీ) గౌరెల్లి To భద్రాచలం NH 930P ఆనుకొని HMDA అప్రూవ్డ్ వెంచర్ తారామతిపేటలో అతి తక్కువ ధరలో ప్లాట్లు అమ్మబడును. Ph: 9703220333 [H-796883]

■ సిద్దిపేట జిల్లా దానంపల్లి గ్రామంలో కేవలం రూ. 5,25,000/- లకు 150 గజాల Plot తోపాటు మరియు 20 గ్రాముల బంగారం ఉచితం ఈ ఆఫర్ వారం రోజుల మాత్రమే. Ph: 9603633180 [H-793642]

■ కేవలం 2 లక్షలకే 121 చ.గ. ఫామ్ ప్లాట్ కొనండి. ప్రతి ప్లాట్‌పై ఖచ్చితమైన బహుమతులు గెలుపొందండి. Breeza కారు,హీరో బైక్స్-10, LED T.V. లు-10, A/C లు-10 మరెన్నో బహుమతులు. 9154047151, 9700518878. [WA-6935]

■ Manneguda- HMDA Villa Plots in Gated Community & Inside ORR Close to Software Hub, Near B.N. Reddy Nagar, Bank Loans avbl. Ph: 8985555077 [H-781351]

■ Plot For Sale Neredmet Madhuranagar 300 yds. South Face 40x67 Rate 40,000 per S.yard. Notary Plot Call: 9247760198. [H-793641]

■ Moosapet Main Road 892 Sq. yds, Open Plot for Sale Ready to Construction: Ph : 9849342550, 9063235896 [H-792852]

■ N/E Corner Plot for Sale 220 Sq.yds. Near Asian Theater, Uppal. 200 Mtrs. to Warangal H/W, P.Yard: 81,500/- Slightly Nego. Ph: 7013494203 Suresh, 9676224179 Surender [HA-10701]

■ Thimmaipally 4KM inside ORR & 10KM from Sainikpuri HMDA East Plots 200 Sq.yds & Panchayat Plots within 10K. Ph: 9704511481 [HA-92824]

■ East Facing Open Plot For Sale 267sq.yds, Srisai Nagar Colony, Rd No.5, Near Brundavan Colony, Meeseva Back side, Saroor Nagar. Ph : 9885038679 [HA-92822]

■ Open Plots 15 Min. Drive from Shamshabad,Nearby MNC Companies Amezon, Microsoft, Kalera Etc @ Rs.5000/- Per Sq.Yd. Ph:7993444305 [HA-1633]

Services

BUSINESS SERVICE

■ CIBIL తో సంబంధం, లేకుండా GHMC పరిధిలోని ఇండ్లు, ప్లాట్స్ పై ప్రైవేట్ బ్యాంక్ లోన్స్, పర్సనల్ & బిజినెస్ లోన్స్, ఇప్పించబడును. సంప్ర: 7075700632 [H-793399]

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-792847]

BUSINESS OFFER

■ రూ. 5,500/- చెల్లించి రిజి. పొంది HR మేనేజర్‌గా వర్క్‌ఫ్రమ్ హోం ఆదాయం ట్రైనింగ్ + డైలీ మా సపోర్ట్ 9 సం॥ల గల ISO సర్టిఫైడ్ సంస్థ ఇంట్రస్ట్ ఉన్నవారు డిటెయిల్స్ వాట్సాప్ చేయగలరు. 6281159171 [H-781353]

■ నిరుద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు, హౌస్‌వైఫ్స్, అవిటివారు (కాళ్ళు, చేయిలేకున్నా) నడవడం, మాట్లాడకలిగితే చాలు మరిన్ని వివరాలకు సంప్ర: Ph: 9392058697/ 7893539918 [H-793541]

■ మీరు ఒక మంచి కార్, స్వంత ఇల్లు, మీ పిల్లకు ఉన్నత విద్య, ఒత్తిడిలేని జీవితం.. ఇంకా మరెన్నో కోరుకుంటున్నారా? అయితే వెంటనే సంప్రదించండి: 9392364542. [T-4136]

CHITS & DEPOSITS

■ కపిల్ చిట్స్‌లో 5 లక్షల నుండి 1 క్రోర్ వరకు న్యూ చిట్స్ కలవు & పెండింగ్ చిట్స్ ఇప్పించబడును. నరసింహా రెడ్డి. ఫోన్ : 9866117243. [H-781354]

INSURANCE

■ కోటి రూ॥లు మొత్తం మెచ్యూరిటీ కొరకు, కోటి రూ॥ల తక్షణమే ఇన్సూరెన్స్ కొరకు ప్రతిరోజు 300/- రూ॥లు చొప్పున పొదుపు చేయండి. పెన్షన్స్, పిల్లల మనీబ్యాక్ LIC పాలసీల కొరకు, కరోనా రక్షక్ హెల్త్ పాలసీ కొరకు, శ్రీరామ్ చిట్స్ & డిపాజిట్ కొరకు సంప్ర: 9246351657. WWW.LICSAMRAT.COM [HA-10367]

HEALTH CARE

■ A Physiotherapy Department is for Lease in a new 50 beded Rihab Center Attached with well Established Multi Speciality Hospital @ Mehdipatnam. Contact Roshan: 9246549091 [HA-92830]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Sarabu Mallavaram Padma Latha W/o. Gopala Krishna Murthy Vojjala R/o. Flat no. E-406 Raja Pushpa Retreat Kokapet Hyd. I have changed my name as Vojjala Padmalatha for all furture purposes. [H-781458]

■ I, Prasanth Yeruva S/o Nagendra Reddy Yeruva R/o G-1 Rich Homes Apt Gayathri Nagar Colony Godavari Homes Cyberabad Medchal 500055. Have changed my name to Prasanth Reddy Yeruva for all purposes [DA-7715]

■ I, Chinthakindi Rakesh Vijay Prasad S/o Ch Vijay Prasad, R/o 404, 1-10/8, Pratibha Apartment, St-4, Ashok Nagar, 500020. I Changed my Name as Chinthakindi Rakesh [HA-10400]

■ I, DALELA RAMESH KUMAR (Old Name) S/o. DALELA MUNGALAL Changed of my Name as RAMESH KUMAR (New Name) S/o. DALELA MUNGALAL R/o. H.No. 8-2-542/3/3, Flat No. G4, Rock Ville Apartments, Road No. 4, Banjara Hills, Khairatabad, Hyderabad. T.S. 500034. [Z-772211]

■ I, DALELA KAMAL BAI (Old Name) W/o. RAMESH KUMAR Changed of my Name as KAMALA BAI (New Name) W/o. RAMESH KUMAR R/o. H.No. 8-2-542/3/3, Flat No. G4, Rock Ville Apartments, Road No. 4, Banjara Hills, Khairatabad, Hyderabad. T.S. 500034. [Z-772212]

OLD AGE HOME

■ మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296/7981467036/6281127224. [H-793536]

■ రత్న చంద్రన్ సర్వీసెస్ అన్ని రకముల పేషెంట్స్‌కి వృద్ధులకు, మంచాన పడిన వారికి పని మనుషులను మీ ఇంటికి పంపబడును. సంప్ర: 9769244048, 6301877612 [HA-92738]

■ రాఘవి హోంకేర్ అన్ని రకాల పేషెంట్లకు, వృద్ధులకు, మంచాన పడ్డ వారికి పని మనుషులు 24x7 మీ ఇంటి వద్దకే పంపబడును. సంప్ర: 8977842502 [H-797562]

TOURS & TRAVELS

■ 5/6 బద్రీ, కేదార్, గంగోత్రి, యమునోత్రి, 8/6 కాశీ, నేపాల్, ముక్తినాథ్. 5/7 అమర్ నాథ్, వైష్ణవీ 10 టికెట్లపై గోల్డ్ కాయిన్ ఫ్రీ. ఫోన్ : 8121682275, 9849747093 [H-793544]

■ కాశీ యాత్ర, గంగానది పుష్కరాలు 17/4, 15రో. 17యా. ఏసీ స్లీపర్ బస్, టిఫిన్, భోజనంతో, చార్ ధామ్ యాత్ర 15రో, 12 యా, 2 గ్రామ్ గోల్డ్ ఫ్రీ మా టూర్స్. ఫోన్ : 6304280161, 9493652100 [H-796767]

■ ఏప్రిల్‌లో 4 జ్యోతిర్లింగాలు, మహారాష్ట్ర, కొల్లాపూర్, షిర్డి, 7రో, మే-20 చార్‌ధామ్. జూన్-4 శ్రీలంక 8రో, జూన్-14 ఉజ్జయిని, సోమనాథ్ 11రో, జూన్-29 కాశీలో 9ది. జంగం శ్రావణ్ స్వామి, ఫోన్ 9704841370 [HA-10390]

■ S.V.Tours & Travels చార్‌ధామ్, వైష్ణోదేవి, అమర్‌నాథ్, తమిళనాడు, 5 రోజులు/ కర్ణాటక, అస్సాం, కాల్: రానాజీ: Ph: 6301578513, 7997819622 [H-793630]

■ 8/4/23న 8 జ్యోతిర్లింగాలు, 5 ద్వారకలు, 35 యా॥, 17రో॥ 1/5/23 రామేశ్వరం శ్రీరంగం, అరుణాచలం, కన్యాకుమారి 22యా॥, 10రో॥, 20/5/23 చార్‌ధామ్ యాత్ర 14రో॥ 7/6/23 కాశీలో 9ది॥ 7/6/23 కాశీ, నేపాల్, ముక్తినాథ్ 12 రో॥ సంప్ర: భాస్కరరావు, Ph: 9848486847 [H-793537]

Wanted

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9848571888. [H-793404]

■ టిఫిన్ సెంటర్‌లో పని చేయుటకు అనుభవం గల సూపర్ వైజర్స్ కావలెను ఇక్కడే ఉండి చేసుకునే వారికి. మంచి జీతం+భోజనం+ వసతి కలదు.9666934949. [H-792851]

■ అనుభవం గల సూపర్‌వైజర్, గ్రాఫిక్ డిజైనర్, లోడింగ్ బాయ్స్, హెవీ డ్రైవర్, హౌస్ కీపింగ్ బాయ్స్ కావలెను. బ్యాచిలర్స్‌కు రూము కలదు ఎగ్జోటిక్ డెకొరేషన్-23215566, 9100222333. [H-793599]

■ బేబి కేర్, పేషెంట్ కేర్, ఇంటి పని, వంట పని చేయుటకు అర్జెంటుగా కావలెను. జీతం : 15-22వేలు, రూం, మీల్స్ ఫ్రీ. 24/7, 12, 8, 4 Hrs ఫోన్ : 8019315552 [HA-29254]

■ టైలర్స్ కావలెను: టీషర్ట్స్, స్పోర్ట్ యూనిఫామ్స్ కుట్టుటకు అనుభవంగల M/F టైలర్స్ కావలెను @ Kothapet, Hyd. Contact : 9908611486 [H-793643]

■ టెలీకాలర్స్ డ్రైవర్స్ (కార్లు, ట్రాలీ), డేటా ఎంట్రీ, రిపోర్టర్లు, వెబ్ డిజైనింగ్, వీడియో ఎడిటింగ్, సూ.వైజర్, టీచర్లు, లెక్చరర్స్, హెల్పర్స్, ఆయాలు, మేస్త్రీలు, వర్కర్లు కా॥ జీ. 15-25K+ హాస్టల్ @9505261777 ఫీజు లేదు. [H-797609]

■ L.B. నగర్ ఆఫీస్‌లో 10am to 5 pm పనికి లేడీ రిసెప్షనిస్టులు-2 అర్జెంటుగా కావలెను. L.B. నగర్ వారికి ప్రాధాన్యత, మంచి జీతం. ఫోన్ : 6305979755 [H-781404]

■ మా ఫార్మా కంపెనీలో పనిచేయుటకు ఉప్పల్ పరిసర ప్రాంతాల నుంచి హెల్పర్ బాయ్స్, ప్యాకింగ్ గర్ల్స్ 24 సం॥ పైన వారు, టూర్ చేయగల సేల్స్ ఎగ్జిక్యూటివ్ అనుభవం / ట్రైనీ కావలెను. ఫోన్ : 9515906315 [H-793742]

■ నాగోల్‌లో ఇంట్లో పనికి ఆడ మనిషి కావాలి. వసతి ఉంది. ఫోన్ : 9441885763 [HA-11009]

■ టెన్సిల్ స్ట్రక్చర్ వర్క్ కోసం సైట్ సూపర్‌వైజర్, ఫ్యాబ్రికేటర్స్, వెల్డర్లు కావలెను. Natural Solutions. Ph: 9550766869/ 7569681647 [H-793543]

■ Hydలో 24గం॥ ఇంట్లో ఉంటూ బేబీకేర్ పని చేయుటకు 20-30yrs అనుభవం గల ఒంటరి మహిళ (Single Lady) కావలెను. మంచి జీతం + భోజనం + వసతి కలదు. Ph: 9390644882 [H-793741]

■ *అలేరు టౌను & వరంగల్ హైవేకు *1km దూరంలో గల ఫార్మ్ లాండ్ వెంచర్ నందు మార్కెటింగ్ చేయుటకు Rtd.emp, గృహిణులు, మెడికల్ రిప్రజెంటేటివ్స్, LIC ఏజెంట్స్ మరియు డబ్బు సంపాదించాలని తపన కలిగిన వారికి మంచి అవకాశం. Ph: 9059608333, 9703314569 [H-778979]

■ అర్జెంటుగా ప్రముఖ కొరియర్ సంస్థ World First నందు చందానగర్, కొండాపూర్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి బ్రాంచ్‌లో పనిచేయుటకు పరిసర ప్రాంతాల పికప్ & డెలివరి బాయ్స్ కావలెను. Ph: 7799994504, 7799994502 [H-796832]

■ S.B.Ecomaticsలో నాన్ వోవెన్ బాగ్స్ సేల్స్ కొరకు ఆడ/మగ మార్కెటింగ్ సిబ్బంది కావలెను. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం. Ph: 9010327614/ 9885737126 [H-793640]

Prakruthi Properties MAKING FUTURE LANDMARK
Real Estate Company లో పని చేయుటకు (Srisailam Highway) Marketing Executives, Team Leaders, AGM,GM's, Retired Employees కావలెను.
8500888192

■ KPHB 9thఫేస్ నందు గల JP Lucky Gemsలో టెలికాలర్స్‌గా 10 మంది స్త్రీ అభ్యర్థులు కావలెను. Qlf. Inter పాస్, Salary: 12000/- + 3000 inc, టైమింగ్స్: 9AM-3.30 PM. Cont: 8897750540 [G-795434]

■ సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలో పని చేయుటకు అనుభవం కలిగిన 10th పాస్ అయిన సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం: 8గంటలకు 22,000/-, సంప్ర: 9701238229 [H-793598]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్, ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795299]

■ ఇంటర్‌మీడియట్ కాలేజీలో పనిచేయుచున్న లెక్చరర్లు, స్టాఫ్, స్కూల్ టీచర్లు PRO's సంప్రదించగలరు. సెల్ © 78426 66755 [B-1053]

■ CPP కం॥లో పనిచేయుటకు ఎంప్లాయిస్ కావలెను. Q: 10th, డిగ్రీ, MBA, బి.టెక్ & Python, JAVA, వెబ్ & గ్రాఫిక్ డిజైనర్స్ అనుభవం ఉన్నవారు కావలెను. Ph: 9493328573 [H-793406]

■ MEGA GROUP MAN POWER & Security సంస్థ విస్తరణలో భాగంగా AP & TS లలో జిల్లాల వారీగా ఈ ఫీల్డ్‌లో అనుభవమున్న వారికి ఫ్రాంచైజ్ ఇవ్వబడును. (పెట్టుబడి లేదు). సెల్ : 70326 10569, 70931 25169. [NA-5468]

■ జాబ్ Searching Male/Female, House Wifes & All Retired Persons ఇంటిదగ్గరే ఉంటూ నెలకు 50K-1L సంపాదించుకునే గొప్ప అవకాశం. ఫోన్ : 9676140152 [H-796882]

■ విశ్వ టెంట్ హౌజ్‌లో పనిచేయుటకు డ్రైవర్స్ కమ్ వర్కర్స్ కావలెను. భోజనం + ఉచిత గృహ వసతి+ మంచి జీతం. చక్రీపురం, కుషాయిగూడ. ECIL సం.ప్ర. 8074013200, 8686537692 [H-793389]

■ ఫార్మా ఆఫీస్ లో బిల్లింగ్ ఆపరేటర్, డ్రైవర్, హెల్పర్స్ కావలెను. Walk Ins @ 195, వాయుపురి (ECIL దగ్గర) ఫోన్ : 9701420745 [HA-92815]

■ సెక్యూరిటి గార్డ్స్ కావలెను. ఉప్పల్ భగాయత్ & నారాయణ గూడ ఫ్లైఓవర్ దగ్గర & అత్తాపూర్ పిల్లర్ నెం. 150 దగ్గర, 12 గం. డ్యూటీ. జీతం: 13-14వేలు సంప్ర: 8978907070 [H-797557]

■ మ్యారేజ్ బ్యూరో నందు పనిచేయుటకు అమ్మాయి కావలెను. చదువుతో నిమిత్తం లేకుండా మంచి వాక్చాతుర్యం గల నమ్మకంతో పనిచేసే అమ్మాయి కావలెను. 8341220970 [K-1232949]

■ CM హోమ్‌కేర్ సర్వీస్: బేబీకేర్, ఇంటి, వంట, పేషెంట్స్ చూసుకోవడానికి కేర్ టేకర్స్, ఇంటికి పంపబడును. 20-50y స్త్రీ/పు, 24/7 మా వద్దనే ఉండి లాంగ్ టైమ్ డైపర్ వర్కర్స్ కావలెను. జీ: 16-20K. 6309807798, 9121099519 [H-797507]

■ శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరోలో పనిచేయుటకు మంచి వాక్చాతుర్యము & కంప్యూటర్ Knowledge కలిగిన 40years లోపు (Females) కావలెను. Qly: డిగ్రీ: మంచి జీతం+Inc, తార్నాక 9866044439, 9866044439 [H-796827]

■ పేషెంట్స్ కేర్, బేబీకేర్, వృద్ధుల కొరకు ఆయాలు కావలెను. జీతం: Rs. 15,000/-, భోజన సౌకర్యం, వసతి కలదు. ఫోన్: 9769244048/ 6301877612 [HA-92739]

■ గణేష్ రియల్ ఎస్టేట్స్ సంస్థలో పనిచేయుటకు మార్కెటింగ్ సిబ్బంది (M/F), టెలీ కాలర్స్, ఏజెంట్స్, టీమ్ లీడర్స్ కావలెను. ఫోన్ : 9912345790 [H-793296]

■ జీవితాంతం ఎక్కువ సంపాదన ఏ పెట్టుబడి లేకుండా కావాలంటే LIC ఏజెంట్‌గా చేరండి. 10th పాస్ అయి ఆడ/మగ పార్ట్/ఫుల్ టైం పనిచేయుటకు సంప్ర: 9246351657 [HA-10366]

■ HYD సిటీ - కార్గో ఆఫీస్ కొరకు మేనేజర్స్ (M) - 2, కావలెను. జీతం : 12+6=18 వేలు. Q: డిగ్రీ + M.S. ఆఫీస్, M.S. Excel, Tally. వర్క్ ప్రోగ్రెస్ ని బట్టి ఇంక్రిమెంట్స్. 8 to 10 గం॥ డ్యూటీ, టూవీలర్ మస్ట్, సెల్: 7013370695. [A-635]

■ Wanted Teachers (CBSE), NEET & JEE Faculty, Sal: 12-15 Lakhs, Exp. Candidates, Send C.V. info@dheeranchinnamalaischool.ac.in, Dheeran Chinnamalai School & Academy, Krishnagiri (Dist),Tamilnadu, 9442882228. [T-1201063]

■ Wanted Staff to Work in Hotels for Singapur min Qul.: 10th age below 35 Student to work permit processing 45 days. Contact 6302457136, 6301585377 [H-781352]

■ Wanted Experience CA for Reputed Construction Company at Lakadikapul. Ph : 9949629786 / 8328087781. [HA-1120]

■ Do Home Based Job in Medical Transcription. We Provide Training without any Investment Any Body can do this Job, Qly: SSC and Above. Try Once. Ph: 9866269536 T&C Apply. [H-781557]

■ Wanted AC, Fridge, WM, TV, CCTV, Moter Mechanic and Electrician and Helpers, Contact: 7989668128, 9030190919 [HA-10397]

■ Urgently Required Security Guards At Old City, Falaknuma. Qualification 10th Pass, Sal: 17,000/- to 20,000/- Free Uniform & Food/ Ph: 9989187157 [H-796830]

■ Wanted Telecallers and Sales Manager for Reputed Construction Company Salary + Incentives Cont.: 6300407796, 9885468071, Kaveri Hills, Madhapur, Hyd. [H-792997]

■ Wanted HR/ Billing / Marketing Exe., IT Manager, Drivers, DMO, Nurses, CATH LAB Technician, Cardiologist, Medivision Hospital. Ph : 9010533938. [H-786844]

■ TVS Showroom Wanted Telecaller (F), Sales Exe (M), Direct Marketing Ex (M), Computer Operator (M/F) @ Somajiguda. Ph:8019815474, 9849081130 [H-797608]

FACULTY TEACHERS

■ Raj Elit Academy, Tutions 1 St. to Inter Teachers Vacancy for all Subjects I-X, Inter, IIT & Marketive Executives Required L.B. Nagar, Ph: 9912955610 [H-793658]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

నేడు రంజాన్ కానుకల పంపిణీ

రహమత్‌నగర్: హెచ్‌ఎఫ్ నగర్ ఫేజ్–2లోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్లో ఆదివారం రంజాన్ కానుకలను పంపిణీ చేస్తారని డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్సూర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డిల చేతుల మీదుగా లబ్ధిదారులకు కానుకలు అందిస్తారన్నారు. అర్హులంతా వెళ్లి కానుకలను తీసుకోవాలని ఆయన సూచించారు.

'రాగం తానం పల్లవి' ప్రారంభం



కచేరీ నిర్వహిస్తున్న కళాకారులు

పంజగుట్ట: విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆనంద్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో 'రాగం తానం పల్లవి' కార్యక్రమం ప్రారంభమైంది. మూడు రోజులపాటు కొనసాగే ఈ కార్యక్రమాన్ని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళారత్న దీపికా రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రఖ్యాత సంగీత విద్వాంసులు డి.రాఘవాచారి, హైదరాబాద్ సిస్టర్స్‌లోని ఒక విద్వాంసురాలు హరిప్రియ, పీవీఎస్.శేషయ్యశాస్త్రి, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ సీతా చంద్రశేఖర్, విజయనగరం డి.వర్ధని హాజరయ్యారు. దక్షిణాది సంగీతంలో 200 ఏళ్ల క్రితమే కచేరీలో అగ్రతాంబూలం అందుకున్న రాగం తానం పల్లవిని కేవలం సంగీత విద్యార్థులకు పరిమితం చేయకుండా కళాకారులకు, శ్రోతలకు దానిపై అవగాహన కల్పించాలనే విజ్ఞాన సమితి ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని సమితి అధ్యక్షుడు సూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి వేమూరి వేంకట సుజ్జన్ తెలిపారు.

బాలామృతం పంపిణీ



పాల్గొన్న కార్పొరేటర్ కవితారెడ్డి తదితరులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం.10లోని గురుబ్రహ్మనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం హెల్తీ బేబి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పాల్గొని చిన్నారులకు బాలామృతం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. చిన్నారుల ఆలనా, పాలనాపై మరింత శ్రద్ధ చూపాలని అంగన్‌వాడీలను కోరారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం విలువ తెలియజేయడంతో పాటు అవి ఎందులో లభిస్తాయో ప్రయోగాత్మకంగా చేసి చూపించాలన్నారు.

ఉపవాస దీక్షలతో ఆరోగ్యం



ముస్లింలతో కలిసి నమాజ్ చేస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: ఉపవాస దీక్షలతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత చేకూరుతుందని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. రహమత్‌నగర్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం రాత్రి స్థానిక మసీదు కమిటీ సభ్యులకు ఇఫ్తార్ విందును ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ఈ మాసంలో చేసుకున్న పుణ్యాలకు రెట్టింపు ప్రతిఫలం లభిస్తుందన్నారు. మసీదు కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఖైసర్, అజీజ్, ఇమ్రాన్, జగ్గు, సర్వర్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు విజయ్‌కిరణ్, శంకరయ్య, ఆర్కే, రఘు, లింగమూర్తి, తరుణ్ పాల్గొన్నారు.

బీజేవైఎం నాయకులకు సన్మానం



రహమత్‌నగర్: టీఎస్‌పీఎస్సీ కార్యాలయ ముట్టడి కేసులో అరెస్టయి జైల్ నుంచి విడుదలైన బీజేవైఎం నాయకులకు బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. రహమత్‌నగర్‌కు చెందిన హైదరాబాద్ జిల్లా బీజేవైఎం కార్యదర్శి భరత్‌గౌడ్, నగర నాయకుడు మన్మథరావు టీఎస్‌పీఎస్సీ ముట్టడిలో అరెస్టై 16 రోజుల అనంతరం జైలు నుంచి శుక్రవారం విడుదలయ్యారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్, మన్మథరావు మాట్లాడుతూ, కేసులు, అరెస్టులకు తాము భయపడమన్నారు.

పది పరీక్షలకు పకడ్బందీ కార్యాచరణ

- ఠాణాల్లో ప్రశ్న పత్రాలు భద్రం
- విధుల్లో 12 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు



బంజారాహిల్స్ ఠాణాలో ప్రశ్నపత్రాలు డిపాజిట్ చేసేందుకు వచ్చిన ఉపాధ్యాయులు

బంజారాహిల్స్: పదో తరగతి పరీక్షల నిర్వహణను సవాల్‌గా తీసుకున్న విద్యాశాఖాధికారులు ఆ మేరకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ప్రత్యేక తనిఖీ బృందాలతో పాటు నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు. స్నేహపూరిత వాతావరణంలో విద్యార్థులు పరీక్ష రాసేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఈ నెల 3 నుంచి 10వ తరగతి పరీక్షలు జరగనుండగా.. గతంలో మాదిరి కాకుండా ఈ సారి పరీక్షలను ఆరుకు కుదించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరగనుంది. ఫస్ట్ లాంగ్వేజ్ కింద కాంపోజిట్ కోర్సు, సైన్స్ పరీక్షలు మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 నిమిషాల వరకు నిర్వహిస్తారు. పరీక్ష గదిలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, సాంకేతిక సామగ్రిని అనుమతించరు. ఉదయం 8.45 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. దూర ప్రాంతాల వారికి ఆలస్యమైతే ఐదు నిమిషాల వరకు సడలింపు ఇవ్వాలని అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

36 పరీక్ష కేంద్రాలు

☛ ఖైరతాబాద్ విద్యాశాఖ జోన్ పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, బోరబండ, రహ్మత్‌నగర్, వెంగల్‌రావునగర్, అమీర్‌పేట్, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత, 144 ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థుల కోసం 34 కేంద్రాలు కేటాయించగా, ఒకసారి ఫెయిలైన ప్రైవేట్ విద్యార్థులకు రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు.



గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలకు టీవీలు అనుసంధానం చేసిన దృశ్యం

☛ ప్రశ్న పత్రాలను ఇప్పటికే ఠాణాల్లో భద్రపరిచారు. ప్రశ్న పత్రాలు పరీక్ష కేంద్రాలకు చేర్చేందుకు జోన్ పరిధిలో 13 రూట్లు ఏర్పాటు చేశారు. 7781 మంది విద్యార్థులు పది పరీక్షలు రాస్తుండగా ఇందులో 1215 మంది ప్రభుత్వ, 5822 మంది ప్రైవేట్, 711 మంది గురుకుల పాఠశాలలు, 33 మంది ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన వారు ఉన్నారు.

☛ అలాగే ఒకసారి ఫెయిలైన విద్యార్థులు 175 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పోలీసు పహారాలో ప్రశ్న పత్రాలను కేంద్రాలకు తరలిస్తారు. ప్రశ్నాపత్రాలను నిఘా నేత్రాల కింద తెరిచే విధంగా అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని టీవీలకు అనుసంధానం చేశారు.



పరీక్ష కేంద్రాల్లో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న టీచర్లు

☛ తనిఖీ బృందాలు అప్రమత్తంగా ఉంటూ నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా 436 మంది ఇన్విజిలేటర్లు పరీక్ష విధులు నిర్వహించనున్నారు.

144 సెక్షన్ అమలు

అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లను కూడా మూసివేయిస్తారు. అలాగే ఇన్విజిలేటర్లు, సూపరింటెండెంట్లు, తమ సెల్‌ఫోన్లను గేటు వద్దే సెక్యూరిటీ గార్డుల వద్ద భద్రపరిచాలని ఆదేశాలు జారీ చేశారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



అభివాదం చేస్తున్న సంఘం ప్రతినిధులు

పంజగుట్ట: రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రెండు వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు వడ్ల హన్మాండ్లు చారి డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన సంఘం యూత్ అధ్యక్షుడు ఉదారపు నర్సింహాచారితో కలిసి మాట్లాడుతూ ..విశ్వకర్మలు లేనిదే విశ్వం లేదంటారని, అలాంటి విశ్వకర్మలు ప్రస్తుతం అన్ని రంగాల్లో తీవ్రంగా వెనుకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విశ్వకర్మల ఆత్మగౌరవ భవనానికి ఐదు ఎకరాలు, ఐదు కోట్ల నిధులు ప్రకటించడంతో పాటు ఎల్బీనగర్ బ్రిడ్జికి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అమరుడైన శ్రీకాంత్ చారి పేరు పెట్టినందుకు ఎంతో సంతోషిస్తున్నామన్నారు.తమ కులస్తులు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాజకీయంగా ఎంతో వెనుకబడి ఉన్నారని హన్మాండ్లు చారి ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పడాల బ్రహ్మంచారి, ఉపాధ్యక్షులు విద్యాసాగర్, భారతి తదితరులు పాల్గొన్నారు.

పరిపూర్ణ వ్యక్తి విజయరామారావు



విశ్వనాథ జయంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

పంజగుట్ట: అటు పోలీసు శాఖలోనైనా, ఇటు రాజకీయ రంగంలో అయినా నిజాయతీ, నిబద్ధత కలిగిన పరిపూర్ణ వ్యక్తి కె.విజయరామారావు అని వక్తలు కొనియాడారు. ఇటీవల మృతి చెందిన మాజీ మంత్రి, సీబీఐ మాజీ డైరెక్టర్ కె.విజయరామారావు (కేవీఆర్) సంస్మరణ సభను శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వనాథ సాహిత్య పీఠం వారి విశ్వనాథ జయంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ .. ఎంతో క్లిష్టమైన పరిస్థితుల్లో ఆయన సీబీఐ డైరెక్టర్‌గా పని చేసి అందరికీ ఆమోదయోగ్యమైన, అంగీకారమైన నిర్ణయాలు తీసుకునేవారన్నారు. మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ .. పోలీస్ ఉన్నతాధికారిగా అన్ని పోస్టుల్లో నిజాయతీగా, నిబద్ధతతో పని చేసి, పోలీస్ శాఖలో తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కె.కేశవరావులు విజయరామారావుతో తమకున్న పరిచయాన్ని గుర్తుచేసుకున్నారు. మాజీ డీజీపీ ఆంజనేయ రెడ్డి తాను కేవీఆర్‌తో కలిసి పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్నారు. తెలుగు అకాడమీ మాజీ సంచాలకుడు వెల్చాల కొండల రావు, ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ప్రభుత్వ మాజీ సలహాదారు పాపారావు, ప్రభుత్వ ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి, కూతురు అన్నపూర్ణ, పెద్ద సంఖ్యలో అధికారులు, ప్రముఖులు పాల్గొని వారికి విజయరామారావుతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు.

స్వాగత సభ పోస్టర్ ఆవిష్కరణ



పంజగుట్ట: తెలంగాణ సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడం, ఆ మహనీయుడి 125 అడుగుల భారీ విగ్రహం ఏర్పాటు నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు స్వాగత సభను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, సమతా సైనిక్ దళ్, ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4న రవీంద్రభారతిలో సభ ఏర్పాటు చేస్తున్నట్లు ఆహ్వాన కమిటీ ప్రతినిధులు బి.శ్యామ్, దాసరి శ్యామ్ మనోహర్, ఢిల్లీ వసంత్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉద్యోగ సంఘం నాయకులు మామిడి నారాయణ, విద్యార్థి నేత మాందాల భాస్కర్‌తో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సభను విజయవంతం చేయాలని విద్యార్థి, మేధావి, ఉద్యోగులు, యువతకు పిలుపునిచ్చారు. కిషన్, ప్రసాద్, హరిబాబు, శ్రీకాంత్, అర్జున్ పాల్గొన్నారు.

'బీసీలకు బీజేపీ చేసిందేమీ లేదు'

పంజగుట్ట: భారతదేశం అంటేనే అందరికీ సమన్యాయం అని అంటారు కానీ.. అది ప్రస్తుతం పాలకులకు ఒక విధంగా, ప్రతి పక్షాలకు మరో విధంగా పని చేస్తోందని వివిధ పార్టీల నేతలు, వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆధ్వర్యంలో ఓబీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు యుద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యూపీఏ ప్రభుత్వం బీసీలకు ఎంతో మేలు చేసిందని, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఏమి చేసిందో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో సగానికి పైగా ఉన్న బీసీ జనాభాకు సంబంధించి ప్రభుత్వం వద్ద లెక్కలు లేకపోవడం బాధాకరమన్నారు. గతంలో రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర చేస్తే, ప్రస్తుతం రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర చేసి దేశప్రజలకు ఏకం చేశారని, అదిచూసి భయపడి రాహుల్‌పై అనర్హత వేటు వేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీకో హటావో దేశ్‌కో బచావో అనే నినాదంతో ముందుకు పోదామన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు అజీజ్ పాషా మాట్లాడుతూ .. భారతదేశం అంటేనే మదర్ ఆఫ్ డెమోక్రసీ, విశ్వగురు అని చెప్పుకునే మోదీ దాన్ని అమలులో మాత్రం చేయడం లేదన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, ఆప్ నేత రాము గౌడ్, సామాజిక కార్యకర్త ఇందిరా శోభన్ తదితరులు సమావేశంలో మాట్లాడారు.

జీఓ 58,59పై అవగాహన

ఫిలింనగర్: అర్హులంతా జీఓ 58,59ను సద్వినియోగం చేసుకోవాలని జూబ్లీహిల్స్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్ రావు సూచించారు. ఫిలింనగర్ బీజేఆర్ నగర్ బస్తీవాసులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. జీఓ 58,59, గృహలక్ష్మి పథకాలపై అవగాహన కలిగించారు. జీఓ 58,59 కింద అర్హులంతా ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే పేదలకు గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం రూ. 3 లక్షల ఆర్థిక సాయం చేయనుందని, ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శ్రీ వెంకటేశ్వర శినికేతన్ గురువు హేమ వనసర్ల శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. పుష్పాంజలి, బాదాం త్రిపుర సుందరి, ముద్దుగారే యశోధ, పలుకే బంగారుమాయెరా, మూషిక వాహన, తాండవ నృత్యకరీ, పాటలకు కిన్నెర, గుర్గా, వర్ష, గాయత్రి, హర్షిత, అనన్య, మానస, సహస్ర కూచిపూడి నాట్యాంశాలను ప్రదర్శించి అలరించారు.

ఆకట్టుకున్న రామాయణ కల్పవృక్షం ఫెస్టివల్

మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ ట్రైనింగ్) లో మూడు రోజుల పాటు కొనసాగనున్న రామాయణ కల్పవృక్షం ఫెస్టివల్ ఆకట్టుకుంటోంది. ఇందులో భాగంగా శనివారం కళాకారుడు మనస్‌పాత్, పండిత్ దిల్‌కశ్ భారతి సదానంద్ సంప్రదాయ పాటలతో పాటు సుందరాకాండం, రామచరితలోని పలు అంశాలను ఆలపించారు. అమిగనత్ర వాల్మీకి రామాయణం, హేమంత్‌పాండే తులసీరామాయణంలోని హనుమాన్ దర్శన్, సుధాశేషయ్యన్ కంభ రామాయణం, నాగరాజ్ పతూరి రామాయణ అంశాలను ప్రదర్శించి అలరించారు.

హెచ్‌బీసీకి పాలపిట్ట పార్కు నిర్వహణ బాధ్యత

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని పాలపిట్ట పార్కు నిర్వహణ బాధ్యతలను హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ శనివారం చేపట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌బీసీ అధ్యక్షుడు డాక్టర్ టి సత్యనారాయణరెడ్డి, టీఎస్ఎఫ్‌డీసీ డైరెక్టర్ సైకిలాబ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, మేనేజర్ శ్రావణ్‌తోపాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఇటీవల అటవీశాఖ నిర్వహించిన టెండర్లలో హెచ్‌బీసీ టెండర్ దక్కించుకోవడంతో పాలపిట్ట పార్కు బాధ్యతలను లాంఛనంగా చేపట్టి ప్రత్యేక పూజలను నిర్వహించింది. గతంలో ఈ పార్కు నిర్వహణ బాధ్యతను సైకుల్ సంస్థ నిర్వహించేది. ఆ తర్వాత అగ్నిప్రమాదం చోటు చేసుకోవడం, అనంతరం అటవీశాఖ నిర్వహించిన టెండర్‌ను హెచ్‌బీసీ దక్కించుకోవడంతో వారికి నిర్వహణ బాధ్యతను అప్పగించారు.

రూ. 171 కోట్ల ఆస్తి పన్ను వసూలు



జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో ట్యాక్స్ చెల్లిస్తున్న వినియోగదారులు

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం చివరి రోజైన శుక్రవారం ఆస్తి పన్ను చెల్లింపులు భారీగా జరిగాయి. శుక్రవారం ఒక్క రోజే ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో వినియోగదారులు రూ. 6.6 కోట్ల ఆస్తి పన్ను చెల్లించారు. సర్కిల్ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం రూ. 200 కోట్లు పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకోగా గత నెల 31వ తేదీ వరకు రూ. 171 కోట్లు వసూలు చేశారు. ఒక్క మార్చి నెలలోనే రూ.18 కోట్లు వసూలయ్యాయి. గతేడాది మార్చి 31వ తేదీ వరకు రూ. 156 కోట్లు వసూలు కాగా, ఈ సారి లక్ష్యానికి మించి పన్నులు రాబట్టారు. ఇదిలా ఉండగా ఎర్లీ బర్డ్ స్కీం కింద ఈ నెల 1వ తేదీ నుంచి 5 శాతం రాయితీతో పన్ను చెల్లింపులకు అవకాశం కల్పించామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి సూచించారు. ఈ అవకాశం మళ్లీ మళ్లీ రాదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. 2023–24 సంవత్సరానికి ఈ స్కీం వర్తిస్తుందన్నారు.

సర్కిల్–17 పరిధిలో...

మార్చి 31న ఆఖరి తేదీ కావడంతో ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలో రూ. 4 కోట్ల బకాయిలు వసూలైనట్టు డీఎంసీ మోహన్ రెడ్డి తెలిపారు. కాగా సర్కిల్ పరిధిలో రూ. 181 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, ఇప్పటి వరకు రూ.135 కోట్లు వసూలయ్యాయని చెప్పారు.

కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన: ఆమ్ ఆద్మీ



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఆమ్‌ఆద్మీ నాయకులు

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం లిబర్టీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద 'బీజేపీ కో హటావో.. దేశ్‌కో బచావో' అన్న నినాదంతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ డి.సుధాకర్ మాట్లాడుతూ, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దేశంలో నిరంకుశ పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. తమ మాట వినని విపక్ష పార్టీల నేతలపై ఈడీ, ఐటీ, సీబీఐలను ఉపయోగించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తూ జైలు పాల్జేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అన్ని శక్తులూ ఏకమై బీజేపీని గద్దెదించి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, దేశ సమైక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.నిరసన కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు రాముగౌడ్, శోభన్, భూక్య రాకేష్, హరిచరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ స్థలం కబ్జాకు యత్నాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.2లోని సాగర్ సొసైటీ–ఇందిరానగర్ మధ్యలో ఉన్న ఖరీదైన జీహెచ్‌ఎంసీ స్థలంపై కబ్జాదారులు కన్నేశారు. బోగస్ పత్రాలు సృష్టించి ఈ స్థలాన్ని కాజేసేందుకు ముమ్మర యత్నాలు చేస్తున్నారు. కమలాపురి కాలనీకి సమీపంలో ఉన్న ఈ స్థలం చుట్టూ జీహెచ్‌ఎంసీ గతంలోనే ప్రహరీ నిర్మించి గేటు కూడా ఏర్పాటు చేసింది. అయితే ఇందులో తమ ప్లాట్లు ఉన్నాయంటూ కొందరు వ్యక్తులు బోగస్ పత్రాలతో ఆక్రమించేందుకు యత్నిస్తుండగా స్థానికులు అడ్డుకుంటూ వస్తున్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి ఈ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే ఈ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి ఆక్రమించే అవకాశాలున్నాయి.



సాగర్ సొసైటీని ఆనుకొని ఉన్న జీహెచ్‌ఎంసీ స్థలం

అవార్డు రావడం సంతోషకరం



అవార్డును ప్రదర్శిస్తున్న డాక్టర్ సునీత

పంజగుట్ట: తనకు ఎక్సలెన్స్ ఎమర్జింగ్ ఫార్మా లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని డాక్టర్స్ ఫార్మా ఎండీ డాక్టర్ సునీత అన్నారు. శనివారం ఆమె సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ..అవార్డు కోసం ఎన్నో ప్రముఖ ఫార్మా కంపెనీలు పోటీ పడినప్పటికీ తనను అవార్డుకు ఎంపిక చేశారన్నారు. కరోనా విలయతాండవం చేస్తున్న సమయంలో తాను అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించానని, ఆ సేవలను గుర్తించి తనను ఈ అవార్డుకు గుర్తించారన్నారు. గత 20 ఏళ్లుగా అమెరికాలో ప్రముఖ ఆసుపత్రుల్లో పనిచేసిన అనుభవాన్ని ఇక్కడి ప్రజలకు ఉపయోగపడేలా చేయడమే తన లక్ష్యమన్నారు.

కనువిందు చేస్తున్న పుష్పాలంకరణ





ఇకబెనా ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న మొక్కలు, పుష్పాలంకరణ

బంజారాహిల్స్: కత్తిరించిన పువ్వులు... కొమ్మలు... ఆకులతో కనువిందు చేసే రీతిలో తయారు చేసిన పుష్పాలంకరణ ఆహూతులను ఇట్టే కట్టిపడేస్తోంది. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో ఏర్పాటు చేసిన ఇకబెనా ప్రదర్శనలో రంగు రంగుల పూల ఆకృతులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. జపనీస్ ఆర్ట్‌గా పేరొందిన ఇకబెనా పూల ప్రదర్శనను ఇక్కడ ఏర్పాటు చేయగా పెద్ద సంఖ్యలో నగరవాసులు విచ్చేసి వీటిని తిలకిస్తూ ఆనందిస్తున్నారు. సుమారుగా 30కిపైగా ఆకృతుల్లో ఇక్కడ పుష్పాలంకరణ చేశారు.

కార్మికనగర్‌లో మురుగు పరుగు



రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

రహమత్‌నగర్: కార్మికనగర్ రహదారిపై మురుగు పరుగు తీస్తోంది. కొంత కాలంగా ఈ ప్రాంతంలో ప్రవహిస్తున్న మురుగు నీటితో పాదచారులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఫిర్యాదు చేయగానే జలమండలి సిబ్బంది వచ్చి తూతూ మంత్రంగా మరమ్మతు చేయడం పరిపాటిగా మారిందని, సమస్య మాత్రం శాశ్వతంగా పరిష్కారం కావడం లేదని బస్తీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

శుభాకాంక్షలు



టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి జన్మదిన వేడుకలు హిమాయత్‌నగర్‌లో జరిగాయి. ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు.

– సాక్షి, సిటీబ్యూరో

క్లుప్తంగా...

దివ్యదర్శనం టోకెన్లు జారీ పునఃప్రారంభం

తిరుమల: తిరుమల నడకమార్గాల్లో దివ్యదర్శనం టోకెన్ల జారీని టీటీడీ శనివారం ఉదయం నుంచి పునః ప్రారంభించింది. కోవిడ్ నేపథ్యంలో మూడు సంవత్సరాలుగా టీటీడీ దివ్యదర్శనం టోకెన్ల జారీని నిలిపివేసింది. అయితే భక్తుల కోరిక మేరకు అలిపిరి నడక మార్గంలో గాలిగోపురం వద్ద 10 వేలు, శ్రీవారి మెట్టు మార్గంలో ఐదు వేల దివ్యదర్శనం టోకెన్లను శనివారం నుంచి కేటాయిస్తున్నారు. భక్తులు నేరుగా తమ ఆధార్ కార్డుతో హాజరైతేనే టోకెన్లు జారీ చేస్తారు. కాగా, శ్రీవారి ఆలయంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో 4న అష్టదళ పాదపద్మారాధన, 3 నుంచి 5వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

త్వరలో తిరుపతి నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు

తొలుత ఓపెన్ స్కై పాలసీ కింద కువైట్‌కు సర్వీసులకు అవకాశం

సాక్షి, అమరావతి: ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక నగరం తిరుపతి నుంచి త్వరలో అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. తిరుపతి విమానాశ్రయానికి 2017లోనే అంతర్జాతీయ విమానాశ్రయ హోదా వచ్చింది. అయితే, ఇప్పటివరకు అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభం కాలేదు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, తిరుపతి నుంచి ప్రపంచ నగరాలకు విమానాలు నడిచేలా కృషి చేస్తోంది. ముందుగా తిరుపతి విమానాశ్రయం నుంచి కువైట్‌కు సర్వీసులు ప్రారంభించేలా కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో పాటు విమానయాన సంస్థలతో ఏపీ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏడీసీఎల్), స్థానిక ఎంపీ, ఎయిర్‌పోర్టు అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఓపెన్ స్కై పాలసీ కింద కువైట్‌కు విమాన సర్వీసులు ప్రారంభించాలని స్థానిక వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిని కోరారు. ఈ పాలసీ కింద 400 సీట్లు కేటాయించాలని కోరగా కేంద్రం నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు అధికారులు తెలిపారు. తిరుపతి నుంచి కువైట్‌కు సర్వీసులు నడపడానికి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నుంచి సానుకూల సంకేతాలు వచ్చాయని తిరుపతి ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజ్ కిషోర్ తెలిపారు. ఇండిగో, ఎయిర్‌ఏషియా సంస్థలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు.

వైద్య విద్య మరింత ఖరీదు?

- యూజీ, పీజీ మెడికల్, పారామెడికల్ కోర్సుల ఫీజు పెంపుపై టీఏఎఫ్‌ఆర్సీ కసరత్తు
- ఈ నెల 30లోగా కాలేజీల వారీగా ప్రతిపాదనలు కోరిన కమిటీ
- ఆదాయ, వ్యయాల ఆడిట్ రిపోర్టులు కూడా ఇవ్వాలని ఆదేశం
- వాటిని పరిశీలించాక ప్రభుత్వానికి నివేదిక
- రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తే అమల్లోకి కొత్త ఫీజులు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్య విద్య మరింత ఖరీదు కాబోతోంది. ఇప్పటికే ప్రైవేటు కాలేజీల్లో మెడికల్ కోర్సుల ఫీజులు భారీగా ఉండగా, మరింత పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. దీనిపై రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీలు అటు ప్రభుత్వానికి వినతులు సమర్పిస్తూనే.. ఇటు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ)కి సైతం విజ్ఞప్తులు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2023–24 నుంచి 2025–26 మధ్య కాలానికి సంబంధించి ఫీజుల నిర్ధారణపై కసరత్తు మొదలుపెట్టిన టీఏఎఫ్‌ఆర్సీ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 30వ తేదీలోగా మెడికల్ కాలేజీల వారీగా ప్రస్తుతం ఫీజులు, పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించింది.

కేటగిరీల వారీగా ఫీజులు

మెడికల్ కోర్సులకు సంబంధించి ఫీజులు ఒక్కో కేటగిరీలో ఒక్కో రకంగా ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో స్థిరమైన ఫీజులుండగా.. ప్రైవేటు కాలేజీల్లో మాత్రం ఏ, బీ, సీ కేటగిరీల్లో భిన్నమైన ఫీజులు తీసుకుంటున్నారు. ప్రైవేటు కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లకు సంబంధించి కేటగిరీ 'ఏ' (కన్వీనర్ కోటా) అడ్మిషన్‌కు వార్షిక ఫీజు రూ.60వేలు ఉండగా.. కేటగిరీ 'బీ' (మేనేజ్‌మెంట్ కోటా)కి రూ.11.5 లక్షల నుంచి రూ.14.5 లక్షల వరకు ఉంది. ఇక కేటగిరీ 'సీ' (ఎన్నారై కోటా) అడ్మిషన్ ఫీజు రూ.25 లక్షల నుంచి రూ.28 లక్షల వరకు ఉంది. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి కేటగిరీ 'ఏ'కు రూ.7.5లక్షలు, కేటగిరీ 'బీ'కి రూ.28 లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఫీజు ఉంది. బీడీఎస్ కోర్సులకు కేటగిరీ 'ఏ'లో రూ.45 వేలు, కేటగిరీ 'బీ'లో రూ.4.2 లక్షలు ఉండగా.. కేటగిరీ 'సీ'లో రూ.ఎనిమిదిన్నర లక్షల వరకు ఉంది. వీటితోపాటు బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్, బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్, హోమియోపతి, పారామెడికల్ కోర్సులకు సంబంధించిన ఫీజులు కూడా కాలేజీల వారీగా భిన్నంగా ఉన్నాయి.

ఆడిట్ రిపోర్టులే కీలకం

యూజీ, పీజీ మెడికల్ కోర్సుల ఫీజు పెంపునకు కాలేజీల ఆడిట్ రిపోర్టులే కీలకం కానున్నాయి. టీఏఎఫ్‌ఆర్సీ తాజాగా ప్రతి కాలేజీ ఆడిట్ రిపోర్టును సమర్పించాలని సూచించింది. ఇందులో కాలేజీల నిర్వహణ ఖర్చులు మొదలు బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు, ల్యాబ్‌ల నిర్వహణ, ఇతర వ్యయాలకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారం ఉంటుంది. ఈ ఖర్చులు గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో ఒకరకంగా ఉంటే పట్టణ ప్రాంతాల కాలేజీల్లో మరోరకంగా ఉంటాయి. దీంతో కాలేజీ వారీగా ఆడిట్ నివేదికలను పరిశీలించాక ఫీజుల పెంపుపై టీఏఎఫ్‌ఆర్సీ ఒక అంచనాకు వస్తుంది. ఆ మేరకు ఫీజులను ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం దానిని ఆమోదిస్తే కొత్త ఫీజులు అమల్లోకి వస్తాయి.



హంస వాహనంపై రాములోరు విహారం

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం కేరళ వాయిద్యాలు, కోలాటాల నడుమ వేణుగానాలంకారంలో కోదండ రాముడు భక్తులకు అభయం ఇచ్చారు. అనంతరం రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు హంస వాహనంపై రాములోరు విహరించారు. కోదండ రామాలయంలో మంగళవారం ఉదయం 8:00 గంటలకు వటపత్రశాయి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనం ఇస్తారు. రాత్రికి సింహ వాహనంపై కోదండ రాముడు ఒంటిమిట్ట పురవీధుల్లో ఊరేగుతారు.

చంద్రబాబువి పగటి కలలు

ఏపీ విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: 'మాకు ముందస్తు ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం లేదు. చంద్రబాబుకు ఎన్నికలు కావాలి. ఎన్నికలు వస్తే ఏదో అయిపోతానని ఆయన కలలు కంటున్నాడు. ఏమీ కాదు. ఇప్పుడు కొంతైనా ఆశతో బతుకుతున్నాడు. ఎన్నికల తర్వాత అదీ ఉండదు. వచ్చే ఎన్నికల్లో ఇప్పుడున్నన్ని సీట్లు కూడా ఆ పార్టీకి రావు. వాపును చూసి బలుపనుకుంటున్నాడు. ఎన్నికలయ్యాక చంద్రబాబు తుస్సుమంటాడు' అని ఏపీ విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పాలన, అధికార వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రం అభివృద్ధి సాధించగలుగుతుందన్నది తమ పార్టీ విధానమని చెప్పారు. తమ పార్టీ తొలి నుంచీ మూడు రాజధానులకే కట్టుబడి ఉందని, ఎప్పుడైనా తమది అదే నినాదమని స్పష్టం చేశారు. రేపటి నుంచే మూడు రాజధానులు అమల్లోకి రావాలన్నది తన డిమాండ్ అని, ఆ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభ్యర్థిస్తున్నానని తెలిపారు. శనివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని న్యాయ పరమైన చిక్కుల వల్ల విశాఖ నుంచి పాలన ఆలస్యమవుతోందన్నారు. టీడీపీ, కొన్ని దుష్ట శక్తులే మూడు రాజధానుల ప్రయత్నాలను అడ్డుకుంటున్నాయని.. తుదకు న్యాయం, నిజమే గెలుస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మూడు రాజధానుల నినాదం వినిపిస్తామని చెప్పారు. మంత్రి బొత్స ఇంకా ఏమన్నారంటే..

మా ప్రభుత్వంపై పెరిగిన నమ్మకం

- దేశ చరిత్రలో ఎక్కడా లేనంతగా క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలు ఇస్తున్నాం. మా ప్రభుత్వంపై ప్రజలకు మరింత నమ్మకం, భరోసా పెరిగింది. ఇలాంటప్పుడు ముందస్తు ఎన్నికలకు వెళ్లాలన్న ఆతృత మా పార్టీకి ఎందుకు ఉంటుంది?
- ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటమికి నేనే బాధ్యత వహిస్తున్నా. ఓటమిపై పరిశీలన చేసుకొని, లోటుపాట్లుంటే సరి చేసుకుంటాం.
- దశాబ్దాలుగా మార్గదర్శి అక్రమాలకు పాల్పడుతోంది. ఇన్నాళ్లూ దాని యాజమాన్యం తప్పించుకుంది. ప్రస్తుతం మరిన్ని అక్రమాలు బయటకు వస్తున్నాయి. ఇక తప్పించుకోలేరు.

ఏపీలో కొత్త జిల్లాల పేర్లతో అడ్రస్ సర్టిఫికెట్లు

సాక్షి, అమరావతి: ఏపీలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త జిల్లాల పేర్లతో చిరునామా సర్టిఫికెట్లు జారీ చేయడానికి ఆ శాఖ ఏర్పాట్లు చేసింది. ఆధార్ కార్డుల్లో కొత్త జిల్లాల పేర్లను చేర్చుకోవడానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకుంది. ఆధార్‌కార్డు జారీ సంస్థ యూఐడీఏఐ సూచించిన ఫార్మాట్‌లో సోమవారం నుంచే అడ్రస్ సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. ఏపీలో అంతకు ముందు 13 జిల్లాలు ఉండగా.. వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ సంఖ్యను 26కు పెంచింది. ఈ నేపథ్యంలో ప్రజలు తమ ఆధార్ కార్డులలో కొత్త జిల్లా పేరుతో చిరునామా మార్చుకోవాలంటే.. ఆ వివరాలతో కూడిన ఏదో ఒక ధ్రువీకరణ పత్రం దాఖలు చేయాల్సి ఉంటుంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడకుండా.. కొత్త జిల్లాల పేర్లతో కూడిన అడ్రస్ సర్టిఫికెట్లను సచివాలయాల ద్వారా జారీ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఏర్పాట్లు చేసింది. అడ్రస్ సర్టిఫికెట్ల జారీ బాధ్యతను సంబంధిత గ్రామ, వార్డు సచివాలయ రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

లోకేశ్ డైరెక్షన్.. పల్లె ఓవరాక్షన్



సత్యమ్మ గుడి వద్ద కారు పైకెక్కి టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్న పల్లె



పగిలిన ఎమ్మెల్యే కారు అద్దం.. కారుపై పడిన చెప్పులు

- రెచ్చిపోయిన ఏపీ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి
- అల్లరి మూకతో కలసి పుట్టపర్తిలో హల్‌చల్

సాక్షి, పుట్టపర్తి: 'ప్రశాంతి నిలయం'గా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో టీడీపీ నేత, ఏపీ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అనుచరులతో కలిసి అలజడి సృష్టించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ.. దౌర్జన్యకాండకు ఒడిగట్టారు. ఫలితంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేశ్ గత నెల 25న పుట్టపర్తి నియోజకవర్గం ఓబులదేవరచెరువులో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. తాను అవినీతి చేసినట్లు నిరూపించాలని.. అభివృద్ధిపై ఏప్రిల్ ఒకటో తేదీన పుట్టపర్తి సత్యమ్మ గుడి వద్దకు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో లోకేశ్ సూచన మేరకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి స్పందిస్తూ.. తాను చర్చకు వస్తున్నానని చెప్పడంతో ఆయన్ను పోలీసులు టీడీపీ కార్యాలయంలో హౌస్ అరెస్ట్ చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సత్యమ్మ గుడి సర్కిల్‌కు చేరుకున్నారు. కాసేపటికే పల్లె పోలీసుల నుంచి తప్పించుకుని.. భారీగా అనుచరులను వెంటేసుకుని అక్కడికి చేరుకున్నారు.

రండి చూసుకుందాం..

పల్లె రఘునాథరెడ్డి అక్కడికి వచ్చీ రాగానే కారు పైకెక్కి 'ఎమ్మెల్యే ఎక్కడ? నేను చర్చకు సిద్ధం'అంటూ హంగామా చేశారు. వెనుక ఉన్న అనుచరులు తొడలు కొడుతూ.. మీసం మెలేస్తూ 'రండి రేయ్.. చూసుకుందాం'అంటూ రెచ్చగొట్టారు. పక్కనే ఉన్న ఎమ్మెల్యే వాహనం (ఫార్చునర్) అద్దాలు ధ్వంసం చేశారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై చెప్పులు, రాళ్లు రువ్వారు. దీంతో ఆత్మ రక్షణ కోసం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రతిఘటించడానికి పూనుకున్నారు. అంతలో పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ నేతృత్వంలో పోలీసులు లాఠీలు ఝుళిపిస్తూ ఇరు వర్గాల వారిని చెదరగొట్టారు. ఈ దశలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఇంటికెళ్లిపోయారు. బస్టాండ్ వరకు వెళ్లిన పల్లె రఘునాథరెడ్డి మాత్రం మళ్లీ సత్యమ్మ గుడి సర్కిల్‌కు చేరుకుని హల్‌చల్ చేసినప్పటికీ పోలీసులు మిన్నకుండిపోయారు.

నగర వార్తలు

కారు బోల్తా... విద్యార్థి దుర్మరణం

- కారులో షికారుకెళ్లిన స్నేహితులు
- డ్రైవింగ్ చేసిన బాలుడితో పాటు అందరూ మైనర్లే



శంషాబాద్: కారు అదుపు తప్పి బోల్తాపడడంతో ఓ విద్యార్థి దుర్మరణం చెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నగరంలో తలాబ్‌కట్టకు చెందిన ఓ విద్యార్థి (17) తన స్నేహితులతో(ముగ్గురు మైనర్లు) కలిసి శనివారం తెల్లవారు జామున తండ్రి కారులో షికారుకు వెళ్లారు. శంషాబాద్‌కు వచ్చిన వారు తిరిగి తలాబ్‌కట్టకు బయలుదేరగా..ఉదయం 6.50 గంటల సమయంలో గగన్‌పహాడ్‌లోని బీఈ కంపెనీ వద్ద డ్రైవింగ్ చేస్తున్న విద్యార్థి ఓ వాహనాన్ని ఢీ కొట్టబోయాడు. అదే సమయంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో బోల్తాపడింది. ఆ సమయంలో ముందు సీట్లో కూర్చున్న అబ్దుల్లా జహీర్(16)కు తీవ్ర గాయాలయ్యాయి. మిగతావారికి కూడా స్వల్పగాయాలయ్యాయి. హుటాహుటినా అత్తాపూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అబ్దుల్లా జహీర్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ర్యాష్ డ్రైవింగ్‌తో పాటు మైనర్ డ్రైవింగ్ కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆసుపత్రి భవనం పైనుంచి పడి రోగి మృతి

శంషాబాద్: ప్రయివేటు ఆసుపత్రి భవనం నుంచి దూకి రోగి మృతిచెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. షాబాద్ మండలం ముద్దెంగూడకు చెందిన సరిగుంట యాదయ్య మార్చి 27న భూవివాదాల నేపథ్యంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతడిని పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చేర్చారు. కోలుకున్న తర్వాత ఇంటికి పంపినప్పటికీ అతడి ఆరోగ్యం బాగా లేకపోవడంతో భార్య ఇద్రమ్మ మరోసారి అదే ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఐసీయూలో ఉన్న అతడి మానసిక ప్రవర్తన సరిగా లేకపోవడంతో ఆస్పత్రిలో ఉన్న సిబ్బందిపై దాడి చేయడంతో పాటు నానా హంగామా చేశాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున ఐదో అంతస్తు నుంచి కిందికి దూకేయడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టోల్, ఇంధన ధరల పెంపుపై లారీ యజమానుల నిరసన



ఆటోనగర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

వనస్థలిపురం: కేంద్ర ప్రభుత్వం మొండివైఖరి వీడి పెంచిన టోల్ ఫీజులను, డీజిల్ ధరలను తగ్గించాలని లారీ యజమానులు నినదించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన టోల్ ఫీజు, డీజిల్ ధరలను నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోయేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆటోనగర్ వద్ద లారీ యజమానులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బూడిద నందారెడ్డి మాట్లాడుతూ ఓ వైపు క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నా డీజిల్ ధరలు పెంచడం అన్యాయమని అన్నారు. అంతకంతకు పెరుగుతున్న డీజిల్ ధరలతో రవాణా రంగం కుదేలవుతోందని, ప్రజలపై పెనుభారం పడుతోందని అన్నారు. పక్కనున్న కర్నాటక రాష్ట్రంలో మనకన్నా లీటర్‌కు రూ.12 తక్కువగా ఉందని అన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతు పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు వీడనాడి డీజిల్ ధరలు, టోల్ ఫీజు తగ్గింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. లారీ యజమానుల సంఘం ఆటోనగర్ అధ్యక్షుడు కేసారం బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేతలు సుర్వి రాజుగౌడ్, రాంరెడ్డి, శ్రీనివాస్, పర్వతాలు, కళ్యాణ్, శ్రీకాంత్‌రెడ్డి, నరేష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కాచిగూడ: అప్స స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్వెస్ట్ అలయన్స్ సహకారంతో విద్యానగర్, ముషీరాబాద్ కేంద్రాల్లో పేద విద్యార్థిని విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అప్స ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ హజారే, సంస్థ ప్రతినిధి బొట్టు రమేష్ ప్రకటించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మూడు నెలల శిక్షణలో ఎంఎస్ ఆఫీస్, ఎక్సల్ పవర్ పాయింట్, అడ్వాన్స్ ఎక్సల్, ఇంటర్‌నెట్ కాన్సెప్ట్, స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్‌లో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఒంటి గంట నుంచి సాయంత్రం 4.30 వరకు శిక్షణ ఉంటుందని ఈ శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జర్నలిస్టు పసునూరు శ్రీధర్‌బాబుకు డాక్టరేట్

సాక్షి, సిటీబ్యూరో: సీనియర్ జర్నలిస్ట్ పసునూరు శ్రీధర్ బాబుకు తెలంగాణ యూనివర్సిటీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. 'రోల్ ఆఫ్ టెలివిజన్ న్యూస్ ఇన్ తెలంగాణ మూవ్‌మెంట్' అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ప్రజల భావోద్వేగాలను వ్యక్తీకరించడంలో టెలివిజన్ న్యూస్ మాధ్యమం బలమైన పాత్ర పోషించిందని శ్రీధర్ బాబు తన పరిశోధనలో వెల్లడించారు. రాష్ట్ర సాధన స్వప్నాన్ని సాకారం చేయడంలో టెలివిజన్ న్యూస్ ఎంతగానో దోహదపడిందని పేర్కొన్నారు. యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఆయన తన పరిశోధన పూర్తి చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన శ్రీధర్ బాబు ప్రస్తుతం బీబీసీ న్యూస్‌లో సీనియర్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్‌గా పని చేస్తున్నారు.

రచయిత మల్లికార్జున్‌కు చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారం

సాక్షి, సిటీబ్యూరో: విలక్షణ రచయిత దివంగత డాక్టర్ వి.చంద్రశేఖరరావు స్మారక పురస్కారానికి ఈ ఏడాది నగరవాసి, యువ రచయిత మల్లిఖార్జున్‌ను ఎంపిక చేసినట్లు డా.చంద్రశేఖర్ రావు సాహిత్య కుటుంబం ప్రతినిధి డా.వి. ప్రసూన తెలిపారు. వచ్చే నెల 13వ తేదీన డా.చంద్రశేఖర్‌రావు జయంతి సందర్భంగా ఈ పురస్కార ప్రదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. తనదైన ప్రత్యేక శైలిలో రచనలు చేసే మల్లిఖార్జున్ ఇరానీ కేఫ్, కాగితం పడవలు తదితర రచనల ద్వారా పాఠకులకు దగ్గరయ్యారు.

బడి దుస్తులు..భలేగా!

వచ్చే విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఏకరూప దుస్తుల పంపిణీ

- కసరత్తు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- గ్రేటర్, శివారు జిల్లాల ప్రభుత్వ పాఠశాలల్లో 3.64 లక్షల మంది విద్యార్థులు

హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు ఇలా..

జిల్లా పేరు	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
హైదరాబాద్	631	1,08,635
మేడ్చల్–మల్కాజిగిరి	505	90,301
రంగారెడ్డి	1301	1,65,203
మొత్తం	2,497	3,64,139



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు జిల్లాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2023–24 విద్యాసంవత్సరం ఆరంభం రోజే ఏకరూప దుస్తులు అందజేసేందుకు సంబంధిత విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ స్థానిక సంస్థలు, ఎయిడెడ్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేస్తారు. మరో వారం రోజుల్లో వస్త్రం జిల్లాకు చేరనుంది.

అందంగా..ఆకర్షణీయంగా...

- బాల బాలికలకు దుస్తుల కోడ్ రంగు ఒకేలా ఉండేలా వస్త్రం సరఫరా చేస్తున్నారు. ఫ్యాషన్ డిజైనర్ల సిఫారసు మేరకు దుస్తుల తయారీలో మార్పులు చేశారు. ఒకటి నుంచి మూడోతరగతి బాలికలకు కుడివైపు పాకెట్‌తో ఫ్రాక్, సూటింగ్ క్లాత్‌తో కుట్టిన బెల్టు రింగులు రూపొందించారు. స్లీవ్‌లపై పట్టీలతో ముద్రించిన ఎరుపు, బూడిద రంగు గీతలతో చొక్కాలు కుట్టిస్తారు.
- నాలుగు, ఐదో తరగతి చదువుతున్న బాలికలకు స్కర్ట్‌పై రెండు పాకెట్లతో పాటు దానిపై పట్టీలతో కూడిన షర్టు పంపిణీ చేస్తారు. ఆరోతరగతి నుంచి 12వ తరగతి బాలికలకు ఎరుపు, బూడిద రంగులో పంజాబీ శైలి దుస్తులు కుట్టిస్తారు. ఒకటి నుంచి ఏడో తరగతి బాలురకు నిక్కరు, షర్టు, 8 నుంచి 12వ తరగతి బాలురకు ప్యాంటు, చొక్కా అందజేస్తారు.

విద్యార్థులకు సకాలంలో ఏక రూప దుస్తులు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. స్థానిక సంస్థల ద్వారా సంబంధిత ప్రధానోపాధ్యాయుడు, ఎస్ఎంసీలు దుస్తులు కుట్టించాలి. అలా కుదరని వారు మాకు సమాచారమందించాలి. వెంటనే టైలర్ని పంపిస్తాం.

– ఐ.విజయకుమారి, డీఈఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

జ్యువెలరీ షాపు కాల్పుల కేసులో మరో నిందితుడిపై పీడీ యాక్ట్



మహమ్మద్ ఫిరోజ్

చైతన్యపురి: చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్కాపురి కాలనీ మహదేవ్ జ్యువెలరీ దుకాణంలో జరిగిన కాల్పుల కేసులో మరొక నిందితుడిపై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ గణపతి జ్యువెలరీ దుకాణం నుంచి నగలు డెలివరీ చేసేందుకు రాగా అదే సమయంలో దుండగులు కాల్పులకు పాల్పడిన విషయం తెలిసిందే. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా పదిమంది నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులంతా చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వీరిలో రాజస్తాన్‌కు చెందిన బన్సీరాం అలియాస్ మనీష్ దేవసిపై ఇప్పటికే పీడీ యాక్ట్ నమోదు చేశారు. కాగా మరో నిందితుడు మహమ్మద్ ఫిరోజ్ (31)పై కూడా రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

'మహిళల రక్షణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం'

కాచిగూడ: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి అన్నారు. శనివారం రాత్రి బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన మహిళా మోర్చా ప్రవాస్ యోజన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళల రక్షణపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ప్రభుత్వంలో ఉన్న పెద్దలే మహిళలను చులకనగా చూస్తున్నారని దుయ్యబట్టారు. 2023 ఎన్నికల్లో బీజేపీ జెండా తెలంగాణలో ఎగురబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఒడిస్సా రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు స్మృతి పట్నాయక్, బీజేపీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనా రాహిత్యంతోనే ప్రమాదాలు

లక్డీకాపూల్: పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు రోడ్డు భద్రతపై అవగాహన లేకపోవడమే కారణమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. వాహనాలను నడిపే సమయంలో నిర్లక్ష్యంగా ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. శనివారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో వైద్య విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్‌పై డీసీపీ అవగాహన కల్పించారు. స్టాఫ్ లైన్, రాంగ్ రూట్, ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ పట్ల ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యల పట్ల అవగాహన కల్పించారు. నడిచివెళ్లేవారు జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలన్నారు. వాహన నడిపేవారికి కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవింగ్ చేసేటపుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ, సత్యనారాయణ, ఆర్ఎంఓ డాక్టర్ హుమీరా, నిమ్స్ పారా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శిరందాస్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



నిమ్స్‌లో వైద్య విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్ రాజు

క్లుప్తంగా...

రేపటి నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

- ఈనెల 8,9 తేదీల్లో ఎస్సై తుది రాత పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాల భర్తీలో భాగంగా సివిల్ ఎస్సై, తత్సమాన పోస్టులకు తుది రాత పరీక్ష హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ఈనెల 3న (సోమవారం) ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్నట్టు టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 8,9 తేదీల్లో హైదరాబాద్‌తోపాటు వరంగల్, కరీంనగర్‌లో సివిల్ ఎస్సై, ఐటీ, కమ్యూనికేషన్ ఎస్సై, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఎస్సై, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై పోస్టులకు తుది రాత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఈనెల 6న అర్ధరాత్రి 12 వరకు గడువున్నట్టు తెలిపారు. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌లో ఇబ్బందులు ఉంటే 9393711110, 9391005006 నంబర్లలో సంప్రదించాలని లేదా support@tslprb.inకు ఈమెయిల్ చేయవచ్చన్నారు.

వ్యవసాయ వర్సిటీలో పీజీ సీట్ల పెంపు

ఏజీ వర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 18వ అకడమిక్ కౌన్సిల్ సమావేశం విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి రఘునందన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 19 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. సంగారెడ్డి అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కళాశాలలో సాయిల్, వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్ ప్రాసెసింగ్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్‌లో పీజీ కోర్సుల్ని ప్రారంభించడానికి అకడమిక్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. దీంతో పాటు 2023–24 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో సీట్లను 210కి పెంచుతూ తీర్మానించారు. పీహెచ్‌డీ కోర్సు సీట్లని 61గా పెంచుతూ నిర్ణయం తీసుకోగా.. 2013–2024 బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్ కోర్సులో 955 సీట్లు, బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) లో 87 సీట్లు, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) 77 సీట్లు, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్‌లో 121 సీట్లకు పెంచుతూ కౌన్సిల్ ఆమోదించింది. అలాగే 60 సీట్లతో ఈ ఏడాది కొత్తగా ఆదిలాబాద్‌లో వ్యవసాయ కళాశాలని ప్రారంభించడానికి ఆమోదముద్ర వేశారు. డిప్లొమా కోర్సులో 760 సీట్లకు ఆమోదం తెలిపారు.

శరత్‌చంద్రారెడ్డికి బెయిల్

సాక్షి, న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టయిన శరత్‌చంద్రారెడ్డికి రౌజ్ అవెన్యూ కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. శరత్‌చంద్రారెడ్డి వేసిన పిటిషన్‌ను శనివారం జస్టిస్ నాగ్‌పాల్ విచారించారు. పిటిషనర్ భార్య వైద్యం నేపథ్యంలో 6 వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

కేన్సర్ రోగులను ఆదుకోండి: జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పేద కుటుంబాలకు చెందిన చాలా మంది ఆస్తులు అమ్ముకుని కేన్సర్ జబ్బుకు చికిత్స చేయించుకోవాల్సి వస్తోందని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేన్సర్ మహమ్మారి సోకిన కొన్ని కుటుంబాలు ఆర్థిక భారాన్ని తట్టుకోలేక చనిపోతున్నారని, మరికొన్ని కుటుంబాలు రోడ్డుపై పడుతున్నాయని శనివారం సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖలో ఆయన వెల్లడించారు. కేన్సర్ రోగుల చికిత్స కోసం నిధిని ఏర్పాటు చేయాలని ఆ లేఖలో కోరారు. కేన్సర్ చికిత్సను ఆరోగ్యశ్రీలో చేర్చాలన్నారు. కేన్సర్ మృతుల కుటుంబాలను కూడా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

బీసీల సంక్షేమానికి నిధులివ్వండి

సాక్షి, న్యూఢిల్లీ : బీసీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ డిమాండ్ చేశారు. ఆయన పలువురు బీసీ నేతలతో కలసి శనివారం ఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలేతో భేటీ అయ్యారు. జనగణనలో కులగణన, బీసీ బిల్లు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు, ప్రత్యేక మంత్రిత్వశాఖ వంటి అంశాలపై అథవాలేతో చర్చించారు. బీసీ అట్రాసిటీ చట్టాన్ని పరిశీలించాలని కోరారు. 15 డిమాండ్లతో వినతిపత్రాన్ని అందజేశారు. కులగణనకు కేంద్రం సుముఖంగానే ఉందని, దీనిపై అధికారులతో చర్చిస్తున్నామని అథవాలే తెలిపారని గుజ్జ కృష్ణ తెలిపారు.

జూన్ 2 నుంచి ఐఏఎల్ జాతీయ మహాసభలు

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ మహాసభలు జూన్ 2, 3, 4 తేదీల్లో కేరళలోని త్రివేండ్రంలో జరగనున్నాయని ఐఏఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తెలిపారు. జాతీయ మహాసభలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. న్యాయవాది గుజ్జుం రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఐఏఎల్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఐఏఎల్ రాష్ట్ర నాయకులు ఏవీ కృష్ణారావు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్దన్, ఎంకే రత్నం, జయశ్రీనివాస్, కె.వి.ఎల్, పి.రాములు, కె.నరేశ్, దామోదర్, అజయకుమారి, బొమ్మగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఐదు రోజుల్లో ఇల్లు రెడీ

భారత నిర్మాణ రంగంలో అడుగుపెట్టిన 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ

- అందుబాటులోకి తెచ్చిన ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థులు
- 600 చ.అడుగుల ఇల్లు.. ఐదు రోజుల్లో నిర్మాణం
- రూ.5.50 లక్షల ఖర్చు.. 60 ఏళ్లకు పైగా మన్నిక
- బెంగళూరులో మరో 3 అంతస్తుల భవనం సిద్ధం
- దేశ అవసరాలకు అనుగుణంగా టెక్నాలజీ వినియోగం



ఇటుక

ఇటుక పేర్చి ఇల్లు కట్టే స్థాయిని దాటేసి.. నచ్చిన మోడల్‌లో ఇంటిని ప్రింటింగ్ చేసుకునే స్థితికి వచ్చేశాడు మనిషి. నెలలు, సంవత్సరాల తరబడి కట్టే ఇళ్లను సైతం త్రీడీ ప్రింటింగ్ హౌసింగ్ టెక్నాలజీ సాయంతో గంటలు.. రోజుల్లోనే చకచకా నిర్మించేస్తున్నాడు.

సాక్షి, అమరావతి: భారత నిర్మాణ రంగంలో కొత్త టెక్నాలజీ చేరింది. శ్రమ లేకుండా ఆధునిక సాంకేతిక పద్ధతిని వినియోగించడం ద్వారా ఇళ్లను సిద్ధం చేయడంపై మద్రాస్ ఐఐటీ పూర్వ విద్యార్థులు చేసిన ప్రయోగాలు ఫలించాయి. సంప్రదాయ నిర్మాణాలకు భిన్నంగా 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ ఇళ్లను అందుబాటులోకి తెచ్చారు. ఇందుకోసం 'త్వస్త మాన్యుఫాక్చరింగ్ సొల్యూషన్స్' పేరుతో స్టార్టప్ సంస్థను స్థాపించి 3డీ ప్రింటర్‌ను అభివృద్ధి చేశారు. ప్రయోగాత్మకంగా ఐఐటీ ప్రాంగణంలోనే కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఓ ఇంటిని నిర్మించారు. ఒకే అంతస్తులో 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో కేవలం రూ.5.50 లక్షల ఖర్చుతో.. ఆధునిక హంగులతో 5 రోజుల్లోనే ఇల్లు పూర్తయిపోయింది. సామగ్రి కొనుగోలు, రవాణా, లేబర్ ఖర్చులు వంటివేమీ లేకుండా నిర్మించిన ఈ ఇళ్లు 50 నుంచి 60 ఏళ్లపాటు నాణ్యతతో మన్నుతాయని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు.

ప్లాన్.. కాంక్రీట్.. ప్రింటింగ్

సాధారణ ఇంటి నిర్మాణం మాదిరిగానే 3డీ ప్రింటింగ్ నిర్మాణం కూడా సాగుతుంది. అయితే, ఇందులో కార్మికులకు బదులుగా యంత్రం నిర్మాణ పని చేస్తుంది. ఇంటిని ఎక్కడ కట్టాలో నిర్ణయించాక, అవసరమైన ప్లాన్ (బ్లూప్రింట్) రూపొందిస్తారు. గోడలు, గదులు ఎలా ఉండాలో ప్లాన్ చేసి ఇంటి బ్లూప్రింట్ మోడలింగ్ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ ద్వారా సిద్ధం చేస్తారు. అనంతరం ప్లాన్‌ను కంప్యూటర్ సాయంతో భారీస్థాయిలో ఉండే 3డీ ప్రింటర్‌కు పంపిస్తారు. ఇంటి ప్రింటింగ్ ప్రారంభించే ముందు.. పేస్ట్ లాంటి బిల్డ్ మిశ్రమాన్ని (కాంక్రీట్) వేసేందుకు అనువుగా నిర్మాణ ప్రాంతం చుట్టూ యంత్రం రోబోటిక్ హ్యాండ్ కదిలేందుకు వీలుగా బిల్డింగ్ సైట్ చుట్టూ పట్టాలు అమరుస్తారు. అన్నీ సరిచూసుకున్నాక యంత్రానికున్న 'ప్రింట్' బటన్ ఆన్ చేయగానే ప్రింటర్ దానికదే ప్లాన్ ప్రకారం నిర్మాణాలన్నీ ప్రారంభించి గోడలు, కిటికీలు, వెంటిలేటర్లు వంటివి పూర్తిచేస్తుంది. ఇందులో ప్రింటర్‌లోని నాజిల్ ద్వారా కాంక్రీట్ మెటీరియల్ బయటకు వస్తే.. దాన్ని మరో కాంక్రీట్ డ్రయర్ నిర్మాణ సామగ్రిని త్వరగా పటిష్టం చేస్తుంది. ఆ వెంటనే దానిపై మరో పొర కాంక్రీట్ వేస్తుంది. ఇలా పొరలు పొరలుగా ప్లాన్‌లో ఉన్నట్టుగా నిర్మాణం పూర్తవుతుంది. ఆపై కిటికీలు, తలుపులు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వైరింగ్ వంటి పనులను కార్మికులతో పూర్తిచేస్తారు.

'త్వస్త'తో జత కట్టిన ఎల్ అండ్ టీ

త్వస్త స్టార్టప్ అందుబాటులోకి తెచ్చిన ఈ 3డీ ఇల్లు దేశాన్ని ఆకర్షిస్తోంది. తక్కువ ఖర్చుతోనే ఆధునిక హంగులతో డబుల్ బెడ్రూమ్ ఇంటిని పూర్తిచేయగలగడంతో ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ త్వస్త మాన్యుఫాక్చరింగ్ సొల్యూషన్స్‌తో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. ఇప్పటికే బెంగళూరులో 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడంతస్తుల 3డీ ప్రింటెడ్ భవన నిర్మాణం పూర్తి చేసింది. భారత తపాలా శాఖకు చెందిన ఈ భవన నిర్మాణానికి కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతి సైతం మంజూరు చేయడం గమనార్హం. కొత్తగా వచ్చిన 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ ఇప్పటికే ప్రపంచంలోని చాలా దేశాలను ప్రభావితం చేసిందని.. ఈ టెక్నాలజీలో పెద్దఎత్తున ఇళ్ల నిర్మాణం చేపడితే తక్కువ సమయంలోనే లక్షలాది మందికి సొంతింటి కలను నిజం చేయవచ్చని ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.

రూ.2 వేల కోట్లతో గిరిజన ప్రాంతాల్లో పక్కా రోడ్లు

- రాష్ట్రవ్యాప్తంగా 1,179 రోడ్ల నిర్మాణానికి అనుమతులు జారీ
- ప్రతి యూనివర్సిటీలో గిరిజన బాలబాలికలకు వసతి గృహాలు
- మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్, క్రిస్టినా జెడ్ చొంగ్తు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో పక్కా రోడ్లు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్లు మంజూరు చేసిందని, ఈ పనులకు సంబంధించిన అనుమతులు తాజాగా జారీ అయ్యాయని గిరిజన, మహిళాభివృద్ధి శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడించారు. ఈ రోడ్లతో గిరిజన ప్రాంతాల రూపురేఖలు మారిపోతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో 1,179 రోడ్ల నిర్మాణ పనులను ఈ నిధులతో చేపడతామన్నారు. మొత్తం 3,152.41 కిలోమీటర్ల మేర పనులకు త్వరలో టెండర్లు పూర్తి చేస్తామని, వెనువెంటనే పనులు ప్రారంభించి ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా తలపెట్టిన కార్యక్రమాలను శనివారం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి వివరించారు. రాష్ట్రంలోని ప్రతి యూనివర్సిటీ క్యాంపస్‌లో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేకంగా గిరిజన బాలబాలికల వసతి గృహాలను నిర్మించనుందని తెలిపారు. ఇప్పటికే వరంగల్ కాకతీయ యూనివర్సిటీ పరిధిలో 500 మంది విద్యార్థులకు సరిపడేలా హాస్టళ్లను నిర్మిస్తున్నామన్నారు. 3,467 గిరిజన ఆవాసాలకు రూ.324 కోట్లు ఖర్చు చేసి త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించడంతో దాదాపు 2.4 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11లక్షల ఎకరాల పోడు భూములకు సంబంధించి 4 లక్షల దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిశీలన ప్రక్రియ తుది దశకు చేరిందని వెల్లడించారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు త్వరలో పోడు భూముల పట్టాలకు సంబంధించి నిర్ణయం తీసుకుంటాయని, ఆ తర్వాత వెంటనే పట్టాలు పంపిణీ చేసేందుకు గిరిజన సంక్షేమ శాఖ సిద్ధంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు పార్లమెంటు చట్టం చేసినప్పటికీ ఇప్పటికీ అందుబాటులోకి రాకపోవడం బాధాకర మన్నారు. గిరిజన వర్సిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 4 వందల ఎకరాల భూమి అప్పగించిందని, దీనితో పాటు భవనాలు, ఇతర వసతులను కూడా కల్పించి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి బాధ్యతలు అప్పగించిందన్నారు. ఇదంతా పూర్తయి దాదాపు మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ తరగతులు ప్రారంభం కాకపోవడంతో గిరిజన బిడ్డలు ఉన్నత చదువులకు నోచుకోలేకపోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, ట్రైకార్ చైర్మన్ రామచంద్రనాయక్, జీసీసీ చైర్మన్ రమావత్ వాల్యా నాయక్, గిరిజన సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో 3.25 శాతం వృద్ధి

2022–23లో సింగరేణి భారీ ప్రగతి.. సీఎండీ శ్రీధర్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ 2022–23 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి, రవాణాలో భారీ వృద్ధిని నమోదు చేసిందని సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ వెల్లడించారు. సంస్థ చరిత్రలోనే అత్యధికంగా 671 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 418 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ (మట్టి) తొలగింపు జరిపిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021–22లో సాధించిన 650 టన్నుల బొగ్గు ఉత్పత్తితో పోల్చితే గతేడాది 3.25 శాతం వృద్ధిని నమోదు చేసిందన్నారు. 2017–18లో అత్యధికంగా 392 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించగా, దానిపై 7 శాతం వృద్ధిని గతేడాది నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 2 శాతం వృద్ధితో 667 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిపిందని పేర్కొన్నారు. కార్మికులు, అధికారులకు ఈ సందర్భంగా శ్రీధర్ అభినందనలు తెలిపారు. 2023–24లో 750 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని కోరారు. సింగరేణిలో మొత్తం 11 ఏరియాలు ఉండగా, 5 ఏరియాలు 100 శాతం లక్ష్యాలను సాధించాయని, 18 ఓపెన్ కాస్ట్ గనుల్లో 11 ఓపెన్ కాస్ట్ గనులు 100 శాతం ఉత్పత్తి సాధించాయని వివరించారు. 8 భూగర్భ గనులు కూడా 100 శాతం ఉత్పత్తి జరిపాయన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం గత ఆర్థిక సంవత్సరంలో 9,304 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, ప్రభుత్వ రంగ విద్యుత్ కేంద్రాల్లో అగ్రస్థానంలో నిలిచిందని శ్రీధర్ వెల్లడించారు.

ఆదాయ లక్ష్యం నెరవేరింది..

- 2022–23 ఆర్థిక సంవత్సరంలో మూడు కీలక శాఖల్లో భారీ ఆదాయం
- ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ల శాఖల ఆదాయం రూ.75 వేల కోట్లు
- గతేడాదితో పోలిస్తే రూ. 11 వేల కోట్లు ఎక్కువ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నిధులు సమకూర్చిపెట్టే మూడు కీలక శాఖలూ ఈ ఏడాది ఆదాయాన్ని బాగానే ఆర్జించాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను వాణిజ్య పన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్ శాఖల రాబడులు ఆశించిన మేర రావడంతో ఆర్థిక శాఖ వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి. ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో అంచనాలకు మించిన ఆదాయం రాగా రిజిస్ట్రేషన్ల శాఖ మాత్రం ఆదాయ అంచనాలకు కూతవేటు దూరంలోనే ఆగిపోయింది. మొత్తంమీద ఈ మూడు శాఖల ద్వారా ప్రభుత్వ అంచనాలకు తగ్గట్టుగానే రూ. 75 వేల కోట్లు (వ్యాట్ కాకుండా) సమకూరడం గమనార్హం.

సవరించిన మేరకు వాణిజ్య పన్నులు

వాణిజ్య పన్నుల శాఖ వస్తు సేవల పన్ను (జీఎస్టీ), అమ్మకపు పన్ను (వ్యాట్) రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ఈ శాఖ ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 75,300 కోట్లు ఆదాయం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో జీఎస్టీ రూ. 42 వేల కోట్లు కాగా అమ్మకపు పన్ను ద్వారా రూ. 33 వేల కోట్లు వస్తాయని తొలుత భావించింది. అయితే ఆ తర్వాత అంచనాల మేరకు ఈ రెండు కేటగిరీల్లో కలిపి రూ. 72,500 కోట్లుగా ఆదాయ అంచనాను సవరించింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి వరకు రూ. 65,273 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఇందులో జీఎస్టీ 38,265 కోట్లు కాగా, మిగిలింది వ్యాట్ ద్వారా లభించింది. ఇక మార్చితో కలిపి ఆదాయం రూ.72,525 కోట్లు దాటింది. ఇందులో జీఎస్టీ కింద రూ. 42 వేల కోట్లకుపైగా రాగా వ్యాట్ రూపంలో రూ. 30 వేల కోట్లు సమకూరాయి. గతేడాదితో పోలిస్తే ఇది 12 శాతం ఎక్కువ కావడం విశేషం.

గతేడాది కంటే రూ. 2,200 కోట్లు అధికంగా

ఇక స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ. 15,600 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో సమకూరుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే మార్చి 31 నాటికి రూ. 14,250 కోట్ల వరకు ఆదాయం వచ్చినట్లు రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాల ద్వారా తెలిసింది. కాగ్‌కు నివేదించిన లెక్కల ప్రకారం 2021–22 ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ. 12,372 కోట్ల రెవెన్యూ వచ్చింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి అంతకంటే రూ. 2,200 కోట్ల వరకు అదనంగా రూ. 14,250 కోట్ల మేర ఆదాయం రావడం గమనార్హం. అయితే ప్రభుత్వం అంచనా వేసిన దాని కంటే రూ. 1,400 కోట్ల మేర రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయంలో గండి పడింది.

రికార్డు స్థాయిలో 'లిక్కర్ అమ్మకాలు'

ఈ ఆర్థిక సంవత్సరంలో లిక్కర్ అమ్మకాలు భారీ స్థాయిలో జరిగాయి. గత ఆర్థిక సంవత్సరం (2021–22)లో రూ. 30,783 కోట్ల విలువైన 3.7 కోట్ల లిక్కర్, 3.47 కోట్ల బీర్ కేసులు అమ్ముడయ్యాయి. అదే 2022–23 సంవత్సరానికి వచ్చేసరికి రూ. 35,116 కోట్లకుపైగా విలువైన మద్యం అమ్ముడయింది. ఇందులో 3.51 కోట్ల లిక్కర్, 4.78 కోట్ల బీర్ కేసులున్నాయి. ఈ అమ్మకాల ద్వారా అమ్మకపు పన్ను పోను రూ. 18,827 కోట్ల వరకు ఎక్సైజ్ శాఖకు అదాయం వచ్చినట్లు తెలుస్తోంది. ఇక మూడు కీలక శాఖల్లో కలిపి గతేడాది రూ. 64 వేల కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం లభించింది. ఇందులో జీఎస్టీ ద్వారా రూ.34,500 కోట్లు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ. 12,372 కోట్లు, ఎక్సైజ్ ద్వారా రూ. 17,482 కోట్లు వచ్చాయి. అదే ఈ ఏడాదిలో రూ. 11 వేల కోట్లు ఎక్కువగా రూ. 75 వేల కోట్ల వరకు సమకూరడం విశేషం.

త్వరలో ప్రత్యేక అగ్నిదళం



అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితులు, విపత్తులు ఎదుర్కొనేలా శిక్షణ

- 50 మంది సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డీజీ నాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: అగ్ని ప్రమాదాలతోపాటు ఇతర అత్యవసర పరిస్థితులు, విపత్తుల సమయంలో వెంటనే రంగంలోకి దిగేలా సుశిక్షితులైన 50 మంది అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి తెలిపారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) తరహాలో ఉండే ఈ బృందానికి అన్నిరకాల అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తామని వెల్లడించారు. ఈ బృందం హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తుందని తెలిపారు. అగ్నిమాపకశాఖ సిబ్బందికి ఇస్తున్న శిక్షణ, అందుబాటులో ఉన్న ఫైర్ ఫైటింగ్ పరికరాలు, అగ్నిప్రమాదాల నియంత్రణకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలను శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డీజీ నాగిరెడ్డి, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ లక్ష్మి ప్రసాద్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ పాపయ్య, ఫైర్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ప్రసన్న కుమార్‌తో కలిసి వివరించారు. తొలుత అగ్నిప్రమాదం జరిగినప్పుడు మంటలను ఆర్పేందుకు వినియోగించే పరికరాలు, బ్రాంటో స్కైలిఫ్ట్ పనితీరును మాదాపూర్ ఫైర్ స్టేషన్‌లో అధికారులు వివరించారు. అనంతరం బహుళ అంతస్తుల్లో నిర్మితమవుతున్న అరబిందో భవనం, గోపన్‌పల్లిలోని హానర్స్ హోమ్స్ భవనంలో ఫైర్ సేఫ్టీ కోసం ఏ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నది ప్రయోగాత్మకంగా పరిశీలించి చూపారు. వట్టినాగులపల్లి అగ్నిమాపకశాఖ శిక్షణ కేంద్రంలో సిబ్బందికి ఇస్తున్న శిక్షణ, ఏర్పాటు చేసిన వ్యవస్థను సైతం డీజీ నాగిరెడ్డి వివరించారు.

అగ్నిప్రమాదాల నియంత్రణకు సంసిద్ధం

వేసవిలో ఎదురయ్యే అగ్నిప్రమాదాలను నియంత్రించేందుకు అగ్నిమాపకశాఖ సన్నద్ధంగా ఉందని నాగిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 137 ఫైర్‌స్టేషన్లలో అన్ని రకాలు కలిపి 400కుపైగా ఫైర్ వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫైర్ సేఫ్టీ పరికరాలు పనిచేయకపోవడంతోనే స్వప్నలోక్ భవనంలో అగ్నిప్రమాదం సంభవించి ప్రాణనష్టం జరిగిందని గుర్తు చేశారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ఎక్కువ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఫైర్ ఫైటింగ్ కోసం రోబోలు, డ్రోన్లను వినియోగించేలా ప్రణాళికలు ఉన్నాయని, మరో ఏడాదిలో ఇవి అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. అగ్నిప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందికి సైతం శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అగ్నిమాపక సిబ్బందికి సైతం ఆరోగ్య భద్రత సదుపాయం కల్పించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని నాగిరెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఫైర్‌సిబ్బంది నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో పలురకాల అగ్నిప్రమాదాలను ఎలా నియంత్రిస్తారన్నది ప్రయోగాత్మకంగా చూపారు.

ఆస్తిపన్ను వసూళ్లు రూ. 825.87 కోట్లు

- మునిసిపాలిటీల్లో గతేడాదితో పోలిస్తే 127.62 కోట్లు అదనం
- హైదరాబాద్ మినహా 128 మునిసిపాలిటీలు, 12 కార్పొరేషన్లలో నిర్దేశిత లక్ష్యంలో 72.03 శాతం వసూలు
- 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఎర్లీబర్డ్ పథకం.. ఐదు శాతం రాయితీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పురపాలక సంఘాలు, సంస్థల నుంచి ఆస్తిపన్ను రూపంలో రూ.825.87 కోట్లు వసూలయ్యాయి. జీహెచ్ఎంసీ మినహా 128 మునిసిపాలిటీలు, 12 కార్పొరేషన్ల పరిధిలో నిర్దేశిత లక్ష్యం రూ.1,146.56 కోట్లలో 72.03 శాతం మేర వసూలైంది. 2021–22 ఏడాది ఆస్తిపన్ను వసూళ్లతో పోలిస్తే ఈసారి రూ.127.62 కోట్లు అదనంగా సమకూరాయి. ఆస్తిపన్ను వసూళ్లలో హైదరాబాద్ మినహా 12 కార్పొరేషన్లలో 92.33 శాతం పన్ను వసూళ్లతో ఫిర్జాదిగూడ మొదటిస్థానంలో నిలవగా, 55.02 శాతం పన్ను వసూళ్లతో నిజామాబాద్ చివరి స్థానంలో ఉంది. మునిసిపాలిటీలలో జగిత్యాల జిల్లా కోరుట్లలో అత్యధికంగా 97.39 శాతం, నిర్మల్ జిల్లా భైంసాలో అత్యల్పంగా 26.93 శాతం మాత్రమే వసూలైంది. ఆస్తిపన్ను, భవన నిర్మాణాల ఫీజుల వసూళ్లతో మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రతి సంవత్సరం ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. చిన్న మునిసిపాలిటీల్లో కూడా పన్నువసూళ్లు ఆశాజనకంగా ఉండటంతో ప్రభుత్వానికి ఏయేటికాయేడు ఆదాయం పెరుగుతోంది. ఆర్థిక సంవత్సరం ముగింపునకు రెండు నెలల ముందు నుంచే కమిషనర్ అండ్ డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సత్యనారాయణ మునిసిపల్ కమిషనర్లతో తరుచూ సమావేశాలు నిర్వహించడం, ఆదాయలక్ష్యాలను చేరుకునేందుకు అవసరమైన సమీక్షలు ఎప్పటికప్పుడు చేయడంవల్ల పన్నువసూళ్లలో పురోగతి స్పష్టంగా కనిపించింది. మునిసిపాలిటీల్లో అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న గ్రాంట్లతోపాటు స్వయంగా ఆదాయం సమకూర్చుకోవడం తప్పనిసరని సీడీఎంఏ సత్యనారాయణ పేర్కొన్నారు. ఆస్తిపన్నుకు సంబంధించిన వివాదాలను పరిష్కరించేందుకు ప్రతీ మంగళ, గురు, ఆదివారాల్లో మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఏప్రిల్ 30లోగా ఆస్తిపన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లించినవారికి ఎర్లీబర్డ్ స్కీమ్ వర్తిస్తుందని కమిషనర్, డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సత్యనారాయణ తెలిపారు. ఆస్తిపన్ను మొత్తం చెల్లించేవారికి ఐదుశాతం రాయితీ లభిస్తుందన్నారు. ఆస్తిపన్ను మునిసిపల్ కార్యాలయానికి రాకుండానే పేమెంట్ యాప్స్ ద్వారా చెల్లించవచ్చని పేర్కొన్నారు. పన్నుచెల్లింపు దారులకు మునిసిపాలిటీలు పంపించే ఎస్ఎంఎస్‌లలో లింక్ తెరిచి పన్ను చెల్లించవచ్చని, లేదంటే వాట్సాప్ చాట్‌బాట్ నంబర్ 90002 53342 ద్వారా కూడా చెల్లించవచ్చని వివరించారు.

రాష్ట్రంలోని 12 కార్పొరేషన్లలో 2022-23 సంవత్సరం ఆస్తిపన్ను

కార్పొరేషన్	నిర్దేశిత లక్ష్యం	వసూళ్లు	వసూళ్ల శాతం
నిజామాబాద్	60.98	33.55	55.02
రామగుండం	11.42	7.54	66.08
మీర్‌పేట	14.05	8.70	61.91
బడంగ్‌పేట	24.17	17.76	73.48
బండ్లగూడ జాగీర్	21.30	15.95	74.89
గ్రేటర్ వరంగల్	86.45	65.07	75.27
కరీంనగర్	34.00	28.98	85.22
ఖమ్మం	33.12	27.08	81.74
జవహర్‌నగర్	10.80	7.87	72.86
పీర్జాదిగూడ	14.50	13.38	92.33
బోడుప్పల్	23.05	15.48	67.13
నిజాంపేట్	52.30	39.51	75.54

రూ.20కి 'హై ప్రైస్' కరెంట్!

- అమ్ముకోవడానికి విద్యుత్ ఎక్స్ఛేంజీలకు అనుమతి
- ఇతర సెగ్మెంట్ల కింద యూనిట్ విద్యుత్ ధర రూ.10

సాక్షి, హైదరాబాద్: వేసవిలో దేశవ్యాప్తంగా డిమాండ్ భారీగా పెరిగిన నేపథ్యంలో హైప్రైస్ సెగ్మెంట్ కింద విద్యుత్ ఎక్స్ఛేంజీల్లో యూనిట్‌కు రూ.20 గరిష్ట పరిమితితో విద్యుత్‌ను విక్రయించుకోవడానికి అనుమతిస్తూ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (సీఈఆర్సీ) ఉత్తర్వులు జారీ చేసింది. హైప్రైస్ డే అహెడ్ మార్కెట్ సెగ్మెంట్ పేరుతో ఈ విక్రయాలు జరపుకోవచ్చు. ఇతర సెగ్మెంట్ల కింద యూనిట్‌కు రూ.10 గరిష్ట పరిమితితో విక్రయాలు జరపాలని ఆదేశించింది. గతేడాది వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరగడంతో ఎక్స్ఛేంజీల్లో ధరలు ఆకాశాన్ని తాకాయి. దీంతో ఎక్స్ఛేంజీల్లో విక్రయించే ధరలపై యూనిట్‌కు రూ.12 గరిష్ఠ పరిమితి విధిస్తూ 2022 జూన్ 30న సీఈఆర్సీ సుమోటో ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా జారీ చేసిన ఉత్తర్వులతో పవర్ ఎక్స్ఛేంజీల్లో విద్యుత్ ధరలు యూనిట్‌కు హైప్రైస్ సెగ్మెంట్ కింద రూ.0–20, ఇతర సెగ్మెంట్ల కింద రూ.0–10 వరకు ఉంటాయి. మరుసటి రోజుకు అవసరమైన అదనపు విద్యుత్‌ను ఒకరోజు ముందే విద్యుత్ ఎక్స్ఛేంజీల్లో డే అహెడ్ మార్కెట్, గ్రీన్ డే అహెడ్ మార్కెట్ విధానంలో డిస్కంలు కొనుగోలు చేస్తాయి. అదేరోజు అవసరమైన విద్యుత్‌ను కనీసం 15 నిమిషాల ముందు రియల్ టైమ్ మార్కెట్ విధానంలో బుక్ చేసుకుంటాయి. ఈ విభాగాల కింద రూ.0–10 ధరతో యూనిట్ విద్యుత్ విక్రయాలకు తాజాగా సీఈఆర్సీ అనుమతిచ్చింది. దిగుమతి చేసిన బొగ్గు/గ్యాస్ ఆధారిత విద్యుత్‌ను ఎక్స్ఛేంజీల్లో హైప్రైస్ డే అహెడ్ మార్కెట్ విభాగం కింద యూనిట్‌కు రూ.50 ధరతో విక్రయించడానికి ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజీకి అనుమతిస్తూ ఫిబ్రవరి 16న సీఈఆర్సీ ఉత్తర్వులిచ్చింది. తాజా ఆదేశాలతో యూనిట్‌కు రూ.20 గరిష్ట ధరతో హైప్రైస్ విద్యుత్ అమ్ముకోవడానికి అన్ని పవర్ ఎక్స్ఛేంజీలకు అనుమతిచ్చినట్టు అయింది.



వెర్‌స్టాపెన్‌కు పోల్ పొజిషన్

ఫార్ములావన్ సీజన్‌లోని మూడో రేసు ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రిలో తొలి విజయమే లక్ష్యంగా ప్రపంచ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ బరిలోకి దిగనున్నాడు. మెల్‌బోర్న్‌లో శనివారం జరిగిన క్వాలిఫయింగ్ సెషన్‌లో వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ల్యాప్‌ను ఒక నిమిషం 16.732 సెకన్లలో పూర్తి చేసి 'పోల్ పొజిషన్' సాధించాడు. తద్వారా నేడు జరిగే ప్రధాన రేసును వెర్‌స్టాపెన్ తొలి స్థానం నుంచి ప్రారంభించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. ఇప్పటి వరకు ఆరుసార్లు ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రిలో పోటీపడ్డ వెర్‌స్టాపెన్ 2019లో అత్యుత్తమంగా మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. నేటి ప్రధాన రేసులో వెర్‌స్టాపెన్‌కు మెర్సిడెస్ జట్టు డ్రైవర్లు జార్జి రసెల్, లూయిస్ హామిల్టన్ నుంచి గట్టిపోటీ లభించనుంది. రసెల్ రెండో స్థానం నుంచి, హామిల్టన్ మూడో స్థానం నుంచి రేసును ప్రారంభిస్తారు. ఈ సీజన్‌లో రెండు రేసులు జరగ్గా.. తొలి రేసు బహ్రెయిన్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్, రెండో రేసు సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రిలో సెర్జియో పెరెజ్ విజేతలుగా నిలిచారు.

లక్నో 'సూపర్' విజయం

50 పరుగులతో ఢిల్లీ చిత్తు
- కైల్ మేయర్స్ మెరుపు హాఫ్ సెంచరీ
- మార్క్ వుడ్‌కు ఐదు వికెట్లు



మేయర్స్

లక్నో: కేఎల్ రాహుల్ నాయకత్వంలోనే లక్నో సూపర్ జెయింట్స్ ఐపీఎల్ కొత్త సీజన్‌లో శుభారంభం చేసింది. శనివారం ఏకపక్షంగా సాగిన పోరులో లక్నో 50 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. కైల్ మేయర్స్ (38 బంతుల్లో 73; 2 ఫోర్లు, 7 సిక్సర్లు) చెలరేగాడు. అనంతరం ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లకు 143 పరుగులే చేయగలిగింది. డేవిడ్ వార్నర్ (48 బంతుల్లో 56; 7 ఫోర్లు), రిలీ రోసో (20 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. పదునైన పేస్‌తో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మార్క్ వుడ్ (5/14) ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు.

నిరాశపర్చిన రాహుల్


లక్నో ఇన్నింగ్స్ నెమ్మదిగా ప్రారంభమైంది. కెప్టెన్ కేఎల్ రాహుల్ (8) విఫలం కాగా, పవర్‌ప్లేలో స్కోరు 30 పరుగులే. అయితే ఆ తర్వాత మేయర్స్ చెలరేగిపోయాడు. ముకేశ్ ఓవర్లో 2 సిక్స్‌లు, అక్షర్ ఓవర్లో అతను వరుసగా 4, 6 బాదాడు. కుల్దీప్ ఓవర్లో సిక్సర్‌తో 28 బంతుల్లోనే అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాతా తన జోరు కొనసాగిస్తూ మేయర్స్ 4 బంతుల వ్యవధిలో 3 సిక్స్‌లు కొట్టడం విశేషం. మరో ఎండ్‌లో హుడా (17), స్టొయినిస్ (12), కృనాల్ పాండ్యా (15 నాటౌట్) ప్రభావం చూపలేకపోయారు. సకారియా వేసిన 17వ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్‌తో 19 పరుగులు రాబట్టిన లక్నో... అతను వేసిన 20వ ఓవర్లోనూ 3 సిక్సర్లతో 22 పరుగులు పిండుకుంది. చివర్లో నికోలస్ పూరన్ (21 బంతుల్లో 36; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ లక్నో భారీ స్కోరుకు కారణమైంది.

టపటపా...

ఉనాద్కట్ ఓవర్లో మూడు ఫోర్లతో ఆట మొదలు పెట్టిన వార్నర్ జోరుతో 4 ఓవర్లలో ఢిల్లీ స్కోరు 40 పరుగులకు చేరగా, భారీ లక్ష్యం దిశగా శుభారంభం లభించినట్లు అనిపించింది. అయితే లక్నో బౌలర్లు వుడ్, రవి బిష్ణోయ్ 7 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టి పడేశారు. కొద్ది సేపు ధాటిని ప్రదర్శించిన రోసో, పావెల్ (1) కూడా ఎనిమిది పరుగుల వ్యవధిలో వెనుదిరగడంతో ఢిల్లీ గెలుపు ఆశలు సన్నగిల్లాయి. మరో వైపు ఒంటరి పోరుతో 45 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించి వార్నర్ పోరాడినా లాభం లేకపోయింది.

ఆ క్యాచ్ పట్టి ఉంటే...

ఐపీఎల్‌లో తన తొలి మ్యాచ్ ఆడిన కైల్ మేయర్స్‌కు అదృష్టం కలిసొచ్చింది. సకారియా బౌలింగ్‌లో షార్ట్ థర్డ్‌మాన్ వద్ద అతను ఇచ్చి అతి సునాయాస క్యాచ్‌ను ఖలీల్ అహ్మద్ వదిలేశాడు. ఆ సమయంలో మేయర్స్ స్కోరు 14. ఆ తర్వాత చెలరేగిన అతను తన స్కోరుకు మరో 59 పరుగులు జోడించడం విశేషం.



మార్క్ వుడ్ (5/14)

స్కోరు వివరాలు


లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) అక్షర్ (బి) సకారియా 8; మేయర్స్ (బి) అక్షర్ 73; హుడా (సి) వార్నర్ (బి) కుల్దీప్ 17; కృనాల్ (నాటౌట్) 15; స్టొయినిస్ (సి) సర్ఫ‌రాజ్ (బి) ఖలీల్ 12; పూరన్ (సి) పృథ్వీ షా (బి) ఖలీల్ 36; బదోని (సి) సర్ఫరాజ్ (బి) సకారియా 18; కృష్ణప్ప గౌతమ్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 193. వికెట్ల పతనం:** 1–19, 2–98, 3–100, 4–117, 5–165, 6–187. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4–0–30–2, ముకేశ్ 4–0–34–0, సకారియా 4–0–53–2, అక్షర్ 4–0–38–1, కుల్దీప్ 4–0–35–1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (బి) వుడ్ 12; వార్నర్ (సి) గౌతమ్ (బి) అవేశ్ 56; మార్ష్ (బి) వుడ్ 0; సర్ఫరాజ్ (సి) గౌతమ్ (బి) వుడ్ 4; రోసో (సి) మేయర్స్ (బి) బిష్ణోయ్ 30; పావెల్ (ఎల్బీ) (బి) బిష్ణోయ్ 1; అమాన్ (సి) పూరన్ (బి) అవేశ్ 4; అక్షర్ (సి) (సబ్) మన్కడ్ (బి) వుడ్ 16; కుల్దీప్ (నాటౌట్) 6; సకారియా (సి) కృనాల్ (బి) వుడ్ 4; ముకేశ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 143. వికెట్ల పతనం:** 1–41, 2–41, 3–48, 4–86, 5–94, 6–112, 7–113, 8–139, 9–143. **బౌలింగ్:** మేయర్స్ 1–0–7–0, ఉనాద్కట్ 3–0–39–0, గౌతమ్ 4–0–23–0, అవేశ్ ఖాన్ 4–0–29–2, మార్క్ వుడ్ 4–0–14–5, బిష్ణోయ్ 4–0–31–2.

పంజాబ్‌దే పైచేయి

కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై ఏడు పరుగులతో గెలుపు

రాణించిన రాజపక్స, అర్‌ష్‌దీప్ సింగ్



అర్‌ష్‌దీప్ సింగ్

మొహాలి: సొంతగడ్డపై పంజాబ్ కింగ్స్ శుభారంభం చేసింది. ఐపీఎల్ టి20 క్రికెట్ టోర్నీలో భాగంగా శనివారం మాజీ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఏడు పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడు కీలక వికెట్లతో పంజాబ్ విజయంలో ముఖ్య పాత్ర పోషించిన అర్‌ష్‌దీప్ సింగ్ (3/19)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. రాజపక్స (32 బంతుల్లో 50; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో మెరిపించగా... శిఖర్ ధావన్ (29 బంతుల్లో 40; 6 ఫోర్లు), ప్రభ్‌సిమ్రన్ (12 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా దూకుడుగా ఆడారు. పంజాబ్ ఇన్నింగ్స్ ముగిశాక మైదానంలో ఫ్లడ్‌లైట్‌లు మొరాయించడంతో కోల్‌కతా ఇన్నింగ్స్ అరగంట ఆలస్యంగా మొదలైంది. 192 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా 16 ఓవర్లలో 7 వికెట్లకు 146 పరుగులు చేసిన దశలో భారీ వర్షంతో ఆట నిలిచిపోయింది. వర్షం తగ్గకపోవడంతో ఆట సాధ్యపడలేదు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 16 ఓవర్ల వరకు కోల్‌కతా విజయ సమీకరణం 154 పరుగులుగా ఉంది. 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన కోల్‌కతాను రసెల్ (19 బంతుల్లో 35; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), వెంకటేశ్ అయ్యర్ (28 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకున్నారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 50 పరుగులు జోడించడంతో గెలుపుపై కోల్‌కతా ఆశలు పెంచుకుంది. అయితే వీరిద్దరిని వరుస ఓవర్లలో పంజాబ్ బౌలర్లు పెవిలియన్ పంపించడం, ఆ వెంటనే వర్షం రావడంతో కోల్‌కతాకు నిరాశ తప్పలేదు.

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ × రాజస్తాన్	(మ. గం. 3:30 నుంచి)
బెంగళూరు × ముంబై	(రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి) గుర్బాజ్ (బి) సౌతీ 23; శిఖర్ ధావన్ (బి) వరుణ్ చక్రవర్తి 40; రాజపక్స (సి) రింకూ సింగ్ (బి) ఉమేశ్ 50; జితేశ్ శర్మ (సి) ఉమేశ్ (బి) సౌతీ 21; సికందర్ రజా (సి) నితీశ్ రాణా (బి) నరైన్ 16; స్యామ్ కరన్ (నాటౌట్) 26; షారుఖ్ ఖాన్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 191. వికెట్ల పతనం:** 1–23, 2–109, 3–135, 4–143, 5–168. **బౌలింగ్:** ఉమేశ్ యాదవ్ 4–0–27–1, సౌతీ 4–0–54–2, సునీల్ నరైన్ 4–0–40–1, వరుణ్ చక్రవర్తి 4–0–26–1, శార్దుల్ ఠాకూర్ 4–0–43–0.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: మన్‌దీప్ సింగ్ (సి) స్యామ్ కరన్ (బి) అర్‌ష్‌దీప్ సింగ్ 2; గుర్బాజ్ (బి) ఎలిస్ 22; అనుకూల్ రాయ్ (సి) సికందర్ రజా (బి) అర్‌ష్‌దీప్ సింగ్ 4; వెంకటేశ్ అయ్యర్ (సి) రాహుల్ చహర్ (బి) అర్‌ష్‌దీప్ సింగ్ 34; నితీశ్ రాణా (సి) రాహుల్ చహర్ (బి) సికందర్ రజా 24; రింకూ సింగ్ (సి) సికందర్ రజా (బి) రాహుల్ చహర్ 4; ఆంద్రీ రసెల్ (సి) సికందర్ రజా (బి) స్యామ్ కరన్ 35; శార్దుల్ ఠాకూర్ (నాటౌట్) 8; సునీల్ నరైన్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (16 ఓవర్లలో 7 వికెట్లకు) 146.**

వికెట్ల పతనం: 1–13, 2–17, 3–29, 4–75, 5–80, 6–130, 7–138.

బౌలింగ్: స్యామ్ కరన్ 3–0–38–1, అర్‌ష్‌దీప్ సింగ్ 3–0–19–3, ఎలిస్ 3–0–27–1, సికందర్ రజా 3–0–25–1, రిషి ధావన్ 1–0–15–0, రాహుల్ చహర్ 2–0–12–1, హర్‌ప్రీత్ బ్రార్ 1–0–7–0.

ఫైనల్లో సింధు



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు ఫైనల్లోకి ప్రవేశించింది. సెమీఫైనల్లో సింధు 24–22, 22–20తో యో జియా మిన్ (సింగపూర్)పై గెలిచి ఈ ఏడాది తొలిసారి ఓ టోర్నీలో ఫైనల్ చేరింది. గత ఏడాది కామన్వెల్త్ గేమ్స్‌లో, సింగపూర్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన తర్వాత సింధు మరో టోర్నీలో తుది పోరుకు అర్హత పొందడం ఇదే తొలిసారి. నేడు జరిగే ఫైనల్లో గ్రెగోరియా మరిస్కా తుంజుంగ్ (ఇండోనేసియా)తో సింధు తలపడుతుంది.

హంపి, హారిక గేమ్‌లు 'డ్రా'



న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, అంతర్జాతీయ మాస్టర్ వైశాలి తమ ఏడో రౌండ్ గేమ్‌లను 'డ్రా'గా ముగించారు. శనివారం జరిగిన ఏడో రౌండ్‌లో బిబిసారా (కజకిస్తాన్)తో ఆడిన హంపి 37 ఎత్తుల్లో... వైశాలితో జరిగిన గేమ్‌ను హారిక 42 ఎత్తుల్లో 'డ్రా'గా చేసుకున్నారు. ఏడో రౌండ్ తర్వాత హంపి మూడు పాయింట్లతో ఐదో ర్యాంక్‌లో, హారిక రెండు పాయింట్లతో ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్నారు.

అల్‌కరాజ్‌కు షాక్



ఫ్లోరిడా: మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీ నుంచి డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ (స్పెయిన్) నిష్క్రమించాడు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో పదో సీడ్ సినెర్ (ఇటలీ) 6–7 (4/7), 6–4, 6–2తో టాప్ సీడ్ అల్‌కరాజ్‌ను బోల్తా కొట్టించి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఈ ఓటమితో అల్‌కరాజ్ తన నంబర్‌వన్ ర్యాంక్‌ను సెర్బియా దిగ్గజం జొకోవిచ్‌కు కోల్పోనున్నాడు.

విజేత సాకేత్–యూకీ జోడీ



సాక్షి, హైదరాబాద్: జిరోనా ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని భారత్‌కే చెందిన తన సహచరుడు యూకీ బాంబ్రీతో కలిసి డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. స్పెయిన్‌లో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో సాకేత్–యూకీ జోడీ 6–4, 6–4తో సెర్వాంటెస్–రొకా బటాలా (స్పెయిన్) ద్వయంపై గెలిచింది. సాకేత్–యూకీలకు 4,250 యూరోల (రూ. 3 లక్షల 79 వేలు) ప్రైజ్‌మనీతో పాటు 75 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఓవరాల్‌గా సాకేత్–యూకీ జోడీకిది ఎనిమిదో టైటిల్ కాగా, ఈ ఏడాది రెండోది. గత జనవరిలో వీరిద్దరు నొంతబురి ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ సాధించారు.

సినిమా

ట్యూన్ అయ్యారు

తెలుగు తెరపై పరభాషా తారలు చాలామంది కనిపిస్తుంటారు. తెరవెనక పరభాషా సాంకేతిక నిపుణులు పని చేస్తుంటారు. ముఖ్యంగా పలువురు పరభాషా సంగీతదర్శకులు టాలీవుడ్‌కి ట్యూన్ అయ్యారు. ఈ ఏడాది తెలుగు చిత్రాలకు ఎక్కువగా ఇతర భాషల సంగీతదర్శకులు ట్యూన్లు ఇస్తున్నారు. వారి గురించి తెలుసుకుందాం.



● రవి బస్రూర్



● ఇళయరాజా, యువన్ శంకర్ రాజా




● హారీస్ జయరాజ్



● సంతోష్ నారాయణన్



● అంజనీష్ లోక్‌నాథ్



● జీవీ ప్రకాశ్





● హేషమ్ అబ్దుల్



● అనిరుధ్

● గోపీ సుందర్



● సి. సత్య

● 'కేజీఎఫ్ 1, 2' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో పేరు తెచ్చుకున్నారు రవి బస్రూర్ (కన్నడ). ప్రస్తుతం ప్రభాస్ హీరోగా 'కేజీఎఫ్' దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న 'సలార్' చిత్రానికి, అలాగే సీనియర్ నటుడు హరనాథ్ సోదరుడు, నటుడు వెంకట సుబ్బరాజ్ తనయుడు హీరోగా పరిచయమవుతున్న 'సీతామనోహర శ్రీరాఘవ' చిత్రానికి కూడా రవి బస్రూర్ స్వరాలందిస్తున్నారు.

● గతంలో 'బిల్లా రంగా, గురు' ఇటీవల 'దసరా' చిత్రాలకు సంగీతం అందించారు సంతోష్ నారాయణన్ (తమిళ్). ప్రస్తుతం ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న 'ప్రాజెక్ట్ కె'కి, వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను డైరెక్షన్‌లో ప్రారంభమైన 'సైంధవ్' చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.

● హీరోగా, సంగీత దర్శకునిగా కొనసాగుతున్న జీవీ ప్రకాశ్‌కుమార్ (తమిళ్) ఇప్పటికే తెలుగులో పలు చిత్రాలకు సంగీతం అందించారు. ప్రస్తుతం రవితేజ హీరోగా వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న 'టైగర్ నాగేశ్వరరావు'కి, నితిన్ హీరోగా వెంకీ కుడుముల తెరకెక్కిస్తున్న చిత్రానికి స్వరాలందిస్తున్నారు.

● మాతృభాష మలయాళంలో 'నోట్ బుక్' (2006) ద్వారా సంగీతదర్శకుడిగా కెరీర్ ఆరంభించిన గోపీ సుందర్ 'మళ్ళీ మళ్లీ ఇది రాని రోజు' (2015) చిత్రంతో తెలుగుకి వచ్చారు. ఆ తర్వాత 'భలే భలే మగాడివోయ్', 'మజ్ను', 'ప్రేమమ్', 'గీత గోవిందం', 'మజిలీ' తదితర చిత్రాలకు స్వరాలందించారు. ఇటీవల రిలీజైన '18 పేజెస్', 'బుట్ట బొమ్మ' చిత్రాలకు గోపీయే సంగీతదర్శకుడు.

● 'అజ్ఞాతవాసి' (2018), నాని 'గ్యాంగ్‌లీడర్' (2019) వంటి చిత్రాలకు తనదైన శైలిలో సంగీతం అందించారు అనిరుధ్ రవిచంద్రన్. ప్రస్తుతం ఆయన ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి స్వరాలందిస్తున్నారు.

● 'జర్నీ' (2011), 'సమ్‌థింగ్ సమ్‌థింగ్' (2013), 'సిటిజన్' (2013) వంటి డబ్బింగ్ చిత్రాలతో టాలీవుడ్‌కి పరిచయమైన సి.సత్య (తమిళ్) ప్రస్తుతం స్ట్రెయిట్ తెలుగు చిత్రం చేస్తున్నారు. పవన్ కల్యాణ్–సాయిధరమ్ తేజ్ హీరోలుగా సముద్రఖని దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి సత్యనే స్వరకర్త.

● తమిళ చిత్రాలతో పాటు తెలుగు సినిమాలకూ తనదైన శైలిలో సంగీతం అందిస్తున్నారు హారీస్ జయరాజ్ (తమిళ్). ప్రస్తుతం ఆయన నితిన్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి, నాగశౌర్య కథానాయకుడుగా చేస్తున్న చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

● 'కిరాక్ పార్టీ' (2018) చిత్రంతో తెలుగులోకి సంగీత దర్శకునిగా ఎంట్రీ ఇచ్చారు అజనీష్ లోక్‌నాథ్ (కన్నడ). ఆ తర్వాత 'నన్ను దోచుకుందువటే' (2018) మూవీకి స్వరాలు అందించారు. నాలుగేళ్ల విరామం తర్వాత ఆయన తెలుగులో చేస్తున్న తాజా చిత్రం 'విరూపాక్ష'. సాయిధరమ్ తేజ్ హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది.

● మలయాళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హేషమ్ అబ్దుల్ వహాబ్ 'ఖుషి' సినిమాతో తెలుగుకి వస్తున్నారు. విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న చిత్రం ఇది. అలాగే నాని హీరోగా సౌర్యువ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి, శర్వానంద్ హీరోగా శ్రీరామ్ ఆదిత్య తెరకెక్కిస్తున్న చిత్రానికి హేషమ్ అబ్దుల్ సంగీతం అందిస్తున్నారు. **వీరే కాదు.. మరికొందరు ఇతర భాషల సంగీత దర్శకులు తెలుగు చిత్రాలకు ట్యూన్లు ఇస్తున్నారు.**

మ్యూజిక్ మేస్ట్రో ఇళయరాజా పాటలను 1980ల నుంచి తెలుగు శ్రోతలు వింటున్నారు. తెలుగు పరిశ్రమతో సుదీర్ఘ అనుబంధం ఇళయరాజాది. ఇటీవల విడుదలైన 'రంగ మార్తాండ'కు ఆయనే స్వరకర్త. అలాగే త్వరలో విడుదల కానున్న 'మ్యూజిక్ స్కూల్'కి కూడా స్వరాలందించారు. ఇక ఇళయరాజా తనయుడు యువన్ శంకర్ రాజా టాలీవుడ్ కెరీర్ 'శేషు' (2002) సినిమాతో ప్రారంభమై, కొనసాగుతోంది. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కిన 'కస్టడీ' చిత్రానికి తండ్రి ఇళయరాజాతో కలిసి స్వరాలు అందించారు యువన్. అలాగే శర్వానంద్ హీరోగా చేయనున్న ఓ చిత్రానికి యువన్ శంకర్ స్వరాలందిస్తున్నారు.

రావణాసుర విజయంపై నమ్మకం ఉంది - రవితేజ



● సుధీర్‌వర్మ, సుశాంత్, రవితేజ, అభిషేక్ నామా

''రావణాసుర' చిత్రం నన్నెంతో అలరించింది. కచ్చితంగా ప్రేక్షకులందర్నీ కూడా అలరిస్తుందని నా ప్రగాఢ నమ్మకం. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం'' అన్నారు రవితేజ. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'రావణాసుర'. ఇందులో అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజితా పొన్నాడ హీరోయిన్లుగా నటించారు. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ– ''రావణాసుర' టైటిల్, ఆ టైటిల్ డిజైన్ క్రెడిట్ నిర్మాత అభిషేక్‌కు దక్కుతుంది. అతను మల్టీటాలెంటెడ్ పర్సన్. ఈ సినిమా మంచి విజయం సాధించి నిర్మాతలుగా మాకు మంచి పేరు రావాలని, భవిష్యత్‌లో మేమిద్దరం కలిసి మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా హిట్‌తో సుధీర్ వర్మ నెక్ట్స్ లెవల్‌కి వెళ్లాలి. ఆర్‌టీ టీమ్ వర్క్స్ బ్యాక్‌బోన్స్ అయిన శేత, నమ్రత, వింధ్యా రెడ్డిగార్లకు థ్యాంక్స్. నా ఉత్సాహం, నా ప్రోత్సాహం నా అభిమానులే'' అని అన్నారు. ''రవితేజగారి నుంచి కొత్త విషయాలు నేర్చుకున్నాను. రిజల్ట్‌తో సంబంధం లేకుండా ప్రతి సినిమాకు కష్టపడాలని చెప్పారు. సుధీర్‌వర్మ అద్భుతమైన దర్శకుడు. ఆయన నన్ను కొత్తగా చూపించారనే అనుకుంటున్నాను'' అన్నారు సుశాంత్. ''రావణాసుర' బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుంది'' అన్నారు అభిషేక్ నామా. ''రవితేజగారి 'ఆంజనేయులు' సినిమాకు దర్శకత్వ విభాగంలో వర్క్ చేశాను. దర్శకుడిగా ఆయనతో ఓ సినిమా చేయాలనుకున్నాను. 'రావణాసుర' వంటి మంచి స్టోరీకి డైరెక్టర్‌గా నన్ను సెలక్ట్ చేసుకున్న రవితేజగారికి ధన్యవాదాలు. ఈ సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ హండ్రెండ్ పర్సెంట్ థ్రిల్ అవుతారు'' అన్నారు సుధీర్‌వర్మ. మేఘా ఆకాష్, దక్షా నగార్కర్, పూజితా పొన్నాడ. మ్యూజిక్ డైరెక్టర్స్ హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో, రైటర్ శ్రీకాంత్ విస్సా తదితరులు పాల్గొన్నారు.

ఇది చాలా స్పెషల్ మూవీ - ఏఆర్ మురుగదాస్



● 'ఠాగూర్' మధు, మురుగదాస్, గౌతమ్ కార్తీక్

''1947 ఆగస్టు 15న మన దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని మనందరికీ తెలుసు. కానీ అడవి మధ్యలో ఉండే ఓ కొండ ప్రాంతంలోని ఓ ఊరు ప్రజలకు ఈ విషయాన్ని ఓ కారణం చేత బ్రిటిష్ అధికారులు చెప్పరు. దీంతో అక్కడి ప్రజలు స్వాతంత్య్రం కోసం పోరాడుతూనే ఉంటారు. వ్యక్తిగతంగా వారందరికీ ఆగస్టు 16న స్వాతంత్య్రం. అయితే 1947 ఆగస్టు 14, 15, 16.. ఈ మూడు రోజుల్లో ఆ ఊళ్లో ఏం జరిగింది? అనే విషయం ఆసక్తికరం. ఇది చాలా స్పెషల్ మూవీ'' అన్నారు దర్శక–నిర్మాత ఏఆర్ మురుగదాస్. గౌతమ్ కార్తీక్ హీరోగా ఎన్.ఎస్. పొన్‌కుమార్ దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ ఫిల్మ్ 'ఆగస్టు 16, 1947'. దర్శకుడు ఏఆర్ మురుగదాస్, ఓం ప్రకాష్ భట్, నర్సిరామ్ చౌదరి నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 14న నిర్మాత ఎన్వీ ప్రసాద్ తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో ''ఎప్పటికీ గుర్తుండిపోయే కథ ఇది'' అన్నారు గౌతమ్ కార్తీక్. ''ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించాలి'' అన్నారు పొన్‌కుమార్. ''ఆగస్టు 16, 1947' ప్రత్యేకంగా ఉంటుంది. క్లయిమాక్స్ అద్భుతంగా ఉంది. తెలుగు ప్రేక్షకులందరికీ ఈ సినిమా నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాత 'ఠాగూర్' మధు.

ఒకే ఒక్క పాత్రతో...



● గార్గేయి

ఒకే ఒక్క పాత్రతో రూపొందిన చిత్రం 'హలో మీరా'. గార్గేయి యల్లాప్రగడ ప్రధాన పాత్రలో కాకర్ల శ్రీనివాసు దర్శకత్వంలో జీవన్ కాకర్ల సమర్పణలో డా. లక్ష్మణరావు దిక్కల, వరప్రసాద రావు దుంపల, పద్మ కాకర్ల ఈ చిత్రాన్ని నిర్మించారు. ''ఒకే పాత్రతో సినిమాని అద్భుతంగా నడిపించడంతో పాటు అసభ్యకర సన్నివేశాలు లేకుండా శ్రీనివాసు తెరకెక్కించారు. ఈ నెల 21న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

37 ఏళ్లకు మళ్లీ జోడీగా...



● రాజేంద్ర ప్రసాద్, అర్చన

'లేడీస్ టైలర్' (1986) సినిమాని, ఆ చిత్రంలో జంటగా నటించిన రాజేంద్రప్రసాద్, అర్చనల కెమిస్ట్రీని అంత సులువుగా మరచిపోలేం. ఈ జోడీ 37 ఏళ్లకు స్క్రీన్ షేర్ చేసుకుంటున్న చిత్రం 'షష్టిపూర్తి'. రాజేంద్ర ప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో రూపేష్ కుమార్ చౌదరి, ఆకాంక్షా సింగ్ జంటగా పవన్ ప్రభ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. హీరోగా నటించడంతో పాటు రూపేష్ నిర్మిస్తున్నారు. చెన్నైలోని సంగీతదర్శకుడు ఇళయరాజా స్టూడియోస్‌లో ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ఆరంభమైంది. తొలి సీన్‌కి ఇళయరాజా కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత ఆర్‌బి చౌదరి క్లాప్ ఇచ్చారు. రూపేష్ కుమార్ చౌదరి మాట్లాడుతూ– ''లేడీస్ టైలర్' తర్వాత రాజేంద్రప్రసాద్, ఇళయరాజాగార్ల కాంబినేషన్‌లో 'ఆస్తులు అంతస్తులు, చెట్టు కింద ప్లీడర్, ఏప్రిల్ 1 విడుదల' వంటి మ్యూజికల్ హిట్స్ వచ్చాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ లెజెండ్స్ కాంబినేషన్ రిపీట్ అవుతోంది. అలాగే 'లేడీస్ టైలర్' తర్వాత రాజేంద్ర ప్రసాద్, అర్చనగారు చేస్తున్న చిత్రమిది. సినిమాలో మొత్తం నాలుగు పాటలు ఉన్నాయి. ఇదొక న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామా. జూలైలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చెప్పారు.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

గూడ్స్ రైలు కింద నుంచి దాటబోతూ..

రైలు కదలడంతో గాయాలు.. తప్పిన ప్రాణాపాయం



ఎర్రుపాలెం: రైల్వేస్టేషన్‌లో ఆగిన గూడ్స్ కింద నుంచి ప్లాట్‌ఫాం దాటాలనే యత్నంలో.. రైలు కదలడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలివి... ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామానికి చెందిన ఆకుల పెద్దబాబు (58) తన కుటుంబ సభ్యులతో కలిసి ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌కు శుక్రవారం వచ్చారు. టికెట్ తీసుకోవడం కోసం మరో ప్లాట్‌ఫాంపై ఉన్న కౌంటర్ వద్దకు వెళ్లేందుకు ఆయన ఆగిన గూడ్స్ రైలు కింద నుంచి దాటే యత్నం చేశాడు. ఈక్రమంలో అకస్మాత్తుగా గూడ్సు కదలడంతో ప్రయాణికులు అరుస్తూ.. కింద పడుకోవాలని సూచించగా పెద్దబాబు అలాగే చేశారు. అనంతరం ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ రైలును ఆపేశాడు. స్టేషన్‌లో ఉన్న వారు పెద్దబాబును బయటకు లాగగా ప్రాణాపాయం తప్పినప్పటికీ.. ఆయన ఎడమ చేతికి తీవ్రగాయాలు కావడంతో విజయవాడ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనను వీడియో తీసిన పలువురు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా వైరల్ అయింది.

స్థలాల క్రమబద్ధీకరణకు మరో అవకాశం

- కటాఫ్ తేదీ 2014 జూన్ 2 నుంచి 2020 జూన్ 2 వరకు పొడిగింపు
- జీవో 58, 59 పెండింగ్ దరఖాస్తులు సత్వరమే పరిష్కారం: సీఎస్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణకు మరో అవకాశంగా జీవో 58, 59 కింద దరఖాస్తుల గడువును రాష్ట్రప్రభుత్వం శనివారం నుంచి నెలరోజులు, కటాఫ్ తేదీని 2014 జూన్ 2 నుంచి 2020 జూన్ 2 వరకు పొడిగించడంతో పెద్దసంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అన్నారు. పేదలకు ఇళ్లస్థలాలు, 2బీహెచ్‌కే ఇళ్లు, స్థలా ల క్రమబద్ధీకరణకు సంబంధించిన 58, 59, 76, 118 జీవోలతో సాధించిన ప్రగతి, కంటివెలుగు, ఆరోగ్య మహిళ అమలుపై ఆమె శనివారం జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గతంలో తిరస్కరణకు గురైన దరఖాస్తులను కలెక్టర్లు పరిశీలించాలని సూచించారు. జీవో 58, 59, 76, 118కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ త్వరగా పరిష్కరించాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు.

50 రోజుల్లో 2 కోట్లమందికి కంటిపరీక్షలు

గత 47 రోజుల్లో 96 లక్షల మందికి కంటిపరీక్షలు నిర్వహించినందుకు జిల్లాల కలెక్టర్లను సీఎస్ శాంతికుమారి అభినందించారు. 50 రోజుల్లో రెండు కోట్లమందికి కంటిపరీక్షలు జరిపి కొత్తరికార్డు సృష్టిస్తారని సీఎస్ ఆశాభావం వ్యక్తం చేశారు. కంటివెలుగు శిబిరాలను నిరంతరం తనిఖీ చేయాలని, సేవలపై లబ్ధిదారులు సంతృప్తి చెందేలా చూడాలని కోరారు. మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆరోగ్యమహిళ కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా మరింత విస్తృతం చేయాలని సూచించారు. సమీక్షలో రాష్ట్ర రెవెన్యూ, వైద్య శాఖల కార్యదర్శులు నవీన్ మిట్టల్, ఎస్ఏఎం రిజ్వీ పాల్గొన్నారు.

ఉదయం ఎంపీపీగా.. మధ్యాహ్నం మిరప కూలీగా

కురవి ఎంపీపీకి 'పదవి' తెచ్చిన కష్టం





కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి ఎంపీపీ గుగులోత్ పద్మావతికి 'పదవి' పెద్ద కష్టాన్ని తీసుకొచ్చింది. రోజూ ఉదయం అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూనే.. మధ్యాహ్నం తాలు మిరపకాయలు ఏరే కూలీ పని చేస్తున్నారు. కురవి ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వ్ కావడంతో బీఆర్ఎస్ నుంచి మండలంలోని మేఘ్యా తండాకు చెందిన గుగులోత్ రవి నాయక్ తన భార్య పద్మావతికి అవకాశమిచ్చారు. ఎన్నికల సమయంలో లక్షల్లో అప్పులు చేశారు. అప్పుల కింద ఎకరం భూమి పోయింది. ఎంపీపీ పదవితో సంపాదించింది శూన్యం. దీంతో కుటుంబ భారం మోసేందుకు కాయకష్టం చేయక తప్పడం లేదని పద్మావతి వాపోయారు.

విద్యుత్ ఉత్పత్తిలో కేటీపీఎస్ టాప్

- తెలుగు రాష్ట్రాల్లోనే ముందంజ
- 5, 6వ దశల కర్మాగారంలో అత్యధికంగా 82.10% పీఎల్ఎఫ్

పాల్వంచ: ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే విద్యుత్ సంస్థల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారం అత్యధిక పీఎల్ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) సాధించి తొలిస్థానంలో నిలిచింది. తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఈ కర్మాగారంలోని 1,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 9, 10, 11 యూనిట్లు ఏపీ జెన్‌కో, టీఎస్ జెన్‌కో స్టేషన్లతో పోటీ పడి 82.10% పీఎల్ఎఫ్‌తో 7,191.680 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి నమోదు చేశాయి. జెన్‌కో మొత్తం ఉత్పత్తి వాటాలో ఇది 22.83% కావడం విశేషం. ఐదో దశలోని 250 మెగావాట్ల సామర్థ్యం ఉన్న 9వ యూనిట్ ఈ ఆర్థిక సంవత్సరంలో నిరంతరాయంగా నడవడంతో ఇదే యూనిట్‌పై గతంలో ఉన్న 144 రోజుల రికార్డును అధిగమించింది. ఇక 250 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 10వ యూనిట్‌పై గతంలో ఉన్న 222 రోజుల రికార్డ్‌ను సైతం అధిగమించి ఉత్పత్తి సాధించగా,



83.53% పీఎల్ఎఫ్‌తో రాష్ట్రంలో రెండో స్థానం, 11 యూనిట్ 83.10% పీఎల్ఎఫ్‌తో మూడో స్థానంలో నిలిచాయి. కాగా గతేడాది 72.78% పీఎల్ఎఫ్‌ను అధిగమించి ఉత్పత్తిలో రాష్ట్రంలోనే తొలిస్థానంలో నిలిపిన కేటీపీఎస్ 5, 6వ దశల ఇంజనీర్లు, కార్మికులకు సీఈ ఎం.ప్రభాకర్‌రావు అభినందించారు.

వెనుకబడిన కేటీపీఎస్ 7వ దశ

విద్యుత్ ఉత్పత్తిలో గడిచిన ఆర్థిక ఏడాది సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కలిగిన కేటీపీఎస్ 7వ దశలోని 12వ యూనిట్ మాత్రం ఉత్పత్తిలో వెనుకబడింది. 2021–22లో 83.56% పీఎల్ఎఫ్ ఉండగా ఈసారి 60.09% మాత్రమే సాధించింది. గతంలో 5,855.9482 మిలియన్ యూనిట్ ఉత్పత్తి సాధించిన ఈ దశలో ఈసారి 4,211.3262 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి నమోదైంది.


క్లుప్తంగా...

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కరోనా స్క్రీనింగ్ పరీక్షలు



శంషాబాద్: దేశవ్యాప్తంగా కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం విమానాశ్రయాలను అప్రమత్తం చేసింది. దీంతో శంషాబాద్ విమానాశ్రయంలో థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభించారు. 100 మంది అంతర్జాతీయ ప్రయాణికుల్లో ఇద్దరికి కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. విదేశాలకు వెళ్లే వారికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదన్నారు. కోవిడ్ నిబంధనలను పాటించి మాస్కు ధరించడంతో పాటు భౌతికదూరం పాటించాలని అధికారులు సూచించారు.

కొత్తగా 22 కరోనా కేసులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శనివారం 4,834 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 22 మంది వైరస్ బారినపడ్డారు. దీంతో ఇప్పటివరకు మొత్తం నమోదైన కేసుల సంఖ్య 8.42 లక్షలకు చేరింది. ప్రస్తుతం 146 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతుండగా..28 మంది కరోనా నుంచి కోలుకున్నట్లు అధికారులు తెలిపారు.

పేదలపై మందుల ధరల పెంపు ప్రభావం

సాక్షి, హైదరాబాద్ : అత్యవసర మందుల ధరలను పెంచేందుకు తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీఎస్ రావు, జే విజయ్‌రావు కోరారు. ధరల పెంపు పేద వర్గాలపై తీవ్రంగా పడుతుందని శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) గణనీయంగా పెరగడం వల్ల 384 ఎసెన్షియల్ డ్రగ్స్, 1000కి పైగా ఫార్ములేషన్స్ ధరలు 11శాతం పెరిగాయని కేంద్రం చెప్పడం బాధాకరమన్నారు. మందుల లభ్యతను పేద ప్రజలకు అందుబాటులో ఉంచే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని ఆయన స్పష్టం చేశారు.

జాబొచ్చినా జాయినింగ్ లేదు!



- ఫ్రెష్ గ్రాడ్యుయేట్లకు తప్పని 'క్యాంపస్ రిక్రూట్‌మెంట్'తిప్పలు
- ఏడాది కావస్తున్నా ఇంకా ఉద్యోగాల్లో చేర్చుకోని కొన్ని కంపెనీలు
- పైగా మళ్లీ క్యాంపస్ ఇంటర్వ్యూలు చేస్తుండటంతో ఆందోళన
- ఐటీరంగంలో ఒడిదుడుకులు సహజమేనంటున్న నిపుణులు
- మరీ ఎక్కువకాలం వేచి ఉండాల్సి రావడం సమస్యేనని వెల్లడి
- యువత నైపుణ్యాలు, నాలెడ్జ్‌ను పెంచుకోవాలని సూచన
- 'రిక్రూట్'సమయంలోనే ఉద్యోగాల్లోకి తీసుకునే తేదీపై హామీ తీసుకోవాలి: రమణ భూపతి
- ఆర్థిక వ్యవస్థలు కోలుకుంటే అన్నీ సర్దుకుంటాయి: 'కో ఫోర్జ్' వెంకారెడ్డి

గత ఏడాదే కోర్సులు పూర్తి చేసుకున్న ఫ్రెష్ గ్రాడ్యుయేట్లు క్యాంపస్ రిక్రూట్‌మెంట్లలో ఎంపికైనా ఉద్యోగాలు మాత్రం ఇంకా చేతికి అందలేదు. ఏడాది కింద కాలేజీలకే వెళ్లి, మెరిట్ విద్యార్థులను ఇంటర్వ్యూ చేసి రిక్రూట్ చేసుకున్న కొన్ని కంపెనీలు ఇప్పటికీ 'ఆన్ బోర్డింగ్ (ఉద్యోగాల్లో చేర్చుకోవడం)'ప్రక్రియను మొదలుపెట్టలేదు. పైగా మళ్లీ కొత్తవారి కోసమంటూ పలు కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు చేపడుతుండటం.. చిన్న కంపెనీలే కాకుండా బహుళజాతి కంపెనీ (ఎంఎన్‌సీ)లు కూడా ఇలాగే వ్యవహరిస్తుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. అసలు ఉద్యోగం వస్తుందా, రాదా? భవిష్యత్తు ఎలా ఉంటుందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్/డిగ్రీ చదువు ముగియగానే క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపిక కావడంతో.. తమకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందనే ఊహలు తలకిందులు అవుతున్నాయని వాపోతున్నారు. – సాక్షి, హైదరాబాద్

నిరుద్యోగుల వెతలెన్నో..

➤ ఇటీవల 'ఫోరం ఫర్ ఐటీ ఎంప్లాయీస్ (ఫైట్)' చేసిన అధ్యయనంలో 'ఆఫర్ లెటర్ల'తో అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వెలుగులోకి వచ్చాయి. భారీ సంఖ్యలో ఐటీ కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు చేస్తూ ఆఫర్ లెటర్లు (లెటర్ ఇంటెంట్) ఇచ్చిఏడాది దాటుతున్నా ఆన్ బోర్డింగ్ సమాచారం ఇవ్వడం లేదు. దీనితో చాలా మంది ఆందోళనలో పడిపోతున్నారు. ఇక కొన్ని కంపెనీలు ఆఫర్ లెటర్లను రద్దు చేస్తున్నా యి. మరికొన్ని కంపెనీలు ఉద్యోగంలో చేరేందుకు నిర్ణీతకాలానికి బాండ్లు సమర్పించాలని, ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కొర్రీలు పెడుతు న్నాయి. అభ్యర్థులు ఇతర కంపెనీల్లో మంచి ఉద్యోగాలు, ఆఫర్లు వచ్చినా వెళ్లలేని పరిస్థితిని కల్పిస్తున్నాయి. కొన్ని కంపెనీలు తాము శిక్షణ, ఇతరాల కోసం వెచ్చించిన మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లిస్తే ఇతర కంపెనీలకు వెళ్లేందుకు అనుమతిస్తున్నాయి. ఫైట్ నిర్వహించిన సర్వేలో వేయి మందికి పైగా ఆఫర్ లెటర్ల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఇన్ఫోసిస్, ఎంఫసిస్, విప్రో, క్యాప్‌జెమిని వంటి ప్రధాన కంపెనీలు కూడా ఇందులో ఉన్నట్లు సర్వే వెల్లడించింది.

ఆందోళన వద్దు..

ఐటీరంగంలో ఒడిదుడుకులు సహజమేనని, యువత తమ నైపుణ్యాలు, నాలెడ్జ్‌ను పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఉద్యోగాల కోసం కొన్నినెలల నిరీక్షణ ఫరవాలేదని, అది ఎక్కువ కాలమైతేనే సమస్యగా మారుతుందని చెప్తున్నారు. రెండు, మూడేళ్లకోసారి కరెక్షన్ వస్తుందని, అది ఆయా రంగాలకు మంచిదే తప్ప హానికరం కాదని పేర్కొంటున్నారు.

ముందే స్పష్టత తీసుకోవాలి..



ఎంఎన్‌సీలు సహా వివిధ ఐటీ కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌కు వచ్చినప్పుడే ఏ తేదీలోగా 'ఆన్ బోర్డింగ్'చేస్తారనే దానిపై కాలేజీ యాజమాన్యాలు స్పష్టత తీసుకోవాలి. లేకుంటే కంపెనీలు తమకు నచ్చినట్టు చేస్తూ.. అవసరముంటే నెలలోనే జాయినింగ్ ఇస్తూ, లేకుంటే నెలల తరబడి జాప్యం చేస్తూ వెళుతున్నాయి. ఈ విషయంలో అటు కాలేజీలు, ఇటు కంపెనీల తప్పిదాలు ఉన్నాయి. ఐటీ కంపెనీలు వెంటనే ఉద్యోగం ఇవ్వకపోయినా శిక్షణ ఇవ్వొచ్చు. ఇంటర్న్‌షిప్, ట్రైనింగ్ ప్రాసెస్‌తో నడిపించవచ్చు. ఫ్రెషర్స్ కూడా ఒక కంపెనీ ఆఫర్‌కే పరిమితం కాకుండా మరో కంపెనీలో ప్రయత్నించొచ్చు. ఆన్‌బోర్డింగ్ వచ్చేలోగా చిన్న కంపెనీలు, స్టార్టప్‌లలో చేరి నైపుణ్యాలు మెరుగుపరుచుకోవచ్చు.

– రమణ భూపతి, క్వాలిటీ థాట్ గ్రూప్ చైర్మన్

ఆర్థిక మాంద్యం తొలగితే చక్కబడొచ్చు



ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్య పరిస్థితి నెలకొంది. మార్కెట్ వాస్తవ పరిస్థితి ఏమిటనేది మరో మూడు నెలల్లో స్పష్టత వస్తుంది. కంపెనీలు మంచి ఉద్దేశంతోనే ఫ్రెష్ రిక్రూట్‌మెంట్ చేపట్టాయి. కంపెనీ బిజినెస్ అవసరాలను బట్టి ఆఫర్ లెటర్లు ఇచ్చిన వారిని ఆన్‌బోర్డింగ్‌కు పిలుస్తుంటాయి. ఆఫర్ లెటర్లు ఇచ్చి పిలవనంత మాత్రాన అది నేరమేమీ కాదు. ఎకానమీ వృద్ధి చెంది పరిశ్రమకు సానుకూల పరిస్థితులు ఏర్పడితే అన్నీ సర్దుకుంటాయి. గత వందేళ్లలో ప్రతి ఏడెనిమిదేళ్లకోసారి ఇలాంటి పరిస్థితులు ఎదురవుతూనే ఉన్నాయి. సోషల్ మీడియా విస్తృతి పెరిగి ఎక్కువ ప్రచారం జరగడం తప్ప ఇది కొత్తగా వచ్చిన సమస్యేమీ కాదు. యువత సమయాన్ని సద్వినియోగం చేసుకుని స్కిల్స్ పెంచుకోవాలి.

– కోఫోర్జ్ వెంకా రెడ్డి, సీనియర్ హెచ్ఆర్ లీడర్

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి



ఆఫర్ లెటర్లు ఇచ్చినా జాయినింగ్ తేదీపై కంపెనీలు స్పష్టత ఇవ్వకపోవడంపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. కార్మిక శాఖ ద్వారా సర్వే నిర్వహించాలి. ఆఫర్ లెటర్లను గౌరవించని సంస్థలపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వపరంగా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఇటీవల మా సంస్థ సర్వేలో వెల్లడైన అంశాలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి కేటీఆర్, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌లకు అందజేశాం..

– సి.వినోద్‌కుమార్, కన్వీనర్, ఫోరం ఫర్ ఐటీ ఎంప్లాయీస్

విశాఖ పోర్టుకు యూకే షిప్ హెచ్‌ఎంఎస్ తమర్



దొండపర్తి(విశాఖ దక్షిణ): యూకే రాయల్ నేవీకి చెందిన ఆఫ్‌షోర్ పెట్రోలింగ్ నౌక హెచ్‌ఎంఎస్ తమర్ విశాఖ పోర్టుకు శనివారం చేరుకుంది. ఈ నౌకకు చెందిన 17 మంది సిబ్బంది విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొత్త కొప్పెర్లలోని విభిన్న ప్రతిభావంతుల ఎన్జీఓ క్యాంపస్‌ను సందర్శించారు. అక్కడ దివ్యాంగ పిల్లలు, యువతతో ముచ్చటించారు. వారితో క్రికెట్, బాస్కెట్‌బాల్ వంటి క్రీడలు ఆడారు. మొక్కలు నాటి వసతి గృహాలకు రంగులు వేశారు. ఇండో–పసిఫిక్‌లో పూర్తి స్థాయి పెట్రోలింగ్ విధులు నిర్వర్తించే రాయల్ నేవీ నౌకల్లో హెచ్‌ఎంఎస్ తమర్ ఒకటి. ఇరుదేశాల నావికాదళ సంబంధాలు మరింత బలోపేతమయ్యేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని నావికాదళ వర్గాలు పేర్కొంటున్నాయి. హెచ్‌ఎంఎస్ తమర్ విశాఖ పర్యటన భారత్‌లో రక్షణ, భద్రతా సంబంధానికి తమ దేశం ఇస్తున్న ప్రాముఖ్యతకు నిదర్శనమని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ పేర్కొన్నారు.



నిఖత్ జరీన్‌కు ఘనస్వాగతం

శంషాబాద్: ప్రపంచ మహిళా బాక్సింగ్ చాంపియన్‌షిప్ గెలుచుకున్న నిఖత్ జరీన్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. శనివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న నిఖత్‌కు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ చాంపియన్‌షిప్ సాధించిన నిఖత్ యువతకు ఆదర్శమని ప్రశంసించారు. అనంతరం ఓపెన్‌టాప్ జీప్‌లో ఆమెతో పాటు ప్రయాణించారు. ఈ సందర్భంగా క్రీడాభిమానులు పెద్ద ఎత్తున ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. నిఖత్‌కు స్వాగతం పలికిన వారిలో క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ ఆంజనేయగౌడ్, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు చాముండేశ్వరీనాథ్, మాజీ ఎంపీ వేణుగోపాలాచారి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఉన్నతాధికారులు ఉన్నారు.

హెచ్‌సీఏఏ అధ్యక్షుడిగా పల్లె



పల్లె నాగేశ్వర్‌రావు



కల్యాణ్‌రావు

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది పల్లె నాగేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. శుక్రవారం ఎన్నికలు జరగగా, శనివారం ఎన్నికలకు సంబంధించిన పూర్తి ఫలితాలు వెల్లడయ్యాయి. తన సమీప ప్రత్యర్థి న్యాయవాది ఎ.జగన్‌పై 381 ఓట్ల మెజారిటీతో పల్లె విజయం సాధించారు. నాగేశ్వర్‌రావుకు 1120, జగన్‌కు 739, రవీందర్‌రెడ్డి 675 ఓట్లు వచ్చాయి. అలాగే ఉపాధ్యక్షుడిగా కల్యాణ్‌రావు(ఓట్లు: 1115) ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ప్రదీప్‌రెడ్డి, పులి దేవేందర్, స్పోర్ట్స్ సెక్రటరీగా కటకం శారద, ట్రెజరర్‌గా వెంగల పూర్ణశ్రీ, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాస్ భైరెడ్డి ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా కె.శ్రీనివాస్‌రావు, సి.సునీతా కుమారి ఎన్నికయ్యారు. వీరు ఏడాది పాటు పదవుల్లో కొనసాగనున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు 1993లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల్లో న్యాయవాదిగా ఉన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.